www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 31-1-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 325 | శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: త్రయోదశి ఉ.8:26, చతుర్దశి తె.5:52 వరకు, నక్షత్రం: పునర్వసు రా.1:34 తదుపరి పుష్యమి, వర్జ్యం: మ.2:30-3:58, దుర్ముహూర్తం: ఉ.6:51-8:21, అమృతఘడియలు: రా.11:21-12:49, రాహుకాలం: ఉ. 9.00-10:30, సూర్యోదయం: 6:51, సూర్యాస్తమయం: 6:06 | గుంటూరు సిటీ

Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

భారతి సిమెంట్స్‌కు చెక్!

రద్దుబాటలో సున్నపురాయి లీజులు?

ఆ రూల్స్ మాకు వర్తించవు

ప్రభుత్వం ఇచ్చినవాటిని ఎలా కాదంటారు?

షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోండి

భారతి సిమెంట్స్ వాదన.. తోసిపుచ్చిన సర్కారు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం చట్టపరమైన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకొని తమకు కేటాయించిన సున్నపురాయి లీజులను ఎలా రద్దుచేస్తారని భారతి సిమెంట్స్ ప్రశ్నిస్తోంది. జగన్ ప్రభుత్వ హయాంలో తమకు నిబంధనల ప్రకారమే

మిగతా 14వ పేజీలో...

గ్రూప్-1 ఫలితాలు విడుదల

87 మందితో జాబితా ప్రకటించిన ఏపీపీఎస్సీ

న్యాయ వివాదాలతో 2 క్రీడా పోస్టులు పెండింగ్

కోర్టు తీర్పుల అనంతరం మార్పులు ఉండొచ్చని వెల్లడి

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అభ్యర్థులు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న గ్రూప్-1 ఫలితాలు ఎట్టకేలకు విడుదలయ్యాయి. 89 పోస్టులకు గాను 87 మందితో ఎంపిక జాబితాను ఏపీపీఎస్సీ శుక్రవారం రాత్రి ప్రకటించింది. న్యాయ వివాదాల

మిగతా 12వ పేజీలో...


బిట్స్ @ అమరావతి

మందడం-వెంకటపాలెంలో 70 ఎకరాల్లో ప్రాంగణం

భూ విక్రయ ఒప్పందం పూర్తి

3దశల్లో అభివృద్ధి... 10 వేల మందికి విద్యావకాశాలు

12



జగన్ హయాంలో నెయ్యి పేరిట తిరుమలకు సరఫరా చేసిన 'రసాయన మిశ్రమం'లో జంతువుల కొవ్వు లేనే లేదా? 'ఉంది' అంటూ చంద్రబాబు రాజకీయం చేశారా? సజ్జల రామకృష్ణా రెడ్డి డిమాండ్ చేస్తున్నట్లుగా చంద్రబాబు క్షమాపణలు చెప్పాలా? అసలు... అందులో జంతువుల కొవ్వు కలవలేదని ఎవరు నిర్ధారించారు? వైసీపీ వారు తమకు తాము 'లేదు' అనుకుంటే సరిపోతుందా? ఈ ప్రశ్నలకు ఇవిగో సమాధానాలు...


unviable and unreasonable for supplying pure Ghee. M/s A R Dairy Food Private Limited (A-1), Dindigul supplied 4 tankers on 12.06.2024, 20.06.2024, 25.06.2024 and 04.07.2024 respectively, and the same were accepted with earlier procedure of testing which doesn't include adulteration testing in TTD lab. The samples were drawn from 2 tankers on 06.07.2024 and 2 tankers on 12.07.2024 and forwarded to NDDB CALF Lab. TTD received the NDDB CALF Test Reports on 16.07.24 and 23.07.24 respectively which shows ghee adulteration with vegetable and animal fats. Thus, M/s A R Dairy Food Private Limited (A-1), Dindigul by supplying

ఇది... 'సిట్' దాఖలు చేసిన చార్జిషీట్!

"నెయ్యి శాంపిళ్లలో వెజిటబుల్ ఫ్యాట్‌తోపాటు, జంతువుల కొవ్వూ కలిసి కల్తీ అయినట్లు తేలిందని ఎన్‌డీడీబీ-కాఫ్ ప్రయోగశాల నిర్ధారించింది. ఆ మేరకు 2024 జూలై 16వ తేదీన టీటీడీకి టెస్ట్ రిపోర్టు పంపింది" అని 'సిట్' స్పష్టంగా పేర్కొంది. ఎన్‌డీడీబీ అంటే... జాతీయ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు! పాల ఉత్పత్తులకు సంబంధించిన అత్యున్నత సంస్థ! 'జంతువుల కొవ్వు' నిజమని ఆ సంస్థే తేల్చింది!

ఇది... చార్జిషీట్‌లో 'సిట్' వెల్లడించిన సంగతి. 'నెయ్యి'లో వెజిటబుల్ ఫ్యాట్స్‌తోపాటు తక్కువ స్థాయిలో జంతువుల కొవ్వులు (గొర్రె కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె) కూడా ఉన్నట్లు 'సిట్' తన చార్జిషీటులోనే పేర్కొంది.

g. In all the four Ghee samples of TTD B-sitosterol was detected. However, Cholesterol was not detected in analysis of two available samples of TTD. The results suggest that the samples of Ghee from TTD mainly contains Vegetable oils and/or fats of plant origin and possibility for presence of fat from Animal origin (Ghee, Tallow, Lard or Fish oil) appears very less.



ఇది... ఐసీఏఆర్-ఎన్‌డీఆర్ఐ ఇచ్చిన నివేదిక. తమకు అందిన శాంపిళ్లలో పంది కొవ్వు లేదని... గొర్రె కొవ్వు, చేప నూనెలను గుర్తించే పరిజ్ఞానం తమకు లేదని ఆ సంస్థ తెలిపింది. అంతేకాదు... తమ మెథడాలజీని 'థర్డ్‌పార్టీ' నిర్ధారించాల్సి ఉందని తన మీద తనకే నమ్మకంలేదని తేల్చేసింది.

'నెయ్యి' అబద్ధం.. కొవ్వు నిజం!

వైసీపీ హయాంలో ఘోర అపచారం.. వాస్తవాలకు ముసుగేసి తప్పుడు ప్రచారం

జంతువుల కొవ్వు లేదని 'సిట్' నిర్ధారించినట్లు అబద్ధాలు

'ఫ్యాట్'ను నిర్ధారించిన ఎన్‌డీడీబీ

ఆ రంగంలో అత్యున్నత సంస్థ అదే!

చార్జిషీటులోనూ ప్రస్తావించిన 'సిట్'

అశక్తతతో ఐసీఏఆర్ అసమగ్ర రిపోర్ట్

దానిని పట్టుకుని వైసీపీ నానా యాగీ

అనిల్ సింఘాల్ తప్పు చేశారు..!

తప్పుడు నిర్ణయాలకు తలూపారు

ధర్మారెడ్డి, బాలాజీలదీ అదే బాట: సిట్

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో తిరుమలకు సరఫరా చేసింది నెయ్యే కాదని, నూటికి నూరు పాళ్లూ రసాయన మిశ్రమమని స్పష్టంగా తేలిపోయింది!

అయినా సరే, అందులో జంతువుల కొవ్వు లేదని తనకుతానుగా 'సర్టిఫికెట్' ఇచ్చుకున్న వైసీపీ... 'చంద్రబాబు క్షమాపణ చెప్పాలి' అంటోంది!

డెయిరీ ఉత్పత్తులకు సంబంధించిన అత్యున్నత సంస్థ ఎన్‌డీడీబీ ఇచ్చిన రిపోర్టు ఊసెత్తకుండా... ఆ నివేదికలోని అంశాలను 'సిట్' తన చార్జిషీటులో కూడా ప్రస్తావించిన సంగతి చెప్పకుండా... 'అందులో పంది కొవ్వు లేదు. గొర్రె

మిగతా 14వ పేజీలో...

జగన్, గజదొంగలంతా

క్షమాపణ చెప్పాలి

జంతువుల కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదిక

సుబ్బారెడ్డి పీఏ ఖాతాలోకి వచ్చిన రూ.కోట్ల సంగతేంటి?

సిట్ 'చార్జిషీటు'లో లోపాలు

నెయ్యి దందా వెనుక పెద్దలను బయట పెట్టాలి: టీటీడీ చైర్మన్

14

11న.. 11 మందీ

అసెంబ్లీకి రండి

కల్తీ నెయ్యిపై చర్చిద్దాం

కలియుగ దైవాన్ని మోసం చేసిన ఘనత జగన్, వైసీపీదే

కల్తీపై ఇంకా అబద్ధాలా: టీడీపీ

కల్తీ సహజమే

జంతు వ్యర్థాలు లేవని తేలింది

బాబు సారీ చెప్పాలి: సజ్జల



కుప్పం చెరువుకు జలహారతి ఇచ్చి, సారె సమర్పిస్తున్న చంద్రబాబు

తెలుగు జాతి ఖ్యాతి అమరావతి

విశ్వనగరంగా రాజధాని అభివృద్ధి

ఇతర రాష్ట్రాలతో సమానంగా మనకు మహానగరం అవసరం

అమెరికాకు సిలికాన్ వ్యాలీ.. భారత్‌కు క్వాంటం వ్యాలీ

ఎన్ఆర్ఐ వైద్యులు శాశ్వతంగా ఈ ప్రాంతంతో మమేకం కావాలి

గుంటూరు జీజీహెచ్‌లో కానూరి జింఖాన ఎంసీహెచ్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు

13



విద్యార్థులతో ముఖాముఖిలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

త్వరలోనే జాబ్ క్యాలెండర్

కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి 755 కంపెనీలు: లోకేశ్

ఒక్కటొక్కటిగా గ్రౌండవుతున్నాయ్

4 వేల ప్రొఫెసర్ల భర్తీకి చర్యలు

పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతాం: మంత్రి

కాకినాడ జేఎన్‌టీయూలో 'హలో లోకేశ్' కార్యక్రమం

13





నిజాం నగలను హైదరాబాద్‌కు తరలించే యోచన లేదు

▸ ఆర్‌బీఐ పర్యవేక్షణలో భద్రంగా ఉన్నాయి: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 30: నిజాంకు చెందిన నగలను హైదరాబాద్‌కు తీసుకెళ్లి శాశ్వతంగా ప్రజల సందర్శనార్థం ఉంచాలనే అంశంపై ప్రభుత్వం ప్రస్తుతానికి ఎటువంటి నిర్ణయం తీసుకోలేదని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తెలిపారు. విలువైన 173 నగలు ప్రస్తుతం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) పర్యవేక్షణలో అత్యంత కట్టుదిట్టమైన భద్రతలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు రాజ్యసభలో షెకావత్ లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

250కిలోల బంగారం గోల్‌మాల్ కేసులో పీఎన్‌బీకి రూ.16కోట్ల ఆస్తుల అప్పగింత

హైదరాబాద్, జనవరి 30(ఆంధ్రజ్యోతి) పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) 250కిలోల బంగారానికి ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలను ఉల్లంఘించి ఆ బంగారాన్ని అమ్మేసిన ఘన్‌శ్యామ్‌దాస్ జ్యువెలరీ అండ్ సన్స్ కేసులో గతంలో ఈడీ జప్తు చేసిన రూ.16కోట్ల విలువైన ఆస్తులను పంజాబ్ నేషనల్ బ్యాంకుకు అప్పగించడానికి అనుమతిస్తూ నాంపల్లిలోని ఈడీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది. 2011లో ఘన్‌శ్యామ్‌దాస్ బంగారు నగల దుకాణం సంస్థ ప్రతినిధులు పీఎన్‌బీ ఇచ్చిన బ్యాంకు గ్యారంటీలను చూపించి 250కిలోల బంగారం కొనుగోలుకు బెంగళూరులోని ఎస్బీఐ నుంచి రుణం తీసుకున్నారు. ఆ తర్వాత హైదరాబాద్‌లోని అబిడ్స్‌లోని తమ షాపులో ఉన్న బంగారాన్ని స్థానిక మార్కెట్‌లో నగదుకు అమ్మేశారు.

కెనడా నుంచి అమెరికాకు మానవ అక్రమ రవాణా

▸ భారతీయుడిపై కేసులు నమోదు

న్యూయార్క్, జనవరి 30: మనుషులను(భారతీయులు) అక్రమంగా కెనడా నుంచి అమెరికాకు తరలిస్తోన్న ఒక భారతీయుడి(22)పై న్యూయార్క్‌లో కేసు నమోదు అయ్యింది. శివమ్(22) అనే ఆ వ్యక్తిపై నలుగురు భారతీయుల్ని అక్రమంగా అమెరికాకు తరలించడంపై, అలాగే డబ్బు కోసం కుట్ర పన్ని ఈ పని చేసినట్లు కేసులు నమోదు చేశారు. న్యూయార్క్ ఉత్తర జిల్లాలోని ఫెడరల్ గ్రాండ్ జ్యూరీ ఈమేరకు ఈ నెల 28న అతడిని నిందితుడిగా పేర్కొంది.

బర్గమ్ భార్య అందంగా ఉందనే.. ఆయనకు మంత్రి పదవిచ్చా!



ఓవల్ ఆఫీసులో క్యాథ్రిన్, డగ్ బర్గమ్, ట్రంప్

వాషింగ్టన్, జనవరి 30: ఎవరైనా ప్రతిభను చూసి పదవి ఇస్తారు! మన కులం వాడనో.. మన మతం వాడనే అభిమానంతోనో పదవి ఇచ్చే వారూ ఉంటారు! కానీ.. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం భిన్నం! అమెరికన్ వ్యాపారి, రాజకీయ నాయకుడు అయిన డగ్ బర్గమ్ భార్య అందంగా ఉంది కాబట్టే ఆయనకు తన క్యాబినెట్‌లో మంత్రి పదవి ఇచ్చానని చెప్పారు! అంత అందమైన భార్యను కలిగున్న ఎవరైనా విజేతలేనని.. అందుకే తాను బర్గమ్‌తో కలిసి పని చేయాలనుకున్నానని వివరించారు. ఆ సమయంలో బర్గమ్, ఆయన భార్య అక్కడే ఉండడం గమనార్హం.

శబరిమల బంగారం చోరీ కేసులో నటుడు జయరామ్‌ను ప్రశ్నించిన సిట్

చెన్నై, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలోని బంగారు తాపడాల అదృశ్యం కేసులో ప్రముఖ మలయాళ నటుడు జయరామ్‌ను శుక్రవారం ప్రత్యేక దర్యాప్తు బృందం ప్రశ్నించింది. చెన్నైలోని ఆయన నివాసానికి వచ్చిన సిట్ అధికారులు 2019లో చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమాల గురించి ఆరా తీసి, వాంగ్మూలం నమోదు చేశారు. ఈ కేసులో జయరామ్‌ను సాక్షిగా చేర్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అయితే, తాను 40 ఏళ్లుగా శబరిమలకు వెళ్తున్నానని, ఆ సందర్భంగా ఉన్నికృష్ణన్ పొత్తితో పరిచయం ఏర్పడిందని సిట్ బృందానికి జయరామ్ చెప్పారు. మరమ్మతుల కోసం ఆ బంగారు రేకులను తెచ్చినట్లు ఉన్నికృష్ణన్ చెప్పాడని వివరించారు.

నెలసరి ఆరోగ్యం ప్రాథమిక హక్కు



▸ పాఠశాలల్లో బాలికలకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు ఇవ్వాలి: సుప్రీం

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం ప్రసాదించిన జీవించే హక్కు, విద్యాహక్కులో భాగంగా.. నెలసరి సమయంలో ఆరోగ్యంగా ఉండడం (రుతుక్రమ ఆరోగ్యం) మహిళల ప్రాథమిక హక్కు అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఆరు నుంచి 12వ తరగతి వరకూ చదివే కౌమార దశలోని బాలికల కోసం కేంద్రం రూపొందించిన 'పాఠశాలలకు వెళ్లే బాలికల కోసం రుతుక్రమ పారిశుధ్య విధానా'న్ని దేశవ్యాప్తంగా అమలు చేయాలని జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సూచించింది. అందులో భాగంగా.. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో మగ పిల్లలకు, ఆడ పిల్లలకు వేరువేరుగా శౌచాలయాలను ఏర్పాటు చేయాలని, వాటిలో ఉపయోగించడానికి వీలయ్యే నీటి కనెక్షన్ ఉండేలా చూడాలని, విద్యార్థినులకు పర్యావరణ హిత శానిటరీ న్యాప్‌కిన్స్‌ను ఉచితంగా అందుబాటులో ఉంచాలని దేశంలోని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలను ఆదేశించింది. ఈ తీర్పును అమలు చేయకపోతే ప్రైవేటు స్కూళ్ల గుర్తింపును రద్దుచేయాలని.. ప్రభుత్వ పాఠశాలల్లో అమలుచేయకపోతే అందుకు నేరుగా రాష్ట్రప్రభుత్వాలను బాధ్యులను చేస్తామని హెచ్చరించింది. పాఠశాలల్లో విద్యార్థినులకు ఉచితంగా శానిటరీ న్యాప్‌కిన్లు అందించాలని, కనీస పారిశుధ్య సౌకర్యాలు ఏర్పాటయ్యేలా చూడాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. ఈ తీర్పును వెలువరించింది. "ఒక పీరియడ్ (ఫుల్‌స్టాప్) వాక్యాన్ని ముగించాలి తప్ప.. బాలికల విద్యను కాదు" అన్న అమెరికన్ విద్యావేత్త, సామాజిక కార్యకర్త మెలిస్సా బెర్టన్ హృద్యమైన వ్యాఖ్యను ఉటంకిస్తూ జస్టిస్ జేబీ పార్దీవాలా 126 పేజీల తీర్పును ప్రారంభించారు. "రాజ్యాంగంలోని 21వ అధికరణం కింద కల్పించన జీవించేహక్కులో రుతుక్రమ ఆరోగ్యం కూడా ఒక భాగమే. ఒక బాలిక అత్యున్నతమైన లైంగిక, పునరుత్పత్తి ఆరోగ్యాన్ని సాధించడానికి.. సురక్షితమైన, ప్రభావవంతమైన, అందుబాటు ధరల్లో ఉండే నెలసరి ఆరోగ్య నిర్వహణ చర్యలు ఉపయోగపడతాయి. ఆరోగ్యకరమైన పునరుత్పత్తి జీవితాన్ని గడిపేహక్కులో భాగంగా.. లైంగిక ఆరోగ్యాన్ని గురించి తెలుసుకునే హక్కు, దానికి సంబంధించిన చదువును పొందే హక్కు కూడా ఉంటుంది" అని ఆయన తన తీర్పులో పేర్కొన్నారు. కాగా.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ఏ ప్రకారం లభించే 'విద్యాహక్కు'ను సుప్రీంకోర్టు 'మల్టీప్లయర్ రైట్'గా (అంటే.. ఒక వ్యక్తి బాగా చదువుకుంటే, తద్వారా తనకున్న మిగతా అన్ని హక్కుల గురించీ తెలుసుకుంటారని అర్థం) అభివర్ణించింది. మనిషి గౌరవంగా బతకాలన్నా, జీవించే హక్కును పూర్తిస్థాయిలో అనుభవించాలన్నా అది చదువు ద్వారానే సాధ్యమని తేల్చిచెప్పింది. అంతటి కీలకమైన చదువుకకు.. రుతుక్రమంపై సరైన అవగాహన లేకపోవడం వల్ల, పాఠశాలల్లో సౌకర్యాలు లేకపోవడం వల్ల చాలా మంది బాలికలు దూరం కావాల్సిన పరిస్థితి వస్తోందని.. చదువు ఆగిపోవడం వల్ల వారు తమ ఇతర హక్కులను కూడా వినియోగించుకోలేకపోతున్నారని ఆవేదన వెలిబుచ్చింది. ప్రాథమిక విద్యా హక్కు, విద్యాహక్కు చట్టం అనేవి.. ఉచిత, నిర్బంధ విద్యను అందిస్తాయని, అటువంటి విద్యను పొందడానికి అడ్డంకిగా మారే ఖర్చులు, రుసుములు ఏవైనా సరే ఈ హక్కు కిందకే వస్తాయని తేల్చిచెప్పింది (అంటే శానిటరీ ప్యాడ్లకు అయ్యే ఖర్చు వల్ల విద్యార్థినులు చదువు మానేయాల్సిన పరిస్థితి వస్తే ఆ ఖర్చును ప్రభుత్వమే భరించాలని దీని అర్థం).

కీలక ఆదేశాలు..


పాఠశాలల్లో రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ చర్యలు లేకపోవడం వల్ల బాలికల విద్య ఆగిపోకుండా పలు కీలక ఆదేశాలను ధర్మాసనం జారీ చేసింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలన్నింటిలోనూ 'ఏఎస్‌టీఎం డీ-6954' ప్రమాణాలకు తగినట్టుగా తయారుచేసిన పర్యావరణహిత శానిటరీ న్యాప్కిన్లను విద్యార్థినులకు ఉచితంగా అందుబాటులో ఉంచాలని అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాలనూ ఆదేశించింది. వాటిని కూడా.. మరుగుదొడ్ల ప్రాంగణంలోనే, వెండింగ్ మెషీన్ల ద్వారా అందుబాటులో ఉంచాలని, అలాంటి అవకాశం లేని చోట.. ఒక నిర్ణీత ప్రదేశంలో నిర్ణీత అధికారి(టీచర్/ప్రిన్సిపాల్) వద్ద లభ్యమయ్యేలా చూడాలని పేర్కొంది. ఇంకా..

- ప్రతి పాఠశాలలోనూ పనిచేసే స్థితిలో ఉన్న, ఆడ-మగ పిల్లలకు వేర్వేరు మరుగుదొడ్లు, నిరంతర నీటి సౌకర్యంతో ఉండేలా చూడాలని ఆదేశించింది. అలాగే.. పాఠశాలల్లో ఇప్పటికే ఉన్న, కొత్తగా కట్టబోయే మరుగుదొడ్లను.. విద్యార్థుల గోప్యతను కాపాడేలా, దివ్యాంగులతో సహా పిల్లలందరి అవసరాలకు అనుగుణంగా ఉండాలని స్పష్టం చేసింది.
- పాఠశాలలో ఉన్నప్పుడు నెలసరి వస్తే బాలికలు ఇబ్బంది పడకుండా.. అత్యవసర చర్యల్లో భాగంగా అన్ని పాఠశాలలూ రుతుక్రమ ఆరోగ్య నిర్వహణ కార్నర్లు ఏర్పాటుచేయాలి. వాటిలో అదనపు లోదుస్తులు, అదనపు యూనిఫారాలు, వాడిన శానిటరీ న్యాప్‌కిన్లను పారేయడానికి వీలుగా డిస్పోజబుల్ బ్యాగులు, ఇతరత్రా అవసరమైన అన్ని వస్తువులనూ ఆయా కార్నర్లలో ఉంచాలి. ప్రతి పాఠశాలలోనూ వాడేసిన శానిటరీ న్యాప్‌కిన్లను పారవేయడానికి సురక్షితమైన, పరిశుభ్రమైన, పర్యావరణానికి హాని కలిగించని యంత్రాంగం ఉంచేలా చర్యలు తీసుకోవాలి.
- 'రుతుక్రమ ఆరోగ్యం, యవ్వనదశపై అవగాహన, శిక్షణ' అనే అంశంపై పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలని.. నెలసరి సమయంలో, యవ్వనదశలో వచ్చే మార్పులు, ఆరోగ్య సమస్యలపై లింగ సున్నితత్వంతో కూడిన పాఠ్యాంశాలను చేర్చాలని నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్‌టీ), స్టేట్ కౌన్సిల్స్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎస్‌సీఈఆర్‌టీ)లకు ఆదేశాలు జారీచేసింది. ..తీర్పు వెలువడిన తేదీ నుంచి 3 నెలల్లోగా ఈ ఆదేశాలన్నీ కచ్చితంగా అమలయ్యేలా చూడాలని ఆదేశించింది.

'మునగ' ప్యాడ్లతో సురక్షితమైన పీరియడ్ కేర్!

రుతుస్రావం సమయంలో మహిళలు మూత్రనాళ సమస్యలు, బ్యాక్టీరియల్ వాగినోసిస్, ఫంగల్ ఇన్ఫెక్షన్లు వంటి బారిన పడే ప్రమాదం ఉంది. అయితే నెలసరి అప్పుడు మునగ మొక్క (మోరింగా) సారాల ఆధారిత శ్యానిటరీ ప్యాడ్లను వినియోగించడం వలన ఈ రిస్క్‌ను తగ్గించే అవకాశం ఉందని ప్రముఖ గైనకాలజిస్టులు, వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. ఇవి సహజమైనవని, చర్మ స్వభావానికి అనుకూలం (స్కిన్ ఫ్రెండ్లీ)గా ఉంటాయని తెలిపారు. సంప్రదాయ వైద్యంలో మునగ చెట్టును ఒక 'అద్భుతమైన వృక్షం'గా చెబుతుంటారు. ఇది దానిలోని విస్తృత శ్రేణి బయో యాక్టివ్ సమ్మేళనాలకు ప్రసిద్ధి చెందింది. దీని వలన పలు ఆరోగ్యపరమైన ఉపయోగాలు ఉన్నాయని ఆధునిక శాస్త్రీయ అధ్యయనాలు కూడా ధ్రువీకరిస్తున్నాయి. వాటిల్లో పరిశుభ్రత, నెలసరి సంరక్షణకు సంబంధించిన యాంటీ మైక్రోబియాల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ ప్రభావాలు వంటివి ఉన్నాయి. సాధారణ ఔషధాలతో పోలిస్తే మునగ ఆకుల సారాలు యాంటీ ఇన్‌ఫ్లమేటరీ చర్యను ప్రదర్శించినట్లు ఓ అధ్యయనం వెల్లడించింది.

లోకం తీరు



బుద్ధిమాంద్యానికి మూలకణాల చికిత్స వద్దు

▸ చికిత్స అందిస్తామని ప్రకటించే క్లినిక్‌ల లైసెన్సు రద్దు చేయాలి: సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ, జనవరి 30: బుద్ధిమాంద్యానికి (ఆటిజానికి) మూలకణాల (స్టెమ్‌సెల్స్) చికిత్సను అందించవద్దని, దానివల్ల ఫలితాలు ఉంటాయన్న శాస్త్రీయ ఆధారాలు లేవని సుప్రీంకోర్టు పేర్కొంది. క్లినికల్ ట్రయల్స్ జరగని, ఆమోదం లేని చికిత్సను అందించటం అనైతికత మాత్రమే కాదు.. వైద్యపరమైన తప్పుడు విధానమవుతుందని హెచ్చరించింది. బుద్ధిమాంద్యానికి మూలకణాల చికిత్స అందిస్తామంటూ దేశవ్యాప్తంగా అనేక క్లినిక్‌లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దీనిని అడ్డుకోవాలంటూ దాఖలైన ఓ పిటిషన్ మీద జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. పలు వైద్య రంగాల్లో మూలకణాల పరిశోధన ఫలితాలను ఇస్తున్నప్పటికీ.. బుద్ధిమాంద్యం చికిత్సలో మాత్రం దాని వల్ల ఉపశమనం లభిస్తుందన్న ఆధారాలు లేవని ఇప్పటికే పలు వైద్యపరిశోధన సంస్థలు వెల్లడించాయి. ఈ నేపథ్యంలోనే, ఆటిజంకు మూలకణాల చికిత్సను అందిస్తామని అటు వైద్యులు చెప్పవద్దని, ఇటు ఆ చికిత్స కావాలని పేషంట్లు, వారి తరఫు వ్యక్తులు డిమాండ్ చేయటానికి వీల్లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఒకవేళ పేషంటు నుంచి సమ్మతి తీసుకొని ఆ చికిత్స ఇచ్చినా.. ఆ సమ్మతి చెల్లదని తెలిపింది. ఇప్పటికే స్టెమ్‌సెల్స్ చికిత్స తీసుకుంటున్న ఆటిజం పేషంట్లకు ఉన్నపళంగా చికిత్సను నిలిపివేయకుండా, క్రమంగా ఇతర చికిత్సకు మళ్లించాలని సూచించింది. ఈ మేరకు జాతీయ వైద్య మండలి, కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించింది. ఆటిజంకు స్టెమ్‌సెల్స్ థెరపీ ఇస్తామని ప్రకటించుకునే క్లినిక్‌ల లైసెన్సు రద్దు చేయాలని, జరిమానా విధించాలని సుప్రీం ధర్మాసనం ఆదేశించింది.

APPOINTMENTS

WALK-IN INTERVIEW

రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్న బల్క్‌డగ్ పరిశ్రమ ప్రొడక్షన్ విభాగంలో పనిచేయుటకు ఈ క్రింది అర్హతలు, శారీరక దారుఢ్యం మరియు మంచి ఆరోగ్యం గల అభ్యర్థులు కావలెను.

2022 to 2025 PASSED OUT CANDIDATES & 2026 PURSUING CANDIDATES

Job Title	Qualification	Age	Stipend (P.M)
Trainee Helper	S.S.C , Inter / ITI (Fitter, Electrical, Diesel Mechanic)	Age 21-25 years	Rs. 15,000/-
Trainee Supervisor/ Graduate Apprentice	B.Sc (Chemistry) మొదటి 2 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 3వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 18,000/-
	B.Pharmacy B.Tech (Chemical/Mechanical/ Instrumentation/EIE/EEE) మొదటి 3 సంవత్సరములు అన్ని సబ్జెక్టులు పాసై 4వ సంవత్సరంలో సబ్జెక్టులు మిగిలిన వారు కూడా అర్హులు.		Rs. 20,000/-
	M.Sc (Organic Chemistry/ Analytical Chemistry /Micro Biology)		Rs. 22,000/-
	M.Pharmacy (Pharmaceutical Chemistry/ Analysis/QA/RA)		Rs. 24,000/-

పై అర్హతలు గల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్స్ మరియు జిరాక్స్ కాపీలను తీసుకొని ఈ క్రింది ప్రదేశాలలో జరుగు ఇంటర్వ్యూకు హాజరు కాగలరు. ఎంపిక కాబడిన అభ్యర్థులు షిఫ్ట్‌లలో పనిచేయవలసియుండును.

02-02-2026	NRI COLLEGE OF PHARMACY AGIRIPALLI, Krishna Dist.
02-02-2026	QIS COLLEGE OF PHARMACY Vengamukkapalem, ONGOLE, Prakasam Dist.
03-02-2026	V-V INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES GUDLAVALLERU, Krishna Dist.
03-02-2026	ST. ANN'S COLLEGE OF PHARMACY Bypass Road, CHIRALA, Bapatla Dist.
04-02-2026	KVSR SIDDHARTHA COLLEGE OF PHARMACEUTICAL SCIENCES Siddhartha Nagar, VIJAYAWADA, NTR Dist.
04-02-2026	NARASARAOPETA INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES Kotappakonda Road, NARASARAOPET, Palnadu Dist.
05-02-2026	K L UNIVERSITY Vaddeswaram, TADEPALLI, Guntur Dist.
05-02-2026	BAPATLA COLLEGE OF PHARMACY BAPATLA
06-02-2026	NIMRA COLLEGE OF PHARMACY IBRAHIMPATNAM, Krishna Dist.
06-02-2026	VIGNAN COLLEGE OF PHARMACY VADLAMUDI, Guntur Dist.
07-02-2026	SRI SIDDHARTHA COLLEGE OF PHARMACY NUZIVIDU, Krishna Dist.
07-02-2026	CHALAPATHI INSTITUTE OF PHARMACEUTICAL SCIENCES LAM, Guntur Dist.

Interview Time : 9:00 am to 03:00 pm

సదుపాయములు: 1.బ్యాచ్‌లర్స్‌కు (పురుషులు) ఉచిత వసతి 2.ఉచిత యూనిఫాం 3.అర్హులైన వారికి PF, ESI ఇవ్వబడును 4.భోజన ఖర్చులో రాయితీ

Issued by : SSM Manpower Services
Cyberhills Colony, PJR Nagar, Gachibowli, Hyderabad, Telangana.
Contact : 08694-257001

కాన్ఫిడెంట్ రియల్ ఎస్టేట్స్ ఫౌండర్ సీజే రాయ్ ఆత్మహత్య

▸ ఐటీ దాడుల భయంతో తుపాకీతో కాల్చుకుని బలవన్మరణం



బెంగళూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కేరళకు చెందిన కాన్ఫిడెంట్ రియల్ ఎస్టేట్ సంస్థ ఫౌండర్ చైర్మన్ సీజే రాయ్ తుపాకీతో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బెంగళూరులోని కాన్ఫిడెంట్ గ్రూప్‌పై ఐటీ శాఖ అధికారులు దాడులు జరిపారు. ఈ దాడులకు భయపడి సీజే రాయ్, తన వద్ద ఉన్న రివాల్వర్‌తో కాల్చుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. బెంగళూరు రిచ్‌మండ్ సర్కిల్‌లో ఉన్న ల్యాంగ్‌ఫర్డ్ రోడ్డులో ఈ సంఘటన జరిగింది. సీజే రాయ్‌పై పన్నులు ఎగవేశారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో శుక్రవారం మధ్యాహ్నం ఐటీశాఖ అధికారులు ఆ కంపెనీపై దాడులు చేశారు. సుమారు గంటకుపైగానే సీజే రాయ్‌ను విచారించారు. ఆ తర్వాత కాసేపటికే ఆయన తుపాకీతో కాల్చుకున్నారు. కంపెనీ సిబ్బంది హుటాహుటిన హెచ్ఎస్ఆర్ లే అవుట్‌లోని నారాయణ ఆసుపత్రి తరలించినా, అప్పటికే ఆయన చనిపోయారు. 2025 ఫోర్బ్స్ ప్రకటించిన వందమంది అత్యంత ధనిక వ్యాపారవేత్తలలో రాయ్ ఒకరు. దుబాయ్ సహా పలు దేశాల్లో ఆస్తులున్నాయి. వీటి విలువ బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా.

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా సునేత్ర

నేడు ప్రమాణ స్వీకారం చేయనున్న అజిత్ పవార్ సతీమణి.. క్రీడలు, ఎక్సైజ్ శాఖల కేటాయింపు

▸ అజిత్ నిర్వహించిన ఆర్థిక శాఖ ఫడణవీస్ వద్దే
▸ 2 వారాల్లో రెండు ఎన్‌సీపీల విలీనం?
▸ అధ్యక్ష రేసులో పవార్, సునేత్ర, సుప్రియ, ప్రఫుల్



సునేత్ర పవార్

ముంబై, జనవరి 30: విమాన ప్రమాదంలో మరణించిన ఎన్‌సీపీ అధినేత అజిత్ పవార్ స్థానంలో మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ఆయన భార్య సునేత్ర పవార్ శనివారం ప్రమాణం చేయనున్నారు. ఈ పదవి చేపట్టాలని పార్టీ నేతలు చేసిన విజ్ఞప్తికి ఆమె అంగీకారం తెలిపారని సీనియర్ నాయకుడు, మంత్రి ఛగన్ భుజ్‌బల్ మీడియాకు తెలిపారు. ప్రస్తుతం రాజ్యసభ సభ్యురాలిగా ఉన్న ఆమెను శనివారమే తమ శాసనసభాపక్ష నేతగా ఎన్‌సీపీ ఎమ్మెల్యేలు ఎన్నుకోనున్నారు. కాగా.. దివంగత పవార్ ఉపముఖ్యమంత్రిగా ఆర్థిక, ప్రణాళికా శాఖలు చూసేవారు. ఎక్సైజ్, యువజన సంక్షేమం, మైనారిటీల అభివృద్ధి, క్రీడలు కూడా ఆయన వద్దే ఉన్నాయి. ఫిబ్రవరిలో జరిగే అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెట్టాల్సి ఉంది. ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో సునేత్ర ఆర్థిక శాఖ వంటి కీలక శాఖను నిర్వహించలేరని.. ఆమెకు ఎక్సైజ్, క్రీడల శాఖలు ఇస్తామని.. ఆర్థిక శాఖ ప్రస్తుతానికి సీఎం ఫడణవీస్ వద్దే ఉంటుందని బీజేపీ నాయకత్వం ఎన్‌సీపీ నేతలకు స్పష్టం చేసినట్లు తెలిసింది. బడ్జెట్ సమావేశాల తర్వాత ఆర్థిక శాఖను ఎన్‌సీపీకి ఇస్తామని ప్రతిపాదించిందని.. ఇందుకు వారు సమ్మతించినట్లు సమాచారం. అజిత్ మరణంతో బారామతి అసెంబ్లీ స్థానం ఖాళీ అయింది. ఉప ఎన్నికలో సునేత్ర బరిలోకి దిగనున్నారు.

విలీనంపై జోరుగా మంతనాలు..

మరోవైపు... రెండు ఎన్‌సీపీల విలీనం ఖాయమని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్‌సీపీ-ఎస్‌పీ, దివంగత అజిత్ పవార్ సారథ్యంలోని ఎన్‌సీపీ రెండు వారాల్లో కలిసిపోతాయని రెండు వర్గాల నుంచీ సంకేతాలు అందుతున్నాయి. అయితే విలీనం తర్వాత పార్టీకి ఎవరు నేతృత్వం వహించాలన్న అంశంపై ప్రస్తుతం పవార్ కుటుంబంలో జోరుగా చర్చలు సాగుతున్నట్లు సమాచారం. పవార్‌తో పాటు అజిత్ భార్య సునేత్ర పవార్, శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలె, ఎన్‌సీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రఫుల్ పటేల్ రేసులో ఉన్నట్లు తెలిసింది. ఇటీవలి మున్సిపల్ ఎన్నికల సమయంలోనే రెండు ఎన్‌సీపీలు కలిపిపోవాలని అజిత్ పవార్ కూడా ఆశించారని.. ఎన్‌సీపీ-ఎస్‌పీ నేత జయంత్ పాటిల్‌తో ఈ దిశగా చర్చలు కూడా జరిపారని.. ప్రస్తుత జడ్పీ ఎన్నికల తర్వాత తుది నిర్ణయం తీసుకుందామని చెప్పారని పవార్ పార్టీ నేతలు అంటున్నారు. అయితే అజిత్ పార్టీకి చెందిన కొందరు ఎమ్మెల్యేలు మాత్రం ప్రస్తుత పరిస్థితుల్లో విలీనానికి సుముఖంగా లేరు. అజిత్ పార్టీ అధ్యక్షుడు మాత్రమే కాదు.. ఎన్‌సీపీ శాసనసభాపక్ష నేత.. మహాయుతి ప్రభుత్వంలో కీలక భాగస్వామి. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు విలీనం అయితే, తర్వాత పార్టీ వైఖరి ఎలా ఉంటుంది..ఫడణవీస్ ప్రభుత్వంలో కొనసాగుతుందా లేదా అనేది అసలు ప్రశ్న. ప్రభుత్వం నుంచి వైదొలిగే ఉద్దేశం ఎన్‌సీపీ ఎమ్మెల్యేలకు లేదు. అందుకే అజిత్ నిర్వహించిన శాఖల భర్తీపై తొలుత దృష్టిపెట్టాలని, ఆ తర్వాతే విలీనంపై చర్చలకు వెళ్లాలని వారు పట్టుబడుతున్నారు. కాగా, బారామతి విమాన ప్రమాదంపై రాష్ట్ర సీఐడీ విభాగం శుక్రవారం దర్యాప్తు ప్రారంభించింది.



జంపన్నవాగులో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తుల విహంగ వీక్షణం

వనమంతా జనమై.. మేడారానికి పోటెత్తిన భక్తులు

మేడారం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సాధారణంగా మేడారం మహాజాతరలో ఎప్పుడూ రెండోరోజే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉంటుంది. సమ్మక్క గద్దె చేరిన 24గంటల తర్వాత జాతర పలుచబడుతుంది. ఈసారి అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొంది. మూడోరోజు భక్తులు వరదలా పోటెత్తారు. ఫలితంగా శుక్రవారం పరిస్థితి ఒక్కసారిగా అదుపు తప్పింది. జంపన్నవాగు, బస్టాండ్ ప్రాంగణం ఇలా ఎక్కడ చూసినా ఇసుకేస్తే రాలనంతగా భక్తజనం కనిపించారు. ప్రత్యేకించి క్యూలైన్ల వద్ద భక్తులను నియంత్రించడం పోలీసులకు సవాలుగా పరిణమించింది. గద్దెల వద్ద వెళ్లే అన్ని ప్రధాన ద్వారాల వద్ద భక్తులు కిక్కిరిసిపోవడంతో లోపలివారు బయటకు రాలేని పరిస్థితి.. అలాగే బయటి వారు లోపలికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇది తొక్కిసలాటకు దారితీసింది. మహిళలు, పిల్లలు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రద్దీని నియంత్రించడానికి పోలీసులు పలుమార్లు లాఠీలకు పనిచెప్పారు. ఒకదశలో రద్దీని తగ్గించేందుకు వీఐపీల క్యూలైన్లలోకి సాధారణ భక్తులను అనుమతించారు. భక్తుల తాకిడి పెరగడంతో పలుచోట్ల ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి.

రేవంత్‌కు హార్వర్డ్ పట్టా

కెనడీ స్కూల్ నుంచి సర్టిఫికెట్ అందుకున్న టీ.ముఖ్యమంత్రి



హైదరాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడిలో చదివి.. రాజకీయాల్లోకి వచ్చి.. తక్కువ సమయంలోనే రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన రేవంత్‌రెడ్డి ఇప్పుడు మరో రికార్డు సాధించారు. ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీలోని కెనడీ స్కూల్‌లో '21వ శతాబ్దంలో నాయకత్వం' కోర్సును పూర్తిచేసి సర్టిఫికెట్ అందుకున్నారు. ఓ రాష్ట్ర సీఎం హోదాలో కోర్సును పూర్తిచేసి.. హార్వర్డ్ నుంచి సర్టిఫికెట్ అందుకున్న తొలి ముఖ్యమంత్రిగా రికార్డుల్లోకి ఎక్కారు. హార్వర్డ్ యూనివర్సిటీలో ఈ కోర్సుకు సంబంధించి ఈ నెల 25 నుంచి వారం రోజులపాటు ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు క్లాసులు నిర్వహించారు. 20 దేశాలకు చెందిన దాదాపు 60 మంది విద్యార్థులు ఈ క్లాసులకు హాజరయ్యారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ తరగతులకు హాజరై.. హోంవర్కులు, అసైన్‌మెంట్లు పూర్తిచేశారు. అధికారం, నాయకత్వం, అనిశ్చితి వంటి అంశాలపై శిక్షణ పూర్తిచేశారు.

జెలెన్‌స్కీ.. శాంతి చర్చలకు మాస్కోకి రండి!

▸ ఉక్రెయిన్ అధ్యక్షుడికి రష్యా మళ్లీ పిలుపు



గత ఆగస్టులో పుతిన్ అలాస్కాలో పర్యటించిన సమయంలో దిగిన ఫొటోను ట్రంప్ వైట్ హౌస్‌లో ఇలా ఫ్రేమ్ కట్టించారు. ఉక్రెయిన్ యుద్ధ విరమణపై చర్చల వేళ ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకొంది.

మాస్కో, జనవరి 30: రష్యా- ఉక్రెయిన్ మధ్య నాలుగేళ్లుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే దిశగా అమెరికా చేస్తున్న ప్రయత్నాలు సత్ఫలితాన్ని ఇస్తున్నాయి. శాంతి చర్చల కోసం మాస్కోకు రావాలంటూ ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని రష్యా మరోమారు ఆహ్వానించింది. అయితే, తమ ఆహ్వానంపై ఉక్రెయిన్ నుంచి స్పందన లేదని, జెలెన్‌స్కీ పర్యటనపై తమకు సమాచారం లేదని రష్యా అధికార ప్రతినిధి దిమిత్రి పెస్కోవ్ విలేకరులతో అన్నారు. అయితే, శాంతిచర్చల కోసం తమ దేశానికి రావాలని రష్యా గతేడాది చేసిన ప్రతిపాదనను జెలెన్‌స్కీ అప్పట్లో తిరస్కరించారు. కాగా, ట్రంప్ వ్యక్తిగతంగా చేసిన వినతి మేరకు ఫిబ్రవరి 1 వరకు ఉక్రెయిన్ రాజధాని కీవ్‌పై దాడులు చేయకుండా ఉండేందుకు అంగీకరించామని రష్యా తెలిపింది.

రూ.8.69 లక్షల విలువైన ఖైనీ, గుట్కా స్వాధీనం

- ఏలూరు జిల్లాలో విజిలెన్స్ దాడులు
- ఐదు షాపుల నిర్వాహకులపై జీఎస్టీ, క్రిమినల్ కేసులు నమోదు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏలూరు క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి కోట్లాది రూపాయలు పన్నులు ఎగవేస్తూ గుట్కా ప్రియులను దోచేస్తూ, మనీ లాండరింగ్‌కు పాల్పడుతూ ప్రభుత్వానికి పెనుసవాల్ విసురుతున్న గుట్కా మాఫియా చీకటి దందాపై 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రధాన సంచికలో శుక్రవారం 'గుట్కా మాఫియా.. చీకటి దందా' శీర్షిక కథనం ప్రచురితమైన విషయం విదితమే. దీనిపై ఏలూరు జిల్లా విజిలెన్స్ ఎస్పీ కె.నాగేశ్వరరావు ఆదేశాలతో అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి శుక్రవారం ఏలూరు వన్‌టౌన్ పెద్ద మార్కెట్లో ఏకకాలంలో ఐదు షాపులపై దాడులు చేపట్టారు. ఈ దాడులు శుక్రవారం రాత్రి 8 గంటల వరకు కొనసాగించారు. విజయ స్టోర్స్, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్, సింహాద్రి కూల్ డ్రింక్స్, శ్రీ లక్ష్మీ ప్రసన్న జనరల్ స్టోర్స్, ఆకుల కొండలరావు జనరల్ స్టోర్‌పై దాడులు నిర్వహించి మొత్తం రూ.8,69,44000 లక్షల విలువైన ఖైనీ, గుట్కా ప్యాకెట్లను సీజ్ చేశారు. ఎలాంటి లైసెన్సు లేకుండా, ఎలాంటి బిల్లులు ఇవ్వకుండా ఖైనీ, గుట్కాలను యథేచ్ఛగా విక్రయిస్తున్నట్టు గుర్తించారు. ఎంఆర్‌పీపై ఉన్న ధరల కన్నా 150 రెట్లు అధికంగా వసూలు చేస్తున్నట్టు గుర్తించి, అయా షాపుల యజమానులపై జీఎస్టీ కేసు నమోదు చేశారు. ఏలూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వారిపై క్రిమినల్ కేసు నమోదుకు విజిలెన్స్ అధికారులు ఫిర్యాదులు చేశారు.

29 పట్టణ ప్రాంతాల్లో టిడ్కో మౌలికవసతులకు రివైజ్డ్ టెండర్లు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి అవాస్ యోజన(పట్టణ) పథకం నిధులతో రాష్ట్రంలోని 29 పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గతంలో మౌలికవసతులకు సంబంధించి మంజూరైన పనులను రద్దు చేసి, కొత్త ధరలతో రూ.226.36 కోట్ల పనులు మంజూరు చేసేందుకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో ఎంఎస్‌ఆర్-ద్వారక-కావేరి(జాయింట్ వెంచర్) కాంట్రాక్టు అగ్రిమెంట్‌ను రద్దు చేశారు. దీంతో తిరిగి టెండర్లు పిలిచేందుకు ఏపీ టిడ్కోకు అనుమతిస్తూ మున్సిపల్‌శాఖ ఆదేశాలిచ్చింది.

మేనిఫెస్టో హామీలు అమలు చేయండి: ఎస్టీయూ

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి 20 నెలలు దాటినా ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు ఇచ్చిన మేనిఫెస్టో హామీలు అమలుచేయలేదని, వాటిని వెంటనే అమలుచేయాలని ఎస్టీయూ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఉద్యోగుల ఆర్థిక సమస్యలపై దశలవారీ ఉద్యమం చేపట్టిన ఎస్టీయూ.. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని మండలాల తహసీల్దారులకు వినతిపత్రాలు అందజేసింది.

చట్టం ప్రకారమే టీచర్ల బదిలీలు: పాఠశాల విద్యాశాఖ

ఉపాధ్యాయ బదిలీల చట్టాన్ని అనుసరించే టీచర్ల బదిలీలు ఉంటాయని, టీచర్లకు ప్రస్తుత పాఠశాలలో గరిష్ఠ పరిమితి ఎనిమిదేళ్లుగానే ఉంటుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో శుక్రవారం మంగళగిరిలోని విద్యాభవన్‌లో సమావేశం నిర్వహించారు. భాషా సబ్జెక్టుల టీచర్లకు 70:30 నిష్పత్తిలోనే ఉండాలని సంఘాల ప్రతినిధులు కోరారు. దీనిని 30:70 నిష్పత్తి చేయాలనే ఆలోచన విరమించుకోవాలని కోరారు. దీనిపై పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు తెలిపారు. సర్వీసు మేటర్స్‌పై అన్ని జిల్లాల అధికారులకు శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇన్ సర్వీస్ టీచర్లు బీఈడీ, బీపీఈడీ కోర్సులు చేసేందుకు అనుమతిని ఆన్‌లైన్ ద్వారా జారీచేయాలనే ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని @ SCRailwayindia అనుసరించండి
ద.మ.రైల్వేలోని టెండరు ప్రకటన వివరాలను వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడగలరు

టెండరు నం: GTL-EM-74-2025-26 తేది:29.01.2026 PUB/1838

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ మెయింటెనెన్స్/ గుంతకల్ వారు దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-టెండర్లు కోరుతున్నారు.

టెండరు నం: GTL-EM-74-2025-26. పని పేరు: గుంతకల్ డివిజన్ - SSE & JE/ Pway/NDL మరియు ఇంజినీరింగ్ సిబ్బంది కొరకు స్టాఫ్ క్వార్టర్ టైప్-IV-1 యూనిట్ (ప్లింత్ ఏరియా 103 చ.మీ.) మరియు టైప్-III-10 యూనిట్లు (1 యూనిట్ ప్లింత్ ఏరియా 63 చ.మీ.) ప్రతిపాదిత నిర్మాణం కోసం ఎలక్ట్రికల్ ఏర్పాట్లు. సుమారు విలువ: రూ. 24,56,017.39/-

ముగింపు తేది మరియు సమయం: 19.02.2026న 15.00 గం.

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. ఏదేని సవరణ ఉంటే అది ఆన్‌లైన్‌లో మాత్రమే జారీ చేయబడుతుంది. టెండరుదారులు టెండరు డాక్యుమెంట్‌ను http://www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.

గమనిక: ఈ ఇ-టెండరులో పాల్గొనుటకు/బిడ్ వేయుటకు టెండరుదారు వ్యాలిడ్ DSC (డిజిటల్ సిగ్నేచర్ సర్టిఫికెట్) కలిగి ఉండవలెను.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, మెయింటెనెన్స్, గుంతకల్

టెండరు ప్రకటన నం: G/E.29/Tr./Tender Notice/47/2025-26 PUB/1839

భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్/ ట్రాక్షన్/ గుంతకల్ వారు దిగువ తెలిపిన పనుల కొరకు ఇ-టెండర్లు కోరుచున్నారు.

టెండరు నం: GTL-TRD-29-eTN-78-2025-26, పని పేరు: GTL డివిజన్‌లో భద్రత దృష్ట్యా ప్లాట్‌ఫారమ్‌పై లైవ్ OHE భాగాన్ని నివారించడానికి OHE ఏర్పాట్లలో మార్పులు. సుమారు విలువ: రూ. 1,28,02,594/-, బయానా: రూ. 2,14,000/-

టెండరు ముగింపు తేది మరియు సమయం: 19.02.2026న 15.00 గం.లకు

గమనిక:
1. టెండరుదారులు టెండరు డాక్యుమెంట్‌ను www.ireps.gov.in నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

టెండరు బిడ్డింగ్ మరియు ఇతర వివరాల కొరకు http://www.ireps.gov.in కు లాగిన్ కాగలరు. ఏదైన సవరణ ఆన్‌లైన్ ద్వారా మాత్రమే జారీ చేయబడుతుంది.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్
A2331

తదుపరి టెండరు నిబంధనలు/ వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దర్శించండి
వెబ్‌సైట్ :https:// www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in

ఆర్టీఈ అడ్మిషన్లకు అనుమతి

రానున్న విద్యా సంవత్సరంలో విద్యాహక్కు చట్టం ద్వారా అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతిస్తూ పాఠశాల విద్యాశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. అడ్మిషన్లు పొందే విద్యార్థుల ఫీజులు ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపింది.

9 నుంచి టెన్త్ ప్రీఫైనల్ పరీక్షలు

పదో తరగతి ప్రీఫైనల్ పరీక్షలు ఫిబ్రవరి 9 నుంచి 19 వరకు జరుగుతాయని ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే 9వ తేదీ నుంచి నుంచి 12 వరకు 1 నుంచి 9 తరగతుల ఫార్మేటివ్ అసెస్‌మెంట్-4 పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

జైళ్లశాఖ డీజీగా బాలసుబ్రహ్మణ్యం

రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, కరెక్షనల్ సర్వీసెస్ బాధ్యతలు నిర్వర్తిస్తున్న అంజని కుమార్, ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ డైరెక్టర్‌గా ఉన్న జి.పాలరాజులు శనివారం పదవీ విరమణ చేయనుండటంతో ఈ ఇద్దరు ఐపీఎస్ అధికారులను రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతల నుంచి రిలీవ్ చేసింది. దీంతో ప్రస్తుతం డీజీపీ కార్యాలయంలో హెచ్‌వోపీఎఫ్‌గా ఉన్న ఎన్.బాలసుబ్రహ్మణ్యంకు జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్, కరెక్షనల్ సర్వీసెస్, ఇంటెలిజెన్స్ ఐజీ పీహెచ్‌డీ రామకృష్ణకు ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఉత్తర్వులు విడుదల చేశారు.

भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking)
Branch Office: Kapas Bhavan, 4/2, Ashok Nagar, P.B.227, Guntur-522002, AP
Tele.No.0863-2233472, Fax No.0863-2357472, E-mail:guntur@cotcorp.com
Website: www.cotcorp.org.in, Ministry Website: www.ministryoftextiles.gov.in

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పత్తి రైతులందరికీ ప్రజాప్రకటన

ప్రస్తుత పంట సీజన్ 2025-26 కు సంబంధించి, కనీస మద్దతు ధర (MSP) పథకం కింద పత్తి కొనుగోలుకు చివరి తేదీని 20 ఫిబ్రవరి 2026గా నిర్ణయించబడినట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పత్తి రైతులందరికీ తెలియజేయబడుతోంది.

అందువల్ల, KapasKisaan App లో నమోదు చేసుకున్న పత్తి రైతులందరూ కనీస మద్దతు ధరల ప్రయోజనాన్ని పొందేందుకు, యాప్ ద్వారా ముందుగానే స్లాటు బుక్ చేసుకుని, సమీపంలోని CCI కొనుగోలు కేంద్రంలో తమ పత్తిని 20.02.2026 లోపు విక్రయించవలసిందిగా కోరడమైనది. మరిన్ని వివరాల కోసం, శాఖాకార్యాలయం, గుంటూరు యొక్క WhatsApp హెల్ప్‌లైన్ నంబర్ 7659954529 ను సంప్రదించగలరు.

శాఖామేనేజర్

ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శన



ఢిల్లీలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో పాల్గొన్న రాష్ట్ర కళాకారులు

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): భారత్ పర్వ్‌లో భాగంగా ఆంధ్రప్రదేశ్ దినోత్సవం సందర్భంగా 46 మంది కళాకారులతో ఢిల్లీలో శుక్రవారం నిర్వహించిన కూచిపూడి శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ ప్రదర్శన నృత్యాభిమానులు, సందర్శకులను మంత్రముగ్ధులను చేసింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ భవన్ స్పెషల్ కమిషనర్ ఆర్జా శ్రీకాంత్ కళాకారులను సన్మానించారు. రాష్ట్ర సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ, ప్రచారం చేస్తున్న కూచిపూడి కళాకారుల కృషిని కొనియాడారు.

పారదర్శకతపై 'పరదా'!

ప్రస్తుత సీఎఫ్ఎంఎస్ వ్యవస్థకు తూట్లు

వైసీపీ హయాంలోనే విఫలమైన వ్యవస్థలోకి మళ్లీ ప్రయత్నాలు!

రాష్ట్రంలో చెల్లింపుల కోసం ప్రభుత్వం ప్రస్తుతం వినియోగిస్తున్న సీఎఫ్ఎంఎస్ (సెంట్రలైజ్డ్ ఫైల్ మేనేజ్‌మెంట్ అండ్ ట్రాకింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్) వ్యవస్థ పూర్తి పారదర్శకం. ప్రతి రూపాయి కదలిక ఇక్కడ తెలిసిపోతుంది. పైసా తేడా వచ్చినా పట్టేస్తుంది. శాప్ ప్లాట్‌ఫామ్‌పై ఇంత ఆధునికంగా రూపొందించిన ఆధునిక వ్యవస్థను కాదని వైసీపీ హయాంలోనే విఫలమైన, పరదాల తరహా వ్యవస్థలోకి ఆర్థిక శాఖ తిరిగి మళ్లాలనుకోవడం చర్చనీయాంశంగా మారింది.

- ప్రతి రూపాయి కదలికను ట్రాక్ చేసేలా శాప్ ప్లాట్‌ఫామ్‌పై సీఎఫ్ఎంఎస్ అభివృద్ధి
- చంద్రబాబు హయాంలో చక్కని ఫలితాలు
- వైసీపీ అధికారంలోకి రాగానే 'జావా'లోకి...
- చెల్లింపుల్లో తప్పులు రెండో కంటికి తెలియకుండా ఆ జాగ్రత్త
- ఇప్పుడు మళ్లీ ఆ దిశగా నడుస్తున్న వైనం
- అదనపు నిధుల కేటాయింపుల్లోనూ అదే తీరు
- ఆర్థిక శాఖ అధికారుల వైఖరిపై విమర్శలు

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

చంద్రబాబు హయాంలో 2014-19లో సీఎఫ్ఎంఎస్‌ను శాప్ ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేశారు. తమ బిల్లు ఎంతవరకు వచ్చిందనేది సంబంధిత వ్యక్తులు ఈ వ్యవస్థలో ఎప్పటికప్పుడు ట్రాక్ చేసుకోవచ్చు. చెల్లించే ప్రతి బిల్లు, ప్రతి రూపాయికి ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి ఆమోదం ఉండేలా రూపొందించారు. అంతకుముందున్న చెల్లింపుల వ్యవస్థలో పారదర్శకత లేదు. సీఎఫ్ఎంఎస్‌ను శాప్ ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేయడం వల్ల ప్రతీ బిల్లును ఆర్థిక శాఖ ముఖ్యకార్యదర్శి ఎప్పుడైనా చూడగలరు. చెల్లింపుల్లో ఏదైనా తప్పు జరిగితే ఆ తప్పు తుడిచేయడం కుదరదు. ఆ తప్పు అలాగే కనబడుతుంది. దాన్ని సరిచేస్తూ మరోసారి కరెక్షన్ ఎంట్రీ వేస్తారు. ఈ కరెక్షన్ ఎంట్రీ తమకు అడ్డంకిగా ఉందన్న ఉద్దేశంతో వైసీపీ హయాంలో మొత్తం చెల్లింపుల వ్యవస్థను జావా ప్లాట్‌ఫామ్‌పై అభివృద్ధి చేయాలని భావించారు. హెర్బ్ పేరుతో రెడీ చేశారు. కానీ, అది అనుకున్న ఫలితాలు ఇవ్వలేదు. చెల్లింపుల్లో తప్పు జరిగితే దాన్ని ఎవరికీ తెలియకుండా డిలీట్ చేసే అవకాశం జావా ప్లాట్‌ఫామ్‌పై ఉంటుంది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వంలోనూ చెల్లింపుల కోసం జావా ఆధారిత ప్లాట్‌ఫామ్‌ను సిద్ధం చేయాలంటూ ఆర్థిక శాఖ అధికారులు ప్రతిపాదిస్తున్నారు. దీనిపై ఆ శాఖలో ప్రాథమిక సమావేశం కూడా జరిగింది. త్వరలో ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశం జరగాల్సి ఉంది. అలాగే, గతంలో సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ రాకముందు పీడీ ఖాతాల బిల్లులను చెక్కుల రూపంలో ఇచ్చేవారు. ఇవి ఆర్థిక శాఖ కార్యదర్శులతో సంబంధం లేకుండా ట్రెజరీల స్థాయిలో జరిగిపోయేవి. అయితే, ఆ పీడీ ఖాతాల బిల్లులు ఒక్కోసారి దాదాపు రూ.50 కోట్లకు పైగా ఉండేవి. ఒక్కోసారి ఖజానాలో డబ్బు లేనప్పుడు ఈ చెక్కులు సమస్యగా మారేవి. ఈ సమస్యను అధిగమించడం కోసం రూ.కోటి దాటిన ప్రతి పీడీ ఖాతా చెక్కునూ ఆర్థిక శాఖ కార్యదర్శి పరిశీలనకు పంపాలన్న నిబంధన పెట్టారు. సీఎఫ్ఎంఎస్ వచ్చాక ప్రతి బిల్లు ఆర్థిక శాఖ కార్యదర్శి పరిశీలించే అవకాశం ఉంది. దీంతో ఆ కోటి రూపాయల చెక్కు నిబంధన అవసరం లేకుండా పోయింది. అయితే, ఇప్పుడు మళ్లీ వెనక్కి వెళ్లి రూ.కోటి దాటిన పీడీ ఖాతాల బిల్లులు ఆర్థిక శాఖ కార్యదర్శి పరిశీలనకు రావాలన్న నిబంధన తేవాలని ఆర్థిక శాఖ భావిస్తోంది. శాప్ ప్లాట్‌ఫామ్‌పై పకడ్బందీగా ఉన్న సీఎఫ్ఎంఎస్‌ను జావాకు మార్చి పారదర్శకతను కోల్పోవడం ఎందుకు అన్న విమర్శలు వస్తున్నాయి. అలాగే, అదనపు నిధుల కేటాయింపు విషయంలోనూ ఆర్థిక శాఖ ఇటీవల ఇచ్చిన ఒక మెమోపై ఉద్యోగుల నుంచి తీవ్రమైన అసంతృప్తి వ్యక్తమవుతోంది. సాధారణంగా ఏదైనా శాఖకు అదనంగా నిధులు కావాలంటే సదరు శాఖ ఆర్థిక శాఖకు ప్రతిపాదన పంపుతుంది. ఆ ప్రతిపాదన ఆ శాఖను చూసే ఆర్థిక శాఖ కార్యదర్శి, సెక్షన్ల పరిశీలన తర్వాత బడ్జెట్ కార్యదర్శికి, బడ్జెట్ సెక్షన్లకు చేరి సబబు అనుకుంటే అదనపు నిధులు మంజూరు చేస్తూ జీవో ఇస్తారు. కానీ, ఇప్పుడు నేరుగా బడ్జెట్ కార్యదర్శి, బడ్జెట్ సెక్షన్లకు మాత్రమే ఈ అదనపు నిధుల ప్రతిపాదన వెళ్లేలా నిబంధనలు మార్చారు. దీనివల్ల ఏ శాఖకు ఎంత అదనపు నిధులు ఇచ్చారనేది ఆర్థిక శాఖలోని ఉద్యోగులకు కూడా తెలియకుండా పోతుంది. దీని వల్ల పారదర్శకత దెబ్బ తింటుందని ఉద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కాంక్లేవ్‌లో ప్రసంగిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్‌గా రూపొందిస్తాం

- రాష్ట్రస్థాయి కోకో కాంక్లేవ్‌లో మంత్రి అచ్చెన్నాయుడు

ఏలూరు సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని హార్టికల్చర్, కోకో హబ్‌గా తీర్చిదిద్దేలా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఏలూరు జిల్లా కేంద్రం ఏలూరులో శుక్రవారం నిర్వహించిన రాష్ట్రస్థాయి కోకో కాంక్లేవ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కోకో ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. కోకో సాగు రైతులకు అధికాదాయం ఇచ్చే పంటగా అభివృద్ధి చెందుతోందని, కోకో సాగు విస్తరణ, నాణ్యతా ప్రమాణాలు, ఆధునిక సాగు విధానాలపై ఈ కాంక్లేవ్‌లో విస్తృత చర్చ జరుగుతుందని తెలిపారు. కోకో ప్రాసెసింగ్, విలువ జోడింపు ద్వారా రైతులకు మరింత లాభాలు సాధ్యమవుతాయని వెల్లడించారు. కోకో ఉత్పత్తి, నాణ్యత పెంపుతో పాటు అంతర్జాతీయ మార్కెటింగ్‌కు అనుసంధానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీని ఏర్పాటుచేసి ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటుకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం గత బడ్జెట్‌లో రూ.300 కోట్లు కేటాయించి గత ఏడాది కాలంలో రూ.1200 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకంలో రైతులకు అందిందని చెప్పారు. విజయవాడలో అంతర్జాతీయ స్థాయిలో హార్టికల్చర్ కాంక్లేవ్‌ను నిర్వహించి ఉద్యానవన పంటల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ముఖ్య కార్యదర్శి చిరంజీవి చౌదరి, కలెక్టర్ వెట్రిసెల్వి, ఏలూరు, దెందులూరు, చింతలపూడి, ఉంగుటూరు ఎమ్మెల్యేలు బడేటి రాధాకృష్ణయ్య(చంటి), చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, పత్సమట్ల ధర్మరాజు, ఉద్యానశాఖ కమిషనర్ కె.శ్రీనివాసులు, ఉద్యాన వన విభాగానికి చెందిన జాతీయ సంస్థల డైరెక్టర్లు/అధిపతులు, కోకో అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.



శ్రీసత్యసాయి జిల్లా పరిగి మండలం సేవా మందిరంలో చరఖా తిప్పుతున్న సీడబ్ల్యూసీ సభ్యుడు రఘువీరారెడ్డి

గాంధీని విమర్శించడం దేశాన్ని విమర్శించడమే

- జాతీయ జెండా మహాత్ముడి భిక్ష
- దేశంలో ఏకత్వాన్ని చెడగొడుతున్నారు: రఘువీరా రెడ్డి
- ముగిసిన గాంధీజీ సందేశ్ యాత్ర

హిందూపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జాతిపిత మహాత్మాగాంధీని విమర్శించడం అంటే మన దేశాన్ని విమర్శించడమేనని సీడబ్ల్యూసీ సభ్యుడు, మాజీ మంత్రి రఘువీరారెడ్డి అన్నారు. శ్రీసత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలంకతాపురంలో ఈ నెల 28న ప్రారంభించిన 'గాంధీ సందేశ్ యాత్ర' శుక్రవారం హిందూపురంలోని గాంధీ సర్కిల్‌లో ముగిసింది. అనంతకు ముందు పరిగి మండలం సేవా మందిరంలో గాంధీజీని స్మరించుకుంటూ రఘువీరా చరఖాపై నూలు వడికారు. అక్కడి నుంచి పాదయాత్రగా వచ్చి, హిందూపురంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ రోజు జాతీయ జెండా కింద మనమంతా ఉన్నామంటే అది మహాత్మగాంధీ పెట్టిన భిక్ష అని తెలిపారు. అలాంటి మహానుభావున్ని కొంతమంది ఆకతాయిలు సోషల్ మీడియాలో ఇష్టానుసారంగా విమర్శిస్తుంటే ఈ ప్రభుత్వాలకు చీమకుట్టినట్లయినా లేదని మండిపడ్డారు. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న దేశంలో ఏకత్వాన్ని చీల్చి చెండాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీ సిద్ధాంతాలు, ఆశయాలను సజీవంగా ఉంచేందుకు ప్రతి ఒక్కరూ నడుంబిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ మాజీ సభ్యుడు కేవీపీ రామచంద్రరావు, పీసీసీ మాజీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పార్టీ జిల్లా నాయకులు పాల్గొన్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్నాడని.. కొడుకును కడతేర్చిన తండ్రి, చిన్నాన్న

- అనంతపురం జిల్లాలో దారుణం



కుపేంద్ర రెడ్డి

డి.హీరేహాళ్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం కోల్పోయి, కుటుంబ సభ్యులపైనే దాడికి పాల్పడుతున్న వ్యక్తిని అతని తండ్రి, చిన్నాన్న కలిసి హతమార్చారు. అనంతపురం జిల్లా డి.హీరేహాళ్ మండలం చెర్లోపల్లి గ్రామంలో శుక్రవారం ఈ దారుణ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన దొడ్డప్పకు కుమారుడు కుపేంద్ర రెడ్డి(30), కూతురు ఉన్నారు. వీరిది వ్యవసాయ కుటుంబం. ఎనిమిదేళ్ల క్రితం దొడ్డప్ప కుటుంబానికి, ఇతరులకు జరిగిన ఘర్షణలో కుపేంద్ర చేతిలో ఓ వ్యక్తి హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అతను ఏడేళ్ల జైలు శిక్ష అనుభవించాడు. గతేడాది జైలు నుంచి వచ్చాక మతిస్థిమితం కోల్పోయి, కుటుంబ సభ్యులతో తరచూ గొడవపడేవాడు. గురువారం మధ్యాహ్నం పొలం వద్ద పనులు చేసుకుంటున్న దొడ్డప్ప, చిన్నాన్న దేవరాజ్ వద్దకు వెళ్లిన కుపేంద్ర రెడ్డి.. వారితో గొడవపడి, దాడికి యత్నించాడు. రాత్రి మరోసారి డబ్బు కోసం గొడవకు దిగాడు. కుమారుడి నుంచి తమకు ఎప్పటికైనా ప్రాణహాని ఉంటుందని భావించిన దొడ్డప్ప, దేవరాజ్.. అతడిని చంపేయాలని నిర్ణయించుకుని నిద్రిస్తున్న కుపేంద్రరెడ్డిపై అర్ధరాత్రి దాడి చేశారు. కర్రతో తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమై కుపేంద్రరెడ్డి చనిపోయాడు. కేసు నమోదు చేసిన పోలీసులు... నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

8న శ్రీపెరంబుదూర్‌లో కమ్మ మహానాడు

కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్



ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతున్న జెట్టి కుసుమ కుమార్

న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని శ్రీపెరంబుదూర్ వేదికగా ఫిబ్రవరి 8న కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) మహానాడు నిర్వహిస్తామని వ్యవస్థాపక అధ్యక్షుడు జెట్టి కుసుమ కుమార్ ప్రకటించారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియాలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న కమ్మ కులస్థులను ఏకం చేయడమే లక్ష్యంగా కేజీఎఫ్ ఏర్పాటు చేశామన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 2.1 కోట్ల కమ్మ సమాజానికి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పారు. దేశ జనాభాలో సుమారు 1.5 శాతం కమ్మ కులస్థులే ఉన్నారని తెలిపారు. దేశంలో మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో సంఘటితంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్తు తరాలకు నాయకత్వ అవకాశాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. తమిళనాడులో అత్యధికంగా 65 లక్షల కమ్మ జనాభా ఉన్నారన్నారు. బొల్లినేని మునుస్వామి నాయుడు, జీ.డి.నాయుడు, వైకో వంటి ప్రముఖుల గడ్డ తమిళనాడని తెలిపారు. చారిత్రక రాజవంశాలు, నాయకత్వ సంప్రదాయం ఉన్న ప్రాంతంగా తమిళనాడు గుర్తింపు పొందిందని స్పష్టం చేశారు. అయితే, తమిళనాడు రాజకీయాల్లో కమ్మ కులస్థుల ప్రాతినిధ్యం తగ్గిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడులో భవిష్యత్తులో కనీసం 30 మంది కమ్మ ఎమ్మెల్యేలు ఉండాలనే లక్ష్యంతో ముందుకు వెళుతున్నామని తెలిపారు. గతేడాది హైదరాబాద్‌లో నిర్వహించిన వరల్డ్ కమ్మ సమ్మిట్‌కు భారీ స్పందన లభించిందని గుర్తుచేశారు.

ప్రజల్ని అప్రమత్తం చేసేలా విపత్తు సమాచారం

- ప్రాణ, ఆస్తి నష్టాల తగ్గింపే లక్ష్యం: డిజాస్టర్ ఎండీ

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, వరదలు, పిడుగులు, వడగాడ్పులు, భారీ వర్షాలు, భూకంపాల వంటి ప్రకృతి విపత్తులపై ఇచ్చే సమాచారం ప్రజల్ని భయపెట్టేలా, ఇబ్బంది పెట్టేలా కాకుండా వారికి అర్థమయ్యేలా, పూర్తిగా అప్రమత్తం చేసేలా అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్ అన్నారు. విపత్తు ప్రమాదాల తగ్గింపు కోసం రిస్క్ కమ్యూనికేషన్, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ అనే అంశంపై విజయవాడలో రెండు రోజులపాటు జరిగిన వర్క్‌షాప్‌లో భాగంగా శుక్రవారం ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'సమర్థవంతమైన విపత్తు నివారణ చర్యలు ప్రమాద తగ్గింపునకు దోహదం చేస్తాయి. ప్రకృతి విపత్తుల్లో వ్యక్తులతోపాటు కమ్యూనిటీలు ప్రధాన పాత్ర పోషించాలి. ప్రాణ, ఆస్తి నష్టం కనిష్ఠ స్థాయికి తగ్గింపే లక్ష్యంగా అధికార యంత్రాంగం పని చేయాలి' అని ప్రఖర్‌జైన్ చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు & మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ
3వ అంతస్తు, CMS కాంపౌండ్, ప్రభుత్వ ENT హాస్పిటల్ ఎదురుగా, పెదవాల్తేరు, విశాఖపట్నం-530017. ఫోన్ నం:8978680775 ఇమెయిల్:sevisakhapatnam@gmail.com
టెండరు ప్రకటన నం 11/APMSIDC/SE-VSP/PA/2025-26, తేది: 29.01.2026
విజయనగరం జిల్లాలో 1 (ఒక) పని కొరకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారం ద్వారా టెండర్లు కోరబడుతున్నవి. పని సుమారు విలువ: రూ.153.00 లక్షలు. తదుపరి వివరాల కొరకు https://tender.apeprocurement.gov.inను దర్శించగలరు.
సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్, APMSIDC సర్కిల్, విశాఖపట్నం
DIPR R.O. No.4783PP/CL/ADVT/1/1/2021-22, తేది.30.01.2026

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA VIJAYAWADA -520004
NIT No.M100029554-M12 TENDER ID : 892955
APGENCO invites Online tenders for "Procurement of cast basalt bends for ash pipe lines of 600 MW unit". Bid Start date & time 29.01.2026 at 5.30 PM. Bid Submission closing date & time: 16.02. 2026 at 02:00 PM. For further details visit https://tender.apeprocurement.gov.in Contact No.08563-262872.
DIPR RO No.4782PP/CL/ADVT/1/1/2021-22, Dt.30.01.2026

GOVERNMENT OF ANDHRA PRADESH EDUCATION & WELFARE INFRASTRUCTURE DEVELOPMENT CORPORATION, VIJAYAWADA
NIT No: 103 to 108/MD/APEWIDC/VJA/2025-26 E-procurement Tender Notice Dated: 30-01-2026
Downloading commencement on 02-02-2026 and closing date may be viewed in e-procurement.gov.in
Tenders are invited for Various Civil Works in Andhra Kesari University at Pernamitta Campus Ongole, APSWREIS at Velugonda, Pre-Metric Boys Hostel at Ongole and Office Building for Department of Mines and Geology, Ongole Town in Prakasam District and Vikrama Simhapuri University at Nellore from Registered Civil Contractors with estimate cost ranging from Rs. 214.00 Lakhs to Rs.1476.22 Lakhs. Further details may be viewed at http://tender.apeprocurement.gov.in Contact No. 08645-295758. Note: 1.Changes/amendment if any will only be communicated through above e- procurement platform.
Sd/- Managing Director, APEWIDC, Vijayawada.

SPORTS AUTHORITY OF ANDHRA PRADESH
IGMC STADIUM, LABBIPET, BANDAR ROAD, VIJAYAWADA
Tenders are hereby invited from reputed and experienced companies for the following tenders.

S. No	Tender ID	Name of the work	Estimate Contract Value (in Rs.)
1	893617	Completion of Incomplete Kreeda Vikasa Kendram at Kondapi (SC Constituency), Prakasam District (Part-1)	30,51,727/-
2	893618	-Do-(Part-2)	30,53,495/-
3	893620	-Do-(Part-3)	23,79,733/-
4	893624	-Do-(Part-4)	30,66,689/-

Bid Starting Date: 30.01.2026. Bid end date:10.02.2026 Tender documents are available on e-procurement platform tender.apeprocurement.gov.in. Tenders will be opened in the presence of company representatives who attend the evaluation. For further details contact: 8501074922
Sd/- Vice Chairman and Managing Director
DIPR RO No.4779PP/CL/ADVT/1/1/2021-22, Dt: 30.01.2026

ANDHRA PRADESH POWER GENERATION CORPORATION LIMITED
VIDYUT SOUDHA, VIJAYAWADA -520004
NOTICE INVITING TENDERS (NIT)/RFX NO:610002188
APGENCO invites Online tenders for USHES- R&M Works- Refurbishment of Head Regulator of Guntawada reservoir at Upper Sileru - Providing stoping gates and stoping gate hoisting arrangements for the upstream and downstream of the intake regulator gates" through APGENCO e-Procurement platform. Please visit https://etender.apgenco.gov.in/irj/portal for tender details, procedure for registration and tender submission etc. Estimate Contract Value of the above work is Rs. 1,62,32,320/-. Tender Schedule will be available online from 29.01.2026 at 8:00 PM onwards. Bid submission closing date: 3:00 PM on 18.02.2026. Pre-qualification/Technical Bids will be opened on 18.02.2026 at 3:15 PM. Price Bids will be opened on 25.02.2026 at 11:00AM. Tender notice can also be seen at www.apgenco.gov.in. Phone:(0866) 2526411, 2526839.
DIPR RO No.4780PP/CL/ADVT/1/1/2021-22, Date:30.01.2026

SAINIK SCHOOL, KORUKONDA
An Autonomous Body under Ministry of Defence, Government of India Dist. Vizianagaram (A.P) Pin : 535214, Phone : 08922-246150. Website : www.sainikschoolkorukonda.org
RECRUITMENT OF PTI - CUM - MARTON ON CONTRACTUAL BASIS FOR A PERIOD OF ONE YEAR
Applications in (Prescribed format) complete in all respects along with DD Rs.500/-(UR) & Rs.250/- (SC/ST (Bank Code No.2791) (Non-refundable) drawn in favour of "Principal, Sainik School Korukonda" payable at SBI, Sainik School Korukonda branch must reach Principal, Sainik School Korukonda within 21 DAYS from the date of publication of the advertisement in Employment News.
Details of the advertisement are available in Employment News and our school website www.sainikschoolkorukonda.org.
Principal, Sainik School Korukonda

DAMODARAM SANJIVAYYA NATIONAL LAW UNIVERSITY
(Estd under Govt of A.P. Act No. 32 of 2008)
"NYAYAPRASTHA", Sabbavaram, Visakhapatnam-531035, AP, India
Phone & Fax: 08924-248216, website: www.dsnlu.ac.in
RECRUITMENT NOTIFICATION Advt. No. DSNLU/TS-01/2026
DSNLU invites application(s) from eligible individuals for the following Teaching Posts in Law. PROFESSORS (2), ASSOCIATE PROFESSORS (4), ASSISTANT PROFESSORS (2), TEACHING ASSOCIATES (1), RESEARCH ASSISTANTS (1).
For application form, eligibility criteria, scale of pay, rule of reservation and other details, visit DSNLU website: www.dsnlu.ac.in. The filled-in application with Registration Fee of Rs.2,000/- (Rupees Two Thousand Only),(Rs. 1,000/- (Rupees One Thousand Only) in case of SC/ST/BC/PH), by way of Demand Draft drawn in favour of "The Registrar, Damodaram Sanjivayya National Law University" payable at Visakhapatnam or Online Payment should reach "The Registrar, Damodaram Sanjivayya National Law University, "NYAYAPRASTHA", Sabbavaram, Visakhapatnam-531 035, Andhra Pradesh" on or before 23.02.2026 by 5.00 P.M.
Visakhapatnam
Date:31.01.2026
Sd/-
REGISTRAR I/c

भारतीय कपास निगम लिमिटेड
THE COTTON CORPORATION OF INDIA LTD.
(A Government of India Undertaking)
Branch Office: Kapas Bhavan, 4/2, Ashok Nagar, P.B.227, Guntur-522002, AP
Tele.No.0863-2233472, Fax No.0863-2357472, E-mail:guntur@cotcorp.com
Website: www.cotcorp.org.in, Ministry Website: www.ministryoftextiles.gov.in

పత్తి రైతులకు విజ్ఞప్తి

2025-26 పత్తి సీజన్‌లో కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ (CCI) ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించబడింది. పత్తి రైతుల హక్కులను రక్షించడానికి కార్పొరేషన్ తన పరిధిలోని జిల్లాల్లో మొత్తం 30 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసింది అని పత్తి రైతులకి తెలియజేయుచున్నాము. కాటన్ కార్పొరేషన్ లిమిటెడ్ పత్తి పంట సంవత్సరం 2025-26 కనీస మద్దతు ధర (MSP) పథకంతో పత్తి అమ్మడానికి Kapas Kisan App ని అభివృద్ధి చేసింది. Kapas Kisan App గూగుల్ ప్లే స్టోర్ మరియు ఆపిల్ iOS లో అందుబాటులో ఉంది. ప్రస్తుతం ముమ్మరంగా దేశవ్యాప్తంగా Kapas Kisan App ద్వారా సుమారు 5 లక్షల క్వింటాల పత్తి కొనుగోలు రోజువారీగా జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్‌లో Kapas Kisan App రాష్ట్ర ప్రభుత్వ CMAPP తో అనుసంధానం చేయబడింది.

అందువలన రాష్ట్రంలోని పత్తి రైతులకూ అభ్యర్ధన ఏంటంటే వారు Kapas Kisan App డౌన్‌లోడ్ చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యొక్క CMAPP పోర్టల్‌లో నమోదు చేసిన తమ మొబైల్ నంబర్ OTP ద్వారా లాగిన్ చేయగలరు. లాగిన్ అయిన తర్వాత భారతీయ పత్తి సంస్థకు (CCI) పత్తి అమ్మడానికి సమీప కేంద్రంలో తమ స్లాట్ బుక్ చేసుకుని కనీస మద్దతు ధర (MSP) లాభాన్ని పొందగలరు. నాణ్యత ప్రమాణల ప్రకారం పత్తిలో తేమ 8% కంటే ఎక్కువ కాకపోతే రైతులకు MSP యొక్క మొత్తం చెల్లింపు ఇవ్వబడుతుంది. కానీ తేమ 8% కంటే ఎక్కువగా 12% వరకు ఉన్నచో, 8% మించిపోయిన తేమ ఉంటే సారూప్యంగా MSP చెల్లింపు తగ్గించబడుతుంది. అందువలన పత్తి రైతులు CCI కి మద్ధతు ఇస్తూ ఆరబెట్టిన పత్తి మాత్రమే కేంద్రానికి తీసుకురావాలని సూచన ఇస్తోంది. తద్వారా అదనపు తేమ కారణంగా ఏమైనా తగ్గింపులు చేయకుండా ఉంటాయి. ఏ పరిస్థితులలోనైనా పత్తిలో తేమ 12% కంటే ఎక్కువ ఉండకూడదు. ఏ విధమైన సహాయం అవసరమైనా, రైతులు గుంటూరులోని శాఖ కార్యాలయానికి WhatsApp హెల్ప్‌లైన్ నంబర్ 7659954529 ద్వారా సంప్రదించవచ్చు.

శాఖాధికారి

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

సైనిక భయంలో జిన్‌పింగ్!

చైనాలో చీమ చిటుక్కుమన్నా పాశ్చాత్యమీడియా ఉలిక్కిపడుతుంది కనుక, చైనా అధ్యక్షుడు ఏకంగా తన సైనికాధిపతిమీదే చర్యలు ప్రకటిస్తే ఇక ఆ కథనాలకు అంతూపొంతూ ఉండదు. ఇటువంటి సందర్భాల్లో తప్పుచేశారు అన్నపదాన్ని వాడితే అవినీతికి పాల్పడ్డారని అర్థమట. దీనితోపాటు, క్రమశిక్షణనూ, చట్టాన్నీ కూడా అతిక్రమించారంటూ దేశ అత్యున్నత మిలటరీ జనరల్‌మీద చైనా రక్షణశాఖ దర్యాప్తు ప్రకటించింది. ఆరంభాన్ని ఇంత ఘనంగా చాటడం ఎందుకు? ఆ దర్యాప్తు ఏదో పూర్తిచేసి, నిజం నిగ్గుతేలిన తరువాతే విషయం చెప్పవచ్చు కదా అన్న ప్రశ్న రావచ్చు. కానీ, చైనాలో ఈ తరహా చర్యలకు చాలా లెక్కలుంటాయి కనుక, సెంట్రల్ మిలటరీ కమిషన్ వైస్ చైర్మన్‌ను జైల్లోకి నెట్టేసిన ఈ పరిణామం మీద పలు రకాల విశ్లేషణలు సాగుతున్నాయి.

పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ జనరల్స్ ఝాంగ్ యౌషియా, లూ జెన్‌లీల అరెస్టు వార్త ప్రపంచ రక్షణరంగ నిపుణులను ఆశ్చర్యంలో ముంచెత్తింది. జిన్‌పింగ్ అధ్యక్షతలోని సెంట్రల్ మిలటరీ కమిషన్ (సీఎంసీ)కు యౌషియా ఉపాధ్యక్షుడు మాత్రమే కాక, సుప్రీంలీడర్‌కు అత్యంత సన్నిహితుడూ విశ్వాసపాత్రుడనీ అంటారు. 2022లో 20వ కమ్యూనిస్టుపార్టీ కాంగ్రెస్ సందర్భంగా ఏడుగురు సభ్యులతో కూడిన సెంట్రల్ మిలటరీ కమిషన్‌కు ఇద్దరు ఉపాధ్యక్షులను, నలుగురుసభ్యులను జిన్‌పింగ్ నియమిస్తే, ఇప్పటికి ఇద్దరు వైస్‌చైర్మన్లు, ముగ్గురు సభ్యులు ఆ పదవులు కోల్పోయారు. జిన్‌పింగ్ సాగిస్తున్న ఈ ప్రక్షాళనలో రక్షణమంత్రికి సైతం రక్షణలేకుండా పోయింది. యౌషియాతోపాటు విచారణ ఎదుర్కొంటున్న లూ జెన్‌లీ పీఎల్‌ఏ జాయింట్ ఆపరేషన్స్ అధినేత, సీఎంసీ సభ్యుడు. రెండేళ్ళలో ఇలా అందరినీ తీసిపారేసిన తరువాత, ప్రస్తుతానికి సీఎంసీలో జిన్‌పింగ్‌తో పాటు సదరు అవినీతి ప్రక్షాళనలో ఆయనకు తోడుగా నిలుస్తున్న మరో ఉన్నతాధికారి మాత్రమే మిగిలారు. 2012లో అధికారంలోకి రాగానే అవినీతి ప్రక్షాళనకు నడుం కట్టిన జిన్‌పింగ్ ఇప్పటివరకూ రెండులక్షలమంది అధికారులమీద చర్యలు తీసుకున్నారట. మంచిదే కానీ, అత్యున్నతస్థాయి సైనికాధికారులను సైతం ఇలా జైళ్ళలోకి నెడితే సైన్యం సమర్థత సన్నగిల్లదా అంటారు కొందరు. 1979లో వియత్నాంతో పోరాడిన అనుభవం ఉన్న యౌషియా వంటి సీనియర్‌లను సైతం శిక్షించడం ద్వారా అత్యంత ఆప్తులను కూడా వదిలిపెట్టబోనని జిన్‌పింగ్ సందేశం ఇవ్వదల్చుకున్నారు. పనిలోపనిగా, ఎటువంటి ప్రశ్నలు, వ్యతిరేకతలకు ఆస్కారం లేకుండా పీఎల్‌ఏను పూర్తిగా తనకు అనుకూలంగా తీర్చిదిద్దుకోవడం కూడా సాధ్యపడుతుంది. చైనాలో పార్టీకీ, ఆర్మీకీ మధ్య ప్రేమలూ పగలూ పక్కపక్కనే ఉంటాయని అంటారు. డెంగ్ కాలంనుంచి అడపాదడపా ఆదేశాలను ధిక్కరించడం, ఆర్మీలో తలెగరేసే వారిని ఓ కంటకనిపెడుతూండటం ఉన్నదే. మొదట్లో పార్టీలో అసమ్మతితో పోరాడిన జిన్‌పింగ్ కూడా తాను సర్వశక్తిసంపన్నుడుగా అవతరించడమే సకల సమస్యలకు పరిష్కారమని నిర్ణయించుకొని, రాజ్యాంగాన్నే సవరించి, ముచ్చటగా మూడోసారి కూడా అధికారంలో కొనసాగుతున్నారు. దేశ అణురహస్యాలను ఝాంగ్ యౌషియా అమెరికాకు అమ్మేశారన్నది ప్రధాన ఆరోపణ. ప్రమోషన్లలో అవినీతి, ఆయుధ కొనుగోళ్ళలో అక్రమాల వంటివి దీనికి అదనం. జిన్‌పింగ్ ప్రభుత్వంపై సైనిక తిరుగుబాటు కథనాలు కూడా వింటున్నాం. తైవాన్‌ను దురాక్రమించుకోవడానికి జిన్‌పింగ్ ఏడాది గడువువిధించారని, యౌషియా అందుకు సానుకూలంగా లేకపోవడంతో పదవి పోగొట్టుకున్నారని అమెరికా మీడియా అంటోంది. గత ఏడాది జూన్ రెండోవారం నుంచి జిన్‌పింగ్ కొంతకాలంపాటు బయటకు కనిపించకపోగానే ఆయన శకం ముగిసినట్టేనని కథనాలు వెలువడ్డాయి. జిన్‌పింగ్ స్థానాన్ని సెంట్రల్ మిలటరీ కమిషన్‌లో ఫస్ట్ వైస్‌చైర్మన్‌గా ఉన్న జనరల్ ఝాంగ్ యౌషియా ఆక్రమించారని, ఆయనకు పార్టీలో సీనియర్లు, 2022 సీపీసీ మహాసభలనుంచి జిన్‌పింగ్ అత్యంత అవమానకరంగా గెంటేసిన మాజీ అధ్యక్షుడు హ్యూజింటావో మద్దతు ఇస్తున్నారని ఆ కథనాలు అన్నాయి. ఇప్పుడు అదే జనరల్ దేశద్రోహిగా ముద్రపడ్డాడు. నిజం ఎప్పటికీ వెలుగుచూడదు కానీ, మావో తరువాత అంతటి అత్యున్నతస్థాయి అధికారాలు అనుభవిస్తున్న జిన్‌పింగ్ మరికొంతకాలం అధికారంలో కొనసాగడానికి ఈ విన్యాసాలన్నీ చేస్తున్నారన్న విశ్లేషణలను కాదనలేం. జీవితకాలపు అధ్యక్షుడుగా కొనసాగదల్చుకున్న జిన్‌పింగ్‌కు సదరు కుట్రకథనాలు, అవినీతి ప్రక్షాళన చర్యలు రాజకీయ ప్రత్యర్థులను అడ్డుతొలగించుకొనే అస్త్రాలుగానే కాక, జనంలో సానుకూలత సాధించుకోవడానికి పునాదులుగా ఉపకరించవచ్చు.

> రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, మహిళలు, కార్మికుల జీవన అనుభవాల నుంచే గద్దర్ పాటలు పుట్టాయి. బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథ వంటి సంప్రదాయ కళారూపాలను సంస్కరించి, వాటిలో విప్లవ భావజాలాన్ని నింపారు. సాధారణ భాష, గ్రామీణ స్వరం, ఉత్సాహభరితమైన నృత్యంతో గద్దర్, 'కార్మిక వర్గం', 'బూర్జువా రాజ్యం', 'విప్లవం' వంటి క్లిష్టమైన సిద్ధాంతాలను ప్రజలకు అర్థమయ్యేట్టు చేశారు.

జానపదంలో రాజకీయ చైతన్య ఝరి

గుమ్మడి విఠల్‌రావుగా జన్మించి గద్దర్‌గా ప్రసిద్ధికెక్కిన ఈ విప్లవ కవి గాయకుడు తెలుగు సాంస్కృతిక, రాజకీయ చరిత్రలో తనకంటూ ప్రత్యేక అధ్యాయాన్ని సొంతం చేసుకున్నారు. 1949 జనవరి 31న అప్పటి మెదక్ జిల్లా తూప్రాన్ గ్రామంలో ఒక పేద దళిత కుటుంబంలో జన్మించిన గద్దర్ తన జీవితాన్ని ప్రజల పాటగా, పోరాట స్వరంగా మలిచారు. 2023 ఆగస్టు 6న ఆయన మరణించినప్పటికీ, పీడిత వర్గాల స్వరంగా ఆయన వారసత్వం ఇప్పటికీ ఎప్పటికీ జీవించే ఉంటుంది.

బ్రిటిష్ వలస పాలనకు వ్యతిరేకంగా పోరాడిన, పంజాబ్‌కు చెందిన చారిత్రక గదర్ పార్టీ పట్ల గౌరవంతో తన పేరును 'గద్దర్'గా మార్చుకున్న విఠల్‌రావు, జానపద కళను రాజకీయ చైతన్యానికి ఆయుధంగా మార్చారు. తన నేతృత్వంలోని జననాట్య మండలి ద్వారా వర్గపోరాట భావజాలాన్ని గ్రామాలు, పొలాలు, కార్మిక కాలనీల్లోకి తీసుకెళ్లారు. విద్యార్థి దశలో పేదరికం వల్ల గద్దర్ ఇంజినీరింగ్ చదువును మధ్యలోనే వదిలేయాల్సి వచ్చింది. చిన్నప్పటి నుంచి దేశభక్తి, సమసమాజ భావాలు మెండుగా ఉన్నాయి. తొలినాళ్లలో గాంధీ బాట అనుసరణీయం అని భావించి బుర్రకథ కళారూపంతో ప్రభుత్వ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కాచిగూడ సమీపంలో చాపెల్ బజార్ దగ్గర గుమ్మడి రామస్వామి నేతృత్వంలో బాపూజీ బుర్రకథ పార్టీ ఏర్పాటు చేశారు. అక్కడ కళాకారులకు బుర్రకథ, ఒగ్గుకథ, నాటికలు, డోలక్, తబలా, డప్పు, కంజర తదితర వాయిద్యాలపై శిక్షణ ఇచ్చేవారు. జాతీయ నాయకులపై, కుటుంబ నియంత్రణపై, ప్రభుత్వ పథకాలపై ప్రదర్శనలు ఇచ్చారు. 1975లో విమలమ్మతో గద్దర్ వివాహం జరిగింది. సమాచార



ప్రసార శాఖ వారి ప్రచార కార్యక్రమాల్లో పాల్గొని అక్కడ వచ్చే పారితోషికంతో జీవితం కొనసాగించారు. కొంతకాలం రసాయన కర్మాగారంలో కూలీగా కూడా పనిచేశారు. ఈ అనుభవాలు ఆయనను కార్మిక జీవనానికి మరింత దగ్గర చేశాయి.

1970ల ప్రారంభంలో బి. నర్సింగరావు నేతృత్వంలోని ఆర్ట్ లవర్స్ అసోసియేషన్‌తో పరిచయం కావటం ఆయన ఆలోచనా విధానాన్ని పూర్తిగా మార్చేసింది. ఆ తర్వాత గద్దర్ చొరవతోనే ఆ సంఘం జననాట్య మండలిగా రూపాంతరం చెందింది. బి. నరసింగరావు ప్రోద్బలంతో 'రంగుల కల', 'దాసి', 'మా భూమి' సినిమాల్లో పాటలు రాశారు. 'ఒరేయ్ రిక్షా', 'జై బోలో తెలంగాణ' సినిమాలకు ప్రతిష్ఠాత్మక నంది అవార్డు వచ్చినా తృణప్రాయంగా తిరస్కరించారు.

జానపద కళలకు రాజకీయ చైతన్యాన్ని జోడించడంలో గద్దర్ ప్రత్యేకత కనిపిస్తుంది. రైతులు, వ్యవసాయ కూలీలు, దళితులు, మహిళలు, కార్మికుల జీవన అనుభవాల నుంచే ఆయన పాటలు పుట్టాయి. బుర్రకథ, ఒగ్గుకథ, జముకుల కథ వంటి సంప్రదాయ కళారూపాలను సంస్కరించి, వాటిలో విప్లవ భావజాలాన్ని నింపారు. సాధారణ భాష, గ్రామీణ స్వరం, ఉత్సాహభరితమైన నృత్యంతో గద్దర్, 'కార్మిక వర్గం', 'బూర్జువా రాజ్యం', 'విప్లవం' వంటి క్లిష్టమైన సిద్ధాంతాలను ప్రజలకు అర్థమయ్యేలా చేశారు. "భారతదేశం భాగ్యసీమరా" పాట దేశ సంపద– ప్రజల పేదరికం మధ్య విరోధాన్ని చూపితే, "ఊరు మనదిరా" పాట శ్రమజీవుల స్వతంత్రాన్ని ప్రకటించింది. కారంచేడు, చుండూరు వంటి దళిత మారణకాండకు స్పందనగానూ, మహిళా సమస్యలు, రైతు ఆత్మహత్యలు, గ్లోబలైజేషన్ దుష్ప్రభావాలు, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం వంటి అంశాలపైనా... ఇలా ఆయన మూడు వేలకు పైగా పాటలు రచించారు.

ముద్రిత మాధ్యమాలకు దూరంగా ఉన్న అణగారిన వర్గాలకు గద్దర్ తన పాటల ద్వారా స్వరం ఇచ్చారు. డప్పు, డోలక్ వంటి ప్రజల వాయిద్యాలతో, సినిమాలు– ఎలక్ట్రానిక్ మీడియా ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ప్రజల జ్ఞాపకాలను, అనుభవాలను వేదికపైకి తీసుకొచ్చారు. తన కళాతత్వాన్ని ఆయన మూడు సూత్రాల్లో వివరించారు: ప్రజల బాణి, ప్రజల పలుకుబడి, ప్రజల జీవితం. ఒంటిపై చొక్కా లేకుండా నల్లటి గొంగడి, గోచికట్టు పంచె, కాళ్లకు గజ్జెలు, ఎర్ర కర్చీఫ్‌తో ఆయన వేదికపై కనిపించేవారు. ఆ ఎర్ర కర్చీఫ్ సందర్భాన్ని బట్టి తల్లి ప్రేమకు, విప్లవానికి, అమరత్వానికి సంకేతంగా మారింది.

"ప్రజల నుంచి ప్రజలకే" అనే విప్లవ సూత్రాన్ని గద్దర్ తన జీవితంలో ఆచరించారు. జానపద కళలను రాజకీయాకరించి, ప్రజల జీవితాలతో మమేకం చేసిన ఆయన, సంస్కృతి కూడా సామాజిక మార్పుకు శక్తిమంతమైన ఆయుధమేనని నిరూపించారు. తన జీవితంలో ఎన్నో ఆటుపోట్లు, ఎత్తుపల్లాలు చూసిన గద్దర్ చివరి రోజుల్లో సామాజిక సమగ్రత కోసం మెరుగైన పౌర సమాజం కోసం కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యారు. ప్రియాంకగాంధీ, రాహుల్‌గాంధీతో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన సభలలో పాల్గొన్నారు. గద్దర్ లేకున్నా ఆయన పాటలు, ఆయన స్వరం, ఆయన పోరాట స్ఫూర్తి ఇంకా ప్రజల్లో చైతన్యాన్ని నింపుతూనే ఉన్నాయి.

○ డా. వెన్నెల గద్దర్
చైర్‌పర్సన్, తెలంగాణ సాంస్కృతిక సారథి

(నేడు గద్దర్ జయంతి)

సివిల్ సర్వీసుల్లో అగ్నిపరీక్షలు

జీవితంలో ఎప్పుడూ రెండు దార్లు మన ముందుంటాయి. ఒకటి విశాలమైనది– సులభంగా వెళ్ళగలిగినదే కానీ వినాశనం వైపు నడిపిస్తుంది. రెండవది ఇరుకైన దారి– వెళ్ళడం కష్టమే అయినా జీవితాన్ని గౌరవప్రదంగా, ప్రశాంతంగా సాగించే అవకాశాన్నిస్తుంది.

నేను పదవీ విరమణ చేసి పదిహేనేళ్ళు అయ్యింది. ఈ కాలంలో నాకు బాగా సంతృప్తినిచ్చిన పని– సివిల్ సర్వీసెస్ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు అవసరమయిన మార్గదర్శనం చేయడం. ఆ ప్రయత్నాల్లో భాగంగా నేను వాళ్ళకు ప్రధానంగా చేసే సూచన– నిజాయితీ, నైతిక ప్రవర్తనల గురించే. ఆకర్షణీయమైన జీతభత్యాలు, సమాజంలో హోదా, గుర్తింపులు మాత్రమే కాదు, మరే ఇతర వృత్తిలో లేని విధంగా– ఒక మంచి పని చేసే అవకాశం, అధికారం సివిల్ సర్వీసు ఉద్యోగికి ఎప్పుడూ చేతిలో ఉంటాయి.




అఖిల భారత సర్వీసు ప్రాముఖ్యాన్ని మన రాజ్యాంగం మాత్రమే ప్రస్తావించింది. ప్రపంచంలో మరే దేశ రాజ్యాంగంలో కనపడని ప్రత్యేకత ఇది. ఇంత తిరుగులేని ఆకర్షణ, దానికి తోడు పూర్తి భద్రత మీకు అండగా ఉన్నప్పుడు... ఇక భయమెందుకు? ప్రలోభాల కోసం కక్కుర్తి ఎందుకు? అని అడుగుతుంటా ఆ యువతీయువకులను, కాబోయే సివిల్ సర్వీస్ అధికారులని. రాజకీయాలు, అకౌంటెన్సీ, న్యాయ వ్యవహారాలు, వైద్యం, వ్యాపారం, పరిశ్రమలు, వైజ్ఞానిక రంగం... సివిల్స్ మాత్రమే కాదు... ఏ రంగంలో అయినా ఈ రెండు అడ్డంకులూ అనుక్షణం అగ్నిపరీక్షలు పెడుతూనే ఉంటాయి. ఈ సవాళ్ళను అధిగమించే సామర్థ్యం మీరు ప్రదర్శిస్తే... అది మీ వృత్తి జీవితాన్ని ఫలప్రదం చేయడంతో పాటూ సమాజంలో మీకో ఉన్నత స్థానం కల్పిస్తుంది, అని వాళ్ళకి చెబుతూ ఉంటాను.

మన దేశం చేసుకున్న అదృష్టం ఏమిటంటే... ప్రతి రంగంలోనూ ఎక్కువ మంది బాగా కష్టపడతారు. నీతి, నిజాయితీతో మెలగుతుంటారు. దేశం పట్ల, ప్రజల పట్ల ప్రేమాభిమానాలతో పనిచేసే వాళ్ళయి ఉంటారు. అదృష్టవశాత్తూ నేను కూడా ఈ కోవకు చెందినవాడిగానే భావించుకుంటా. ప్రలోభాలు, ఒత్తిడులు నా ఉద్యోగ జీవితంలో ఎన్నోసార్లు నాకు అగ్నిపరీక్ష పెట్టాయి.

రాష్ట్రపతిగా ఉన్న జ్ఞానీ జైల్‌సింగ్ గుండె ఆపరేషన్ కారణంగా 45 రోజులు విధులకు దూరంగా ఉండాల్సి వచ్చింది. అప్పుడు ఉప రాష్ట్రపతిగా ఉన్న హిదాయతుల్లాని ఆయన స్థానంలో పనిచేయమన్నారు. అంటే రాష్ట్రపతి హోదాలో.. అని హిదాయతుల్లా గారి భావన. (గతంలో ఆయన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఉన్నప్పుడు.. రాష్ట్రపతి పదవికి వి.వి.గిరి రాజీనామాతో ఖాళీ ఏర్పడింది. అప్పుడు హిదాయతుల్లాను తాత్కాలిక రాష్ట్రపతిగా విధులు నిర్వర్తించమన్నారు. తాత్కాలిక రాష్ట్రపతి.. అన్న పదవి రాజ్యాంగంలో ఉండదు అని చెప్పి... రాష్ట్రపతి హోదాలోనే ఆ విధులు నిర్వర్తించారు. దాంతో ఇది కూడా అలాగే అని ఆయన అభిప్రాయపడి ఉండవచ్చు.) అప్పుడు ఆయనకు సెక్రటరీగా ఉన్న నేను దానితో విభేదించాను. గతంలో లాగా ఇప్పుడా పదవి ఖాళీ కాలేదు, కాబట్టి జైల్ సింగ్ తిరిగొచ్చేదాకానే కాబట్టి.. 'రాష్ట్రపతి విధులు నిర్వర్తించే ఉపరాష్ట్రపతి' గానే మీరుంటారు... అని స్పష్టం చేసాను. దానికి ఆయన వెటకారంగా "అంటే నేను వైస్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా డిస్చార్జింగ్ ది డ్యూటీస్ ఆఫ్ ప్రెసిడెంట్ ఆఫ్ ఇండియా... అని రబ్బరు స్టాంపు తయారు చేయించుకుని సంతకాలు పెట్టాలా?" అని అడిగారు. అప్పుడు నేను– "జైల్ సింగ్ పదవిలో ఉన్నప్పుడే మీరు కూడా రాష్ట్రపతి హోదాలో ఉండడం.. అంటే ఇద్దరు రాష్ట్రపతులు ఉన్నట్లు కదా.. దానికి రాజ్యాంగం ఒప్పుకోదు కదా!" అని చెప్పి వచ్చేసాను. అప్పుడు లా సెక్రటరీగా ఉన్న పేరిశాస్త్రిని ఉపరాష్ట్రపతి సంప్రదిస్తే.. "ఈ విషయంలో ఈ అధికారి తెలిపిందే కరెక్ట్" అని చెప్పారు.

హిదాయతుల్లాకు నా సలహా రుచించకపోవచ్చు, ఆయన నొచ్చుకుని కూడా ఉండవచ్చు. కానీ ఆయనంటే నాకు అపారమైన గౌరవం. ఆయన పండితుడు, పెద్దమనిషి, నిజాయితీపరుడు... అయినా మేం రూల్స్‌కు బందీలం కదా! రేపు చరిత్రకారులు హిదాయతుల్లా వంటి వారిని నిందించకుండా కాపాడవలసిన గురుతర బాధ్యత మామీదే ఉంటుంది కదా!

ఒకసారి ముఖ్యమంత్రి చంద్రబాబు పిలిపిస్తే కేంద్ర సర్వీసులో ఉన్న నేను రాష్ట్రానికి తిరిగివచ్చి ప్రధాన



కార్యదర్శిగా పదవిని చేపట్టిన మొదటి వారంలోనే.. ఒక చిన్న విషయంపై ఆయనతో ముఖాముఖి తలపడాల్సి వచ్చింది. అలవాటు ప్రకారం ఆయన చాలా విసుగ్గా "మీ హనీమూన్ (పదవి తాలూకు కొత్తదనం) ముగిసింది. ఇక పనిమీద శ్రద్ధపెడితే మంచిది. ఇక్కడ ప్రతిదీ తలాతోక లేకుండా గందరగోళంగా ఉంది" అనడంతో అవాక్కయ్యా.

ఆత్మాభిమానం దెబ్బతినడంతో రోషాన్ని నిగ్రహించుకుంటూ "నేనెప్పుడూ చీఫ్ సెక్రటరీ పదవి కావాలని తాపత్రయపడలేదు" అన్నాను. ఆయన ఏడేళ్ళ పదవీ కాలంతో పోలిస్తే నేను అక్కడికి వెళ్ళి వారం రోజులు కూడా కాలేదు. అప్పటివరకూ నేనెప్పుడు మా అమ్మా నాన్నలతో కానీ, టీచర్ల దగ్గర కూడా ఇలా మాటలు పడలేదు. "ఇప్పటికి నా సర్వీసు 35 ఏళ్ళు పూర్తయింది. మహా అయితే మరో రెండేళ్ళు మిగిలి ఉందేమో. దాన్ని కూడా వదులుకుని హాయిగా... గడచిన సర్వీసుకాలపు జ్ఞాపకాలతో రిటైరయిపోతా. ఇప్పటికిప్పుడే నా రాజీనామా ఇచ్చేస్తా" అని చాలా ప్రశాంతంగానే అయినా విస్పష్టంగా చెప్పి బయటకు వచ్చేశా. ఆయన నొచ్చుకున్నట్లున్నారు. వెంటనే ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ కార్యదర్శి ఎస్వీ ప్రసాద్‌ను నా వెనకే పంపారు. ఆ చర్చలప్పుడు ప్రసాద్ కూడా అక్కడే ఉన్నారు. ప్రసాద్ నాకు సర్దిచెప్పి తిరిగి అక్కడికి తీసుకెళ్ళారు. ఇష్టం లేకపోయినా వెళ్ళా. ముఖ్యమంత్రి చిరునవ్వు నవ్వి, జరిగిన దానికి పశ్చాత్తాప ధోరణిలో.. "నాకు మరో ఉద్దేశం ఏదీ లేదు. ఆ మాటలను నేను మీరనుకున్న అర్థంలో అనలేదు. ఒకవేళ మిమ్మల్ని మనస్తాపానికి గురి చేసి ఉంటే సారీ. వాటిని పట్టించుకోకండి. మీ పని మీరు చేసుకోండి. నా సపోర్టు మీకు ఎంతగా ఉంటుందో మీరే చూస్తారు" అన్నారు. అప్పటికి నేను కూడా చల్లబడ్డా.. అంతకుముందు తొందరపడి నేనలా అతిగా ప్రవర్తించినందుకు నొచ్చుకున్నా. మేం షేక్ హ్యాండ్ ఇచ్చుకున్నాం. దాని తరువాతే ప్రధాన కార్యదర్శిగా నా అసలు విధి నిర్వహణ మొదలయింది.

సాధారణంగా ప్రభుత్వ ఫైళ్ళు రెండు రకాలుగా ఉంటాయి... ఒకటి కరెంట్ ఫైల్– అంటే నడుస్తున్న విషయానికి సంబంధించిన సంప్రదింపులతో ఉండేది. మరొకటి నోట్ ఫైల్– దానిని పరిశీలించిన వారి అభిప్రాయాలు, సిఫార్సులు, తుది నిర్ణయం వంటివి ఉంటాయి. నోట్ ఫైళ్లలో సెక్రటేరియట్‌లోని సంబంధిత విభాగంలో నాలుగు గోడల మధ్య జరిగే ఆంతరంగిక విషయాలు రికార్డయి ఉంటాయి. తప్పనిసరి పరిస్థితుల్లో మినహా వీటిని కోర్టులకు సమర్పించరు. ఒకసారి అలా కోర్టుకు ఎందుకో అనుమానం వచ్చి నోట్ ఫైల్ తెప్పించుకుని వాస్తవ పరిస్థితి అర్థం చేసుకుంది. ప్రభుత్వ ఉత్తర్వులకు వ్యతిరేకంగా, పిటిషనర్‌కు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అంటే ఫైల్లో నేను చేసిన సిఫార్సును కోర్టు సరయినదిగా భావించి, నాకు వ్యతిరేకంగా ఉత్తర్వులు జారీ చేసిన మంత్రి నిర్ణయాన్ని కొట్టివేసిందన్నమాట. నిజానికి నా అంచనాలకు భిన్నంగా తీర్పు వచ్చినా... నా విధులు నేను నిర్వర్తించా. న్యాయం జరిగింది. ప్రభుత్వ కార్యకలాపాలన్నీ అంత పకడ్బందీగా తనిఖీలకు అనుకూలమైన ఏర్పాట్లతో ఉంటాయి. మరో సందర్భంలో అదే మంత్రి ఒక ఉత్తర్వు ఇచ్చారు. అది ప్రజోపయోగకరం కాదని నాకు అనిపించింది. దాన్ని ఆయన దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదు. తప్పనిసరి పరిస్థితుల్లో– పరిపాలనకు సంబంధించిన నిబంధనావళి(బిజినెస్ రూల్స్)ని ఆశ్రయించి ఆ మేరకు ప్రధాన కార్యదర్శి ద్వారా మంత్రి ఉత్తర్వులపై 'సమీక్ష' కోరా. తన ఉత్తర్వుల్లో బలం లేకపోవడం, పైగా ఆ ఫైలు ముఖ్యమంత్రి వద్దకు పోతుందన్న విషయం తెలిసి ఉండడంతో ఆయన కూడా చల్లబడ్డాడు. ఇవి ఇరుపక్షాలకీ మనసును కష్టపెట్టే విషయాలే అయినా... ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నేను అంత కచ్చితమైన వైఖరి చూపాల్సి వచ్చింది.

■ డా. మోహన్ కందా
విశ్రాంత ప్రధాన కార్యదర్శి, ఉమ్మడి ఆం.ప్ర. ప్రభుత్వం

'క్రెడిట్ చోరీ'లో వాస్తవాలు ఇవి!

ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతం అనేక దశాబ్దాలుగా నీటి కొరతతో అల్లాడుతోంది. భూగర్భ జలాలు అడుగంటాయి. వర్షాధార వ్యవసాయం రైతులకు శాపంగా మారింది. ఈ నేపథ్యంలో కృష్ణా నదీ జలాలను రాయలసీమ, దక్షిణ కోస్తాకు తరలించే దూరదృష్టి గల ఆలోచన నుంచే వెలిగొండ ప్రాజెక్టు పుట్టుకొచ్చింది. ఈ ప్రాజెక్టును 1996 మార్చి 5న అప్పటి సీఎం చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తయితే, ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని సుమారు 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల మందికి తాగునీరు అందుతుంది. వ్యవసాయ ఉత్పత్తుల పెరుగుదల, రైతుల వలసల నివారణ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం వంటి ఇతర సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది. కానీ దురదృష్టవశాత్తూ, కొందరు పాలకుల నిర్లక్ష్యం, నిధుల కొరత, రాజకీయ అనిశ్చితి కారణంగా వెలిగొండ ప్రాజెక్టు ఎన్నోసార్లు ఆగిపోయింది.



ఈ ప్రాజెక్టు విషయంలో జగన్ చేస్తున్న క్రెడిట్ చోరీ వాదనలు వాస్తవాలకు దూరంగా ఉన్నాయి. వెలిగొండ ప్రాజెక్టును తానేదో ఉద్ధరించినట్లు, తన క్రెడిట్‌ను చంద్రబాబు చోరీ చేస్తున్నట్లు సొంత పత్రికలో అబద్ధాల కథనం రాసుకొచ్చారు. కేవలం బటన్ నొక్కి ఫొటోలకు పోజులిచ్చినంత మాత్రాన ప్రాజెక్టు క్రెడిట్ సొంతం కాదు. దశాబ్దాల పాటు అడ్డంకులను తొలగించి, సాంకేతిక సవాళ్లను అధిగమించి, నిధులు సమకూర్చి, పనుల వేగం పెంచిన వారికే ఆ క్రెడిట్ దక్కుతుంది. వెలిగొండ ప్రాజెక్టు విషయంలో జగన్ చేస్తున్న వాదనలు– గోరంత పని చేసి కొండంత ప్రచారం చేసుకున్నట్టు ఉన్నాయి. ప్రాజెక్టుకు ప్రాణం పోసింది, దీనిని నిద్రావస్థ నుంచి నిర్మాణ దశలోకి తెచ్చింది చంద్రబాబు హయాంలోనే.

వెలిగొండ ప్రాజెక్టులో అత్యంత క్లిష్టమైనవి రెండు సొరంగాలు. చంద్రబాబు ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య మొదటి టన్నెల్ పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. అత్యాధునిక మిషనరీని ఉపయోగించి క్లిష్టమైన నల్లమల అడవులలో తవ్వకం పూర్తి చేశారు. మిగిలిపోయిన స్వల్ప పనులను పూర్తి చేయడానికి వైసీపీ ప్రభుత్వానికి అయిదేళ్లు పట్టింది. 2024 మార్చిలో పనులు పూర్తి కాకుండానే, కేవలం ఎన్నికలు వస్తున్నాయని వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేసి ప్రజలను మభ్యపెట్టాలని చూశారు జగన్‌రెడ్డి. సకాలంలో బిల్లులు చెల్లించక కాంట్రాక్టర్లు పనులు నిలిపివేస్తే, 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.140 కోట్ల బకాయిలు చెల్లించి పనులు పునః ప్రారంభించి, ప్రాజెక్టుకు మళ్ళీ ప్రాణం పోసింది.

2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో బడ్జెట్‌లో రూ.1,373 కోట్లు కేటాయించి, వాటిలో రూ.1,319 కోట్లు ఖర్చు చేసి పనులు పూర్తి చేసింది. 2019–24 మధ్య వైసీపీ ప్రభుత్వం రూ.3,520 కోట్లు కేటాయించి, కేవలం రూ.648 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 18 నెలల్లోనే దాదాపు రూ.525 కోట్లు వెచ్చించి, పనులు పూర్తి చేసి ప్రాజెక్టును పరుగులు పెట్టిస్తున్నది. వైసీపీ ప్రభుత్వ కాలంలో 2,770 మీటర్ల టన్నెల్–2 బెంచింగ్ పనులు మాత్రమే చేయగా, కూటమి ప్రభుత్వం 18 నెలల కాలంలోనే 4,563 మీటర్లు పూర్తి చేసింది. మిగిలిన 361 మీటర్లను కూడా త్వరలో పూర్తి చేయబోతున్నది. వైసీపీ హయాంలో టన్నెల్–2 లైనింగ్ పనులు కేవలం 702 మీటర్లు మాత్రమే చేస్తే, కూటమి ప్రభుత్వం 18 నెలల కాలంలోనే 3,708 మీటర్ల లైనింగ్ పనిని పూర్తి చేసింది. మిగిలిన 3,232 మీటర్లు జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొన్నది. టన్నెల్–2లో 12వ కి.మీ వద్ద నిలిచిపోయిన టీబీఎం మీద ఉన్న కోర్టు కేసులను పరిష్కరించడానికి చర్యలు తీసుకోకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక సాంకేతిక నిపుణులతో కమిటీని ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించింది.

2014–19 మధ్య తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో టన్నెల్స్ హెడ్ రెగ్యులేటర్ పనులను ప్రారంభించి టన్నెల్–1 హెడ్ రెగ్యులేటర్‌ను పూర్తి చేయగా, 2019–24 మధ్య వైసీపీ మిగిలిన పనులను పూర్తి చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక హెడ్ రెగ్యులేటర్ల వింగ్స్, రిటర్న్స్ పనులను 52శాతం పూర్తి చేసి, మిగిలినవి మార్చి నాటికి పూర్తి చేయనున్నది. సరైన ప్రణాళిక లేకుండా 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల బురదను టన్నెల్–1లో రోడ్డు నిర్మాణంలో, టన్నెల్–2లో కొల్లం వాగు వద్ద కుప్పగా పోసి పనులకు అడ్డంకిగా మార్చింది. కూటమి ప్రభుత్వం రూ.456 కోట్లు మంజూరు చేసి రిటైనింగ్ వాల్స్, లైనింగ్ పనులు చేపట్టింది. పరిపాలనా అనుమతులు లేకుండా పనులు మొదలుపెట్టి, అనుమతులు రాకపోవడంతో పనులు ఆపేసింది. వైసీపీ చేసిన నిర్వాకాన్ని సరిదిద్ది, కూటమి ప్రభుత్వం రూ.106.39 కోట్లతో పరిపాలనా ఆమోదం తెలిపి పనులు పునఃప్రారంభించింది. వైసీపీ ప్రభుత్వం కేవలం 96 కుటుంబాలకే పునరావాసం ఇచ్చి, మిగిలిన 7,225 కుటుంబాలను గాలికి వదిలేయగా, కూటమి ప్రభుత్వం వచ్చే జూన్ నాటికి మిగిలిన నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని నిర్ణయించింది.

వాస్తవాలు ఇలా ఉంటే వెలిగొండ ప్రాజెక్టు తానే పూర్తి చేసినట్లు జగన్‌రెడ్డి తన సొంత పత్రికలో కథనాలు రాయించడం ప్రాజెక్టు చరిత్రను తుడిచేయడమే. వెలిగొండ ప్రాజెక్టుకు బీజం పడింది, పనులు ఎక్కువ జరిగింది చంద్రబాబు హయాంలోనే అన్నది నిర్వివాదాంశం. అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టులను పాడు పెట్టిన జగన్‌కు, నేడు ప్రాజెక్టుల క్రెడిట్ కోసం ఆరాటపడే హక్కు ఎక్కడిది?

● నీరుకొండ ప్రసాద్

సమస్యల్లో భావి భారత పౌరులు!

ప్రపంచ జనాభాలో పిల్లలు 25శాతం ఉన్నారు. వీరిలో సుమారు 16.8 కోట్ల మంది బాల కార్మికులు ఉన్నారు. ప్రతి 10 మందిలో ఒకరు ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉన్నారని అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఐఎల్ఓ) అంచనా వేసింది. సుమారు 3.6 కోట్ల మంది పిల్లలు బానిస బతుకులు గడుపుతున్నారని ఆస్ట్రేలియాకు చెందిన మానవ హక్కుల బృందం 'ద వాక్ ఫ్రీ ఫౌండేషన్' నివేదిక పేర్కొంది. పేదరికం, నిరక్షరాస్యత, అక్రమ రవాణా వంటి వాటి వల్ల ఎంతో మంది పిల్లలు బాల కార్మికులుగా మగ్గిపోతున్నారు. బాల కార్మిక వ్యవస్థ వల్ల విద్య, ఆరోగ్యం వంటి ప్రాథమిక హక్కులు కూడా వారికి అందడం లేదు. బాలలు లైంగిక, ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు.

భారతదేశంలో 23,68,17,000 మంది పిల్లలు ఉన్నారు. వీరిలో 11.45శాతం మంది పిల్లలు బడికి దూరంగా ఉన్నారని గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ గత డిసెంబర్ 8న విడుదల చేసిన నివేదిక తెలిపింది. అంతర్జాతీయ కార్మిక సంస్థ నివేదిక ప్రకారం భారతదేశంలో 5 నుంచి 14 ఏళ్ల మధ్య వయస్సులోని దాదాపు కోటి మందికి పైగా మంది పిల్లలు పనుల్లో కొనసాగుతున్నారు. బాల కార్మిక శ్రమశక్తిలో 14 నుంచి 17 సంవత్సరాల పిల్లలు సుమారు 63శాతం ఉన్నారని 'సేవ్ ది చిల్డ్రన్' సంస్థ తెలిపింది. యూనిసెఫ్ నివేదిక ప్రకారం పట్టణ ప్రాంతంలో 5–14 ఏళ్ల వయస్సులోని బాల కార్మికుల సంఖ్యలో 54శాతం పెరుగుదల కనిపించింది.




2025 నాటికి బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలన్న ఐక్యరాజ్యసమితి లక్ష్యం భారతదేశంలో ఆచరణ సాధ్యం కాదని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ తన 52వ నివేదికలో పేర్కొంది. ప్రతి బిడ్డకు సమాన అవకాశాలు, హక్కుల రక్షణ వంటి ఐక్యరాజ్యసమితి అన్ని తీర్మానాలపైనా భారతదేశం సంతకం చేసింది. కానీ అవి ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు భిన్నంగా భారత బాలల పరిస్థితులు ఉన్నాయి. దేశంలోని నలుగురు పిల్లల్లో ముగ్గురు రక్తహీనతతో బాధపడుతున్నారు. ప్రతి రెండవ బిడ్డ బరువు తక్కువగా ఉన్నాడు. ప్రాథమిక విద్యలోనే చదువు మానేసే పిల్లలు 71.01శాతం ఉన్నారు. ఇక, షెడ్యూల్డ్ కులాలు, తెగల బాలికలలో అక్షరాస్యత రేటు 42శాతం మాత్రమే. వంద మంది బాలికల్లో 30 మంది మాత్రమే ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. వీరిలో ఇంకా బాల్య వివాహాలు కొనసాగుతూనే ఉన్నాయి.

ప్రపంచ వ్యాప్తంగా ఎదుగుదల లోపంతో బాధపడుతున్న పిల్లల్లో దాదాపు 70శాతం మంది భారత్, ఆఫ్రికా దేశాల్లోనే ఉన్నారు. వీరిలో 35.7శాతం భారత్‌లో ఉంటే, ఆఫ్రికాలో 33.6శాతం ఉన్నారు. ప్రభుత్వాల నిర్లక్ష్యపూరిత విధానాలు, పేదరికం, పోషకాహార లోపం వల్ల పిల్లలు ఎదుగుదల సమస్యను ఎదుర్కొంటున్నారు. బాల కార్మికులుగా ప్రమాదకరమైన పనుల్లో పనిచేయడం, పోషకాహార లోపం వల్ల ప్రతి సంవత్సరం భారతదేశంలో లక్షలాది బాలలు చనిపోతున్నారు.

బడికి వెళ్లి ఆటపాటలతో జీవించాల్సిన పిల్లలు బాల కార్మికులుగా అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటూ ప్రాణాలు కోల్పోతున్నారు. అందుకు వారి కుటుంబాల ఆర్థిక పరిస్థితులే కారణం. గత ప్రభుత్వాలు.. ముఖ్యంగా నేటి మోదీ ప్రభుత్వం పేదల కోసం కాకుండా, బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల, సంపన్న వర్గాల, సామ్రాజ్యవాద బహుళజాతి కంపెనీల ప్రయోజనాల కోసం పనిచేస్తున్నది. ఫలితంగా గ్రామీణులు పేదరికంలో మగ్గుతున్నారు. దాంతో బడికి దూరమై కుటుంబ పోషణలో పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు. ఫ్యాక్టరీల ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నారు. పిల్లలు ఈ పరిస్థితుల నుంచి బయటపడాలంటే గ్రామీణ పేదలకు భూ పంపిణీ జరగాలి. ప్రజా అవసరాలను తీర్చే పరిశ్రమలు నెలకొల్పి శ్రామికులకు పని కల్పించాలి. పట్టణ పేదలకు ఉపాధి కల్పించాలి.

– బొల్లిముంత సాంబశివరావు
రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఏపీ రైతు కూలీ సంఘం





జీజీహెచ్‌లో శిశు సంరక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

సేవలు స్ఫూర్తిదాయకం

- జన్మభూమిని మరువని ప్రవాసాంధ్రులు
- చదువుకున్న సంస్థ అభివృద్ధికి జింకానా కృషి
- ఎంసీహెచ్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు
- జీజీహెచ్‌లో అందుబాటులోకి మాతా శిశు సంరక్షణ కేంద్రం

గుంటూరు, గుంటూరు మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఎంత ఎదిగినా జన్మభూమిని మర్చిపోకుండా ప్రవాసాంధ్రులు చేస్తున్న సేవాలు కార్యక్రమాలు స్ఫూర్తిదాయకమని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో శుక్రవారం కానూరి జింకాన మాతా శిశు సంరక్షణ కేంద్రం ప్రారంభోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ సంపాదించిన దాంట్లో కొంత సమాజసేవకు వినియోగిస్తే వచ్చే తృప్తి మాటల్లో చెప్పలేనిదన్నారు. సమాజంలో ఇంకా మంచి మిగిలే ఉందని ప్రవాసాంధ్రులు నిరూపించారన్నారు. సాధారణంగా నలభై, యాభై ఏళ్ల క్రితం విదేశాలకు వెళ్లి స్థిరపడిన వాళ్లు జన్మభూమిని మర్చిపోతారని, కానీ చదువుకున్న కాలేజీని గుర్తు పెట్టుకుని 1981లోనే జింకానా సంస్థ ఏర్పాటు చేసి జీజీహెచ్ అభివృద్ధికి ఇంత పెద్ద ఎత్తున సాయం చేయడం అభినందనీయమన్నారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణంతో పాటు భవిష్యత్‌లో దాని నిర్వహణకు ఆటంకాలు రాకుండా బ్యాంకులో కొంత సొమ్ము డిపాజిట్ చేయడం గొప్ప విషయమన్నారు. మనతో పాటు సమాజం కూడా బాగుండాలన్నదే మన సంస్కృతి అని ఇదిమరేదేశంలోనూ కనిపించదన్నారు.

బ్రెయిన్ డ్రెయిన్ వల్ల లాభమే..


సంజీవని పథకంలో ఎన్నారై వైద్యులు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వర్చువల్‌గా కాని, వ్యక్తిగతంగా ఇక్కడకు వచ్చి రోగులకు వైద్య సేవలు అందించాలని కోరారు. ఎన్నారై డాక్టర్లు ఆధునిక సాంకేతికను ప్రదర్శించేందుకు, అమలు చేసేందుకు అమరావతి అత్యుత్తమ ప్రదేశమని చెప్పారు. నేను తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో బ్రెయిన్ డ్రెయిన్ భవిష్యత్తులో బ్రెయిన్ గెయిన్ (దేశానికి సంపద సృష్టి)గా మారుతుందని తాను చెప్పానని ఇందుకు నిలువెత్తు నిదర్శనమే జింకానా వైద్యులు రూ.100 కోట్లతో గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో నిర్మించిన తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రమన్నారు.

పీ4కి సహకరించండి..

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ) విధానం అమలు వల్ల ప్రజలకు మెరుగైన సదుపాయాలు సమకూరాయన్నారు. అయితే ధనిక, పేదల మధ్య అంతరం పెరిగిపోతోందన్నారు. అందుకు తాను పీ4ని తీసుకురావడం జరిగిందని చెప్పారు. పేదలకు వ్యక్తిగతంగా ఏమేమి కావాలో అన్ని ప్రభుత్వం తరుపున చేస్తోన్నామని, అయితే వారిలో జీవన ప్రమాణాలు మెరుగుపడాలంటే సంపాదన అవసరమన్నారు. లేకుంటే ఆర్థిక అసమానతలు ఎన్నటికి తగ్గే పరిస్థితి ఉండదన్నారు. సరైన (మిగతా 8వ పేజీలో)

జీజీహెచ్‌లో మాతా శిశు సంరక్షణ కేంద్రం (ఎంసీహెచ్) నిర్మాణానికి జింకానా ముందుకు వచ్చింది. ఈ క్రమంలో 2014-19 మధ్య అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఆయనే మళ్లీ కూటమి ప్రభుత్వం లో ముఖ్యమంత్రి హోదాలో ఎంసీహెచ్ బ్లాక్‌ను ప్రారంభించారు. ఇక్కడ చదువు కుని అమెరికా వెళ్లి స్థిరపడిన వైద్యులు భారీగా తరలిరావడంతో జీజీహెచ్‌లో పండుగ వాతావరణం నెలకొంది. బ్లాక్ నిర్మాణానికి రూ.100 కోట్లు అందజేసిన ఎన్‌ఆర్‌ఐలతో పాటు ఆస్పత్రి అభివృద్ధికి విరాళం ఇస్తున్న తులసీ రామచంద్ర ప్రభుని సీఎం ప్రత్యేకంగా అభినందించారు. వారితో కలిసి గ్రూపు ఫొటో దిగారు. బ్లాక్‌కు అవసరమైన పరికరాలు, ఫర్నీచర్‌ని ప్రభుత్వం తరపున సమ కూరుస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు.

నాడు శంకుస్థాపన.. నేడు ప్రారంభం






ఎన్ఆర్ఐ వైద్యులకు అభివాదం చేస్తున్న సీఎం చంద్రబాబు

ఆరోగ్యాంధ్ర కోసం 'సంజీవిని'

ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు ప్రవేశపెడుతున్న సంజీవిని పథకం గేమ్ ఛేంజర్‌గా మారుతుందని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ప్రపంచంలోని అత్యుత్తమ వైద్య విజ్ఞానం రోగుల ఇంటి ముంగిటకే తెచ్చే బృహత్తర పథకమే సంజీవినిగా ఆయన అభివర్ణించారు. 'సంజీవిని పథకం నిర్వహణలో సాంకేతిక సహకారం అందించేందుకు బిల్‌గేట్స్ ఫౌండేషన్ ముందుకు వచ్చిందన్నారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్ట్‌గా ఇప్పటికే 70 వేల మందికి క్లినికల్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. ఈ ఏడాది చివరి నాటికి అన్ని జిల్లాల్లో సంజీవిని పథకం కింద అమలు చేస్తామన్నారు. ప్రివెంటివ్ హెల్త్, క్యూ రేటివ్ హెల్త్ వంటి ప్రక్రియలను రియల్ టైమ్ మాని టరింగ్ ద్వారా పర్యవేక్షిస్తామని తెలిపారు.





జాతీయ గీతం ఆలపిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, డాక్టర్లు

ముందుగానే.. పింఛన్

నేడు పంపిణీకి అధికారుల ఏర్పాట్లు

- 1న సెలవు కావడంతో ముందురోజే పంపిణీ
- జిల్లాలో 2,51,879 మందికి.. రూ.109.55 కోట్లు సిద్ధం
- 20 నెలల కూటమి పాలనలో ఆరోసారి ముందురోజే పంపిణీ

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఈ నెలలో కూడా ఒక రోజు ముందుగానే అవ్వాతాతల్లో ఆనందం వెల్లివిరియనున్నది. సాధారణంగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రతీ నెల 1వ తేదీని ప్రభుత్వం సచివాలయాల సిబ్బందితో పంపిణీ చేపడుతున్న విషయం తెలిసిందే. అయితే ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం సెలవు కావడంతో జనవరి 31వ తేదీ శనివారమే పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు కూడా పూర్తి చేశారు. జిల్లాలో 2,51,879 మంది మంది పింఛన్‌దారులు ఉండగా వారికి సంబంధించి రూ.109,55,40,000లను ప్రభుత్వం విడుదల చేసింది. శుక్రవారం సచివాలయాల సిబ్బంది బ్యాంకుల నుంచి నగదును డ్రా చేశారు. శనివారం ఉదయం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్‌ను అందజేసేందుకు సిబ్బంది సిద్ధమయ్యారు. అనివార్య కారణాల వల్ల శనివారం అందుకోలేక పోతే వారికి 2వ తేదీ సోమవారం పింఛన్ అందజేయనున్నారు. వరుసగా రెండో నెల(జనవరి, ఫిబ్రవరి) ఒక రోజు ముందే పింఛన్లు పంపిణీ చేస్తుండటం విశేషం. ఇచ్చిన మాట ప్రకారం ప్రతి నెలా ఒకటోతేదీనే పింఛను అందించడం, సెలవులు, ప్రత్యేక దినాల సందర్భంలో ఒకరోజు ముందుగానే ఠంచనుగా అందడంపై అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతు, ఒంటరి మహిళలు, అనారోగ్య పీడితులైన లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 20 నెలల కూటమి పాలనలో ఇలా ఒక రోజు ముందుగానే పింఛన్ ఇవ్వడం ఇది ఆరోసారి. కిందటేడాది సెప్టెంబరు ఒకటో తేది ఆదివారం కావడంతో ఆగస్టు 31న, డిసెంబరు 1న ఆదివారం రావడంతో నవంబరు 30వ తేదీనే ప్రభుత్వం పింఛన్లు అందజేసింది. ఆ తర్వాత ఏడాది జనవరి 1న సెలవు కావడంతో డిసెంబరు 31నే, జూన్ 1 ఆదివారం కావడంతో మే 30న, ఈ ఏడాది జనవరి 1న న్యూ ఇయర్ వేడుకలను దృష్టిలో ఉంచుకుని డిసెంబరు 31న లబ్ధిదారులకు పింఛను అందజేశారు. తాజాగా ఆరో సారి ఒకరోజు ముందుగా శనివారం పింఛన్‌ను పంపిణీ చేస్తున్నారు.



ముమ్మరంగా హైకోర్టు నిర్మాణ పనులు

- పూర్తయిన రాఫ్ట్ ఫౌండేషన్ నిర్మాణం
- శరవేగంగా జరుగుతున్న పోర్ 2, పోర్ 3 పనులు

8

మోదీ మౌనం.. దేశానికి ప్రమాదం

- ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోక్ ధావలే



8

పుస్తకావిష్కరణలో పాల్గొన్న నాయకులు

రిజిస్ట్రేషన్లు.. రద్దీ

రెండో రోజూ కొనసాగిన వైనం • నేటితో పాత చార్జీల గడుపు ముగింపు

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 1వ తేదీ నుంచి భూముల మార్కెట్ విలువ పెరగనున్న నేపథ్యంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రెండో రోజూ శుక్రవారం కూడా రద్దీ కొనసాగింది. పాత చార్జీలపై రిజిస్ట్రేషన్లకు జనం ఎగబడుతున్నారు. గుంటూరు, బాపట్ల, నరసరావుపేట, తెనాలి తదితర నగర, పట్టణ ప్రాంతాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గడిచిన రెండు రోజులుగా పెద్దసంఖ్యలో రిజిస్ట్రేషన్ కోసం జనం పోటీపడ్డారు. పాత చార్జీలకు శనివారం చివరి రోజు కావడంతో శనివారం కూడా కార్యాలయాల్లో రద్దీ నెలకొనే అవకాశం ఉంది. ఒక్కో కార్యాలయంలో 150 నుంచి 200 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరిగినట్లు సమాచారం. ఇందుకుగాను ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరింది. స్లాట్ బుకింగ్ ద్వారానే రిజిస్ట్రేషన్ల ప్రక్రియ జరగనుండడంతో ముందుగానే స్లాట్ బుకింగ్ కోసం డాక్యుమెంట్ రైటర్లు పోటీపడ్డారు. సర్వర్లపై ప్రభావం పడి కొంతమేర జాప్యం జరిగింది.

కొలిక్కి వచ్చిన రాజధాని సమస్యలు

- 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్ల రిజిస్ట్రేషన్
- మంత్రులు పెమ్మసాని, నారాయణ, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్
- రైతుల పనులపై సీఆర్డీఏ కార్యాలయంలో త్రీమెన్ కమిటీ సమీక్ష

తుళ్లూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాజధాని రైతుల సమస్యలు దాదాపు కొలిక్కి వచ్చాయని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌లతో కూడిన త్రీమెన్ కమిటీ ప్రకటించింది. శుక్రవారం రాయపూడి సీఆర్డీఏ ప్రధాన కార్యాలయంలో ఏడీసీ, సీఆర్డీఏ అధికారులతో రాజధాని పనులపై సమీక్ష జరిగింది. ఈ సమావేశం అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. 29,233 మంది రైతులకు 69,421 ప్లాట్లల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. 1914 మంది రైతులకు 7273 ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉందన్నారు. వీరిలో కొంత మంది వివిధ రకాల కారణాలతో ముందుకు రావడం లేదన్నారు. ప్లాట్లలో డ్రెయిన్ల నిర్మాణం పూర్తి అయిన తర్వాత సర్వే రాళ్లు వేయాలని రైతులు కోరారన్నారు. రైతుల ప్లాట్లలో నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నట్లు చెప్పారు. వర్షాకాలం నాటికి రైతుల ప్లాట్లలో మౌలిక వసతుల కల్పన పూర్తి చేస్తామన్నారు. కొన్ని గ్రామాల్లో వసతుల కల్పనకు టెండర్లు పూర్తి చేశామన్నారు. రైతుల ప్లాట్ల రోడ్డుపోటు సమస్యను పరిష్కరిస్తున్నామని చెప్పారు. ప్రధాన రోడ్డు బాధితులకు ముందుగా లేవుట్ ఏర్పాటు చేసి వారికి నచ్చిన తర్వాత ప్యాకేజి అమలు చేసి పనులు పూర్తి చేస్తామన్నారు. గ్రామ కంఠాల సమస్యను పరిష్కరించడానికి కమిటీని ఏర్పాటు చేశామని నివేదిక ఆధారంగా కేటాయింపులు ఉంటాయని చెప్పారు. వచ్చే క్యాబినెట్ సమావేశంలో జరీబు నాన్ జరీబు సమస్యపై నిర్ణయం తీసుకుంటామన్నారు. శ్మశాన వాటికలకు సీఆర్డీఏ స్థలాలు చూపిందని, వాటి పనులు కూడా పూర్తి అవుతాయన్నారు. 2014 డిసెంబరు 8 నాటికి అమరావతిలో నివాసం ఉండి భూమిలేని నిరుపేద కుటుంబాలకు పింఛన్ అమలు చేస్తున్నట్లు చెప్పారు. కుటుంబాలు వేరు పడి పింఛన్ రాకపోతే వారికి కూడా అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు, అడిషనల్ కమిషనర్ భార్గవ తేజ తదితరులు పాల్గొన్నారు.



సీఆర్డీఏ, ఏడీసీ అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కేంద్ర మంత్రి పెమ్మసాని, మంత్రి నారాయణ , ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్

రేపటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

జిల్లాలో 126 కేంద్రాలు.. 26 వేల మంది విద్యార్థులు • వాట్సాప్‌మిత్ర ద్వారా హాల్‌టిక్కెట్ల డౌన్‌లోడుకు అవకాశం

గుంటూరు(విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థులకు ఆదివారం నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఇందుకోసం జిల్లాలో ఏర్పాట్లు చేసినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ గర్నేపూడి సునీత తెలిపారు. 1 నుంచి 10వ తేదీ వరకు జరిగే పరీక్షలకు 26 వేల మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. కేంద్రాల్లో విద్యార్థులకు మంచి నీరు ఇతర సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అవసరమైన ప్రయోగ పరికరాలు అన్ని కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు రెండు విడతలుగా పరీక్షలు నిర్వహిస్తామన్నారు. సీసీ కెమేరాల పర్యవేక్షణ ఉంటుందని, ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు భద్రత ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించడానికి 48 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 771 మంది ఎగ్జామినర్లను ఏర్పాటు చేశామన్నారు. ప్రయోగ పరీక్షల ప్రశ్నాపత్రాల కోసం 21 స్టోరేజి కేంద్రాలు ఉన్నాయన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం స్టోరేజ్ కేంద్రాల నుంచి ప్రశ్నాపత్రాలు విద్యార్థులకు చేరవేస్తామని తెలిపారు. ఇప్పటికే 17 కేంద్రాల్లో వృత్తి విద్యార్థులకు ప్రయోగ పరీక్షలు ప్రారంభమైనట్లు తెలిపారు. వివిధ బ్రాంచ్‌ల ప్రకారం 2,292 మంది ప్రయోగ పరీక్షలకు హాజరుకానున్నట్లు తెలిపారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్లను వాట్సాప్ మిత్ర (952300009) లేదా ఇంటర్ బోర్డు (బిఐఇ.ఎపి.జివోవి)ద్వారా డౌన్‌లోడు చేసుకోవచ్చని ఆర్ఐఓ తెలిపారు.

కేంద్రాల్లో ఆర్ఐఓ తనిఖీలు..

ఇంటర్ ప్రయోగ పరీక్షల కేంద్రాల్లో ఇంటర్ బోర్డు ఆర్ఐఓ సునీత శుక్రవారం తనిఖీలు చేశారు. ఆయా కేంద్రాల్లో ఎంపీసీ, బైపీసీ విద్యార్థులకు అవసరమైన రసాయనాలు, ల్యాబ్ పరికరాలు ఉన్నాయా? లేదా అనే వివరాలు ఇంటర్‌బోర్డు ఇచ్చిన చెక్‌లిస్టు ప్రకారం పరిశీలించారు. లోపాలు ఉంటే వెంటనే కళాశాలల యాజమాన్యాలకు సూచనలు చేశామన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతారణంలో పరీక్షలు పూర్తి చేసేలా ఉండాలని స్పష్టం చేశారు.



ప్రయోగ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్ఐఓ సునీత తదితరులు

ప్రాధాన్య క్రమంలో వినతుల పరిష్కారం

- పోలీసు సిబ్బందితో ఎస్పీ వకుల్ జిందాల్

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య క్రమంలో పోలీస్ సిబ్బంది వినతుల పరిష్కరించనున్నట్లు ఎస్పీ వకుల్‌జిందాల్ హామీ ఇచ్చారు. జిల్లా పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న సిబ్బంది నుంచి ప్రతి శుక్రవారం పోలీస్ కార్యాలయంలో వినతులు, సమస్యల పరిష్కారానికి నిర్వహించే పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ కార్యక్రమం ఈ వారం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ సిబ్బంది నుంచి నేరుగా వినతులను స్వీక రించారు. వారి సమస్యలను ఆలకించి ప్రాధాన్య క్రమంలో పరిష్కరిస్తానని చెప్పారు. ఆయా ఘటనల్లో శాఖాపరమైన చర్యలు తీసుకున్న సిబ్బందిని తగిన విచారణ అనంతరం విధుల్లోకి తీసుకుంటామన్నారు. వృత్తి పట్ల నిబద్ధత, నిజాయితీ, బాధ్యత కలిగి ప్రజలకు ఉత్తమమైన సేవలు అందిస్తూ శాఖపై నమ్మకాన్ని పెంపొందించాలని సిబ్బందికి సూచించారు. స్వేచ్ఛగా, మనస్ఫూర్తిగా సిబ్బంది విధులు నిర్వర్తించే విధంగా చర్యలు తీసుకుంటామని ఎస్పీ హామీ ఇచ్చారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ వకుల్ జిందాల్

సాగునీటి కోసం యుద్ధం

- అప్పాపురం ఛానల్ ఉన్నా అందని నీరు
- ఏటా పాతరెడ్డిపాలెం, లేమల్లెపాడు రైతులకు తిప్పలే

చేబ్రోలు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): దిగువన పుష్కలంగా నీరు.. ఎగువన నీరందక ఎండిపోతున్న పంటలు.. ఇదీ పాతరెడ్డిపాలెం గుండా వెళ్లే అప్పాపురం కెనాల్ ఆయకట్టు రైతుల పరిస్థితి. కాల్వలో నీరు పారుతున్నా ఆ నీటిని పొలాలకు మళ్లించుకోవడానికి రైతులు పెద్ద యుద్ధమే చేయాల్సి వస్తోంది. పాతరెడ్డిపాలెం, లేమల్లెపాడు రైతులకు ఏటా సాగునీటి తిప్పలు తప్పడంలేదు. ఏటా రైతులకు సాగునీటి కోసం ఎకరానికి రూ.15 వేల నుంచి 20 వేల అదనపు భారం పడుతుంది. రబీ సీజన్‌లో మొక్కజొన్న, మిరప, దోస సాగు చేస్తున్న పాతరెడ్డిపాలెం, లేమల్లెపాడు రైతులు నీటి తడి కోసం పడుతున్న అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. వీరి పొలాల సమీపం నుంచే అప్పాపురం ఛానల్ వెళ్తున్నా మెరకలో ఉండటంతో సాగునీరు అందడం లేదు. దీంతో కాల్వ గట్టుపై 30 నుంచి 40 డీజిల్ ఇంజన్లను ఏర్పాటు చేసి కాల్వలో నుంచి నీటిని తోడుతున్నారు. మొదట ఛానల్ నుంచి పంట కాల్వలోకి.. అక్కడి నుంచి కొంత దూరం తరలించి అక్కడ తవ్విన గుంతల్లో నింపి మళ్లీ అక్కడి నుంచి డీజిల్ ఇంజన్ల ద్వారా ఐదారు కిలోమీటర్ల పొడవునా పైపులు వేసి నీటిని పంటలకు పెట్టుకుంటున్నారు.

భారమవుతోన్న సాగు

ఒక్క ఎకరం మొక్కజొన్న తడవాలంటే కనీసం 3 నుంచి 4 గంటల సమయం పడుతుంది. వారానికి ఒకసారి ఈ ప్రక్రియ తప్పనిసరి. సొంత ఇంజన్లు ఉన్నవారికంటే, అద్దెకు తెచ్చుకునే రైతులకు ఖర్చు తడిసి మోపెడవుతోంది. చీడపీడల నివారణ, కూలీల ఖర్చులతో పాటు నీటి ఖర్చు అధికమవడంతో సాగు గిట్టుబాటు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి, శాశ్వత ప్రాతిపదికన లిఫ్ట్ ఇరిగేషన్ పద్ధతిలోనో, పైపులైన్ల ఏర్పాటు ద్వారానో తమకు నీటి సౌకర్యం కల్పించాలని రైతులు కోరుతున్నారు.



అప్పాపురం కెనాల్ గట్టుపై నీటిని తోడేందుకు సిద్ధంగా ఉన్న మోటార్లు

ఆసక్తికరంగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

● న్యూకేటగిరిలో పల్నాడు ఎడ్లజత విజేత



న్యూకేటగిరీ విజేతకు బహుమతి అందజేస్తున్న యాగంటి చంద్రశేఖర్

రెంటచింతల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వేంచేసియున్న కానుకమాత 176వ వార్షికోత్సవాల నేపథ్యంలో స్థానిక సెయింట్ జోసఫ్ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలు శుక్రవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. న్యూ కేటగిరి విభాగంలో 28 నిమిషాల్లో 15 క్వింటాళ్ల బండను లాగేందుకు 15 ఎడ్ల జతలు పాల్గొన్నాయి. నాదెండ్ల మండలానికి చెందిన మంగు శరాదేవి ఎడ్లజత 4489.07 అడుగుల దూరం లాగి విజేతగా నిలిచింది. గుంటూరు జిల్లా కొండపాటూరు గ్రామం జీపీ చౌదరి బుల్స్, గుడవల్లి లక్ష్మీ దీక్షిత చౌదరి ఎడ్లజత 4274.08 అడుగులతో ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు చెందిన పుచ్చకాయల శేషాద్రి చౌదరి ఎడ్లజత 4230.02 అడుగులతో తృతీయ స్థానం, కృష్ణా జిల్లాకు చెందిన ఎంకేఎం బుల్స్, మేకా కృష్ణమోహన్, ఘంటసాల ఎడ్లజత నాలుగోస్థానం, బాపట్ల జిల్లా వేటపాలెంకి చెందిన ఐకో బుల్స్, అర్జుల శిరీష చౌదరి, శివకృష్ణ చౌదరి ఎడ్లజత ఐదో స్థానంలో నిలిచాయి. ప్రథమ బహుమతిగా రూ.80 వేలను భారతి సీడ్స్ యాగంటి ఆగ్రోటెక్ మేనేజింగ్ డైరెక్టర్ యాగంటి చంద్రశేఖర్ అందజేశారు. కన్సోలేషన్ బహుమతులు అందించారు. న్యాయ నిర్ణేతలుగా రాధాకృష్ణ, సుబ్బారెడ్డి వ్యవహరించారు. శనివారం సబ్ జూనియర్స్ విభాగంలో పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.



నాలుగు పళ్ల విభాగంలో విజేతగా నిలిచిన ఎద్దు

నాలుగుపళ్ల విజేత మంత్రి పార్థసారథి ఎడ్ల జత

మాచవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మోర్జంపాడులో శ్రీ లక్ష్మీనరసింహస్వామి 70వ కళ్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఎడ్ల బలప్రదర్శన పోటీలు శుక్రవారం నాలుగుపళ్ల విభాగంలో జరిగాయి. ఏడు జతలు పాల్గొనగా ఏలూరు జిల్లా నూజివీడు పట్టణానికి చెందిన రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, మేడిగం హర్షవర్ధన్‌రెడ్డి సంయుక్త ఎడ్ల జత 4,600 అడుగుల దూరం లాగి ప్రథమ స్థానంలో నిలిచింది. సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన కొప్పుల గోవర్ధన్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి ఎడ్ల జత ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా కంభం మండలం, ఎర్రబాలెంకి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్ల జత తృతీయ స్థానం, ముప్పాళ్ళ మండలం మాదల గ్రామానికి చెందిన ఉన్నవబోయిన విష్ణు భరత్ యాదవ్ ఎడ్ల జత నాల్గవ స్థానం, దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరి రామకోటయ్య ఎడ్ల జత ఐదవ స్థానం, కారంపూడి గ్రామానికి చెందిన బొమ్మిన పద్మావతి ఎడ్ల జత ఆరవ స్థానం, మంగళగిరి మండలం కురగల్లుకు చెందిన డిగ్గి శ్రీలత ఎడ్ల జత 7వ స్థానంలో నిలిచాయి. వీరికి వరుసగా రూ.35వేలు, రూ.30వేలు, రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.8వేలు నగదుతో పాటు షీల్డ్ అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా దుర్గికి చెందిన దుగ్గి శ్రీనివాసరావు వ్యవహరిస్తున్నారు.

వంద రోజుల కంది పంటపై పరిశోధనలు చేయాలి

● వీసీ ఆర్.శారద జయలక్ష్మీ దేవి



సమావేశంలో పాల్గొన్న వీసీ, అధికారులు

లాంఫాం(తాడికొండ) జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వంద రోజుల్లో చేతికొచ్చే కంది పంటపై శాస్త్రవేత్తలు పరిశోధనలు చేయాలని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి పిలుపునిచ్చారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయం 55వ పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశం రెండవ రోజు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఏపీలో పప్పు ధాన్యాల ఉత్పత్తి పెంచడానికి వ్యూహాలను రచించాలన్నారు. కంది సాగు విస్తీర్ణం పెంచడానికి రబీలో ప్రదర్శన క్షేత్రాలు రైతుల పొలాల్లో ఏర్పాటు చేసి అవగాహన పెంచాలన్నారు. పంటల రక్షణలో ఆధునిక పురోగతి, డ్రోన్స్ ద్వారా చీడపీడలను గుర్తించే పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఆటోమేషన్ యాంత్రికరణపై అవగాహన కల్పించాలన్నారు. చిన్న, సన్నకారు రైతులకు ఉపయోగపడే కొత్త యంత్రాలను అభివృద్ధి చేయాలని కోరారు. మాజీ విస్తరణ సంచాలకులు ఆలపాటి సత్యనారాయణ, ఐసీఏ ఆర్ మాజీ హెచ్‌ఆర్ ఎం.కృష్ణారెడ్డి, సీఆర్ఐడీఏ ప్రధాన శాస్త్రవేత్త ఐ.శ్రీనివాస్, పరిశోధన సంచాలకులు, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల పనులు వేగవంతం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావ

● సీఎంకు ఎమ్మెల్యే యరపతినేని కృతజ్ఞతలు

పిడుగురాళ్ల, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కళాశాల పనులు వైసీపీ హయాంలో నత్తనడకన సాగాయని, కూటమి ప్రభుత్వం వచ్చాకే పురోగతి కనిపించిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్ల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ... పిడుగురాళ్ల మెడికల్ కళాశాల పీపీపీ పద్ధతిలో లేదని, ప్రభుత్వమే నిర్వహిస్తుందన్నారు. మెడికల్ కళాశాలపై వైసీపీ నేతలు అసత్య ప్రచారాలు, సెల్ఫీలతో కాలం గడిపారన్నారు. వైసీపీ హయాంలో రాష్ట్ర నిధులు మెడికల్ కళాశాలకు ఎందుకు విడుదల చేయించలేదో నేతలు సమాధానం చెప్పాలన్నారు. జీఓ నంబరు 4 ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోనే మెడికల్ కళాశాల కొనసాగడంతో పాటు 420 పడకల స్థాయికి పెంచినట్లు చెప్పారు. మొత్తం 837 పోస్టులు మంజూరు చేయడంతో పాటు ఈ ఏడాదే 100 అడ్మిషన్లతో కళాశాల ప్రారంభించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌కు ఎమ్మెల్యే యరపతినేని ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో మంత్రి సత్యకుమార్‌తో సమావేశం కానున్నానని, ముఖ్యమంత్రి చంద్రబాబుతో మెడికల్ కళాశాల ప్రారంభింపజేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వంలో మూడు మున్సిపాల్టీల్లో రూ. 300 కోట్లు, మరో రూ.550 కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి చేపడుతున్నట్లు తెలిపారు.

హార్వర్డ్ సదస్సుకు ఏఎన్‌యూ స్కాలర్ విశ్వజ

ఏఎన్‌యూ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున వర్సిటీలోని సోషియాలజీ అండ్ సోషల్ వర్క్ విభాగం ప్రొఫెసర్ సరస్వతిరాజు అయ్యర్ మార్గ దర్శకత్వంలో పరిశోధనలు నిర్వహిస్తున్న విశ్వజ వచ్చే నెల 6, 7, 8 తేదీల్లో కేమ్ బ్రిడ్జ్ హార్వర్డ్ వర్సిటీలో జరగనున్న ప్రతిష్టాత్మక హార్వర్డ్ కాలేజ్ ప్రాజెక్ట్ ఫర్ ఆసియన్ అండ్ ఇంటర్నేషనల్ రిలేషన్స్ (హెచ్‌పీఏఐఆర్) వార్షిక సమావేశంలో పాల్గొన డానికి ఎంపికయ్యారు. 50 దేశాల దర ఖాస్తుదారుల నుంచి విశ్వజ ఎంపిక చేయబడ్డారు. హెచ్‌పీఏఐఆర్ అనేది హార్వర్డ్ కళాశాలలో అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన విద్యార్థి సంస్థ. ఇది ఆసియా - పసిఫిక్ ప్రాంతానికి సంబంధించిన కీలకమైన ఆర్థిక, రాజకీయ, సామాజిక సమస్యలపై సంభాషణకు ప్రపంచ వేదిక. ప్రముఖ ప్రపంచ నాయకులు, నోబెల్ గ్రహీతలు ఇందులో పాల్గొంటారు. వీసీ కె.గంగాధరరావు స్పందిస్తూ..విశ్వజను అభినందించారు. ఇది ఆమెకు మాత్రమే కాకుండా వర్సిటీకి కూడా ఒక గౌరవమన్నారు. రెక్టార్ శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ సింహాచలం అభినందనలు తెలిపారు.



ఆహ్వాన పత్రాన్ని వీసీ గంగాధరరావుకు చూపిస్తున్న విద్యార్థిని విశ్వజ

పీజీ పరీక్ష ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది నంవబరులో నిర్వహించిన ఎంఏ పరీక్ష ఫలితాలను శుక్రవారం పరీక్షల నిర్వహణాధికారి ఆలపాటి శివప్రసాదరావు విడుదల చేశారు. రీవాల్యుయేషన్‌కు ఫిబ్రవరి 10వ తేదీ వరకు గడవు ఉందని తెలిపారు. పేపర్‌కు రూ. 1,860, పర్సనల్ వెరిఫికేషన్‌కు రూ.2,190 ఫీజు చెల్లించాలని సీఈ తెలిపారు.

పిన్నెల్లిలో పిచ్చికుక్క స్వైరవిహారం

● బాలికకు తీవ్రంగా, ఐదుగురికి స్వల్ప గాయాలు



తీవ్రంగా గాయపడిన చిన్నారి శృతి, హారిక వీపుపై గాట్లు

మాచవరం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పిన్నెల్లి గ్రామంలో శుక్రవారం పిచ్చి కుక్క స్వైర విహారం చేసింది. కుక్క దాడిలో బాలికకు తీవ్ర గాయాలు కాగా మరో ఐదుగురు స్వల్పంగా గాయపడ్డారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురు, శుక్రవారాల్లో పిచ్చికుక్క స్వైర విహారం చేసి ఆరుగురిని గాయపరిచింది. వీరిలో చింతల శృతిని దవడపై కరవడంతో తీవ్ర గాయమైంది. మాచవరం పీహెచ్‌సీకి తరలించగా ప్రథమ చికిత్స అందించి, మెరుగైన చికిత్స కోసం నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ కూడా సరైన పరికరాలు లేక పోవటంతో గుంటూరులోని కాటూరు వైద్యశాలకు తరలించినట్లు బంధువులు తెలిపారు. మరో బాలిక వంగపూరి హారికకు వీపుపై పలు చోట్ల గాయాలయ్యాయి. వీరిద్దరితో పాటు మరో నలుగురి పై కూడా పిచ్చి కుక్క దాడి చేసి గాయ పరిచినట్లు స్థానికులు తెలిపారు.

మిర్చియార్డు సెక్రటరీ డిప్యూటేషన్ పొడిగింపునకు ప్రతిపాదన

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మిర్చి యార్డు (గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ) ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక డిప్యూటేషన్‌ని మరో ఏడాది పొడిగించేందుకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలో ఫైలు కదిలింది. మునిసిపల్ పరిపాలన శాఖ ఎన్‌వోసీ ఇస్తే ఇక జీవో జారీ కావడమే తరువాయిగా మారింది. చంద్రిక మునిసిపల్ పరిపాలన శాఖలో స్పెషల్ గ్రేడ్ కమిషనర్ హోదాలో గ్రేటర్ విశాఖ నగరపాలక సంస్థ డిప్యూటీ ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తూ గతేడాది జనవరి 27న డిప్యూటేషన్‌పై మిర్చి యార్డు సెలెక్షన్ గ్రేడ్ సెక్రెటరీగా పోస్టింగ్ పొందారు. అదే నెల 31న విధుల్లో చేరారు. తన ఏడాది పదవీకాలం ముగియడంతో మరో సంవత్సరం ఫారెన్ సర్వీసు పొడిగించాల్సిందిగా చంద్రిక అర్జీ పెట్టుకొన్నారు. దీనిపై రెండు వారాల వ్యవధిలోనే ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉన్నట్లు మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.

వేంకటేశ్వరస్వామితో పెట్టుకున్న వారికి పుట్టగతులు ఉండవు : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామితో పెట్టుకున్న వారికి ఎప్పటికీ భవిష్యత్ ఉండదని, అందుకు ప్రత్యక్ష నిదర్శనాలు ఎన్నో ఉన్నాయని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వేంకటేశ్వరస్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ, కల్తీ నెయ్యి మహా పాపాన్ని ఇతరులపైకి నెట్టే ప్రయత్నం చేయడం వైసీపీ క్రిమినల్ రాజకీయాల్లో భాగమేనన్నారు. సిట్ స్పష్టంగా హానికారక రసాయనాలు, ఇతర విషపూరిత కెమికల్స్‌తో తిరుమల లడ్డూ తయారుచేశారని ఆధారాలతో సహా స్పష్టంగా సుప్రీంకోర్టుకు సమర్పించిన నివేదికకు వైసీపీ వక్ర భాష్యాలు చెబుతోందన్నారు. ఈ సందర్భంగా ప్రత్తిపాటి పట్టణంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో తెలుగు మహిళల ఆధ్వర్యంలో ఆలయ సంప్రోక్షణ, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య నాయకులు, కూటమి నేతలతో కలిసి గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, మురకొండ మల్లిబాబు, కనమర్లపూడి రమేష్, కొత్త కోటేశ్వరరావు, డాక్టర్ సురేష్ కుమార్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

● జీడీసీసీ బ్యాంకు చైర్మన్ మక్కెన

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బ్యాంకు పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకు చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు కోరారు. జీడీసీసీ నరసరావుపేట బ్రాంచ్‌లో స్టాఫ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రామాయణం మురళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందటంతో టర్మ్ ఇన్సూరెన్స్ రూ.25 లక్షలను బ్రాడీపేటలోని ఎన్‌టీఆర్ సహకార భవన్‌లో కుటుంబ సభ్యులకు అందజేశారు. ప్రతి ఉద్యోగికి ఇన్సూరెన్స్ పథకం వర్తింపచేయడంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సీఈవో వీవీఎస్ ఫణికుమార్ తదితరులున్నారు.



ఇన్సూరెన్స్ పత్రాలు అందజేస్తున్న చైర్మన్ మక్కెన



ఉద్యోగావకాశాలు

→ గుంటూరులో గల బార్ & రెస్టారెంట్‌లో పనిచేయుటకు బిల్లింగ్ ఆపరేటర్ మరియు లిక్కర్ బాయ్స్ కావలెను. Contact 9573271161 AJG-277293

→ రామచంద్ర బ్రదర్స్ ఫర్నిచర్ స్టోర్ నందు సేల్స్ మెన్స్-20 కావలెను. అర్హత : MBA / Anyడిగ్రీ, వయస్సు: 30సం॥లోపు. సంప్ర॥ 99638 48003. AJG-277561

→ తెనాలి మంగళగిరి ఏరియాలలో ప్రముఖ పురుగు మందుల కంపెనీలో పనిచేయుటకు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. Q. డిగ్రీ, జీతం : 15,000 + 3000. సంప్ర॥ 9121469383. AJG-277367

→ TATA కంపెనీ లో లైఫ్ & హెల్త్ ఇన్సూరెన్స్ ఏజెంట్స్ మరియు టీమ్ లీడర్స్ కావలెను. మీ శ్రమకు తగిన ఆదాయం + ఫారిన్ ట్రిప్స్ కలవు. సంప్ర॥ 94908 66938. AJG-277404

→ రాజధాని నిర్మాణ పనులలో పనిచేయుటకు సివిల్ ఇంజనీర్స్ ఫ్రెషర్స్ అర్జెంట్‌గా కావలెను. ఫ్రీ రూమ్, ఫ్రీ భోజనం, మంచి జీతం. వెంటనే సంప్రదించండి.✆ 81211 26670 AJB-260197

→ వడ్లమూడి (V) మ్యారేజ్ బ్యూరో గుంటూరులో పనిచేయుటకు అనుభవం గల కంప్యూటర్ ఆపరేటర్స్, మార్కెటింగ్ సిబ్బంది కావలెను. ఆడవారికి మాత్రమే. సంప్ర: 9666227979. AJH-003737

→ రిటైర్డ్, పెన్షనర్స్, గృహిణులకు శుభవార్త, మీ ఖాళీ సమయంలో రోజుకు 2 గం.లు పనిచేస్తూ నెలకు 30వేలు ఆపైన సంపాదించే గొప్ప సువర్ణ అవకాశం. సంప్ర ✆ 70134 81406 AJB-475

స్థలం అమ్మకము

→ 60 అ. రోడ్‌ని ఆనుకుని 4 ఎకరాలు. గన్నవరం ఎయిర్ పోర్ట్ నుండి 12 కి.మీ., ఇండస్ట్రీయల్ జోన్ వీరపనేని గూడెం కి 1 కి.మీ. 4 ఎకరాలు ధర రూ.5 కోట్లు. ✆ 83175 28192 AJB-194635

ఇల్లు అమ్మకము

→ చీరాల, కొత్తపేట RTC కాలనీలో 9 సెంట్ల విస్తీర్ణములో కల 2 అంతస్తుల డాబా ఇల్లు సౌత్ (ఈస్ట్ రోడ్) అమ్మకానికి కలదు. సంప్ర॥ సెల్: 9177644898 / 7093321399. AJO-0268485

అద్దెకు

→ గుంటూరు RTC కాలనీ, 5వ లైన్‌లోని 311 చ.గలు రెండు అంతస్తుల ఇల్లు గూడెంగా గాని, ప్రవేట్ Business Purposeగా గాని అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 8500002183. AJG-277271

పోయినవి

→ గుత్తా నాగ గాయత్రి @ పరుచూరి నాగ గాయత్రి W/o. పరుచూరి భవానీ శంకరం, D.No. 6-62, గుత్తవారిపాలెం, పెదపులివర్రు గ్రామం, భట్టిప్రోలు మండలం, A.P. నాకు సంబంధించిన పొలం యొక్క సర్వే నంబర్ 48-1,2,3, (S.R.O. భట్టిప్రోలు), గుత్తావారిపాలెం నుండి భట్టిప్రోలుకు వెలుతుండగా పొలం యొక్క డాక్యుమెంట్స్ పోయినవి. కావున ఎవరికైనా దొరికినచో ఈ నంబర్ 9703323999 కు తెలుపగలరు. AJG-277146

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనల కొరకు

ఈ క్రింది నెంబరును సంప్రదించగలరు
99854 03281
సమయం : ఉ॥ 10:00 గం॥ల నుండి సా॥ 06:00 గం॥ల వరకు (సోమవారం నుండి శనివారం వరకు)

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడీవిటి

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

సత్తెనపల్లి రూరల్, జనవరి30(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన ఘటన పాకాలపాడు వద్ద శుక్రవారం జరిగింది. మండలంలోని బృగుబండలో బంధువు దశదినకర్మ నేపథ్యంలో క్రోసూరు మండలం గుడిపాడుకు చెందిన సిద్దెల మీరమ్మ(50) తన సోదరుడు దర్శి యోహాన్‌తో కలసి సరుకుల కోసం బైక్‌పై సత్తెనపల్లి వెళ్లారు. పాకాలపాడు వద్ద బైక్‌ను ట్రాక్టర్ వేగంగా ఢీకొంది. కింద పడిన మీరమ్మపై ట్రాక్టర్ వెళ్లడంతో.. తీవ్రంగా గాయపడింది. యోహాన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు సత్తెనపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తీసుకెళ్లగా మీరమ్మ మృతిచెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆమె కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. తన అల్లుడు దుగ్గి రామ్‌ప్రసాదు రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో.. దశదిన కర్మకు వచ్చిన అత్త మీరమ్మ కూడా రోడ్డు ప్రమాదంలోనే మృతి చెందడం.. రెండు కుటుంబాల్లో విషాద ఛాయలు నింపాయి.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

మిర్చియార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)

వచ్చిన బస్తాలు	78,473	
అమ్మకాలు	85,852	
నిల్వ	13,078	
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	23000
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	25000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	20500
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	23000
దేవనూరు డీలక్స్	14500	26000
ఆర్మూరు	12000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21000
నెంబరు. 5	13500	21500
273	----	----
341	13000	22000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	19000
బ్యాడిగి 355	13500	23000
దేవనూరు డీలక్స్	15000	22500
తాలుకాయలు	7200	11000

మహిళా ఎస్‌ఐ ప్రతాపం

● భార్యాభర్తల కేసులో భర్త పక్కటెముక విరిగేలా కొట్టిన ఖాకీ
● లబోదిబోమంటున్న కుటుంబ సభ్యులు



చికిత్స పొందుతున్న గోపి

వినుకొండటౌన్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): భార్యాభర్తల కేసులో భర్తను పట్టణంలోని ఓ లేడీ ఎస్‌ఐ కొట్టడంతో పక్కటెముక విరిగి మూత్రం ఆగిపోయి వైద్యశాలలో చికిత్స పొందుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాలను పరిశీలిస్తే... పెదకంచర్ల గ్రామానికి చెందిన జయంపు గోపికి సీతాశ్రేణితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు సంతానం. ఇటీవల చిన్నపాటి మనస్పర్థలు రావడంతో సీత తన స్వగ్రామంలో ఓ పెద్దమనిషి ద్వారా పోలీసులను సంప్రదించింది. ఈ నెల 27న గోపీని పోలీసులు స్టేషన్‌కు పిలిపించారు. అతనిని విడిపించాలని బాబాయి జయంపు కోటయ్య, పిన్ని అంజలీ పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. భార్య తరపున పోలీసులు ఒత్తిడి తేవడంతో పట్టణ పోలీస్ స్టేషన్‌లోని ఓ లేడీ ఎస్‌ఐ గోపీని ఈ నెల 28న పోలీస్ బెల్ట్‌తో తీవ్రంగా కొట్టినట్లు బాధితుడి తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, నాగేశ్వరమ్మ వాపోయారు. బాబాయి, పిన్ని సాయంతో గోపీని ఇంటికి తీసుకెళ్లారు. వెంటనే గోపి నోటి నుంచి రక్తం రావడం, పక్కటెముకకు గాయం కావడం, దెబ్బల తాకిడికి పొత్తి కడుపు పేగు ఉబ్బి మూత్రం ఆగిపోయింది. జరిగిన విషయాన్ని బాధిత బంధువులు గ్రామంలో పెద్దల దృష్టికి తీసు కెళ్లారు. వారంతా యానాదులు కావడం జేబులో చిల్లిగవ్వ లేక గోపీని బంధువుల సాయంతో వినుకొండలోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలిం చారు. గోపీకి తీవ్రగాయాలైనట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయం వెలుగులోకి రాకుండా పోలీసులు గోప్యంగా ఉంచినట్లు బాధితుని బంధువులు వాపోతున్నారు. ఈ ఘటనను ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు దృష్టికి తీసుకురావడంతో మహిళా ఎస్‌ఐ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ విషయంపై పట్టణ సీఐ ప్రభాకర్‌ను వివరణగా ఆ రోజు తాను లేనని, జరిగిన ఘటనపై విచారణ చేస్తామని తెలిపారు.

సమస్యల పరిష్కారంతో ఆర్థిక భారం పడదు

గుంటూరు (తూర్పు) జనవరి 30(ఆంధ్రజ్యోతి): సహకార ఉద్యోగుల సమస్యల పరిష్కారం వల్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాపై ఎటువంటి ఆర్థిక భారం పడబోదని రాష్ట్ర వ్యవసాయ, సహకార సంఘాల ఉద్యోగుల యూనియన్ల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మొవ్వా వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు దశల వారీగా స్థానిక శ్యామలనగర్ సహకార కార్యాలయం ఎదుట చేపట్టిన నిరసనలు నాలుగో రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రకాశం, చిత్తూరు జిల్లాల నుంచి భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా మొవ్వా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, సహకార ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ఎంతో పరిపాలన దక్షత కలిగిన సీఎం చంద్రబాబు నాయుడు మాత్రమే రాష్ట్రం లోని సహకార ఉద్యోగులకు న్యాయం చేయగలరన్న నమ్మకంతో ఉన్నామని తెలిపారు. 2019లో తీసుకువచ్చిన జీవో నంబరు 36 ఇప్పటికీ అమలు చేయలేదని ఆవేదన చెందారు. తక్షణమే జీవో అమలు చేసి ఉద్యోగులందరికీ ప్రొసీడింగ్స్ ఇవ్వాలని, డీఎల్‌ఎస్ఎఫ్ ఏర్పాటు చేసి జీతభత్యాలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సును 62 సంవత్సరాలకు పెంచాలని కోరారు. సమస్యలు పరిష్కరించకపోతే వచ్చే నెల 13న కార్యాలయాల ముట్టడి, అప్పటికీ ప్రభుత్వం స్పందించని పక్షంలో 16 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో నాయకులు తోట వెంకట్రావయ్య, రామా నాయుడు, చిరంజీవిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, హరికృష్ణ, ప్రతాప్ రెడ్డి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వీవీఐటీయూలో శ్రీ చిదంబరంగారు చిత్ర బృందం

పెదకాకాని, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నూతన నటీనటులు వంశీ తుమ్మల, సంధ్య వశిష్ట జంటగా వినయ్ రత్నం దర్శకత్వంలో రూపొందుతున్న శ్రీ చిదంబరంగారు చిత్ర బృందం శుక్రవారం వీవీఐటీయూలో సందడి చేసింది. ఫిబ్రవరి 6న సినిమా విడుదల నేపథ్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టింది. హీరో వంశీ, హీరోయిన్ సంధ్యా వశిష్ఠ, దర్శకుడు వినయ్‌రత్నం, వర్సిటీ రిజిస్ట్రార్ వై మల్లికార్జునరెడ్డి, నటీనటులు పాల్గొన్నారు. దర్శకుడు వినయ్ రత్నం మాట్లాడుతూ ఈ చిత్రం యువతలో స్ఫూర్తిని నింపేలా సాగుతుందన్నారు. లోపమే బలం అవ్వాలని చెప్పే విధంగా సినిమా రూపొందించినట్లు చెప్పారు. చిన్న చిన్న సమస్యలకే సూసైడ్ వరకు వెళుతున్న యువతకు ఈ చిత్రం మంచి సందేశం ఇస్తుందన్నారు. అనంతరం చిత్ర బృందంతో విద్యార్థులు నృత్యాలు, సెల్ఫీలతో సందడి చేశారు.




వీవీఐటీయూలో సందడి చేస్తున్న చిత్ర బృందం

మంటల్లో చిక్కుకుని దివ్యాంగుడి మృతి

చుండూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దివ్యాంగుడు మృతి చెందగా, ఎలక్ట్రీషియన్‌కు తీవ్ర గాయాలయ్యాయని చుండూరు సీఐ ఆనందరావు శుక్రవారం తెలిపారు. మోదుకూరులోని బండ్రెడ్డి శివరామకృష్ణ (55), రజనికి రెండు అంతస్తుల భవనం ఉంది. మధ్యాహ్నం భార్యభర్తలు గ్రౌండ్ ఫ్లోర్‌లో ఉండగా పైపోర్షన్‌లో కిటికీ నుంచి పొగలు వస్తున్నాయని ఇరుగు పొరుగు గుర్తించి వారికి చెప్పారు. దివ్యాంగుడైన శివరామకృష్ణ, అక్కడే ఉన్న ఎలక్ట్రీషియన్ పై పోర్షన్‌కి వెళ్లారు. విద్యుత్ బోర్డు మెయిన్ ఆపే క్రమంలో మంటల్లో శివరామకృష్ణ చిక్కుకుని మృతి చెందాడు. ఎలక్ట్రీషియన్ వెంకటరమణమూర్తి కిటికీ అద్దాలు పగలగొట్టుకుని పై నుంచి కిందకు దూకగా.. తీవ్ర గాయాలతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. తెనాలి అగ్నిమాపక సిబ్బంది మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. రూ.7 లక్షల మేరకు ఆస్తి నష్టం జరిగినట్లు అగ్నిమాపక శాఖ సిబ్బంది అంచనా వేసింది. ఘటనా స్థలాన్ని క్లూస్, ఫోరెన్సిక్ బృందాలు పరిశీలించాయి. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ ఆనందరావు తెలిపారు.



అగ్ని ప్రమాదానికి గురైన భవనం వద్ద సహాయక చర్యలు



సదా మీ సేవలో

అచిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతి కి చందాదారులుగా చేరాలనుకుంటున్నారా!

ఈ ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెప్పిన చాలు మా సిబ్బంది తక్షణం మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు. అంతేకాదు, పత్రిక పంపిణీలో మీరు ఏమైనా అసౌకర్యం ఎదుర్కొంటున్న, ఏదేని విన్నపం కోసమైనా ఫోన్ చేసి చెప్పండి, మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు

గుంటూరు 1 టౌన్	- 97036 18725
గుంటూరు 2 టౌన్	- 99854 01056
తెనాలి	- 99854 11202
నరసరావుపేట	- 99854 11206
బాపట్ల	- 99663 35084
పిడుగురాళ్ల	- 93909 05725
మంగళగిరి	- 93986 73618
అమరావతి	- 95027 86195
పొన్నూరు	- 97042 99094
రేపల్లె	- 99854 12254
చిలకలూరిపేట	- 91103 23914
వినుకొండ	- 99662 50266
మాచర్ల	- 88861 19952
సత్తెనపల్లి	- 97048 67908
ప్రత్తిపాడు	- 63004 34285

సర్క్యులేషన్ మేనేజర్: 99854 11214

ఇట్లు: బ్రాంచ్ మేనేజర్

నేడే బ్రహ్మాండమైన విడుదల



హాలీవుడ్	- గుంటూరు
ది సినిమాస్	- గుంటూరు
వి ప్లాటినో	- గుంటూరు
మైత్రి సినిమాస్	- గుంటూరు
రవి ప్రియా మాల్	- ఒంగోలు
రామకృష్ణ	- చిలకలూరిపేట
లక్ష్మీ కాంప్లెక్స్	- తెనాలి

CONTACT: 9290007688

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

ఆంధ్రజ్యోతి

దినపత్రికలో అన్ని రకముల ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

సంప్ర॥ 99854 11213 99854 11225 | 99854 01877 99854 04047 99854 01614



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కె.మయూర్ అశోక్

అభివృద్ధి పనుల్లో విభాగాల మధ్య సమన్వయం ఉండాలి

● కమిషనర్ మయూర్ అశోక్

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో విభాగాల మధ్య సమన్వయం ఉండాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ఆయా పనులు నిర్దేశిత గడువు ప్రకారం నిబంధనల మేరకు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం లక్ష్మీపురం, కృష్ణనగర్, బృందావన్ గార్డెన్స్ లోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రోడ్ విస్తరణ పనులను పరిశీలించి, తీసుకోవాల్సిన చర్యలపై విభాగాధిపతులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో ప్రధానంగా రోడ్ల విస్తరణ పనులను వేగంగా చేపట్టకుంటే ప్రజ లు ఇబ్బందులు పడతారని, పట్టణ ప్రణాళిక, ఇంజనీరింగ్ అధికారులు సమన్వయంతో ఉండాలన్నారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే ప్రతీ ఉద్యోగి సమగ్ర వివరాలు తెలుసుకొని ఉండాలని సూ చించారు. పర్యటనలో సీపీ రాంబాబు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, ఎస్ఈ వెంకటేశ్వర రావు, కార్పొరేటర్ మానం పద్మశ్రీ, ప్రజారోగ్య, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

మతసహనాన్ని పాటించడమే మహాత్ముడికి అసలైన నివాళి

● మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్

గుంటూరు(కార్పొరేషన్), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): మత సహనాన్ని పాటించడమే మహాత్ముడికి అసలైన నివాళి అని, లౌకికవాద మంటే దేవుళ్ళ వ్యతిరేకించడం కాదని, మతాల మధ్య సామరస్యాన్ని పెంపొందిస్తూ మత రహిత పాలన చేయాలని మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ తెలిపారు. శుక్రవారం మహాత్మాగాంధీ 78వ వర్ధంతి సంద ర్భంగా జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో గాంధీజీ సందేశం - సమకాలీన భారత్ అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠి కార్యక్రమానికి జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ బుద్ధుడు తర్వాత ప్రపంచాన్ని అంతలా ప్రభావితం చేసిన వ్యక్తి మహాత్మాగాంధీ అని, ప్రపంచానికి అహింస అనే ఆయుధాన్ని అందించి మార్గాన్ని చూపిన మహనీయుడు అని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయ రెడ్డి, రెట్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒరుగంటి నారాయణరెడ్డి, బీసీ జనమహాసభ అధ్యక్షుడు ఉగ్గం సాంబశివరావు, విశ్రాంత అడిషనల్ ఎస్పీ కేవీ చలపతిరావు, విశ్రాంత ఆచార్యులు సూరం నారాయణరెడ్డి, చంద్రానాయక్, కాపు శ్రీనివాస్, గంగోలు శ్యామ్యూల్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు. తొలుత మహాత్మా గాంధీజీ చిత్రపటానికి పూలమాలల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ప్రముఖ రచయిత, చరిత్రకారులు ప్రభాత్ పట్నాయక్, ఇర్ఫాన్ హబీబ్, బిపిన్ చంద్ర తదితరులు సంయుక్తంగా రచించిన లౌకిక భారతం కోసం గాంధీ అనే పుస్తకాన్ని ఆవిష్క రించారు.



ప్రసంగిస్తున్న మాజీ మంత్రి మాణిక్య వరప్రసాద్

రేపు ఎన్‌టీఆర్ స్టేడియంలో శ్రీనివాస కల్యాణం

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ శ్రీనివాసుడి కల్యాణ మహోత్సవాన్ని ఫిబ్రవరి ఒకటో తేదీన ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వావసు నామ సంవత్సర మధుపూర్ణిమ ఫిబ్రవరి ఒకటో తేదీన సాయంత్రం 6 గంటలకు జరిగే శ్రీ శ్రీనివాసుడు- పద్మావతి అమ్మవార్ల కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు తరలిరావాలని వారు కోరారు.

నెరవేరిన స్వప్నం..

● అందుబాట్లోకి తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం



కానూరి రామ చంద్రరావు జింకానా తల్లీ పిల్లల ఆరోగ్యకేంద్రం

గుంటూరు మెడికల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఒకే మంచంపై ఇద్దరు బాలింతలు, మరో ఇద్దరు పసికందులు. ఒళ్లు పచ్చి పుండుగా ఉండే బాలింతలు గంటల కొద్దీ ఒక పక్కకు ఒరిగి మాత్రమే పడుకోవాల్సి వచ్చేది. పూర్తిగా కాళ్లు చాపుకొనే సౌలభ్యం కూడా ఉండేది కాదు. గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రి స్త్రీ, ప్రసూతి వైద్య విభాగంలో ఒకప్పు డు దృశ్యం ఇది. నిత్యం పెద్ద సంఖ్యలో గర్భిణులు ప్రసవం కోసం రావడంతో, ఉన్న పడకల సంఖ్య చాలకపోవడంతో వైద్యులు ఇలా సర్దుబాటు చేసేవారు.

ఇది పలు సందర్భాల్లో మీడియాలో వార్తలు వెలువడంతో ఎన్నారై వైద్యులు స్పందిం చారు. స్నేహ హస్తం అందించారు. జింకానా వైద్యులు సమకూర్చిన రూ.వంద కోట్ల భారీ వితరణతో.. అత్యాధునిక రీతిలో స్టేట్ ఆఫ్ ఆర్ట్ సౌకర్యాలతో జీజీహెచ్‌లో కానూరి రామ చంద్రరావు జింకానా తల్లీ పిల్లల ఆరోగ్యకేంద్రం రూపుదాల్చింది. సీఎం చంద్రబాబు శుక్ర వారం ఈ విభాగాన్ని ప్రారంభించడంతో ఇకపై ఈ ఆధునిక వైద్యవిభాగం రోగులకు అందుబాట్లోకి రానుంది. 300 పడకల సామర్థం కలిగి ఉండటంతో గర్భిణులకు ఇబ్బం దులు తప్పనున్నాయి. 9 లామినార్ ఫ్లో ఆపరేషన్ థియేటర్లు అందుబాట్లో ఉన్నాయి. ఫలితంగా గర్భిణులకు సుఖప్రసవం జరగడంతో పాటు ప్రసవం అనంతరం సౌకర్యవం తంగా విశ్రాంతి తీసుకొనే అవకాశం లభిస్తుంది. ఈ భవనంలో కంగారు మదర్ ట్రీట్ మెంట్ సెంటర్, మదర్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటుకు కూడా సౌకర్యాలు ఉన్నాయి.

పటిష్టమైన పోలీసు బందోబస్తు

తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం ప్రారంభోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే ప్రభుత్వాస్పత్రి పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. వాహనాలను అనుమతించ లేదు. ఇక సభ జరిగే తల్లీ పిల్లల ఆరోగ్యకేంద్రం ఐదో అంత స్తులోని కాన్ఫరెన్స్ హాల్‌కు పాసులు ఉన్న వారిని మాత్రమే అనుమతించారు. మీడియా ప్రతినిధుల కోసం శుశ్రుతహాల్‌లో భారీ స్క్రీన్ అమర్చి వారు అక్కడే కూర్చునేలా ఏర్పాట్లు చేశారు. సభావేదికపై కూడా మంత్రులు, స్థానిక ఎమ్మెల్యే, జింకానా ప్రతినిధులు వంటి ఎనిమిది మందికి మాత్రమే స్థానం కల్పించారు. డీఎంఈ డాక్టర్ రఘునందన్, సూప రింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి, జీఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారీ సైతం సభికుల స్థానంలోనే కూర్చున్నారు. పలు చోట్ల మెటల్ డిటెక్టర్‌లు ఏర్పాటు చేసి తనిఖీలు చేశారు. ఉదయం 10.50 గంటలకు జీజీహెచ్‌కు చేరుకోవాల్సిన సీఎం చంద్రబాబు గంట కు పైగా ఆలస్యంగా మధ్యాహ్నం 12.15 గంటలకు ఆసుపత్రికి చేరుకున్నారు. అనంతరం సభా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈ భవనం నిర్మాణం జరిగిన తీరును, జింకానా సభ్యులు చేపడుతున్న సేవా కార్యక్రమాలపై ఆరు నిమిషాలు నిడివి ఉన్న లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ప్రదర్శన అనంతరం చంద్రబాబు ఎన్నారై వైద్యులను అభినందించారు. భవిష్యత్తులో కూడా జింకానా సభ్యులు విజ్ఞప్తులు, ప్రతిపాదలనకు ప్రభుత్వం తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఎన్నారై వైద్యుల కోర్కె లను వెంటనే పరిష్కరించాలని వేదికపై ఉన్న ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్‌గౌర్‌ను సీఎం ఆదేశించడం విశేషం.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మైనార్టీ మోర్చ అధ్యక్షుడు షేక్ సయ్యద్‌బాషా

మైనార్టీ మోర్చా నూతన కమిటీ ఏర్పాటు

గుంటూరు సిటీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : భారతీయ జనతా పార్టీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షతన, మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షులు షేక్ సాంబశివరావు ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. శుక్రవారం గుంటూరులో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాషా పాల్గొని మాట్లాడుతూ మైనార్టీ మోర్చా పార్టీకి కీలకమని, మైనార్టీలకు కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా విశేష లబ్ధి చేకూరుతోందన్నారు. నూతన కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు దేసు సత్యనారాయణ, బజరంగ్ రామకృష్ణ, తోట శ్రీనివాసరావు, రాష్ట్ర కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, రాష్ట్ర ఓబీసీ మోర్చా కార్యదర్శి కుమార్ గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

విశ్లేషణాత్మక నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

● శ్రీ చైతన్య ఏజీఎం డాక్టర్ నూతలపాటి

గుంటూరు(విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచి విశ్లేషణాత్మక నైపుణ్యాలను పెంపొందించుకోవాలని శ్రీ చైతన్య ఏజీఎం డాక్టర్ నూతలపాటి అంజయ్య విజ్ఞప్తి చేశారు. క్యాట్ లెవల్-2 పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. పరీక్షలో మొత్తం 121మంది విద్యార్థులు ప్రతిభ చూపినట్లు తెలిపారు. ఇందులో 23 మంది విద్యార్థులు రూ.31వేలు నగదు బహుమతి సాధించినట్లు వెల్లడించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ శివప్రసాద్, అకాడమీ సమన్వయకర్త సచ్చిదానంద మూర్తి, డీన్ నరసింహారావు, వేణుమాధవ్, ఏవో రామారావు తదితరులు అభినందించారు.

విశ్వబ్రాహ్మణులు అన్ని రంగాల్లో రాణించాలి

● రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పార్వతి

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విశ్వబ్రాహ్మణులు సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ప్రగతి సాధించాలని ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొ రేషన్ చైర్మన్ కుమ్మర పార్వతి ఆకాంక్షించారు. స్థానిక రింగురోడ్డు సాయిబాబా రోడ్డులో సంఘ కార్యాలయంలో శుక్రవారం నగర విశ్వబ్రాహ్మణ సమాజ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన పార్వతి మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సామాజిక ఆర్థిక ప్రగతికి విద్య బలమైన ఆయుధమన్నారు. కుటుంబాలు తమ పిల్లలను విద్యావంతులు చేసేందుకు కూటమి ప్రభు త్వం అన్ని విధాల సహకరిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమంలో సంఘ నగ ర అధ్యక్షుడు కడియాల సుబ్బారావు, వై ధర్మారావు, గట్టి శ్రీనివాసరావు, చిరంజీవి ఆచారి, మేడపి వెంకటప్రసాదు, బ్రహ్మముడి కోటేశ్వరరావు, సిద్ధి సాంబశివరావు, మేడూరి మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



కుమ్మర పార్వతిను మర్యాదపూర్వకంగా కలిసిన విశ్వబ్రాహ్మణ సంఘు నాయకులు

వైభవంగా గౌరి విశ్వేశ్వర స్వామి కల్యాణం

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక బ్రాడీపేట, శ్రీ గౌరీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామి జన్మనక్షత్రం సందర్భంగా కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు, పట్టు వస్త్రాలతో ఆలంకరణలు నిర్వహించి, అనంతరం దంపతులచే అర్చకుడు విశ్వేశ్వర శర్మ కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు జంధ్యాల సుబ్ర హ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్ శర్మ, మల్లికార్జున శర్మలు పర్యవేక్షించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిలను వెంటనే చెల్లించాలి

● తాలుకా కేంద్రాల వద్ద ఎస్టీయూ ఆందోళన

గుంటూరు(విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన పెండింగ్ బకాయిలు, 4 డీఏల మంజూరులో జాప్యాన్ని నిరసిస్తూ ఎస్టీయూ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాలోని తాలుకా కేంద్రాల వద్ద ఆందోళన నిర్వహించారు. కూటమి ప్రభు త్వం ఏర్పడి 30 నెలలు గడుస్తున్నా పీఆర్‌సీ కమిటీని ఏర్పాటు చేయకపోవడం, మధ్యంత ర భృతి చెల్లింపునకు ఉత్తర్వులు ఇవ్వకపోవడం, సీపీఎస్ రద్దు చేయకపోవడంపై ఎస్టీయూ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో దశలవారీ ఆందోళనల్లో భాగంగా శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు చేసి తహసీల్దార్ కేంద్రాల్లో వినితిపత్రాలు అందజేశామని నాయకులు వెల్లడించారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు డి.పెదబాబు, ఎస్టీయూ అధ్యక్షుడు షేక్ బాజీ, ప్రధాన కార్యదర్శి వై.శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

తల్లిదండ్రులిద్దరిని కోల్పోయిన చిన్నారులకు పింఛన్!

● జీవో ఎంఎస్. నెం.16ను జారీ చేసిన ప్రభుత్వం

● సీఆర్డీఏ కమిషనర్‌కు అధికారాన్ని కల్పించిన పురపాలక శాఖ

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో భూసమీక రణ పథకం (ఎల్‌పీఎస్) అమల్లో ఉన్న 29 గ్రామాల్లో తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన చిన్నారులకు పింఛన్లు అందించేందుకు వీలుగా ప్రభుత్వం శుక్రవారం జీవో జారీ చేసింది. జనవరి 6వ తేదీన జరిగిన 57వ సీఆర్డీఏ అథారిటీ సమావేశంలో ఈ అంశం చర్చకు రాగా రాజధాని అమరావతి ప్రాంతంలోని భూమిలేని కుటుంబాలకు సామాజిక భద్రత చర్యగా ఇచ్చే రూ. 5,000 పింఛన్‌ను తల్లిదండ్రులను కోల్పోయి, ఏ ఆసరా లేని చిన్నారులకు కూడా ఇవ్వాలని నిర్ణయించారు. ఆ నిర్ణయం మేరకు శుక్రవారం రాష్ట్ర పురపాలక శాఖ జీవో ఎంఎస్ నెం.16ను విడుదల చేశారు. తల్లిదండ్రులిద్దరినీ కోల్పోయిన చిన్నారులకు ఇక నుంచి ప్రతి నెలా రూ.5వేలు పింఛన్ అందించే అధికారాన్ని సీఆర్డీఏ కమిషనర్‌కు కల్పిస్తున్నట్లు జీవోలో పేర్కొన్నారు. కాగా తల్లిదండ్రులు ఇద్దరూ మృతి చెందిన 7 కుటుంబాలకు ఇక నుంచి ఈ పింఛన్ అందనుంది.

జీవశక్తికి మూల కారణం చంద్రుడే

● డాక్టర్ గరికపాటి నరసింహారావు



ప్రవచనం చేస్తున్న డాక్టర్ గరికపాటి

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): సమస్త జీవరాసులకు జీవశక్తి ఇచ్చేది చంద్రుడేనని మహాసహస్రావధాని, ఆధ్యాత్మిక ప్రవచనకర్త డాక్టర్ గరికపాటి నరసింహారావు అన్నారు. స్థానిక పట్టాభిపురం శ్రీసత్యనారాయణస్వామి ఆలయ 49వ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాల్మీకి మహర్షి రచించిన యోగవాశిష్టంపై మూడో రోజు శుక్రవారం ఆధ్యాత్మిక ప్రవచనం జరి గింది. డాక్టర్ గరికపాటి నరసింహారావు ప్రవచనం చేస్తూ పౌర్ణమి రోజు చంద్రకిరణాలు బాగా ఉండటం వల్ల సమస్త జీవరాసులకు శుభం కలుగుతాయని అన్నారు. అదే అమావాస్య రోజు, చంద్రగ్రహణం రోజు చంద్ర కిరణాలు సరిగా లేకపోవడం వల్ల అనేక ఇబ్బందులు కలుగుతాయని అందుకే పెద్దలు ఎటువంటి కార్యక్రమాలు చేయవద్దని తెలియజేసే వారని అన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

శ్రీరమా సత్యనారాయణ స్వామి దేవస్థాన 49వ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్వామికి విష్వక్సేన పూజ, విశేషస్నపన, స్వామిని పెండ్లి కుమారుడిగా అలంకరణ, ధ్వజారోహణ, అగ్ని ప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజే శారు. ఉత్సవాలను ఆలయ కమిటీ సభ్యులు చావలి గణపతి, రావిపాటి సత్య నారాయణ పర్యవేక్షించారు.

విద్యార్థులు ఆంగ్ల నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

● ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోత్స్నకుమారి

గుంటూరు(విద్య), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కళాశాల స్థాయిలోనే ఆంగ్ల భాష నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వీఆర్ జ్యోత్స్నకుమారి సూచించారు శుక్రవారం కళాశాలలో వర్క్ ప్లేస్‌లో సెల్ఫ్ ఇంట్రాక్షన్ అనే అంశంపై నిర్వహించిన ఆంగ్ల భాష సదస్సులో ఆమె మాట్లాడారు. ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఆంగ్ల భాషకు పెరుగుతున్న డిమాండ్ నేపథ్యంలో విద్యార్థులు ఆంగ్ల భాష భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. రాష్ట్రంలోని పలు డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపాధ్యాయులు సదస్సులో పాల్గొని విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు.



సదస్సులో పాల్గొన్న విద్యార్థినులు

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి బ్రహ్మోత్సవాలు


గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇన్నర్‌రింగ్ రోడ్డు రెడ్డిపాలెంలో ఉన్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు శుక్రవారం గణపతిపూజతో పాటు అఖండ దీపారాదన, విశేష సంకల్ప మండప కలశ ఆరాధన, విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శనివారం సాయంత్రం స్వామి వార్ల కల్యాణ మూర్తుల గ్రామోత్సవం వైభవంగా జరుతుంది. తొలి రోజు పూజలో శ్రీలక్ష్మీ తిరుపతమ్మ స్పిరిచ్చువల్, సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు గాదె సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి కోనూరు సతీష్‌శర్మ, గౌరవాధ్యక్షుడు ఈదా సాంబిరెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నల్లచెరువు, 5వ లైనులో కొలువైన కొదండ రామాలయంలో భీష్మ ఏకాదశి సందర్భంగా స్వర రాగ సుధా ఆధ్వర్యంలో జరిగిన భక్తి సంగీత విభావరి ఆకట్టుకుంది. గాయకులు కేవీ సాయిబాబా బృందం పలు భక్తి గీతాలు శ్రావ్యంగా ఆలపించారు. కీ బోర్డుపై శ్రీనివాసశర్మ, తబలాపై షణ్ముఖశర్మ వాయిద్య సహకారం అందించారు అనంతరం కళాకారులను ఆలయ కమిటీసభ్యులు సత్కరించారు.

స్వీట్ షాపు వ్యాపారి ఇంట్లో చోరీ

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అరండల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని కాకుమానువారితోట 8వ లైనుకు చెందిన నల్లమల్లి సాయి పవన్ కుమార్(30) అనే స్వీట్ షాపు వ్యాపారి ఇంట్లో చోరీ జరిగింది. గురువారం రాత్రి సుమారు 11 గంటలకు ఇంట్లో వారందరూ నిద్రపోయారు. ఉదయం నిద్రలేచి చూడగా, వారి ఇంటి తలుపులు, పడక గదిలోని టేబుల్ పక్కకు పడి ఉన్నాయి. బంగారు ఆభరణాలు కనిపించలేదు. సుమారు 134 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒక శాంసంగ్ మొబైల్ ఫోన్, నగదు రూ. 25 వేలు మొత్తం రూ.ఏడు లక్షలకు పైగా విలువైన చేస్తుందని చెప్పారు. కొంతమంది గుర్తు తెలియని నేరస్థులు ఆస్తిని దొంగిలించి పారిపోయారు. ఫిర్యాదు అందిన తర్వాత, అరండల్‌పేట సీఐ కె.ఆరోగ్య రాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.







గుంటూరులోని గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ కానూరి జింఖానా తల్లీ పిల్లల ఆసుపత్రి భవనం ప్రారంభోత్సవానికి శుక్రవారం గుంటూరు వచ్చిన సీఎం చంద్రబాబునాయుడుకు హెలీప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మేయర్ కోవెలమూడి రవీంద్ర, ఎమ్మెల్యేలు, మహమ్మద్ నసీర్ (తూర్పు), గళ్ళా మాధవి (పశ్చిమ), టీడీపీ జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు



చంద్రబాబుతో పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర



ఏపీఐడీసీ చైర్మన్ దేగల ప్రభాకర్




చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా




కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, కనపర్తి శ్రీనివాసరావు



చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఎస్పీ వకుల్ జిందాల్



కమిషనర్ కె.మయూర్ అశోక్



జనసేన నేత గాదె వెంకటేశ్వరరావు



దక్షిణ మధ్య రైల్వే జీఎం చేతుల మీదగా అవార్డు అందుకొంటున్న డీఆర్ఎం సుధేష్ణ సేన్

గుంటూరు రైల్వే డివిజన్‌కు అవార్డుల పంట

● ఆరు కేటగిరీల్లో షీల్డ్‌లు అందుకొన్న డీఆర్ఎం

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రైల్వే 70వ వారోత్సవంలో గుంటూరు డివిజన్‌కు వివిధ కేటగిరీల్లో ఆరు షీల్డ్‌లు దక్కాయి. శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్ క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైల్ కళారంగ్‌లో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్ సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ చేతుల మీదగా డివిజనల్ రైల్వే మేనేజర్ సుధేష్ణ సేన్ షీల్డ్‌లను అందుకొన్నారు. ఉత్తమ పరిశుభ్రత, తుక్కుని డిస్పోజ్ చేయడం, యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్, సేఫ్టీ, మెడికల్ వ్యాన్, ట్రాక్ మెషిన్ వినియోగంలో ఈ అవార్డులు దక్కాయి. ఈ కార్యక్రమంలో డీఆర్ఎంతో పాటు వివిధ విభాగాలకు చెందిన సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

తీవ్రమైన పని ఒత్తిడితోనే ఉద్యోగుల మరణాలు

● సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రజాక్



షేక్ అబ్దుల్ రజాక్

గుంటూరు సిటీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు తీవ్రమైన పనిఒత్తిడితో మానసిక వేదనకు గురవుతున్నారని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రజాక్ ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ.. గడిచిన నెల రోజుల వ్యవధిలో స్వర్ణ గ్రామం వార్డు పరిధిలోనే సుమారు 15 మందికి పైగా ఉద్యోగులు మృతి చెందినట్లు తెలిపారు. ఈ మరణాలకు ప్రధాన కారణం అధికారులు విధిస్తున్న అతి పని భారం, లక్ష్యాల ఒత్తిడేనని పేర్కొన్నారు. శాస్త్రీయతలేని అనేక సర్వేలను పూర్తి చేయాలంటూ ఉద్యోగులపై నిరంతరం ఒత్తిడి తెస్తున్నారని, ముఖ్యంగా బూత్ లెవల్ అధికారులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. సెలవు దినాల్లో కూడా విశ్రాంతి ఇవ్వకుండా పనులు చేయిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే ఈ అనవసర సర్వేలను నిలిపివేయాలని, ఉద్యోగులపై పనిభారం తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పనిఒత్తిడితో మరణించిన ఉద్యోగుల కుటుంబాలకు తక్షణమే కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

పట్టుదలకు గ్రూప్-1 సలాం



షేక్ ఇసుబ్ సలాం

నరసరావుపేట రూరల్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఇసుబ్ సలాం గ్రూప్-1కు ఎంపికై ప్రతిభ చాటారు. ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఆయన ఆంధ్రప్రదేశ్ రవాణా శాఖలో ప్రాంతీయ రవాణా అధికారి (ఆర్‌టీఓ)గా ఎంపికయ్యారు. షేక్ ఇసుబ్ సలాం తండ్రి షేక్ సుభానీ కార్పెంటర్, తల్లి గృహిణి. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఆయన ఎంటెక్ పూర్తి చేశారు. యూపీఎస్సీ, గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమయ్యారు. 2023లో నిర్వహించిన గ్రూప్-1 మెయిన్స్‌లో విజయం సాధించారు. గ్రామస్థులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఆయనకు అభినందనలు తెలిపారు.

గంజాయి ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్ధనరావు

తెనాలి క్రైం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : తెనాలి రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెదరావూరులో 8 మంది గంజాయి ముఠాను అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ జనార్ధనరావు తెలిపారు. శుక్రవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలు వెల్లడించారు. ముందస్తు సమాచారంతో శుక్రవారం మధ్యాహ్నం పెదరావూరు చినమాలపల్లి వద్ద గల ఎన్టీఆర్ కాలనీ ప్రాంతంలో పోలీసులు ఆకస్మికంగా తనిఖీ చేసి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని, 1,600 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో ముగ్గురు విద్యార్థులు ఉన్నారని తెలిపారు. పట్టుబడిన వారిలో స్టూవర్టుపురం వెదుళ్లపల్లికి చెందిన వల్లాసి విజయ్ (42) పెద్ద మొత్తంలో గంజాయి తెచ్చి తెనాలి ప్రాంతానికి చెందిన యువకులతో అమ్మకాలు సాగిస్తున్నాడని వెల్లడించారు. వీరిలో నాజరుపేట రామాలయం రోడ్డుకి చెందిన వడ్లమూడి గోపి కిరణ్, జగ్గడిగుంటపాలెం వైఎస్ఆర్ కాలనీకి చెందిన దేవరకొండ మనుశివశంకర్ (22), నందులపేటకు చెందిన దేవిశెట్టి బసవేశ్వరరావు(24) మారీసుపేటకు చెందిన షేక్ జాకీర్ హుస్సేన్(30) ఉండగా.. గంజాయి సేవిస్తున్న ముగ్గురు విద్యార్థులు చెంచుపేట, నందులపేట మొక్కల సుబ్బారావు వీధి, మారీసుపేట రెండు గేట్ల వద్ద నివాసితులని పేర్కొన్నారు. రూరల్ సీఐ షేక్ నాయబ్ రసూల్, ఎస్ఐ కె.ఆనంద్ పాల్గొన్నారు.

ముమ్మరంగా హైకోర్టు నిర్మాణ పనులు

● పూర్తయిన రాఫ్ట్ ఫౌండేషన్ నిర్మాణం

● శరవేగంగా పోర్ 2, 3 పనులు



పోర్ల నిర్మాణంలో భాగంగా కాంక్రీట్ మిక్స్‌ను నింపుతున్న యంత్రాలు

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో ఐకానిక్ హైకోర్టు నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిగిలిన నిర్మాణాలతో పోల్చినప్పుడు హైకోర్టు పనులు ఒకింత ఆలస్యం అయినప్పటికీ, ప్రస్తుత పరిస్థితి మెరుగ్గానే ఉంది. హైకోర్టు నిర్మాణంలో భాగంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఒక రాఫ్ట్ ఫౌండేషన్‌ను, ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రెండో రాఫ్ట్ ఫౌండేషన్‌ను నిర్మించారు. డిసెంబరు 25న మంత్రి నారాయణ రెండో రాఫ్ట్ ఫౌండేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం 48 గంటలపాటు నిర్విరామంగా కాంక్రీట్ వర్క్ చేసి రికార్డు వేగంతో పనులు పూర్తి చేశారు. భారీస్థాయిలో నిర్మిస్తున్న ఐకానిక్ హైకోర్టులో ఒక్కోటీ 48 మీటర్ల పొడవు, 46 మీటర్ల వెడల్పు చొప్పున మొత్తం 16 పోర్‌లు ఉంటాయి. వీటిపైనే మొత్తం హైకోర్టు నిర్మాణం ఉంటుంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 3 పోర్లు నిర్మించారు. అత్యంత కీలకమైన మిగిలిన పోర్‌ల నిర్మాణం ప్రస్తుతం జరుగుతోంది. గతనెలలో పోర్ నం.13 పూర్తిచేశారు. ప్రస్తుత నిర్మాణ సంస్థ దీన్ని పోర్ నం.1గా పరిగణిస్తోంది. ఆ సంస్థ తాజాగా పెట్టుకున్న నంబర్ల ప్రకారం పోర్ నం.2, 3 పనులు జరుగుతున్నాయి. 2వ పోర్‌లో 600 టన్నుల స్టీలు, 3,026 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్‌ను వినియోగించారు. ఇప్పటికి ఐదు పోర్లు పూర్తవగా, మిగిలిన వాటికి సంబంధించి రాడ్ బెండింగ్ పనులు జరుగుతున్నాయి.

మోదీ మౌనం.. దేశానికి ప్రమాదం

● ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆశోక్ ధావలే



ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో ప్రసంగిస్తున్న డాక్టర్ ఆశోక్ ధావలే, వేదికపై వడ్డే శోభనాద్రీశ్వరరావు తదితరులు

గుంటూరు(తూర్పు), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అమెరికా సుంకాలపై ప్రధాని మోదీ మౌనం.. దేశ భవిత ప్రమాదంలోకి నెట్టివేసిందని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆశోక్ ధావలే అన్నారు. గుంటూరులో జరుగుతున్న ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ రెండో రోజు సమావేశాల్లో అమెరికా సుంకాలు - భారత వ్యవసాయంపై ప్రభావం - ఎన్డీఏ వైఖరి అనే అంశంపై ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రసంగించారు. అమెరికా 150 శాతం సుంకాలు విధిస్తే, ఆ దేశం ఉత్పత్తులపై ఆ స్థాయిలో సుంకాలు విధించి చైనా ధీటుగా బదులిచ్చిందన్నారు. ఈ దెబ్బకి అమెరికా దిగి వచ్చి ఆ సుంకాలను రద్దు చేసుకుందన్నారు. భారత్‌పై 50 శాతం సుంకాలు విధిస్తే నేటి వరకు మోదీ నుంచి సరైన సమాధానం లేదన్నారు. దీంతో నరేందర్ మీన్స్ సరెండర్ అంటూ ప్రపంచ దేశాలు ఎగతాళిగా మాట్లాడుతున్నాయని ఎద్దేవా చేశారు. బ్రిటీష్ రాజ్యానికి మోకరిల్లిన ఆర్ఎస్ఎస్ లక్షణాలు మోదీలో పూర్తిగా కనిపిస్తున్నాయన్నారు. నూతనంగా కుదుర్చుకున్న యూరోపియన్ ఒప్పందాలతో దేశంలో రవాణా, ఇతర రంగాలు నిర్వీర్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. దీనికి తోడు ఫిబ్రవరి 15న అమెరికాతో చేసుకునే ఒప్పందంతో దేశంలో దాదాపు 8 నుంచి 9 కోట్ల మంది పాల రైతులు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మరో వైపు పత్తి బేళ్ల దిగుమతి చేసుకోవడంతో రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఫిబ్రవరి 12న జరిగే సార్వత్రిక సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని కార్మికుల సత్తా మోదీకి తెలపాలని పిలుపునిచ్చారు. ఎస్కేఎం రాష్ట్ర కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కారుచౌకగా భూములను పారిశ్రామిక వేత్తలకు అప్పజెప్పడం సరైన విధానం కాదన్నారు. చట్టాలను ధిక్కరించి మరి అమలు చేస్తే అధికారం తొలిగిపోగానే జైలుకు వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు.

రైతు కూలీ సంఘం అఖిల భారత అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ మాట్లాడుతూ ప్రజల భూములను పంచడంతో వ్యవసాయ రంగంలో కీలకంగా వ్యవహరిస్తున్న మహిళా కూలీలపై ప్రభావం ఎక్కువగా పడుతోందన్నారు.

● ఉత్సాహంగా సాంస్కృతిక కార్యక్రమాలు

ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్యాలతో అలరించారు. ప్రొఫెసర్ ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు నెమలి, కథక్ నృత్యాలు, జానపద, దేశభక్తి గేయాలకు నృత్యాలు అలరించారు. పెదనందిపాడు లయన్స్ మాంటిసోరి పాఠశాల విద్యార్థులు జానపద నృత్యాలను ప్రదర్శించారు. అనంతరం హైదరాబాదుకు చెందిన అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ కళాకారులు ప్రదర్శించిన అంబేడ్కర్ జీవితం పై నాటిక విశేషంగా ఆకట్టుకుంది.



ఏఐకేఎస్ జాతీయ కౌన్సిల్ సమావేశాల సందర్భంగా విద్యార్థులు ప్రదర్శిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రభుత్వ వ్యూహం.. రైతుకు లాభం!

● ఖరీఫ్ ధాన్యం సేకరణలో రెండంచెల ప్రణాళిక

● భారీగా లక్ష్యాలు.. ఆచరణలోనూ అదే వేగం

● మార్చి చివరి వరకు కేంద్రాలు ఉండేలా ఆదేశాలు

● మద్దతు ధరకన్నా.. బహిరంగ మార్కెట్లో పెరిగిన ధర

● చెన్నై నుంచి కూడా వ్యాపారుల రాక



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణ ప్రారంభం కావడం. ప్రభుత్వాలు అరకొరగా లక్ష్యాలు పెట్టుకుని మద్దతు ధర కొనుగోళ్లు మమ అనిపించడం. రైతుల దగ్గర ధాన్యం నిల్వలు అలానే ఉండగా.. కొనుగోలు కేంద్రాలు మూతపడడం.. ఈ సమయం కోసమే వేచి చూసే దళారులు.. అప్పుడే రంగ ప్రవేశం చేసి తాము చెప్పిందే ధరగా అన్నదాతలను నిలువునా వంచించి తమ పబ్బం గడుపుకోవడం.. ఇదీ ఆరేడేళ్లుగా ధాన్యం సేకరణలో జరుగుతున్న తంతు. కానీ, కూటమి ప్రభుత్వం సిండికేట్ చట్రంలో అన్నదాతలు చిక్కుకోకుండా అనుసరించిన రెండంచల వ్యూహం ఫలించింది. బయటి మార్కెట్‌లో ప్రభుత్వ మద్దతు ధరకన్నా.. ధాన్యం ధర రూ.200లు పెరిగింది.

ధాన్యం సేకరణలో గతానుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం దీర్ఘకాలిక లక్ష్యంతో పక్కా ప్రణాళికతో అడుగులేసింది. సీజన్ ఆరంభంలోనే కొనుగోళ్ల లక్ష్యాలను గతం కన్నా రెట్టింపు చేసింది. బాపట్ల జిల్లాలో ఏకంగా మూడు రెట్ల సేకరణ చేస్తున్నట్లు ఘనంగా ప్రకటించింది. నగదు జమలో కూడా అన్నదాతల అభిమానాన్ని చూరగొంది. మార్చి చివరి వరకు కొనుగోలు కేంద్రాలు తెరిచే ఉంచుతామని, అవసరమైతే సేకరణ లక్ష్యాలు పెంచుతామనే సంకేతాలను కూడా రైతులకు పంపింది. ఇవన్నీ కూడా ప్రభుత్వం వ్యూహాత్మకంగా చేసినవే. దీంతో అధిక సంఖ్యలో రైతులు కొనుగోలు కేంద్రాల బాటపట్టగా.. బయట వ్యాపారుల సిండికేట్ పబ్బాలు సాగలేదు. ఇంకా రైతుల వద్ద లక్షల టన్నుల ధాన్యం ఉండడంతో దళారులు వాటిని వీలైనంత తక్కువ ధరకు తన్నుకుపోవడానికి ఎదురుచూస్తున్నారు. గతంలో కేంద్రాలను ఫిబ్రవరి మొదటి వారానికే ముగింపు పలకడంతో.. ఈ దఫా కూడా అలానే జరుగుతుందని సిండికేట్ వర్గాలు ఆశలు పెట్టుకున్నాయి. వీళ్ల వ్యూహాన్ని ముందే పసిగట్టిన ప్రభుత్వం మార్చి నెలాఖరు వరకు కేంద్రాలు తెరిచే ఉంచుతామని, అన్నదాతలెవరూ బయటి మార్కెట్‌లో ధాన్యం అమ్ముకుని నష్టపోవద్దని పిలుపిచ్చింది. దీంతో దళారులు సైతం బయటి మార్కెట్‌లో ధర పెంచక తప్పని పరిస్థితి ఏర్పడింది.

తమిళనాడు వ్యాపారుల రాకతో పెరిగిన ధర

ధాన్యం కొనడానికి తమిళనాడు వ్యాపారులు కూడా ఇక్కడకు వస్తున్నారు. దీంతో ఎకాఎకిన మద్దతు ధరకన్నా బయటి మార్కెట్‌లో రూ.200 వరకు అధికంగా ధర పలికే పరిస్థితి ఏర్పడింది. దిగుబడి మొత్తాన్ని ప్రభుత్వాలు మద్దతు ధరకు కొనడం ప్రాక్టికల్‌గా జరిగే పని కాదు. దీనిని దృష్టిలో ఉంచుకునే ఈసారి రెండంచెల వ్యూహంతో ప్రభుత్వం అడుగులేసింది. ముందుగా ధాన్యం సేకరణలో భారీ లక్ష్యాలు నిర్దేశించి దళారులకు ఓ సంకేతం పంపగా.. కేంద్రాలు ఇప్పట్లో మూసివేయడం జరగదని స్పష్టంగా తేల్చి చెప్పింది. గతంలో కూడా.. బయటి మార్కెట్‌లో ధర ఎంతోకొంత స్థిరంగా ఉండి, అన్నదాతలకు మేలు జరగాలంటే ప్రభుత్వ కేంద్రాలను తెరిచే ఉంచాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తూ వచ్చాయి. కానీ, గత వైసీపీ ప్రభుత్వంలో కేంద్రాలు తెరిచి ఉంచడం సంగతి దేవుడెరుగు, సేకరణే ఏ సీజన్‌లోనూ మూడు జిల్లాలు కలిపి 60 వేల టన్నులకు మించని పరిస్థితి. కానీ, కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గడచిన సీజన్‌లో తలెత్తిన లోటుపాట్లపై దృష్టిపెట్టి.. పక్కాగా అడుగులేయడంతో వాటి ఫలితాలు ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ధర రూపంలో అన్నదాతలకు కనిపిస్తున్నాయి.

లక్ష్యాలు ఇలా...

బాపట్ల జిల్లాలో రెండు లక్షల టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం పెట్టుకోగా, గుంటూరు జిల్లాలో లక్ష, పల్నాడు జిల్లాలో 45వేల టన్నుల ధాన్యం మద్దతు ధరకు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. గత ఆరేళ్ల ఖరీఫ్ ధాన్యం సేకరణ లక్ష్యాలను పరిశీలిస్తే ఇవే అత్యధిక గణాంకాలు. ఈ లక్ష్యాలను చేరుకునే దిశగా యంత్రాంగం వడివడిగా అడుగులేస్తుండగా, బయటి మార్కెట్‌ధర అమాంతంగా పెరగడంతో కొనుగోళ్లు మందగించాయి. బస్తాధాన్యం మద్దతు ధర ఏ గ్రేడు రకానికి రూ.1,792ఉండగా, సాధారణరకానికి రూ.1,777గా ఉంది. బయటి మార్కెట్‌లో రూ.200వరకు ధర అధికంగా పలుకుతుండడంతో కొనుగోలు కేంద్రాల్లో గడచిన పది రోజులుగా సేకరణనామమాత్రంగా ఉంటోంది.

ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా..

కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యం ఓ దశలో భారీగా ఉండడంతో ఇక్కడ మిల్లు కెపాసిటీ సరిపోకపోవడంతో, కాకినాడకు కూడా ధాన్యాన్ని షెడ్యూలింగ్ ఇచ్చి తరలించారు. ఇదే సమయంలో తమిళనాట ధాన్యానికి డిమాండ్ పెరగడంతో అక్కడ వ్యాపారులంతా మన వైపుచూడడం కూడా ఇక్కడి రైతాంగానికి కలిసొచ్చింది.

రూ.17 లక్షల గుట్కా స్వాధీనం

● వరగానిలో విజిలెన్స్, జీఎస్టీ అధికారుల దాడి

పెదనందిపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గుట్కా మాఫియా చీకటి దందాకు అధికారులు కళ్లెం వేశారు. ఎంతో కాలంగా గుట్టుచప్పుడు కాకుండా జరుగుతున్న గుట్కా చీకటి వ్యాపారానికి పెదనందిపాడు మండలం వరగాని గ్రామం అడ్డాగా మారింది. ఇక్కడి నుంచి నిత్యం బడ్డీ కొట్లకు ప్రత్తిపాడు నియోజకవర్గంతోపాటు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని పలు ప్రాంతాలకు పెద్ద ఎత్తున సరఫరా చేస్తుంటారు. ఎంతో కాలంగా జరుగుతున్న ఈ అక్రమ గుట్కా వ్యాపారానికి ఆంధ్రజ్యోతి ప్రధాన సంచికలో వచ్చిన కథనం బ్రేకులు వేసింది. అధికారులకు అందిన పక్కా సమాచారం ప్రకారం విజిలెన్స్‌తో పాటు జీఎస్టీ అధికారులు మూకుమ్మడిగా దాడులు నిర్వహించారు. ఈ దాడిలో అధికారులు సైతం విస్తు పోయే విధంగా భారీ గుట్కా నిల్వలు బయటపడ్డాయి. ఇందుకోసం వరగానిలో ఒక గోదామును నిర్వహిస్తున్నారు. ఊరికి చివరన ప్రధాన రహదారి వెంట ఉన్న ఈ గోదాం నుంచి నిత్యం లక్షలాది రూపాయల గుట్కాను పాన్ షాపులకు సరఫరా చేస్తున్నారు. ఈ విషయం స్థానిక అధికారులకు తెలిసినప్పటికీ మామూళ్ల మత్తులో మిన్నకుండిపోయారు. జిల్లాలో పెద్ద ఎత్తున జరుగుతున్న చీకటి దందాలో వరగానికి చెందిన ఎ.సుధాకర్ ప్రధాన పాత్ర పోషిస్తున్నట్లు విజిలెన్స్ అధికారులకు సమాచారం అందింది. ఈ దాడుల్లో రూ. 17 లక్షల విలువైన గుట్కాల నిల్వలను గుర్తించినట్లు విజిలెన్స్ అధికారులు తెలిపారు. అయితే ఈ నిషేధిత గుట్కా ఎక్కడి నుంచి వస్తుంది... ఎవరు సరఫరా చేస్తున్నారు.. అనే విషయాలపై వ్యాపారి సుధాకర్ నుంచి వివరాలు సేకరించే ప్రయత్నం చేస్తున్నారు. విజిలెన్స్ సీఐ కె.చంద్రశేఖరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు.

కొండవీడు ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు

● భద్రతా ఏర్పాట్లపై క్షేత్రస్థాయి పరిశీలనలో ఎస్పీ కృష్ణారావు



ఘాట్ మార్గాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు

యడ్లపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 7, 8 తేదీల్లో నిర్వహించనున్న కొండవీడు ఉత్సవాలకు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్పీ కృష్ణారావు తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం ఎస్పీ క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కొండలపై చారిత్రక కట్టడాలు, చెరువులు, కొండ దిగువన ఏర్పాటు చేయనున్న వేదిక, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్ ప్రదేశాలతోపాటు సందర్శకుల రాకపోకలకు ఉపయోగించే మార్గాలను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. సందర్శకుల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని, ప్రధానంగా ఘాట్ మార్గంలో ట్రాఫిక్ స్తంభించకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లోతైన చెరువులు, ప్రమాదకరమైన కొండ ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి అటువైపు వెళ్లకుండా నిఘా ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, వృద్ధులు, పిల్లల రక్షణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఉత్సవాల వేదిక, పరిసర ప్రాంతాలను నిరంతరం డ్రోన్ కెమేరాలతో పర్యవేక్షించాలని తెలిపారు. రెవెన్యూ, అటవీ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉత్సవాలు విజయవంతమయ్యేలా చూడాలన్నారు. ఉత్సవాలకు వచ్చే ప్రతి సందర్శకుడికి రక్షణ కల్పించడమే తమ ప్రాధాన్యమన్నారు. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల నుంచి సందర్శకులు అధికసంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ సుబ్బనాయుడు, ఎస్ఐ శివరామకృష్ణ తదితరులు ఉన్నారు.

మాజీ మంత్రి విడదల రజినికి నిరసన సెగ

● బోయపాలెంలో హై టెన్షన్

● వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య తోపులాట

● గో బ్యాక్ రజిని అంటూ టీడీపీ శ్రేణుల నినాదాలు

మాజీ మంత్రి కారును చుట్టుముట్టి గో బ్యాక్ రజిని, డౌన్ డౌన్ రజిని అంటూ నినాదాలు చేస్తున్న టీడీపీ శ్రేణులు



యడ్లపాడు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా యడ్లపాడు మండలం బోయపాలెం జాతీయరహదారి పక్కనే గల శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద శుక్రవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. తిరుమల లడ్డూ వ్యవహారంపై రాజకీయ పోరు కాస్తా నిరసనలకు దారి తీసింది. తిరుమల లడ్డూపై టీడీపీ ప్రచారాన్ని తిప్పికొట్టేందుకు శుక్రవారం చిలకలూరిపేట ఆర్యవైశ్య కల్యాణ మండపంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రెస్ మీట్ ఉన్నట్లు మాజీ మంత్రి విడదల రజిని ఆ పార్టీ ప్రతినిధులు తొలుత పట్టణంలోని విలేకరులకు సమాచారం ఇచ్చారు. అయితే తాళం వేసి ఉండడంతో పసుమర్రు వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రెస్‌మీట్ ఉంటుందని సమాచారం అందించారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్థులు, టీడీపీ నాయకులు ఆలయం వద్దకు చేరుకుని గతంలో మాజీ మంత్రి రజిని చేసిన అక్రమాలపై నిలదీసేందుకు సిద్ధమయ్యారు. స్థానిక వైసీపీ నేతల ద్వారా సమాచారం అందుకున్న ఆమె బోయపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం లో ప్రెస్‌మీట్ పెడుతున్నట్లు ప్రకటించి విలేకరులను అక్కడకు రావాలంటూ ఖర్చులు కూడా ఇస్తానంటూ ప్రలోభ పెట్టారు. చిలకలూరిపేట నుంచి బోయపాలెం ఆలయానికి చేరుకున్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు ఆలయం వద్దకు చేరుకుని ఆమె రాకను నిరసిస్తూ గో బ్యాక్ రజిని, డౌన్ డౌన్ రజిని అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. తప్పు చేసిందే కాకుండా ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో అల్లర్లు సృష్టించేందుకు వచ్చారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పును కప్పి పుచ్చుకునేందుకు దొంగ పూజలు చేసి అసత్య ప్రచారం చేసేందుకు దేవుడి సన్నిధికి వస్తారా అంటూ టీడీపీ శ్రేణులు మండిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు గుడివద్దకు చేరుకుని ఇరువర్గాలకు సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మాజీమంత్రికి లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ వస్తుందని ప్రెస్‌మీట్ నిర్వహించవద్దని కోరారు. దీనితో రజిని పదికి పైగా కొబ్బరికాయలు కొట్టి, పూజలు ముగించుకుని గుడి నుంచి వెలుపలకు వచ్చారు. కారును గ్రామంలోనికి పోనిచ్చేందుకు ప్రయత్నించగా స్థానికులు అడ్డుకున్నారు. గ్రామంలోకి రావడానికి వీలు లేదంటూ సర్వీసు రోడ్డుగుండా తిరిగి వెళ్లిపోవాలంటూ మరోసారి టీడీపీ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. కారును అడ్డగించి ముందుకు కదలనీయకుండా కొద్దిసేపు అడ్డుకున్నారు. దీనితో ఆమె వెంట వచ్చిన వైసీపీ శ్రేణులకు, స్థానిక టీడీపీ శ్రేణులకు మధ్య తోపులాట జరిగి స్వల్ప ఉద్రిక్తత ఏర్పడింది. దీనితో పోలీసులు ఇరు వర్గాలను పక్కకు పంపి వేయడంతో ఆమె చిలకలూరిపేట వెళ్లిపోయారు.

సేవలు స్ఫూర్తిదాయకం



ప్రసంగిస్తున్న మంత్రి సత్యకుమార్, వేదికపై సీఎం చంద్రబాబునాయుడు, కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని తదితరులు



ప్రసంగిస్తున్న కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని



సెల్‌ఫోన్‌లో బంధిస్తున్న విద్యార్థినులు

(5వ పేజీ తరువాయి)

సమయంలో పేదలను చేయి పట్టుకుని నడిపిస్తే భవిష్యత్‌లో వారు దేశానికి ఉపయోగపడతారన్నారు. అంబేడ్కర్, అబ్దుల్ కలాంని అలానే చేయి పట్టుకుని ఇతరులు నడిపించారని, పెద్దయ్యాక వారిద్దరూ అద్భుతాలే సృష్టించారన్నారు. ఎన్ఆర్ఐ వైద్యులు ఎంతమందికి వీలైతే అంతమంది ముందుకొచ్చి పీ4లో భాగస్వామ్యమై మార్గదర్శకులుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు డాక్టర్ కామినేని శ్రీనివాస్, నసీర్ అహ్మద్, ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి సౌరబ్ గౌర్, కలెక్టర్ తమీమ్ అన్సారియా, జింకానా అధ్యక్షుడు డాక్టర్ కోయ రామకోటేశ్వరరావు, పూర్వ అధ్యక్షుడు డాక్టర్ రవి కుమార్ త్రిపురనేని, డాక్టర్ బాబురెడ్డి సాగిరెడ్డి, పద్మశ్రీ అవార్డుగ్రహీత డాక్టర్ మన్నం గోపీచంద్, నాట్కో ఫార్మా వైస్ ప్రెసిడెంట్ నన్నపననేని సదాశివరావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జాతిపిత మహాత్మ గాంధీ వర్ధంతిని పురస్కరించుకొని సీఎం చంద్రబాబుతో సహా సభికులంతా నివాళులర్పించారు.

భోజన కుతూహలం


బెండకాయ జిగురు కలిగిన కూరగాయ. కుటుంబ బంధాల్ని బీరకాయ పీచుతో పోల్చినట్లే, మానవ సంబంధాల్ని బలపరచే బంధాన్ని బెండకాయ జిగురుతో పోల్చవచ్చు. బెండకాయకు అంతటి ఖ్యాతి దాని జిగురువల్లే వచ్చింది. కొందరు ఆ జిగురును కడిగేసి కూర వండుకోవాలని సోషల్ మీడియాలో చెప్పడం చూస్తుంటాం. కానీ నిజానికి బెండకాయ బలం దాని జిగురే.

బెండ... పేగులకు అండ

ఈ జిగురే కడుపులో మంట, గ్యాస్ట్రిక్ సమస్యలను తగ్గించడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. పేగుల గోడల్ని బలపరచి, జీర్ణక్రియను సక్రమంగా నడిపిస్తుంది. ముఖ్యంగాహెలికోబాక్టర్ పైలోరి అనే హానికారక సూక్ష్మజీవి వల్ల పేగులకు కలిగే ఇబ్బందులను అడ్డుకుంటుందని, ఈ జిగురు యాంటీ అథెసివ్ ఏజెంట్‌లా పని చేస్తుందని పరిశోధనలు నిరూపించాయి.

లేత బెండకాయలోని జిగురు ప్రధానంగా పాలీసాకరైడ్ అనే చక్కెర సమ్మేళనాలతో తయారైంది. అందుకే పేగుల సంరక్షకుడిగా బెండకాయ ఒక రక్షకభటుడి పాత్రను నిర్వహిస్తుంది. పోషకాల పరంగా కూడా ఇది విలువైన కూరగాయ. ఇప్పుడు బెండకాయ గింజల నుంచి నూనెను కూడా తయారు చేస్తున్నారు.

ఏ ఆహార పదార్థానికైనా అందులోనికొవ్వు (లిపిడ్లు) దాని పోషక విలువను నిర్ణయించే ప్రధాన అంశం. బెండకాయలో ట్రయాసిల్ గ్లిజరాల్స్, ఫ్యాటీ ఆమ్లాలు వంటి ఆరోగ్యకరమైన కొవ్వులు ఉన్నాయి. ఇవి శరీరానికి శక్తి నిల్వలుగా పని చేస్తాయి.



బెండకాయ గింజల్లోని ప్రొటీన్లు ప్రత్యేకమైనవి. ధాన్యాలు, పప్పుదినుసుల్లో ఉండే ప్రొటీన్లకంటే భిన్నంగా, ఇందులో లైసిన్, ట్రిప్టోఫాన్ వంటి ముఖ్యమైన అమినో ఆమ్లాలు సమతుల్యంగా లభిస్తాయి. అందువల్ల బెండకాయ గింజలు సంపూర్ణ ఆహారంలో కీలక భాగంగా పరిగణించవచ్చు. విటమిన్లు, కార్బోహైడ్రేట్లు కూడా బెండకాయలో సమృద్ధిగా ఉంటాయి. పొటాషియం, క్యాల్షియం, మెగ్నీషియం, ఇనుము వంటి ఖనిజాలు శరీరానికి దండిగా అందుతాయి.

బెండకాయకు షుగర్ నియంత్రణ, చెడ్డ కొవ్వు తగ్గింపు, స్థూలకాయం నియంత్రణ వంటి గుణాలున్నాయి. కేన్సర్ కణాల పెరుగుదలను అరికట్టే శక్తి, విష దోషాలను హరించే లక్షణం కూడా ఉంది. ఎలర్జీలతో బాధపడేవారిలో శరీర తత్త్వ సమతుల్యతను పెంచుతుంది. లివర్‌లోని విషాలను తొలగించి, కాలేయాన్ని శక్తిమంతం చేస్తుంది.

బెండ పెరుగు...

లేత బెండకాయను ముక్కలుగా తరిగి, మునిగేవరకు పాలు పోసి, నాలుగు మజ్జిగ చుక్కలు వేసి తోడు పెట్టాలి. తెల్లవారేసరికి బెండకాయ పెరుగు తయారవుతుంది. రోజూ ఉదయం అల్పాహారానికి ముందు దీన్ని కొద్దిగా తీసుకుంటే ఎసిడిటీ, అమీబియాసిస్ వంటి సమస్యల్లో అద్భుత ఫలితాలు కనిపిస్తాయి. జీవకణాల సంఖ్య తక్కువగా ఉన్న పురుషులకు ఇది మంచి ఔషధం. రక్తహీనత తగ్గుతుంది. ఎముక పుష్టినిచ్చే క్యాల్షియం ఇతర పోషకాలు దీని వలన పెరుగుతాయి కాబట్టి, కీళ్లవాత రోగులు బెండకాయ వాతం చేస్తుందనే అపోహ వదిలి నిర్భయంగా తినవచ్చు.

● గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

ముల్లంగితో వెరైటీగా..!

ముల్లంగి దుంపలతో కూర, పచ్చడి, వేపుడు, సాంబార్... ఇలా ఎన్నో చేసుకుంటూ ఉంటాం. ఇవికాక ముల్లంగితో చేసే వెరైటీ రుచులు మీకోసం.



ముల్లంగి సలాడ్

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి దుంప- ఒకటి, నిమ్మకాయ- ఒకటి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు- పావు కప్పు, సన్నగా తరిగిన టమాటా ముక్కలు- పావు కప్పు, కొత్తిమీర తరుగు- కొద్దిగా, పచ్చి మిర్చి- ఒకటి, అల్లం ముక్క- చిన్నది, ఉప్పు- తగినంత, బ్రౌన్ షుగర్- పావు చెంచా, మిరియాల పొడి- అర చెంచా

తయారీ విధానం

ముల్లంగి చివర్లు కొద్దిగా కోసి తీసివేయాలి. పీలర్ సహాయంతో తొక్క తీసి గ్రేటర్‌తో తురుమాలి. దీన్ని చేత్తో తీసుకుని రసాన్ని గట్టిగా పిండి వెడల్పాటి గిన్నెలో వేయాలి. ఆపైన టమాటా ముక్కలు, ఉల్లిపాయ ముక్కలు, అల్లం తురుం, పచ్చిమిర్చి ముక్కలు, ఉప్పు వేసి కలపాలి. తరువాత నిమ్మరసం, బ్రౌన్ షుగర్, మిరియాల పొడి, కొత్తిమీర తరుగు వేసి కలపాలి. అంతే రుచికరమైన ముల్లంగి సలాడ్ రెడీ..!



ముల్లంగి రొట్టె

కావాల్సిన పదార్థాలు

పెద్ద సైజు ముల్లంగి- ఒకటి, పచ్చి మిర్చి- నాలుగు, జీలకర్ర- రెండు చెంచాలు, ఉప్పు- తగినంత, గోధుమ పిండి- రెండు కప్పులు, నూనె- తగినంత

తయారీ విధానం:

ముల్లంగికి తొక్క తీసి సన్నగా తురుమి పెట్టుకోవాలి. దీన్ని వెడల్పాటి గిన్నెలోకి తీసుకుని అందులో ఉప్పు, సన్నగా తరిగిన పచ్చి మిర్చి ముక్కలు, జీలకర్ర, కొద్దిగా నూనె వేసి కలపాలి. అందులో నీరు ఊరిన తరువాత గోధుమ పిండి వేసి మెత్తటి ముద్దలా కలపాలి. దీని మీద మూతపెట్టి పావుగంటసేపు నాననివ్వాలి. స్టవ్ మీద పెనం పెట్టి నూనె రాసి వేడిచేయాలి. తరువాత పిండిని చిన్న ముద్దలుగా చేసి చపాతీల్లా పామాలి. వేడెక్కిన పెనం మీద ఒక్కో చపాతీ వేసి కొద్దిగా నూనె చిలకరించి రెండు వైపులా దోరగా వేయించాలి. తరువాత పళ్లెంలోకి తీసి రైతాతో సర్వ్ చేయాలి.



ముల్లంగి పకోడి

కావాల్సిన పదార్థాలు

సన్నగా తరిగిన ముల్లంగి ముక్కలు- ఒక కప్పు, శనగపిండి- ఒక కప్పు, బియ్యప్పిండి- పావు కప్పు, ఉప్పు- అర చెంచా కారం- ఒక చెంచా, పసుపు- పావు చెంచా, ధనియాల పొడి- అర చెంచా, గరం మసాల పొడి- అర చెంచా, జీలకర్ర పొడి- అర చెంచా, వంటసోడా- చిటికెడు, మిరియాల పొడి- అర చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, కరివేపాకు- కొద్దిగా, పుదీనా తరుగు- కొద్దిగా, అల్లం వెల్లుల్లి పేస్టు- అర చెంచా, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

వెడల్పాటి గిన్నెలో శనగపిండి, బియ్యప్పిండి, ఉప్పు, కారం, పసుపు, వంటసోడా, గరం మసాల పొడి, ధనియాల పొడి, జీలకర్ర పొడి, మిరియాల పొడి వేసి బాగా కలపాలి. తరువాత అందులో ముల్లంగి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు, కొత్తిమీర తరుగు, పుదీనా తరుగు, కరివేపాకు, రెండు చెంచాల నూనె వేసి బాగా కలపాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి సగానికి పైగా నూనె పోసి వేడిచేయాలి. ఆపైన ముల్లంగి మిశ్రమాన్ని చేత్తో కొద్ది కొద్దిగా తీసుకుంటూ పకోడీల్లా నూనెలో వేయాలి. మధ్య స్థాయి మంట మీద అన్నివైపులా దోరగా వేయించి పళ్లెంలోకి తీయాలి. పైన కొత్తిమీర తరుగు చల్లి సర్వ్ చేయాలి.





ముల్లంగి పాన్‌కేక్

కావాల్సిన పదార్థాలు

ముల్లంగి తురుం- ఒక కప్పు, వెల్లుల్లి రెబ్బలు- నాలుగు, పచ్చి మిర్చి- రెండు, కొత్తిమీర తరుగు- అర కప్పు, ఉప్పు- అర చెంచా, మిరియాల పొడి- అర చెంచా, కారం- అర చెంచా, గోధుమ పిండి- అర కప్పు, నూనె- తగినంత

తయారీ విధానం: వెడల్పాటి గిన్నెలో ముల్లంగి తురుం, వెల్లుల్లి ముక్కలు, పచ్చి మిర్చి ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు, మిరియాల పొడి, కారం, గోధుమ పిండి వేసి బాగా కలపాలి. స్టవ్ మీద పాన్ పెట్టి నూనె రాసి వేడిచేయాలి. చెంచాతో పిండి మిశ్రమాన్ని కొద్దికొద్దిగా తీసుకుంటూ అరచేతిలో బిళ్లలుగా చేసి పాన్ మీద పరచాలి. వాటి మీద కొద్దిగా నూనె చిలకరించి రెండువైపులా ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. వీటిని వేడి వేడిగా టమాటా సాస్ లేదా చిల్లీ సాస్‌తో సర్వ్ చేసుకోవచ్చు.

మేకప్

సెలెబ్ మేకప్ ట్రెండ్స్

ప్రముఖులు అనుసరించే మేకప్ విధానాలు భిన్నంగా ఉంటాయి. ఆ విధానాలను అనుసరించి మనం కూడా వారిలాగే వెలిగిపోవచ్చు. అదెలాగో తెలుసుకుందాం!

సాఫ్ట్ గ్లామ్, మినిమలిస్ట్, మోనోక్రోమ్, బోల్డ్... భారతీయ ప్రముఖులు పాటించే ప్రధాన మేకప్ విధానాలివి. అద్దంలా మెరిసే గ్లాస్ స్కిన్, సహజసిద్ధ కనుబొమలు, మెటాలిక్ ఐషాడోలు, న్యూడ్ లిప్స్ కూడా నేటి మేకప్ ట్రెండ్స్‌లో భాగాలే!.

సాఫ్ట్ గ్లామ్: ముఖంలో ఎక్కడా తీర్చిదిద్దినట్టు కనిపించకుండా న్యూడ్, డ్యూయి ఎలిమెంట్స్‌ను కలిపేసే మేకప్ ట్రెండ్ ఇది. కాటుక కళ్లు, మందపాటి కనుబొమలు, లేత రంగు పెదవులు ఈ ట్రెండ్ ప్రత్యేకతలు

మినిమలిస్ట్: తాజాదనం ఉట్టిపడే సింపుల్ మేకప్‌కు పెద్ద పీట వేస్తూనే బ్లష్, ముదురు రంగు లిప్‌స్టిక్‌లను జోడించడం ఈ మేకప్ ట్రెండ్ ప్రత్యేకత

మోనోక్రోమ్: కళ్లు, పెదవులు, చెక్కిళ్ల మీద ఒకే రంగును ఉపయోగించడం ఈ మేకప్ ప్రత్యేకత

బోల్డ్: ప్రత్యేకమైన సందర్భాల్లో ఎంచుకునే మేకప్ ట్రెండ్ ఇది. కొట్టొచ్చినట్టు కనిపించే స్మోకీ ఐస్, మెటాలిక్ షిమ్మర్ అద్దుకున్న కనురెప్పలు, మందపాటి ఐలైనర్‌లను ఈ మేకప్‌లో ఉపయోగిస్తారు. పెదవుల పైకి దృష్టి మళ్లకుండా ఉండడం కోసం న్యూడ్ లిప్స్‌ను ఎంచుకుంటారు.



కీలకమైన ఆకర్షణలు ఇవే!

చర్మం: అద్దంలా మెరుపులీనే గ్లాస్ స్కిన్ అందర్నీ ఆకట్టుకుంటుంది

కనుబొమలు: ఒత్తుగా, పట్టుకుచ్చులా కనిపించే కనుబొమలు మరింత సహజసిద్ధ లుక్‌ను తెచ్చిపెడతాయి

కళ్లు: గ్రే లేదా లైలాక్ మెటాలిక్ షేడ్స్‌లో మెరిసే ఐషాడోతో పాటు, కళ్లకు కాటుక దిద్దుకోవాలి. అలాగే కనురెప్పల పైన మందంగా ఐలైనర్ అప్లై చేసుకోవాలి

పెదవులు: పెదవులకు న్యూడ్ నుంచి బోల్డ్ వరకూ ఎలాంటి రంగునైనా ఎంచుకోవచ్చు. ఫుల్లర్ లిప్స్‌లా కనిపించడం కోసం ఓవర్ లైన్‌డ్ లిప్స్ స్టైల్ ఎంచుకోవాలి

లైఫ్

ఈ మూడు నియమాలే ముఖ్యం

తగిన బరువు, చక్కని రూపం... ఇవి మాత్రమే మంచి ఆరోగ్యానికి కొలమానాలు కావు. దైనందిన జీవితంలో మన శరీరం, మనసు ఎలా నడుచుకుంటున్నాయన్నది కూడా ముఖ్యమే! ప్రముఖ సెలెబ్రిటీ న్యూట్రిషనిస్ట్ రుజుత దివేకర్ దృఢంగా, సంతృప్తిగా, సంతులనంగా ఉండడానికి అనుసరించవలసిన మూడు నియమాలు, భవిష్యత్తు పోకడల గురించి ఏమంటున్నారంటే..



చదునైన పొట్ట లేదా ఇన్‌స్టాగ్రామ్‌లో లైక్స్... ఇవి ఆరోగ్యానికి కొలమానాలు ఏమాత్రం కావు. మన శరీర సామర్థ్యం ఏ మేరకు ఉందన్నది తెలుసుకోవడం ఎంతో ముఖ్యం. నిజమైన ఆరోగ్యం మూడు కీలక మార్గాల్లో బహిర్గతమవుతూ ఉంటుంది. అవేంటంటే...

సామర్థ్యం

తక్కువ శ్రమతో ఎక్కువ పనులు చేయగలగడమే సామర్థ్యం. కొంతకాలం క్రితం చిన్న కొండ పైకి ఎక్కలేని నా స్నేహితురాలు ఇప్పుడా పని సునాయాసంగా చేయగలిగింది. కొండ పైకి చేరుకుని టీ, స్నాక్స్ ఆస్వాదించి, ఎలాంటి కీళ్ల నొప్పులూ లేకుండా కిందకు దిగి రాగలిగింది. క్రమం తప్పని వ్యాయామం, సరైన ఆహారనియమాల వల్లే ఇదంతా సాధ్యపడింది. సామర్థ్యం పెరిగినప్పుడు, ఆ తేడా స్పష్టంగా కనిపించడమే కాకుండా, అంతర్గత సంతృప్తి కూడా కలుగుతుంది. అంతర్లీనంగా దృఢంగా, సమర్థంగా ఉన్నామనే ఆలోచన కలగడంతో పాటు ఆత్మవిశ్వాసం కూడా పెరుగుతుంది.

రోగనిరోధకశక్తి

దృఢమైన రోగనిరోధకశక్తి సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో కూడా మనల్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. వ్యాధినిరోధకశక్తి మెరుగ్గా ఉన్నప్పుడు నిర్భయంగా రుగ్మతలు కలిగి ఉన్న వాళ్లతో కలిసి వేడుకలకు హాజరవుతూ, కలిసి ప్రయాణాలు చేస్తూ కూడా ఆరోగ్యంగా ఉండవచ్చు. అసిడిటీ, కడుపుబ్బరం, తలనొప్పులు, జ్వరాలు వేధించవు. వాడుకునే మందుల మోతాదు తగ్గుతుంది. మంచి ఆరోగ్యానికి ఇవే అసలైన సంకేతాలు

భావోద్వేగ సంతులనం

కోపాన్ని నియంత్రించుకోవడం, కరుణను పెంపొందించుకోవడం ముఖ్యం. అర్థం లేని కామెంట్లు, ప్రతికూలతలు మనల్ని ప్రభావితం చేయకూడదు. ఉపయోగం లేని విషయాల కోసం సమయాన్నీ, శక్తినీ వృథా చేయనంత కాలం, మన జీవితాలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటాయి. కాబట్టి సామర్థ్యం, వ్యాధినిరోధకశక్తి, కరుణ పెరిగాయో లేదో ఎవరికి వారు పరీక్షించుకోవాలి.

> **బరువు తగ్గించే మందులు**
>
> ఈ మందుల వాడకం గరిష్ఠ స్థాయికి చేరుకోడానికి ఇంకాస్త సమయం మిగిలి ఉంది కాబట్టి వీటి వాడకం ఇంకొంత కాలం పాటు కొనసాగుతుంది. అయితే ఈ మందులతో ముడిపడే ఉండే దుష్ప్రభావాలు, మరీముఖ్యంగా కండర నష్టాన్ని గమనిస్తున్న తొలినాళ్ల వాడకందారులు నెమ్మదిగా వీటి వాడకాన్ని మానుకుంటున్న సందర్భాలు పెరుగుతున్నాయి. కాబట్టి మున్ముందు బరువు తగ్గించే మందుల వాడకం క్షీణిస్తుందని ఆశించవచ్చు.

క్షీణించబోతున్న అంశాలు ఇవే...

పోకడలు, అలవాట్లు కాలానుగుణంగా మారిపోతూ ఉంటాయి. అయితే భవిష్యత్తులో చోటుచేసుకోబోయే కొన్ని ధోరణులను పరిశోధకులు, ఆహార నిపుణులు మాత్రమే అంచనా వేయగలుగుతారు. ఈ ఏడాది క్షీణించే వీలున్న కొన్ని ట్రెండ్స్ గురించి రుజుత దివేకర్ ఏమంటున్నారంటే...

తగ్గుతున్న ప్రొటీన్ వ్యసనం

గత ఏడాది ప్రొటీన్ వ్యసనం విపరీతంగా పెరిగిపోయి, పరాకాష్ఠకు చేరుకుంది. కానీ విక్రయించే వాళ్లకు తప్ప ఉపయోగించే వాళ్లకు అదనపు ప్రొటీన్‌తో ఎలాంటి అదనపు ప్రయోజనం ఉండదనే ఆధారాలు పెరిగిపోయేకొద్దీ ఈ వ్యసనం క్రమేపీ క్షీణించిపోతుంది. సూక్ష్మ పోషకమైన మాంసకృత్తులు కండర పెరుగుదలకూ, మరమ్మత్తుకూ తోడ్పడతాయి. అలాగే ఆకలినీ, తద్వారా బరువునూ అదుపులో ఉంచగలుగుతాయి. అయితే ప్రొటీన్ చుట్టూరా అలుముకుంటున్న హైప్‌ను ఒక సాంస్కృతిక మార్పుగానే చూడాలి. ప్రొటీన్‌తో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా శరీరానికి ప్రయోజనాన్ని అందించామని సంతృప్తి చెందే వ్యక్తుల సంఖ్య పెరిగింది. ఈ కోవకు చెందిన వాళ్లు ప్రాసెస్ చేసిన ప్రొటీన్ బార్‌ను తినడం ద్వారా ప్రొటీన్ పొందిన అనుభూతికి లోనవుతూ ఉంటారు. ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫిట్‌నెస్ ఇన్‌ఫ్లూయెన్సర్లు కూడా ఈ ధోరణిని పెంచి పోషిస్తూ ఉండడం శోచనీయం. నిజానికి పరిపూర్ణమైన మాంసకృత్తులను సమకూర్చుకోవడం కోసం మాంసకృత్తుల వనరుల్లో వైవిధ్యాన్ని పాటించాలి. మాంసం, చికెన్, చేపలు మెరుగైన మాంసకృత్తులను అందిస్తాయి. అలాగే బీన్స్, పప్పుధాన్యాలు, టోఫు, క్వినోవాలు కూడా అంతే సమానమైన వృక్షాధారిత మాంసకృత్తులను అందించగలుగుతాయని అందరూ గ్రహించాలి.

మద్యపానంలోనూ క్షీణత

పాశ్చాత్య దేశాలతో పాటు మన దేశంలో కూడా మద్యపానం అలవాటు క్షీణించడం మొదలుపెట్టింది. 2026లో ఈ ధోరణి మరింత స్పష్టంగా బహిర్గతం కాబోతోంది. ఆరోగ్యాన్ని నష్టపరిచే మద్యం ప్రభావాలు ఎక్కువగా వెలుగులోకొస్తున్నాయి కాబట్టి ఈ అలవాటు క్రమేపీ క్షీణించే అవకాశం లేకపోలేదు. ఈ అలవాటుతో జీర్ణ వ్యవస్థ దెబ్బతిని, నిద్ర నాణ్యత తగ్గుతుంది. నిద్ర మాత్రలు, మానసిక సమస్యల మందుల మీద దుష్ప్రభావం కనబరిచే మద్యం హృద్రోగ వ్యవస్థను కూడా తీవ్రంగా దెబ్బతీస్తున్న సందర్భాలు పెరిగాయి. మద్యపాన దుష్ప్రభావాల పట్ల సర్వత్రా పెరుగుతున్న అవగాహన అభినందనీయం. మద్యంలో క్యాలరీలు ఉంటాయనే విషయం అందరికీ తెలిసిందే! ఎంత అరుదుగా తీసుకున్నా, మద్యంతో పాటు తినే చిరుతిళ్లతో క్యాలరీల మోతాదు పెరిగి శరీర బరువు పెరిగే ప్రమాదం పొంచి ఉంటుంది. కొందరు అరుదుగా తాగినా, తక్కువ సమయంలో ఎక్కువ మోతాదులో తాగేస్తూ ఉంటారు. ఈ అలవాటు రెట్టింపు ప్రమాదకరం. దీంతో మద్యం సంబంధిత కాలేయ జబ్బులు, హృద్రోగాల బారిన పడే ప్రమాదం ఉంటుంది.

చెడు కొలెస్ట్రాల్‌తో సమస్యా

శరీరంలో ఎన్నో రకాల ఆరోగ్య సమస్యలకు కారణమైన చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించేందుకు తినాల్సిన గింజలు ఇవే...

- అవిసె గింజల్లో పీచు, ఆల్ఫా లినోలెనిక్ యాసిడ్, ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్లు పుష్కలంగా ఉంటాయి. వీటిని తరచూ తినడం వల్ల శరీరంలో చెడు కొలెస్ట్రాల్ ఉత్పత్తి తగ్గుతుంది.
- రోజూ అల్పాహారంలో గుమ్మడి గింజలు చేర్చుకున్నా మంచి ఫలితం కనిపిస్తుంది. వీటిలో ఉండే మెగ్నీషియం, ప్రొటీన్ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు... శరీరాన్ని చెడు కొలెస్ట్రాల్ నుంచి కాపాడతాయి.
- తరచూ పొద్దు తిరుగుడు గింజలు, చియా గింజలు, నువ్వులు తింటూ ఉంటే శరీరంలో చేరిన చెడు కొలెస్ట్రాల్ నిల్వలు కరిగిపోతాయి.
- రోజూ గుప్పెడు జీడిపప్పులు, బాదం, పిస్తా, వాల్‌నట్‌లను తినడం వల్ల కూడా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి గణనీయంగా తగ్గుతుంది. వీటిలో ఉండే మోనో శాచురేటెడ్ కొవ్వులు.. చెడు కొలెస్ట్రాల్ శోషణను అడ్డుకుంటాయి.



తెల్లని దుస్తులను మెరిపించేదెలా?

తెల్లని దుస్తులపై చేరిన మురికి, మరకలను సులువుగా తొలగించే మార్గాలివే...

- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల బేకింగ్ సోడా వేసి బాగా కలపాలి. అందులో తెల్లని దుస్తులను పావుగంట సేపు నానబెట్టాలి. తరువాత డిటర్జెంట్ సోప్‌తో ఉతికి ఎండలో ఆరేస్తే మరకలన్నీ తొలగి దుస్తులు తెల్లగా మెరుస్తాయి.



- తెల్లని దుస్తులపై మరకలు పడిన చోట కొద్దిగా వైట్ వెనిగర్‌ను రాసి ఆపైన సబ్బుతో రుద్ది వేడినీళ్లలో ముంచి ఆరేస్తే ప్రయోజనం కనిపిస్తుంది.
- ఒక బకెట్ వేడినీళ్లలో చెంచా ఉప్పు, చెంచా బేబీ షాంపూ, చెంచా డిటర్జెంట్ పౌడర్ వేసి కలపాలి. అందులో తెల్లని దుస్తులను పది నిమిషాల పాటు నానబెట్టి సబ్బుతో ఉతికేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

రాత్రిపూట ఇలా చేస్తే...

రాత్రి పడుకునే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే చాలు... చర్మం మృదువుగా కాంతివంతంగా మారిపోతుంది. అవేంటంటే...



- దూదితో ముఖంపై ఉన్న మేకప్‌ను పూర్తిగా తొలగించాలి. తరువాత క్లెన్సర్‌తో ముఖాన్ని రెండు సార్లు కడగాలి. దీనివల్ల మలినాలు, మేకప్ అవశేషాలు తొలగి చర్మ రంధ్రాలు శుభ్రమవుతాయి. చర్మానికి ఆక్సిజన్ అందుతుంది. మొటిమల బాధ తగ్గుతుంది.
- ముఖాన్ని శుభ్రం చేసుకున్న తరువాత తేలికపాటి సీరమ్‌ను అప్లయ్ చేయాలి. దీనివల్ల నుదుటి మీద గీతలు, పెదవుల చుట్టూ ముడుతలు, కళ్ల కింద వలయాలు ఏర్పడకుండా ఉంటాయి. అలాగే ముఖానికి మాయిశ్చరైజర్ రాసుకుంటే చర్మం తేమతో నిండి ఆరోగ్యవంతంగా కనిపిస్తుంది.
- కళ్ల చుట్టూ ఐ క్రీమ్ రాసి వేళ్లతో సున్నితంగా వలయాకారంలో మర్దన చేయాలి. దీనివల్ల రక్తప్రసరణ మెరుగుపడి కళ్ల కింద నల్లని వలయాలు మాయమవుతాయి.
- రోజూ పడుకునేముందు గ్లాసు మంచినీళ్లు తాగుతూ ఉంటే చర్మ సమస్యలు తగ్గిపోతాయి. చర్మం పొడిబారకుండా ఉంటుంది. ముఖం తాజాగా కనిపిస్తుంది.

స్పోర్ట్స్

గుంటూరు ● శనివారం 31 జనవరి 2026



ఇక గూగుల్‌తో గూగ్లీ

ఐసీసీతో జెమినై ఒప్పందం

న్యూఢిల్లీ: క్రికెట్ మ్యాచ్‌ల వీక్షకులకు సరికొత్త అనుభూతినిచ్చేందుకు ఐసీసీతో గూగుల్ సంస్థ జత కట్టింది. ఈ సందర్భంగా 'ఇప్పుడు గూగుల్.. మీ గూగ్లీకి సహాయం చేస్తుంది' అంటూ కంపెనీ సీఈవో సుందర్ పిచాయ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ద్వారా ఇకనుంచి లైవ్ మ్యాచ్‌ల ఆడియోను విశ్లేషణాత్మకంగా, సులువుగా అర్థమయ్యేలా వినే అవకాశం లభిస్తుంది. ఇందుకు గూగుల్ కంపెనీ తమ జెమినై3 ప్రో ఏఐని వినియోగించుకోనుంది. మ్యాచ్ జరుగుతుండగానే హైలైట్స్, టర్నింగ్ పాయింట్స్‌తో పాటు ఆటగాళ్ల షాట్ల విశ్లేషణ, ఇతర ఆసక్తికర విషయాలను జెమినైని అడగవచ్చు. అంటే.. క్రికెట్ గురించి అంతంతమాత్రం పరిజ్ఞానం ఉన్నవాళ్లు కూడా ఫలానా బంతికి వికెట్ ఎందుకు పడింది? అలాగే బ్యాటర్ షాట్ ఆడిన విధానంలాంటి విషయాల్ని జెమినైని అడిగి తెలుసుకోవచ్చు.

పీటీ ఉష భర్త మృతి

ప్రధాని మోదీ సంతాపం



కోజికోడ్: ప్రముఖ అథ్లెట్, భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అధ్యక్షురాలు పీటీ ఉష భర్త వి. శ్రీనివాసన్ (67) మృతిచెందారు. కేరళలోని తన స్వగృహంలో శుక్రవారం తెల్లవారుజామున హఠాత్తుగా అనారోగ్యం పాలైన శ్రీనివాసన్ కొద్దిసేపటికే ఇంట్లో కుప్పకూలి పడిపోయారు. కుటుంబ సభ్యులు దగ్గరలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మాజీ కబడ్డీ క్రీడాకారుడైన శ్రీనివాసన్ కేంద్ర పారిశ్రామిక భద్రతా దళంలో అధికారిగా పనిచేశారు. శ్రీనివాసన్ మృతి పట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సంతాపం వ్యక్తం చేశారు. శ్రీనివాసన్-ఉష దంపతులకు కుమారుడు ఉజ్వల్ ఉన్నాడు. ఉష క్రీడా, రాజకీయ జీవితంలో శ్రీనివాసన్‌ది ముఖ్యమైన భూమిక. వీరిద్దరి వివాహం 1991లో జరిగింది.

కాచుకో..అల్కారజ్

ఫైనల్లో జొకోవిచ్

హోరాహోరీ సెమీస్‌లో సినర్, జ్వెరెవ్‌కు షాక్ ● ఆస్ట్రేలియన్ ఓపెన్

దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ సుదీర్ఘ కెరీర్‌లో ఐదు సెట్ల సమరాలు ఎన్నింటిలోనో తలపడ్డాడు. కానీ ఈ ఐదు సెట్ల పోరు మాత్రం ఎంతో ప్రత్యేకం. ప్రత్యర్థి 24 ఏళ్ల యువ కెరటం. పైగా గత రెండు సంవత్సరాలుగా ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్. అంతేకాదు జొకో రికార్డు గ్రాండ్‌స్లామ్ స్వప్నానికి అడ్డుపడుతున్న ఇద్దరిలో ఒకడు. దాంతో 25వ గ్రాండ్‌స్లామ్ నెగ్గడం ద్వారా చరిత్ర సృష్టించాలనుకుంటున్న 38 ఏళ్ల జొకో ప్రయత్నాలు చాలా కాలంగా ఫలించడంలేదు. ఏకంగా పదిసార్లు విజేతగా తనకు అచ్చొచ్చిన ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఈసారి 'చరిత్ర' లిఖించాలని లక్ష్యంగా పెట్టుకొన్న నొవాక్ ఈ సెమీస్‌లో ఏమాత్రం తగ్గలేదు. డిఫెండింగ్ చాంపియన్ సినర్‌ను చిత్తుచేసి అరుదైన మైలురాయి చేరుకొనే దిశగా జొకో మరో అడుగేశాడు.

అల్కారజ్



నేడు మహిళల ఫైనల్

(1) సబలెంక X రిబకిన (5)

మ.2 గం. నుంచి సోనీ నెట్‌వర్క్‌లో..

మెల్‌బోర్న్: ఈ ఏడాది తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ పురుషుల సింగిల్స్ కిరీటం కోసం లెజెండరీ ఆటగాడు నొవాక్ జొకోవిచ్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్ అమీతుమీ తేల్చుకోనున్నారు. శుక్రవారం జరిగిన సెమీఫైనల్లో నాలుగో సీడ్ జొకోవిచ్ 3-6, 6-3, 4-6, 6-4, 6-4తో రెండో సీడ్ జానిక్ సినర్ (ఇటలీ)కు షాకిచ్చాడు. మరో సెమీఫైనల్లో 22 ఏళ్ల టాప్ సీడ్ అల్కారజ్ (స్పెయిన్) కూడా ఐదు సెట్ల ఉత్కంఠ భరిత పోరులో 6-4, 7-6 (5), 6-7 (7), 6-7 (7), 7-5తో మూడో సీడ్, నిరుటి ఫైనలిస్ట్ అలెగ్జాండర్ జ్వెరెవ్ (జర్మనీ)ను కంగుతినిపించాడు.

తొలి సెట్ కోల్పోయినా..: సినర్‌తో 4గంటలకుపైగా జరిగిన మ్యాచ్‌లో తడబాటుకులోనైన జొకో తొలి సెట్‌ను చేజార్చుకున్నాడు. అయితే తనదైన శైలిలో పుంజుకొని రెండో సెట్ నెగ్గాడు. మూడో సెట్ నెగ్గిన సినర్ మళ్లీ పైచేయి సాధించాడు. ఈ దశలో నొవాక్ నాలుగో సెట్‌తోపాటు, చివరి సెట్‌ను కూడా సొంతం చేసుకొని 11వ సారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్‌కు చేరాడు. ఇదే జోరులో..తన స్వప్నానికి అడ్డొస్తున్న మరో స్టార్ అల్కారజ్‌ను ఓడిస్తాడేమో చూడాలి.

నువ్వా..నేనా..: అల్కారజ్, 28 ఏళ్ల జ్వెరెవ్ సెమీస్ పోరు ఐదున్నర గంటలపాటు ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించింది. జ్వెరెవ్ నుంచి గట్టి పోటీ ఎదుర్కొన్నా..మొదటి సెట్‌ను అల్కారజ్ చేజిక్కించుకోగలిగాడు. ఈ దశ నుంచి జ్వెరెవ్ మరింత ప్రతిఘటించడంతో తదుపరి మూడు సెట్లు టైబ్రేకర్లకు మళ్లాయి. రెండో సెట్‌నూ అల్కారజ్ సొంతం చేసుకోగా..తదుపరి రెండింటిని జ్వెరెవ్ దక్కించుకున్నాడు. ఇక ఐదో సెట్‌లో అల్కారజ్, జ్వెరెవ్ ఏ మాత్రం పట్టు సడలించలేదు. అయితే చివరకు ఈ సెట్‌లో విజేతగా నిలిచిన అల్కారజ్ ఊపిరి పీల్చుకున్నాడు.

గుజరాత్ ముందుకు..

ఎలిమినేటర్‌లో చోటు ● ముంబైపై విజయం



వేర్‌హమ్ (44 నాటౌట్)

వడోదర: మహిళల ప్రీమియర్ లీగ్‌లో గుజరాత్ జెయింట్స్ ఎలిమినేటర్‌కు అర్హత సాధించింది. శుక్రవారం ఉత్కంఠభరితంగా సాగిన తమ చివరి గ్రూప్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 11 పరుగుల తేడాతో నెగ్గింది. దీంతో 10 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచింది. అలాగే డబ్ల్యూపీఎల్‌లో ఎంఐపై గుజరాత్‌కిదే తొలి విజయం కావడం విశేషం. ఇక ఆదివారం జరిగే మ్యాచ్‌లో ఢిల్లీ కనీసం 50 రన్స్ తేడాతో యూపీ చేతిలో ఓడితే రన్‌రేట్ ఆధారంగా ముంబై ముందుకెళ్తుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 20 ఓవర్లలో 4 వికెట్లకు 167 పరుగులు చేసింది. కెప్టెన్ గార్డ్‌నర్ (46), వేర్‌హమ్ (44 నాటౌట్), అనుష్క (33) రాణించారు. కెర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ముంబై 20 ఓవర్లలో 7 వికెట్లకు 156 పరుగులు చేసి ఓడింది. హర్మన్‌ప్రీత్ (82 నాటౌట్) చివరి ఓవర్ వరకు పోరాడినా సహకారం కరువైంది. సజన (26), కెర్ (20) ఫర్వాలేదనిపించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ వేర్‌హమ్, డివైన్‌లకు రెండేసి వికెట్లు లభించాయి.

ఆదుకున్న గార్డ్‌నర్-వేర్‌హమ్: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ ఇన్నింగ్స్‌లో టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ రాణించింది. ఓపెనర్ బెత్ మూనీ (5) విఫలమైనా మరో ఓపెనర్ సోఫీ డివైన్ (25), అనుష్క రెండో వికెట్‌కు 48 పరుగులు జత చేశారు. ఇక మధ్య ఓవర్లలో ఆచితూచి ఆడిన గార్డ్‌నర్-వేర్‌హమ్ జోడీ చివర్లో బ్యాట్లు ఝుళిపించారు. 16వ ఓవర్‌లో గార్డ్‌నర్ 6,4,4,4తో 19 రన్స్.. 17వ ఓవర్‌లో ఇద్దరూ తలా రెండేసి ఫోర్లతో 17 రన్స్ రాబట్టారు. నాలుగో వికెట్‌కు వీరు 71 రన్స్ జోడించగా స్కోరు 160 దాటేసింది.

రాణించిన జ్ఞానేశ్వర్

నాగాలాండ్‌తో ఆంధ్ర రంజీ

దిమాపూర్ (నాగాలాండ్): మిడిలార్డర్ బ్యాటర్ల బాధ్యతాయుతమైన ఆటతో ఆంధ్ర తొలి ఇన్నింగ్స్ నిలకడగా సాగుతోంది. ఆటకు రెండో రోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 322/6తో ఆట కొనసాగించిన నాగాలాండ్ 366కు ఆలౌటైంది. అనంతరం ఆంధ్ర, ఆరు పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. మిడిలార్డర్ బ్యాటర్ జ్ఞానేశ్వర్ (87 నాటౌట్), కర్ణ్ షిండే (51), ఓపెనర్ అభిషేక్ రెడ్డి (51) అర్థ సెంచరీలతో రాణించగా, శ్రీకర్ భరత్ (0), షేక్ రషీద్ (1) నిరాశపర్చారు. దీంతో ఆంధ్ర ఆట ముగిసే సమయానికి 5 వికెట్లకు 267 పరుగులు చేసి.. నాగాలాండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకి మరో 99 పరుగుల వెనుకంజలో నిలిచింది.

స్ప్రింటర్ షకారి అరెస్టు



ఫ్లోరిడా: మితిమీరిన వేగంతో వాహనాన్ని నడిపినందుకు అమెరికా అథ్లెట్, ఒలింపిక్ పతక విజేత షకారి రిచర్డ్‌సన్ (25)ను స్థానిక పోలీసులు అరెస్టు చేశారు. గురువారం జరిగిన ఈ ఘటనలో షకారి గంటకు 167 కి.మీలకు పైగా వేగంతో ఓర్లాండో రోడ్లపై ప్రమాదకరంగా కారులో దూసుకుపోవడంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

శాంసన్‌పై ఒత్తిడి



సంజూ శాంసన్


ఫామ్‌లేమితో సతమతం

ఆఖరి టీ20 బరిలో భారత్ X కివీస్

రాత్రి 7 నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో..

జట్లు (అంచనా):
భారత్: అభిషేక్, సంజూ శాంసన్, ఇషాన్/శ్రేయాస్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ, శివమ్, హర్షిత్, అర్ష్‌దీప్, బుమ్రా, వరుణ్/కుల్దీప్.
న్యూజిలాండ్: అలెన్, కాన్వే/సీఫర్ట్, రచిన్, మిచెల్, ఫిలిప్స్, చాప్‌మన్, శాంట్నర్ (కెప్టెన్), నీషమ్, సోధీ, హెన్రీ, డఫీ.

తిరువనంతపురం: భారత్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఐదు టీ20ల సిరీస్ ముగింపు దశకు చేరింది. స్థానిక గ్రీన్‌ఫీల్డ్ మైదానంలో శనివారం ఈ చివరి మ్యాచ్ జరగనుంది. ప్రతిష్ఠాత్మక టీ20 వరల్డ్‌కప్‌నకు ముందు ఇదే ఆఖరి పోరు కావడంతో భారత్ తమ సన్నాహకాలను ఘనంగా ముగించాలనుకుంటోంది. ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకున్నా.. విశాఖలో ప్రయోగాలకు దిగి ఓటమి పాలైంది. అటు నాలుగో మ్యాచ్ నెగ్గిన కివీస్ సిరీస్‌ను మరో విజయంతో ముగించి మెగా టోర్నీలో ఆత్మవిశ్వాసంతో అడుగుపెట్టాలనుకుంటోంది. ఓపెనర్ ఫిన్ ఆలెన్ జట్టులోకి రానున్నాడు. దీంతో కాన్వేకు చోటు దక్కకపోవచ్చు.



శాంట్నర్

ఇషాన్ బరిలోకి..!: మెగా టోర్నీలో ప్రధాన వికెట్ కీపర్‌గా చోటు దక్కించుకున్న సంజూ శాంసన్‌పై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. సొంత మైదానంలో తొలిసారి అంతర్జాతీయ మ్యాచ్ ఆడనున్న సంజూకు ఫామ్‌లోకి వచ్చేందుకు ఇదే ఆఖరి చాన్స్. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లో 40 పరుగులు మాత్రమే చేసిన శాంసన్ పేలవ ఫామ్ తో విమర్శలు ఎదుర్కొంటున్నాడు. అలాగే గత 15 ఇన్నింగ్స్‌లో ఒకసారి మాత్రమే అర్ధసెంచరీ సాధించాడు. మరోవైపు వైజాగ్ మ్యాచ్‌లో ఆడని ఇషాన్ నేటి మ్యాచ్‌లో బరిలోకి దిగే అవకాశం ఉంది. అయితే మ్యాచ్‌కి ముందు ఇషాన్‌పై ఫిజియో నిర్ణయం తీసుకుంటాడని బ్యాటింగ్ కోచ్ సితాంశు కోటక్ తెలిపాడు. ఫామ్‌లో ఉన్న అభిషేక్‌కు విశ్రాంతినిచ్చి ఇషాన్‌తో ఓపెనింగ్ చేయిస్తారా? అనేది కూడా డౌటే. ఇక స్పిన్నర్ అక్షర్ పటేల్ ఫిట్‌నెస్‌పై స్పష్టత లేదు. గత రెండు మ్యాచ్‌ల్లో విశ్రాంతినిచ్చిన వరుణ్‌ను ఆఖరి మ్యాచ్‌లో బరిలోకి దింపే అవకాశం ఉంది.

డికాక్ రికార్డు సెంచరీ

రెండో టీ20లో దక్షిణాఫ్రికా గెలుపు



డికాక్ (115)

సెంచూరియన్: వెస్టిండీస్‌తో మూడు టీ20ల సిరీస్‌ను దక్షిణాఫ్రికా మరో మ్యాచ్ మిగిలుండగానే సొంతం చేసుకుంది. గురువారం రాత్రి జరిగిన రెండో టీ20లో ఆతిథ్య జట్టు ఏడు వికెట్లతో నెగ్గింది. తొలుత వెస్టిండీస్ 20 ఓవర్లలో 221/4 స్కోరు చేసింది. ఛేదనలో డికాక్ (49 బంతుల్లో 115) సెంచరీతో కదం తొక్కాడు. దాంతో సఫారీలు 17.3 ఓవర్లలో 225/3 స్కోరు చేసి గెలుపొందారు. డికాక్ మొత్తం 12,113 పరుగులతో టీ20లలో అత్యధిక రన్స్ చేసిన దక్షిణాఫ్రికా ఆటగాడిగా నిలిచాడు. ఎనిమిది శతకాలతో..పొట్టి ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన కీపర్‌గా మరో రికార్డు నెలకొల్పాడు.

పాకిస్థాన్.. అల్ప సంతోషి!

జడేజా ఎద్దేవా

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో తొలి టీ20లో నెగ్గిన పాకిస్థాన్ జట్టును ఆ దేశ ప్రధాని షహబాజ్ షరీఫ్ ఆకాశానికి ఎత్తేయడాన్ని భారత మాజీ ఆల్‌రౌండర్ అజయ్ జడేజా ఎద్దేవా చేశాడు. తమ జట్టు ఏకంగా టీ20 సిరీస్‌నో లేదా మరో ప్రతిష్ఠాత్మక టోర్నీనో గెలిచిన లెవెల్లో షరీఫ్ ప్రశంసలు కురిపించారు. దీనికి జడేజా స్పందిస్తూ 'పాపం. పాకిస్థాన్ అల్ప సంతోషి. ద్వైపాక్షిక సిరీస్‌లో మొదటి మ్యాచ్ నెగ్గిన జట్టును ఓ ప్రధాని అంతలా అభినందించడం నేను తొలిసారి చూస్తున్నా' అని సెటైర్ వేశాడు.

బంగారం, వెండి ధమాల్!

భారీగా పతనమైన ధరలు

ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.68వేలు తగ్గిన కిలో సిల్వర్



- రూ.3.32 లక్షలకు చేరిక
- రూ.15,000కు పైగా పతనమై

రూ.1.54 లక్షలకు జారిన పసిడి

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు కుప్పకూలాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో సిల్వర్ ఫ్యూచర్స్ మార్చి కాంట్రాక్టు ధర శుక్రవారం రూ.67,891 లేదా 16.97 శాతం తగ్గి రూ.3,32,002కు జారుకుంది. వెండికిదే అతిపెద్ద ఒక్కరోజు పతనం. గురువారం నాడు నమోదైన ఆల్‌టైం రికార్డు ధర రూ.4.20 లక్షలతో పోలిస్తే, దాదాపు రూ.88,000 లేదా 24 శాతం తగ్గింది. గోల్డ్ ఫ్యూచర్స్ ఫిబ్రవరి కాంట్రాక్టు రేటు కూడా రూ.15,246 లేదా 9 శాతం తగ్గి రూ.1,54,157కు పడిపోయింది. గురువారం నాడు నమోదైన సరికొత్త రికార్డు గరిష్ఠ స్థాయి రూ.1,80,779 తో పోలిస్తే రూ.26,600 లేదా దాదాపు 15 శాతం క్షీణించింది. గోల్డ్, సిల్వర్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ల (ఈటీఎఫ్) విలువ 20% వరకు పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లో ఈ విలువైన లోహాల ధరలు ఒక్కసారిగా పతనమవడమే ఇందుకు ప్రధాన కారణం. ఢిల్లీ మార్కెట్లోనూ 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.14,000 (7.65%) తగ్గి రూ.1,69,000కు జారుకోగా.. కేజీ సిల్వర్ రేటు రూ.20,000 (5%) క్షీణించి రూ.3,84,500కు పరిమితమైంది.

5,000 డాలర్ల దిగువకు బంగారం.. 100 డాలర్ల కిందికి సిల్వర్: ఇంటర్నేషనల్ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (కామెక్స్)లో ఔన్స్ సిల్వర్ ఫ్యూచర్స్ మార్చి కాంట్రాక్టు ధర గురువారం ఒక దశలో 19.30 డాలర్లు (16.87%) క్షీణించి 95.12 డాలర్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. అంతక్రితం సెషన్‌లో ఔన్స్ సిల్వర్ 121.78 డాలర్ల వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసిన విషయం తెలిసిందే. గోల్డ్ ఫ్యూచర్స్ ఏప్రిల్ కాంట్రాక్టు రేటు సైతం 392.1 డాలర్లు (7.32%) పతనమై 4,962.7 డాలర్ల స్థాయికి పడిపోయింది. అంతక్రితం రోజున ఔన్స్ బంగారం 5,626.8 డాలర్ల వద్ద ఆల్‌టైం రికార్డును నమోదు చేసింది. శుక్రవారం కూడా బంగారం రేటు మరో 9 శాతానికి పైగా పతనంతో ట్రేడవుతోంది.

గంటలో రూ.294 లక్షల కోట్లు ఫట్

అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ట్రేడింగ్ గురువారం తీవ్ర హెచ్చుతగ్గులకు లోనైంది. "ఈస్ట్రన్ టైమ్(ఈటీ) ప్రకారం.. ఉదయం 9.30 గంటల నుంచి 10.25 గంటల మధ్యలో గోల్డ్ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) 3.2 లక్షల కోట్ల డాలర్ల (రూ.294 లక్షల కోట్ల పైమాటే) మేర తరిగి పోయింది. అంటే, సగటున నిమిషానికి 5,800 కోట్ల డాలర్ల (రూ.5.33 లక్షల కోట్లు) మేర కరిగిపోయిందని గ్లోబల్ క్యాపిటల్ మార్కెట్స్ కామెంటరీ ప్లాట్‌ఫామ్ ది కొబెయిసీ లెటర్ తన ఎక్స్ (గతంలో ట్విటర్) ఖాతాలో పోస్ట్ చేసింది. ఆ తర్వాత ఉదయం 10.25 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల మధ్యకాలంలో గోల్డ్ మార్కెట్ క్యాప్ మళ్లీ 2.3 లక్షల కోట్ల డాలర్లు (రూ.211.44 లక్షల కోట్లు) పెరిగింది. అంటే, 6.5 గంటల్లో గోల్డ్ మార్కెట్ క్యాపిటలైజేషన్ 5.5 లక్షల కోట్ల డాలర్ల శ్రేణిలో ఊగిసలాడిందని, ప్రపంచ ప్రముఖ క్రిప్టో కరెన్సీ బిట్‌కాయిన్ మార్కెట్ క్యాప్‌తో పోలిస్తే మూడు రెట్లని కొబెయిసీ లెటర్ పేర్కొంది. అంతేకాదు, గోల్డ్ మార్కెట్ చరిత్రలో ఇదే అతిపెద్ద ఒక్కరోజు ఊగిసలాటని, 2008 ఆర్థిక సంక్షోభ సమయంలోనూ గోల్డ్ ఈ స్థాయిలో ఒడుదుడుకులకు లోను కాలేదని తన పోస్ట్‌లో ప్రస్తావించింది.

అసలేమైంది..?

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ కొత్త చైర్మన్‌గా కెవిన్ వార్ష్‌ను శుక్రవారం ఎంపిక చేశారు. ఫెడ్ రిజర్వ్ పగ్గాలను వార్ష్‌కు అప్పగించబోతున్నారన్న ఊహాగానాల నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో గురువారమే గోల్డ్, సిల్వర్ రేట్లు క్రాష్ అయ్యాయి. ఎందుకంటే, గతంలో ఫెడరల్ రిజర్వ్ గవర్నర్‌గా పనిచేసిన వార్ష్.. వడ్డీ రేట్ల విషయంలో కఠిన వైఖరి కలిగిన వ్యక్తి. ఆయన కఠిన పరపతి విధానం ద్వారా డాలర్ బలోపేతానికే పెద్దపీట వేస్తారన్న అంచనాల నేపథ్యంలో కమోడిటీ ఇన్వెస్టర్లు అప్రమత్తమై రికార్డు గరిష్ఠాల వద్ద పెద్దఎత్తున లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఒక్కసారిగా అమ్మకాలను పోటెత్తించడంతో బంగారం, వెండితోపాటు అన్ని లోహాల ధరలు ఒక్కసారిగా కుప్పకూలాయి. దానికి కారణం బంగారం, ఫెడ్ ప్రామాణిక వడ్డీ రేట్లది విలోమ సంబంధం.

ఫెడ్ కొత్త చైర్మన్ కెవిన్ వార్ష్

ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్



వాషింగ్టన్: అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ కొత్త చైర్మన్‌గా కెవిన్ వార్ష్ ఎంపికయ్యారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం ఈ విషయాన్ని ప్రకటించారు. ట్రంప్ విధానాలను సమర్థించే వారిలో ఒకరైన వార్ష్‌కు గతంలో (2006-11 మధ్య కాలంలో) ఫెడరల్ రిజర్వ్ గవర్నర్‌గానూ పనిచేసిన అనుభవం ఉంది. ఈ నియామకాన్ని యూఎస్ సెనేట్ ఆమోదిస్తే, ఫెడరల్ రిజర్వ్ ప్రస్తుత చైర్మన్ జీరోమ్ పావెల్ స్థానాన్ని ఆయన భర్తీ చేస్తారు. పావెల్ పదవీకాలం ఈ మే నెలతో ముగియనుంది. 55 ఏళ్ల వార్ష్ ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌తో పాటు హూవర్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆర్థిక శాస్త్ర ఆచార్యుడిగా పనిచేస్తున్నారు.

ఎన్ఎస్ఈ ఐపీఓకి సెబీ ఓకే



న్యూఢిల్లీ: సుమారు దశాబ్ది ఎదురుచూపుల అనంతరం నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజీ (ఎన్ఎస్ఈ) తొలి పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కి క్యాపిటల్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీర్ఘకాలంగా పెండింగులో ఉన్న ఈ ఐపీఓ జారీకి ఎలాంటి అభ్యంతరం లేదంటూ సెబీ శుక్రవారం ఎన్ఓసీ జారీ చేసింది. ఎక్స్ఛేంజీలో పాలనాపరమైన లోపాలున్నాయన్న ఆందోళనలు, కో-లొకేషన్ కేసు వంటి కారణాలుగా జాప్యం అవుతూ వస్తున్న ఈ ఐపీఓకి ఎట్టకేలకు మోక్షం లభించిందని ఎన్ఎస్ఈ అధికారి ఒకరు తెలిపారు. దేశంలోనే అతిపెద్దదైన స్టాక్ ఎక్స్ఛేంజీగా పేరొందిన ఎన్ఎస్ఈ పబ్లిక్ ఇష్యూకి 2016 నుంచి ఏదో ఒక అవాంతరాలు వస్తూనే ఉన్నాయి. అప్పటి నుంచి పలుమార్లు ఇష్యూ జారీకి క్లియరెన్స్ ఇవ్వాలని కోరుతూ సెబీని ఎన్ఎస్ఈ అభ్యర్థించింది.

రూ.10,000 కోట్ల సమీకరణ లక్ష్యం: 2016లో ఎన్ఎస్ఈ సమర్పించిన ముసాయిదా ప్రకారం సంస్థలోని ప్రస్తుత వాటాదారుల వాటాను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలో విక్రయించటం ద్వారా రూ.10,000 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది. ఐపీఓ మార్కెట్లో ఇది మరో భారీ ఐపీఓ అవుతుందని మార్కెట్ వర్గాల అంచనా. ప్రస్తుతం ఎన్ఎస్ఈలో 1.77 లక్షల మంది వాటాదారులున్నారు. వీరందరి పెట్టుబడుల విలువ రూ.5 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా.

8 నెలల తర్వాతే: సెబీ నుంచి ఎన్ఓసీ పొందిన నాటి నుంచి ఇష్యూ జారీకి ఏడెనిమిది నెలలు పడుతుందని ఎన్ఎస్ఈ ఎండీ, సీఈఓ ఆశిష్ కుమార్ చౌహాన్ చెప్పారు. ఎన్ఓసీ అందిన తర్వాత సెబీకి డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) సమర్పించేందుకు 4 నెలలు పడుతుందన్నారు.

బిజినెస్

manepally® Jewellers Pvt. Ltd.
trusted legacy since 1890
MANEPALLY DIGITAL GOLD APP
Ph: 99120 10888

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,70,620 ▼	1,56,400 ▼	4,15,000 ▼
విజయవాడ	1,75,000 ▼	1,65,000 ▼	3,47,000 ▼
విశాఖపట్నం	1,66,066 ▼	1,56,400 ▼	4,05,000 ▼
రాజమండ్రి	1,70,620 ▼	1,56,400 ▼	3,65,000 ▼
ప్రొద్దుటూరు	1,74,800 ▼	1,60,820 ▼	3,65,500 ▼
ముంబై	1,65,795 ▲	1,51,868 ▲	3,39,350 ▲

లాభాల స్వీకరణతో మార్కెట్ డౌన్

సెన్సెక్స్ 296 పాయింట్లు పతనం

ముంబై: ఈక్విటీ మార్కెట్లో మూడు రోజుల లాభాలకు తెర పడింది. కేంద్ర బడ్జెట్‌కు ముందు ఇన్వెస్టర్లు లాభాల స్వీకారానికి దిగడం మార్కెట్‌ను కుంగదీసింది. మెటల్, ఐటీ, కమోడిటీ షేర్లలో లాభాల స్వీకరణ జోరుగా సాగింది. ఫలితంగా ఒక దశలో 625 పాయింట్ల వరకు నష్టపోయిన సెన్సెక్స్ చివరికి ఆ నష్టాన్ని 296.59 పాయింట్లకు పరిమితం చేసుకుని 82,269.78 వద్ద ముగిసింది. నిఫ్టీ 98.25 పాయింట్ల నష్టంతో 25,320.65 వద్ద క్లోజైంది.

ఆదివారం ప్రత్యేక సెషన్

ఆదివారం ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2026-27 ఆర్థిక సంవత్సరానికి కేంద్ర బడ్జెట్ ప్రతిపాదించనున్న కారణంగా స్టాక్ మార్కెట్లు పని చేస్తాయి. ఆ రోజు బడ్జెట్ ప్రత్యేక సెషన్ నిర్వహిస్తున్నట్టు ఎక్స్ఛేంజీలు ప్రకటించాయి.

- ఫారెక్స్ మార్కెట్లో రూపాయి శుక్రవారం ఇంట్రాడేలో చారిత్రక కనిష్ఠ స్థాయి 92.02ని తాకింది. ఆ తర్వాత కొంత కోలుకుని చివరికి 6 పైసల లాభంతో 91.93 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



31వ తేదీ			
హైదరాబాద్	515	విజయవాడ	550
వరంగల్	517	గోదావరి	515
చిత్తూరు	573	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ.	75

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	135	విజయవాడ	143
వరంగల్	135	గుంటూరు	143
కరీంనగర్	135	ఒంగోలు	143
మహబూబ్‌నగర్	135	చిత్తూరు	126
కర్నూలు	135	నెల్లూరు	131
విశాఖపట్నం	135	అనంతపురం	131
గోదావరి	143		

కుప్పకూలిన మైక్రోసాఫ్ట్ షేరు

ఒక్కరోజే రూ.36.40 లక్షల కోట్లు ఆవిరి

వాషింగ్టన్: అమెరికా మార్కెట్లో మైక్రోసాఫ్ట్ షేరు ఒక్క రోజులోనే 40,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.36.40 లక్షల కోట్లు) నష్టపోయింది. 2020 మార్చి తర్వాత ఈ షేరు ఇంత భారీగా నష్టపోవడం ఇదే ప్రథమం. ఇటీవలి తమ వ్యయ ప్రణాళికల విషయంలో ఇన్వెస్టర్లకు మైక్రోసాఫ్ట్ తగిన సమాధానం ఇవ్వలేకపోవడం, క్లౌడ్ విభాగంలో మందగమనం, ఏఐ సహా నూతన టెక్నాలజీ రంగాల్లో పెట్టుబడుల వంటి అంశాలు గత కొద్ది కాలంగా వాల్‌స్ట్రీట్‌లో చర్చనీయాంశంగా మారడమే ఇందుకు కారణమని మార్కెట్ వర్గాలు వెల్లడించాయి. దీనికి తోడు ఏఐలో పెట్టిన భారీ పెట్టుబడుల నుంచి తగినంతగా రాబడులు ఉండవన్న భయాలు కూడా ఇన్వెస్టర్లను వెన్నాడుతున్నాయి. ఫలితంగా గురువారం మధ్యాహ్నానికి మైక్రోసాఫ్ట్ షేరు 12% నష్టపోయింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ 42,400 కోట్లు (రూ.38.58 లక్షల కోట్లు) తుడిచిపెట్టుకుపోయింది. చివరకు 10 శాతం నష్టంతో క్లోజైంది. అమెరికన్ స్టాక్‌మార్కెట్ చరిత్రలో భారీ ఇంట్రాడే పతనాల్లో ఇది రెండోది. గత ఏడాది జనవరిలో ఎన్‌విడియా షేరు 59,300 కోట్ల డాలర్ల (రూ.53.96 లక్షల కోట్లు) మేరకు నష్టపోయిన తర్వాత నమోదైన మరో కంపెనీ షేరు ఇంత భారీగా పడిపోవడం ఇదే ప్రథమం. చరిత్రలో అత్యంత దారుణమైన పతనాల్లో ఇదొకటని బ్లూమ్‌బర్గ్ తెలిపింది. కాగా శుక్రవారం కూడా మైక్రోసాఫ్ట్ స్వల్ప నష్టాలతో ప్రారంభమైంది.

యాపిల్ హైదరాబాద్ ఆఫీస్ విస్తరణ

హైదరాబాద్: అంతర్జాతీయ టెక్ దిగ్గజం యాపిల్ కంపెనీ హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని వేవ్‌రాక్ ఐటీ క్యాంపస్‌లో మరో 65,000 చదరపు అడుగుల (ఎస్ఎఫ్‌టీ) ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకున్నట్టు సమాచారం. ఐదేళ్ల కాలానికి నెలకు ఎస్ఎఫ్‌టీకి రూ.125 చొప్పున అద్దె చెల్లించేలా ఈ లీజు ఒప్పందం కుదిరింది. అవసరమైతే పరస్పర అవగాహనతో ఈ లీజు ఒప్పందాన్ని మరో ఐదేళ్ల పాటు పొడిగించేందుకూ అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. గత ఏడాది జూలైలోనూ యాపిల్.. వేవ్‌రాక్ క్యాంపస్‌లోనే 64,125 ఎస్ఎఫ్‌టీ కార్యాలయ స్థలాన్ని లీజుకు తీసుకుంది.

కో వర్కింగ్ సంస్థ వుయ్‌వర్క్ ఇండియా హైదరాబాద్‌లో తన కార్యకలాపాలను మరింత విస్తరిస్తోంది. ఇందులో భాగంగా ఈ సంవత్సరం జూలైలోగా కొత్తగా మరో 3,300 సీట్లను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం రూ.100 కోట్లు ఖర్చు చేయనున్నట్టు కంపెనీ తెలిపింది. సొంత నిధులు, రుణాల ద్వారా కంపెనీ ఈ నిధులు సమీకరించనుంది.

బజాజ్ ఆటో లాభం రూ. 2,750 కోట్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో బజాజ్ ఆటో నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 10 శాతం వృద్ధి చెంది రూ.2,750 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే కాలంలో లాభం రూ.2,196 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో ఆదాయం రూ.13,169 కోట్ల నుంచి రూ.16,204 కోట్లకు పెరిగింది. మొత్తం విక్రయాలు 13,41,252 యూనిట్లుగా ఉన్నాయి.

నెస్లే లాభంలో 45% వృద్ధి

న్యూఢిల్లీ: నెస్లే ఇండియా.. డిసెంబరు త్రైమాసికంలో రూ.5,667 కోట్ల ఆదాయంపై రూ.998 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలం (రూ.688 కోట్లు)తో పోల్చితే లాభం ఏకంగా 45.12 శాతం వృద్ధి చెందగా ఆదాయం 18.5 శాతం పెరిగింది. కాగా రూ.1 ముఖ విలువ కలిగిన ప్రతి షేరుకు రూ.7 మధ్యంతర డివిడెండ్‌ను కంపెనీ బోర్డు సిఫారసు చేసింది.



శ్రీవారి డాలర్ల విక్రయ కేంద్రం

దర్శనం ఉన్నవారికే శ్రీవారి డాలర్

- విక్రయాలకు టీటీడీ తాత్కాలిక బ్రేక్
- తక్కువ ధర.. రెట్టింపైన అమ్మకాలపై సమీక్ష
- బులియన్ మార్కెట్ ప్రకారం ధరల సవరణకు యోచన

తిరుమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవేంకటేశ్వరుడి దర్శనం టికెట్ ఉన్నవారికే శ్రీవారి బంగారు డాలర్లు విక్రయించాలని, అదికూడా ఒక్క డాలర్ మాత్రమే ఇవ్వాలని టీటీడీ యోచిస్తోంది. బంగారం ధర ఏరోజుకారోజు పెరిగిపోతున్నందున బల్క్ కొనుగోళ్లకు అడ్డుకట్ట వేసేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని భావిస్తోంది. తగిన నిర్ణయాలు తీసుకునేదాకా డాలర్ల విక్రయాలను తాత్కాలికంగా నిలిపివేసింది. బంగారం ధరలు పెరిగిపోతున్న రోజుల్లో శ్రీవారి డాలర్ల ధరలు వారానికి ఒకసారి మాత్రమే సవరిస్తున్న అంశంపై.. 'శ్రీవారి డాలర్ల కోసం ఒత్తిళ్లు' అంటూ 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు టీటీడీ అధికారులు స్పందించారు. బయటి మార్కెట్‌లో కన్నా టీటీడీ డాలర్ ధర తక్కువగా ఉండడంతో కొనుగోళ్లు పెరగగా, ఆమేరకు టీటీడీకి నష్టం వాటిల్లుతున్న వైనంపై శుక్రవారం సమీక్షించారు. కౌంటర్లలో 2, 5, 10 గ్రాముల డాలర్లు అమ్మకాల రద్దీని బట్టి ఒక్కొక్కరికీ 5,6 వరకు విక్రయించేవారు. ఇకపై కౌంటర్లలో వారానికి ఒకసారి మాత్రమే ధర అమలు చేయడం కాకుండా, బులియన్ మార్కెట్ ప్రకారం ఏరోజుకారోజు ధరలు సవరించేలా ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. ఈమేరకు బయటి మార్కెట్‌లో కన్నా టీటీడీ డాలర్ ధర తక్కువగా ఉండడంతో విక్రయాలపై కౌంటర్‌లోని సిబ్బంది ఆచితూచి వ్యవహరిస్తున్నారు. రూ.50 వేలకు పైగా విలువైన డాలర్లు కొనుగోలు చేస్తే పాన్‌కార్డ్ తప్పనిసరిగా ఇవ్వాలనే నిబంధనను పెట్టారు. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటల వరకు ఒక్క డాలర్‌ను మాత్రమే విక్రయించారు. ఆ తర్వాత తాత్కాలికంగా విక్రయాలను నిలిపివేశారు.

రెట్టింపైన అమ్మకాలు

బంగారు, వెండి డాలర్ల విక్రయాలు ఇటీవల భారీగా పెరిగిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. సాధారణ రోజుల్లో రూ.20 లక్షల నుంచి రూ.40 లక్షల విలువైన శ్రీవారి డాలర్ల విక్రయాలు జరుగుతాయి. అయితే 26వ తేదీ నుంచి అమ్మకాలు రూ.కోటికి పైగా జరగడం గమనార్హం. 26న రూ.1.53 కోట్లు, 27న రూ.1.36 కోట్లు, 28న రూ.16.04లక్షలు(ధర మార్పిడి జరిగిన రోజు), 29న రూ.1.17 కోట్లు విలువ చేసే డాలర్ల విక్రయాలు జరిగాయి.

విధి నిర్వహణలో.. అలసత్వాన్ని సహించం



విశాఖలో ఉత్తరాంధ్ర జిల్లాల పంచాయతీరాజ్ అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్

లక్ష్యాల్లో విఫలమైతే కఠినంగా వ్యవహరిస్తా.. అధికారులకు ఉపముఖ్యమంత్రి స్పష్టీకరణ

- ప్రతి ఒక్కరూ నిబంధనలకు లోబడి పనిచేయాలి
- కొందరికి ఇప్పటికీ వైసీపీ నేతలతో సంబంధాలు
- ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం
- ప్రజలు ఎన్నో ఆశలతో కూటమిని గెలిపించారు
- వారికి మంచి చేయాలన్న తపనతో పనిచేస్తున్నాం
- అధికారులూ చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించాలి
- పవన్ కల్యాణ్ పిలుపు
- విశాఖలో ఉత్తరాంధ్ర జిల్లాల అధికారులతో సమీక్ష

విశాఖపట్నం/మహారాణిపేట, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో అలక్ష్యాన్ని సహించే ప్రసక్తే లేదని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పష్టంచేశారు. తనకు పొగడ్తలు, చప్పట్లు వద్దని.. పని మాత్రమే కావాలన్నారు. ఉన్నతస్థాయి అధికారి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్ వరకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో పనిచేయాలని.. జలజీవన్ మిషన్, ఉపాధి హామీ పనుల్లో నిర్లక్ష్యాన్ని, నిధుల దుర్వినియోగాన్ని సహించేది లేదని తేల్చిచెప్పారు. నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవడంలో విఫలమైనా, పనిపట్ల నిర్లక్ష్యం చూపినా కఠినంగా ఉంటానన్నారు. శుక్రవారం విశాఖ కలెక్టరేట్‌లో ఉత్తరాంధ్ర జిల్లాల పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. 'అధికారులు కొందరు ఇప్పటికీ వైసీపీ నాయకులతో సంబంధాలు నెరపుతూ ప్రభుత్వ విధానాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్న విషయం నా దృష్టికి వచ్చింది. రాజకీయ ప్రలోభాలకు తావులేకుండా ప్రతి ఒక్కరూ నిబంధనల మేరకు పనిచేయాలి. ప్రజలు ఎన్నో ఆశలతో కూటమిని గెలిపించారు. వారి ఆకాంక్షలకు అనుగుణంగా మేమంతా పనిచేస్తున్నాం. ప్రతి అడుగులో ప్రజలకు మంచి చేయాలనే తపనతో ముందుకు వెళ్తున్నాం. ఈ మంచిని జనాలకు చేరువ చేసేందుకు అధికారులు చిత్తశుద్ధితో బాధ్యతలు నిర్వర్తించాలి' అని కోరారు. పంచాయతీరాజ్‌ను ప్రభావవంతమైన శాఖగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని, పారదర్శకత, జవాబుదారీతనంతో పనిచేస్తున్నామని చెప్పా రు. ఉద్యోగులు కూడా అంతే చిత్తశుద్ధి, జవాబుదారీతనంతో పనిచేయాలని ఆశిస్తున్నామన్నారు. అలసత్వం, అవినీతికి తావులేకుండా చూడాలని సూచించారు. సోషల్ ఆడిట్ మొక్కుబడిగా కాకుండా పక్కాగా జరగాలని.. క్షేత్రస్థాయిలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్నారు. ఇదే సమయంలో తన వైపు నుంచి ఎటువంటి రాజకీయ సిఫారసులు ఉండవని స్పష్టంచేశారు.

ఉపాధి పనులపై ఆరా..

ఉపాధి హామీ పథకం కింద పల్లెపండుగ 1.0, పల్లెపండుగ 2.0, అడవితల్లిబాట, జలజీవన్ మిషన్ కింద ఇప్పటివరకూ చేపట్టిన పనులపై ఉపముఖ్యమంత్రి ఆరా తీశారు. గత ఏడాది లక్ష్యాలను పూర్తిచేశారా.. చేయకపోతే కారణాలేమిటో అధికారుల నుంచి వివరణ తీసుకున్నారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ శాఖను నిర్వీర్యం చేసి నిధులు దుర్వినియోగానికి పాల్పడిందన్నారు. 'పంచాయతీల్లో స్వపరిపాలనకు చోటు లేకుండా చేసింది. ఆర్థిక క్రమశిక్షణ లేకుండా విచ్చలవిడితనంతో ఇష్టారాజ్యంగా నిధులు దారిమళ్లించింది. జలజీవన్ మిషన్ ఉద్దేశాన్ని నిర్వీర్యం చేసి సుమారు రూ.4 వేల కోట్లు దుర్వినియోగం చేసింది. పనులు చేసినట్లు రికార్డుల్లో చూపించి నిధులు డ్రాచేశారు తప్ప ఒక్క ఇంటికి కూడా నీరిచ్చిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను సరిదిద్దుతూ వ్యవస్థను బలోపేతం చేసుకుంటూ ముందుకెళ్తున్నాం' అని వివరించారు. పంచాయతీరాజ్ శాఖను బలోపేతం చేయడానికి అనేక సంస్కరణలు తీసుకొచ్చామని, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు ఇచ్చామని తెలిపారు. 'ఒకేసారి పది వేల మందికి పదోన్నతులు కల్పించి ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుంది. ఉద్యోగి నుంచి అధికారి వరకూ ఏ కష్టం వచ్చినా అండగా ఉంటున్నాం. కడప జిల్లాలో ఎంపీడీవోపై దాడి జరిగితే నేను స్వయంగా వెళ్లి భరోసా ఇచ్చాను. పదోన్నతులు పొందిన సంతోషం.. ప్రజలకు అభివృద్ధి ఫలాలు ఇచ్చేటప్పుడు కనిపించాలి. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మేమంతా కష్టపడుతున్నాం. కేంద్ర పెద్దల మద్దతుతో నిధులు సాధిస్తున్నాం. కూటమి ప్రభుత్వ కష్టానికి సార్థకత చేకూరేలా అధికారులు పనిచేయాలి. ప్రజల సంక్షేమం, సంతోషం ధ్యేయంగా పనిచేయాలి' అని విజ్ఞప్తిచేశారు.

సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏమైంది?

- టీటీడీ బోర్డు నిర్ణయం తీసుకుని 7 నెలలు
- ఒక్క అడుగూ ముందుకు పడని ల్యాబ్ ఏర్పాటు అంశం
- సైబర్ మోసాల నుంచి భక్తులకు రక్షణ ఎలా?

తిరుమల, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి భక్తులు సైబర్ మోసాలకు గురికాకుండా నియంత్రించేందుకు ఏర్పాటు చేయదలిచిన 'ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ ల్యాబ్' నిర్ణయం కేవలం ప్రకటనలకే పరిమితమైంది. తిరుమలలో ప్రత్యేక సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తామని టీటీడీ గతేడాది జూలైలో ప్రకటన చేసినా, ఇప్పటివరకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అవినీతి అక్రమాలను అడ్డుకునేందుకు ఎన్ని చర్యలు చేపట్టినప్పటికీ టీటీడీలో నిత్యం ఏదో ఒక అక్రమం వెలుగుచూస్తూనే ఉంది. శ్రీవారి దర్శనానికి ఉన్న డిమాండ్‌ను క్యాష్ చేసుకుంటూ కొందరు సైబర్ నేరగాళ్లు అక్రమాలకు పాల్పడుతున్నారు. శ్రీవారి దర్శనం, బస, ప్రసాదాలు, ఆర్జితసేవలు వంటి వాటిల్లో అక్రమాలు చోటుచేసుకుంటూనే ఉన్నాయి. నకిలీ దర్శన టికెట్లు సృష్టించడంతో పాటు కొందరు తాము టీటీడీ అధికారులమంటూ భక్తులను మోసగించిన సందర్భాలూ చాలానే ఉన్నాయి. ఇక, టీటీడీ, తిరుమల పేరిట నకిలీ వెబ్‌సైట్లు పుట్టుకొస్తున్నాయి. బల్క్ బుకింగ్ ద్వారా టికెట్లు, గదులు పొంది బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకున్న కేసులూ బయట పడుతున్నాయి. ఈ నేపథ్యంలో బుకింగ్ సిస్టమ్‌తో పాటు యాప్‌లు, పోర్టల్‌లో భద్రపరిచిన భక్తుల వ్యక్తిగత, ఆర్థిక, బయోమెట్రిక్ సమాచారంతో పాటు టీటీడీకి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని రక్షించుకునేందుకు ప్రత్యేకంగా టీటీడీకి ఇన్‌హౌస్ సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ అవసరమని గతంలో నిపుణుల బృందం నివేదిక సమర్పించింది. వీటితోపాటు టీటీడీపై తప్పుడు వార్తలను, ప్రతిష్ఠను దెబ్బతీసే చర్యలను అడ్డుకోవడానికి కూడా ఇది ఉపయోగపడుతుందని భావించారు. ఈ నివేదిక ఆధారంగా గతేడాది జూలైలో సైబర్ సెక్యూరిటీ ల్యాబ్ ఏర్పాటుకు టీటీడీ బోర్డు నుంచి గ్రీన్ సిగ్నల్ లభించింది. తొలుత 40నుంచి 50 మంది సిబ్బందితో అక్టోపస్ భవనంలో ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో ఏర్పాటు చేసిన ఏఐ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లోనే ఏర్పాటు చేయాలని అనుకున్నారు. అయితే ఇప్పటిదాకా ఏదీ కార్యరూపం దాల్చలేదు. సైబర్ నేరగాళ్లు పెరిగిపోతున్న ఈ కాలంలో దీని అవసరం తీవ్రంగా ఉన్నా టీటీడీ పట్టించుకోకపోవడం పట్ల భక్తుల్లో అసంతృప్తి నెలకొంది.



సీఎం, డిప్యూటీ సీఎంలను రాక్షసులుగా చిత్రీకరిస్తూ ఫ్లెక్సీ

భూమన వివాదాస్పద ఫ్లెక్సీ

- సీఎం, డిప్యూటీ సీఎంలను రాక్షసులుగా చిత్రీకరణ
- టీడీపీ శ్రేణుల ఆందోళన
- కరుణాకర్‌రెడ్డి సహా మొత్తం ఐదుగురిపై కేసు నమోదు

తిరుపతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సిట్ నివేదిక తమకు అనుకూలంగా వచ్చిందంటూ వైసీపీ నేతలు సంబరాలు చేసుకుంటున్న క్రమంలో టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి శుక్రవారం ఉదయం తన స్వగృహంలో హోమం నిర్వహించారు. శ్రీనివాస ప్రసాద నిందా పరిహార హోమంలో భూమన దంపతులు పాల్గొన్నారు. సుమారు రెండుగంటల పాటు హోమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన నివాసం వద్ద 'దైవ ద్రోహులు' పేరిట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వివాదానికి దారి తీసింది. మునులు హోమం చేస్తుంటే రాక్షసుల్లా చిత్రీకరించిన చంద్రబాబు, పవన్ కల్యాణ్ చెరోవైపు రక్తాన్ని హోమ గుండంలోకి వంపుతున్నట్లు ఆ ఫ్లెక్సీపై ఉంది. సమాచారం అందుకున్న తిరుచానూరు పోలీసులు భూమన నివాసం వద్దకు చేరుకుని... అభ్యంతకర ఫెక్సీని తొలగించారు. పోలీసులు వెళ్లిన కొద్ది సేపటికి విషయం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు భూమన నివాసం వద్దకు చేరుకున్నాయి. తమ అధినేతల ఫొటోలను అభ్యంతరకరంగా ముద్రించడాన్ని సహించేది లేదంటూ హెచ్చరించారు. అనంతరం తిరుచానూరు పోలీస్ స్టేషన్ చేరుకుని సీఎం, డిప్యూటీ సీఎంలను అవమానిస్తూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ సీఐ సునీల్ కుమార్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై శుక్రవారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. కరుణాకర్‌రెడ్డి, ఫెక్సీ తయారీదారు సహా మొత్తం ఐదుగురిపై కేసు నమోదు చేశారు.

హెల్మెట్ ఎక్కడమ్మా..!

- రోడ్డుపైనే ఓ యువకుడి తల్లికి మంత్రి సవిత ఫోన్



యువకుడి తల్లితో ఫోన్‌లో మాట్లాడుతున్న మంత్రి సవిత, చిత్రంలో కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీశ్ కుమార్

హిందూపురం, జనవరి 30(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండలో శుక్రవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. హెల్మెట్ లేకుండా బైక్ నడుపుతున్న ఓ యువకుడిని మంత్రి సవిత ఆపి, అతని వివరాలు ఆరా తీశారు. తన పేరు సాయి అని, తమ ఊరు సోమందేపల్లి అని ఆ యువకుడు తెలిపాడు. అతని తల్లికి ఫోన్ చేయించి మాట్లాడారు. 'అమ్మా.. నేను మినిస్టర్ సవితమ్మను మాట్లాడుతున్నా. మీ కుమారుడికి రూ.2.5లక్షల బండిని కొనిచ్చారు. బైక్ కంటే నీ కుమారుడు ముఖ్యం కదా..! హెల్మెట్ ఎందుకు కొనివ్వలేదు?' అని ప్రశ్నించారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'జన నాయగన్' వివాదం సీబీఎఫ్‌సీ కేవియట్ పిటిషన్

హీరో విజయ్ నటించిన తాజా చిత్రం 'జన నాయగన్' సెన్సార్ వివాదంపై సెన్సార్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ కార్పొరేషన్ (సీబీఎఫ్‌సీ) శుక్రవారం సుప్రీంకోర్టులో కేవియట్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఈ వివాదంలో ఇటీవల మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై చిత్ర నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అప్పీల్ చేసిన పక్షంలో తమ వాదనలు పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదని అందులో సెన్సార్ బోర్డు విన్నవించింది. దీంతో ఈ సినిమా వివాదంపై సింగిల్ జడ్జి విచారణ పూర్తయ్యేంతవరకు సినిమా విడుదల తేదీపై ఎలాంటి స్పష్టత వచ్చే అవకాశం లేదని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. కాగా, జనవరి 10వ తేదీన విడుదల కావాల్సిన ఈ చిత్రం సెన్సార్ వివాదం కారణంగా వాయిదా పడిన విషయం తెల్సిందే.



చెన్నై (ఆంధ్రజ్యోతి)



టాలీవుడ్‌కు కొత్త అందం!

సీనియర్ హీరో కృష్ణ మనవడు జయకృష్ణ ఘట్టమనేనిని హీరోగా పరిచయం చేస్తూ దర్శకుడు అజయ్ భూపతి రూపొందిస్తున్న తాజా చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమాతో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె, 'ఉయ్ అమ్మ' పాటతో ఎంతో పాపులర్ అయిన రాషా థడానీ తెలుగు చిత్ర పరిశ్రమలోకి ఎంట్రీ ఇస్తోంది. మహేశ్ బాబు సహా పలువురు నట వారసులను చిత్ర పరిశ్రమకు పరిచయం చేసిన అగ్ర నిర్మాత అశ్వనీదత్ ఇప్పుడు మరో కొత్త హీరో జయకృష్ణను పరిచయం చేస్తున్నారు. పి. కిరణ్ ఈ చిత్రానికి నిర్మాత. శుక్రవారం రాషా ఫస్ట్ లుక్ విడుదల చేశారు. 'శ్రీనివాస మంగాపురం' చిత్రంలో ఆమె మంగగా నటిస్తోంది. సాంప్రదాయ దుస్తుల్లో రాషా ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఇటీవల 30 రోజుల పాటు జరిగిన షూటింగ్‌తో సినిమా తొలి షెడ్యూల్ పూర్తయింది. ప్రస్తుతం రెండో షెడ్యూల్ జరుగుతోంది.

'వారణాసి' విడుదల అప్పుడే!



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'వారణాసి' విడుదల తేదీపై స్పష్టత వచ్చింది. 2027 ఏప్రిల్ 7న ఈ సినిమాను విడుదల చేయనున్నట్లు సోషల్ మీడియా వేదికగా ప్రకటించారు. ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా నటిస్తున్న ఈ భారీ యాక్షన్ థ్రిల్లర్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. డాక్టర్ కె.ఎల్.నారాయణ, ఎస్ ఎస్ కార్తికేయ 'వారణాసి' చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. అద్భుతమైన, అసాధారణ ప్రచార వ్యూహాలకు పేరొందిన దర్శకుడు రాజమౌళి 'వారణాసి' రిలీజ్ డేట్ ప్రచారాన్ని భారీ స్థాయిలో ప్రారంభించారు. గురువారం వారణాసి నగరం అంతా విడుదల తేదీ పోస్టర్లు కనిపించి చర్చకు దారి తీశాయి. శుక్రవారం చిత్రం విడుదల తేదీని అధికారికంగా ప్రకటించారు రాజమౌళి. గ్లోబ్ ట్రాటర్, టైమ్ ట్రాటర్ అనే ట్యాగ్ లైన్స్‌తో 'వారణాసి' చిత్రం భారతదేశంలోనే కాకుండా అంతర్జాతీయ వేదికలపై కూడా సంచలనం సృష్టించడానికి సిద్ధమవుతోంది.

తమిళ తెరపై 'ఉత్తమ' మెరుపులు

● 2016 నుంచి 2022 వరకు సినీ పురస్కారాలను ప్రకటించిన ప్రభుత్వం



తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం చిత్ర పరిశ్రమకు సంబంధించి 'ఉత్తమ' సినీ అవార్డులను ప్రకటించింది. ఒకేసారి ఏకంగా 2016 నుంచి 2022 సంవత్సరం వరకు ఏడు సంవత్సరాలకు ఈ అవార్డుల విజేతల పేర్లను వెల్లడించింది. ఈ అవార్డులకు ఎంపికైన వారిలో ఉత్తమ నటులుగా ధనుష్, కార్తి, విజయ్ సేతుపతి, ఆర్.పార్తిబన్, సూర్య, ఆర్య, విక్రమ్ ప్రభు, హీరోయిన్లలో కీర్తి సురేష్, నయనతార, జ్యోతిక, మంజు వారియర్, అపర్ణా బాలమురళి, లిజోమోల్ జోస్, సాయిపల్లవి తదితరులు ఉన్నారు. ఉత్తమ బాల నటుడుగా హీరో అరుణ్ విజయ్ తనయుడు ఆర్నవ్ విజయ్‌ను ఎంపిక చేశారు. ఉత్తమ చిత్రాలుగా 'మానగరం', 'అరమ్', 'పరియేరుమ్ పెరుమాల్', 'అసురన్', 'కూళంగల్', 'జై భీమ్', 'గార్గి'లు ఎంపికయ్యాయి. అలాగే, టీవీ రంగంలో ఉత్తమ నటులుగా, ఆర్.పాండిరాజన్, కౌశిక్, కృష్ణ, తలైవాసల్ విజయ్, వి.సంజీవ్, జై ఆకాష్, కార్తిక్‌రాజ్, నటీమణులుగా రాధిక శరత్ కుమార్, వాణి భోజన్, నీలిమారాణి, సంఘవి, రేవతి, రేష్మ, శోభన షాజహాన్, చైత్రాలకు అవార్డులు వరించాయి. ఈ అవార్డుల ప్రధానోత్సవం ఫిబ్రవరి 13న చెన్నై ట్రిప్లికేణిలోని కలైవానర్ అరంగంలో జరగనుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, సినీ హీరో ఉదయనిధి స్టాలిన్ పాల్గొని ఉత్తమ నటీనటులు, సాంకేతిక నిపుణులకు అవార్డులతో పాటు నగదు పురస్కారం, ప్రశంసా పత్రాలను ప్రదానం చేయనున్నారు. కాగా, ఉత్తమ చిత్రాలుగా ఎంపికైన మొదటి మూడు చిత్రాలకు తొలి బహుమతిగా రూ.2 లక్షలు, రెండో బహుమతిగా రూ.లక్ష, మూడో బహుమతిగా రూ.75 వేలు చొప్పున నగదు బహుమతి, ఒక సవర బంగారు పతకం, జ్ఞాపికను ప్రదానం చేస్తారు. అలాగే, మహిళలను ఉన్నతంగా చిత్రీకరిస్తూ నిర్మించిన చిత్రానికి ప్రత్యేకంగా రూ.1.25 లక్షల నగదు బహుమతిని అందజేస్తారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)





వ్యర్థాల నిర్వహణకు ప్రాధాన్యమివ్వండి

» టిడ్కో ఇళ్లను వేగవంతం చేయండి: మంత్రి నారాయణ

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): అన్ని మున్సిపాలిటీల్లో ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు అధికారులు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ సూచించారు. అనంతపురంలో జరుగుతున్న మున్సిపల్ కమిషనర్ల ప్రాంతీయ సదస్సుకు ఆయన, సీఆర్‌డీఏ కమిషనర్ కన్నబాబు అమరావతి నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. అన్ని మున్సిపాలిటీల్లో ప్రజలకు పూర్తి స్థాయిలో తాగునీరు అందించడంతో పాటు భూగర్భ డ్రైనేజీల నిర్మాణానికి అమృత్‌తో పాటు వివిధ పథకాల ద్వారా పనులు చేపడుతున్నట్లు మంత్రి చెప్పారు. దీనికి టెండర్ల ప్రక్రియ కొలిక్కి వచ్చిందని, వచ్చే నెల రెండో వారంలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆయా పనులకు శంకుస్థాపన చేస్తారని మంత్రి తెలిపారు. మార్చి 31 నాటికి లెగసీ వేస్ట్‌ను పూర్తిగా తొలగించి ఆయా ప్రాంతాలను పార్కులుగా అభివృద్ధి చేయాలని సూచించారు. టౌన్ ప్లానింగ్‌లో దేశంలోనే ముందంజలో ఉండేలా సంస్కరణలు తీసుకురావడంలో కీలకంగా వ్యవహరించిన ఆ విభాగం డైరెక్టర్ విద్యుల్లతను మంత్రి అభినందించారు. సమావేశంలో ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్, సీడీఎంఏ డైరెక్టర్ సంపత్‌కుమార్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండీ అనిల్‌కుమార్‌రెడ్డి, టిడ్కో ఎండీ సునీల్‌రెడ్డి, పట్టణ విభాగం డైరెక్టర్ విద్యుల్లత పాల్గొన్నారు.

సర్పంచ్‌ను చేస్తే 30 లక్షలు ఇస్తా

» అనంతపురం జిల్లాలో ఇప్పటి నుంచే ఎన్నికల సందడి



విడపనకల్లు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలకు నోటిఫికేషన్ రాకుండానే గ్రామాల్లో ఆశావహులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. అనంతపురం జిల్లా విడపనకల్లు మండలం మాళాపురంలో 15 రోజుల కిందట ఓబులేసు అనే వ్యక్తి తొలిగా దండోరా వేయించారు. తనను సర్పంచ్‌గా ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి రూ. 12 లక్షలు ఇస్తానని డప్పు కొట్టి చెప్పారు. ఇదే తరహాలో విడపనకల్లులో శుక్రవారం ఉదయం యొగమ్మగారి మల్లికార్జున అనే వ్యక్తి కూడా దండోరా వేయించారు. విడపనకల్లు సర్పంచ్ పదవికి తనను ఏకగ్రీవంగా ఎన్నుకుంటే గ్రామాభివృద్ధికి రూ. 30 లక్షలిస్తానని ప్రకటించారు. ఈ విషయం పోలీసులకు తెలిసింది. ఓబులేసు, మల్లికార్జునలను విడపనకల్లు ఎస్ఐ ఖాజాహుస్సేన్ స్టేషన్‌కు పిలిపించి విచారించారు. అనుమతి లేకుండా ఎవరూ దండోరా వేయవద్దని, ప్రశాంతతకు భంగం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నాన్ ఎస్‌సీఎస్ కోటాలో ఐదుగురికి ఐఏఎస్

» 6 పోస్టులకు ఐదుగురు ఎంపిక

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): నాన్ స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఐదు మంది సీనియర్ అధికారులకు ఐఏఎస్ హోదా లభించింది. 2023-24, 2024-25 కు సంబంధించి నాన్ స్టేట్ సివిల్ సర్వీసెస్ కోటాలో ఆరు ఐఏఎస్ పోస్టులు ఖాళీ అయ్యాయి. ఈ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వగా 69 మంది సీనియర్ అధికారులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో సర్వీస్ ట్రాక్ బాగున్న 29 మందిని అధికారులను ఎంపిక చేసిన ప్రభుత్వం, వారి పేర్లను యుపీఎస్సీకి పేర్లు పంపించింది. డిసెంబర్ 29, 30వ తేదీల్లో యుపీఎస్సీ 29 మంది అధికారులకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఆరు పోస్టులకు ఆరుగురిని ఎంపిక చేసింది. ఆరుగురిలో జైళ్లశాఖకు చెందిన ఎం.వరప్రసాద్, పరిశ్రమల శాఖకు చెందిన ఎ.ఎ.ఎల్.పద్మావతి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన జి.బాలకృష్ణ, రాష్ట్ర పన్నుల శాఖకు చెందిన ఎం.జయకృష్ణ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన పి.గోపీనాథ్ ఉన్నారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖకు చెందిన వి.రవికుమార్ వార్షిక రహస్య నివేదికల్లో తేడా ఉండడంతో అతను ఎంపిక కాలేదు. ఆరు పోస్టులకు ఐదే భర్తీ అయ్యాయి. ఈ ఏడాది ఇచ్చే నోటిఫికేషన్‌లో మిగిలిన పోస్టులను కలిపి మూడు ఐఏఎస్ పోస్టులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయనుంది.

తెలిసినా.. మౌనంగా ఉన్నాం!

» అద్దేపల్లి కనుసన్నల్లోనే నకిలీ మద్యం దందా

» ముగిసిన రాజేశ్, అన్బురుసు కస్టడీ విచారణ

ములకలచెరువు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "నకిలీ మద్యం తయారీ గురించి తెలిసినా... మౌనంగా ఉన్నాం. ములకలచెరువు కేంద్రంగా జరిగిన నకిలీ మద్యం తయారీ, రవాణా అంతా ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు కనుసన్నల్లోనే జరిగింది. ఎవరి కుట్రతో తయారీ యూనిట్ ప్రారంభించాడో తెలియదు గానీ, 2025 మొదటి నుంచి ప్రయత్నాలు ఆరంభించాడు. అవసరమైన సామగ్రి, ముడి సరుకులు, స్పిరిట్‌ను బెంగళూరు, హైదరాబాద్ నుంచి తెప్పించుకుని, ఎవరికీ అనుమానం రాకుండా ములకలచెరువు కేంద్రంగా జూన్-జూలై నెలల్లో తయారీ ప్రారంభించాడు. ములకలచెరువు, పెద్దతిప్పసముద్రంలోని రెండు మద్యం దుకాణాలను లీజుకు తీసుకుని.. నకిలీ మద్యం అమ్మకాలు చేశాడు. నియోజకవర్గంలోని ఆరు మండలాల్లోని బెల్ట్‌షాపులకు నకిలీ మద్యం అమ్మకాలు జరిగేలా చూశాడు" అని ములకలచెరువు నకిలీ మద్యం కేసులో కీలక నిందితులు రాజేశ్, అన్బురసులు రెండో రోజు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. జిల్లా ఏఈఎస్, దర్యాప్తు అధికారి జోగేంద్ర శుక్రవారం వీరిద్దరి నుంచి కీలక విషయాలు రాబట్టారు. తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ సస్పెండైన జయచంద్రారెడ్డి, ఆయన బావమర్ది గిరిధర్‌రెడ్డి పాత్రపై ప్రశ్నించినట్లు తెలిసింది. అనంతరం నిందితులను మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహించారు. తర్వాత తంబళ్లపల్లె కోర్టులో హాజరుపరిచి, సాయంత్రం మదనపల్లె సబ్‌జైలుకు తీసుకెళ్లారు.

ఈహెచ్ఎస్ సేవలను మెరుగుపరచాలి: బొప్పరాజు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఏపీజేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. ఈ స్కీమ్‌పై ప్రభుత్వం నియమించిన కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో 25 దీర్ఘకాలిక వ్యాధులు, ఓపీలు చూడాలని, మందులు ఉచితంగా ఇవ్వాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎన్ఏబీహెచ్ ఆసుపత్రుల్లో కూడా ఈహెచ్ఎస్ ద్వారా వైద్య సేవలందించేలా చర్యలు తీసుకోవాలన్నారు.

'అలుగు'ను స్మగ్లింగ్ చేస్తున్న ముఠా అరెస్ట్



అలుగు

రాపూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అంతరించిపోతున్న అరుదైన వన్యప్రాణి అలుగు (పాంగోలియన్)ను విక్రయించేందుకు ప్రయత్నిస్తున్న ఓ ముఠాను నెల్లూరు జిల్లా అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. రాపూరు అటవీ శాఖ కార్యాలయంలో రేంజర్ మాల్యాద్రి వెల్లడించిన వివరాల ప్రకారం.. రాపూరు పరిసర ప్రాంతాల్లో అలుగును విక్రయించేందుకు ఒక ముఠా ప్రయత్నిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అటవీ శాఖ బృందం గురువారం రాత్రి వ్యూహాత్మకంగా నిందితులను పట్టుకుంది. అలుగుతోపాటు ఓ బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. రాపూరు మండలం తెగచెర్లకు చెందిన చల్లా లింగయ్య, వెంకటేశ్వర్లు, తిరుపతి జిల్లా డక్కిలికి చెందిన నిడిగింటి శీనయ్య, నెల్లూరు జిల్లా దగదర్తికి చెందిన గొల్లపూడి వెంకటరమణయ్య, అనంతసాగరం మండలం మగుపల్లికి చెందిన పోలంరెడ్డి పెంచలయ్య, కడపకు చెందిన చిట్టి రాజులను అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న అలుగును వన్యప్రాణి సంరక్షణ కేంద్రం లేదా అటవీ ప్రాంతంలో విడుదల చేస్తామని రేంజర్ తెలిపారు.

పొగమంచు.. వాహనదారులూ జాగ్రత్త!

విశాఖపట్నం, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కోస్తాలో శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు పలు జిల్లాల్లో శుక్రవారం పొగమంచు కురిసింది. కొన్ని ప్రాంతాల్లో దట్టంగా మంచు కురవడంతో విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరిక బులెటిన్లు జారీచేసింది. ఉదయం పది గంటల వరకూ వాహనదారులను అప్రమత్తం చేసింది. మరోవైపు మధ్యభారతం నుంచి వీస్తున్న చలిగాలుల ప్రభావంతో కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల చలి తీవ్రత కొనసాగింది. రానున్న రెండు, మూడు రోజుల్లో శ్రీకాకుళం నుంచి బాపట్ల, ఇంకా చిత్తూరు జిల్లాలో ఉదయం పూట పొగమంచు కురుస్తుందని విశాఖ తుఫాన్ హెచ్చరిక కేంద్రం హెచ్చరించింది.

వరద జలాలను.. ఏపీ వాడుకుంటే నష్టమేంటి?

తెలంగాణను ప్రశ్నించిన జలసంఘం చైర్మన్.. పోలవరం-బనకచర్లకే కట్టుబడి ఉన్నాం: ఆంధ్రప్రదేశ్

» అందులో భాగంగానే తొలి దశలో నల్లమలసాగర్ వరకు చేపడుతున్నాం

» టన్నెళ్లు, కాలువల తవ్వకానికి సమయం పడుతుంది

» అందుకే నల్లమలసాగర్ వరకే డీపీఆర్ తయారీ

» కృష్ణా జలాల్లో చెరిసగం వాటాకు అంగీకరించం

» ఏపీ సలహాదారు వెంకటేశ్వరరావు స్పష్టీకరణ

» ఢిల్లీలో ఉన్నతస్థాయి కమిటీ తొలి భేటీ



అమరావతి/న్యూఢిల్లీ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): గోదావరి వరద జలాలను దిగువ, చిట్టచివరి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వాడుకుంటే తప్పేమిటని కేంద్ర జల సంఘం చైర్మన్ అనుపమ్ ప్రసాద్ తెలంగాణను ప్రశ్నించారు. ఉభయ రాష్ట్రాల నడుమ నీటి సమస్యల పరిష్కారానికి శుక్రవారం ఢిల్లీలో ఆయన అధ్యక్షతన కేంద్రం నియమించిన ఉన్నత స్థాయి కమిటీ తొలి సమావేశం జరిగింది. రెండు గంటలపాటు చర్చ జరుగగా.. తెలంగాణ తన ఎజెండా అంశాలను ఇవ్వలేదు. ఏపీ ఇచ్చిన ఎజెండాను జలసంఘం పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో వివరించింది. 66:34 నిష్పత్తిలో కాకుండా కృష్ణా జలాలను రెండు రాష్ట్రాలకు చెరిసగం పంచాలన్న తెలంగాణ డిమాండ్‌ను ఆంధ్రప్రదేశ్ తిరస్కరించింది. ఈ వ్యవహారంపై ప్రస్తుతం బ్రిజేశ్‌కుమార్ ట్రైబ్యునల్ విచారణ జరుపుతున్నందున.. కేటాయింపులపై రాష్ట్రాలు అభిప్రాయాలను వెల్లడించడం కోర్టు ధిక్కరణ కిందకు వస్తుందని స్పష్టం చేసింది. ప్రాజెక్టుల వారీగా గోదావరి జలాల కేటాయింపులు లేకుండానే పొరుగు రాష్ట్రం కాళేశ్వరం సహా పలు ప్రాజెక్టులను నిర్మించలేదా అని నిలదీసింది. కమిటీ సమావేశం అనంతరం రాష్ట్రప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు మీడియాకు వివరాలు తెలియజేశారు. 'గోదావరి వరద జలాల ఆధారంగా పోలవరం-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు చేపట్టడాన్ని తెలంగాణ ప్రశ్నించింది. అయితే ఎగువ రాష్ట్రాలు వారి హక్కుల ప్రకారం వినియోగించుకున్న తర్వాతే.. పోలవరం నుంచి సముద్రంలో వృధాగా కలిసిపోయే వరద జలాలతోనే బనకచర్ల పథకానికి రూపకల్పన చేశామని మేం స్పష్టం చేశాం. పోలవరం-బనకచర్ల పథకానికే కట్టుబడి ఉన్నామని తేల్చి చెప్పాం. ఈ పథకంలో భాగంగానే తొలిదశలో నల్లమలసాగర్ వరకు ప్రాజెక్టు చేపడుతున్నాం. టన్నెళ్లు, కాలువల నిర్మాణానికి సమయం పట్టనున్నందున.. పోలవరం-నల్లమల సాగర్ ప్రాజెక్టుకు డీపీఆర్ తయారు చేయిస్తున్నాం. వృధాగా పోయే వరద జలాలతో పథకాన్ని రూపొందిస్తే తప్పేమిటని జల సంఘాన్ని మేం ప్రశ్నించాం. ఆంధ్రప్రదేశ్ అంగీకారం లేకుండా కాళేశ్వరం, సీతారామసాగర్ ప్రాజెక్టులకు అనుమతులు ఇచ్చినప్పుడు లేని అభ్యంతరం.. బనకచర్ల అనుసంధాన పథకానికి ఎందుకని నిలదీశాం' అని తెలిపారు. ఉమ్మడి రాష్ట్రానికి కేటాయించిన కృష్ణా జలాలను 66:34 నిష్పత్తిలో ఏపీకి 512 టీఎంసీలను, తెలంగాణకు 299 టీఎంసీలను కేటాయించారని గుర్తుచేశారు. అయితే ఈ వాటాను చెరి సగం చేయాలన్న తెలంగాణ వాదనను తాము తోసిపుచ్చామని చెప్పారు. ఇది కృష్ణా జలవివాదాల ట్రైబ్యునల్, అపెక్స్ కౌన్సిల్ నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశామన్నారు.

వారం గడువిస్తే ఎజెండా సమర్పిస్తాం: తెలంగాణ

కమిటీ ఎజెండాలో నల్లమలసాగర్ ప్రాజెక్టును చేర్చవద్దని తెలంగాణ కోరింది. వారం రోజులు గడువిస్తే తమ ఎజెండాను పంపుతామని తెలిపింది. ఇందుకు జలసంఘం అంగీకరించింది. ఇప్పటికే ఏపీ తన ఎజెండాను పంపినప్పటికీ.. ఇంకొన్ని అంశాలను కలిపి మరోసారి పంపాలని కోరింది. సదరు ఎజెండాలపై రెండు రాష్ట్రాలూ 15 రోజుల్లో పరస్పరం అభిప్రాయాలు చెప్పాలని.. ఆ తర్వాత మరోసారి కమిటీ సమాశం ఉంటుందని చైర్మన్ అనుపమ్ ప్రసాద్ వెల్లడించారు. శుక్రవారంనాటి భేటీలో ఏపీ తరపున ఈఎన్‌సీ నరసింహామూర్తి, అంతర్రాష్ట్ర జలవివాదాల విభాగం సీఈ సుగుణాకరరావు, ఎస్ఈ గిరిధర్‌రావు.. తెలంగాణ నుంచి ఆ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జె పాటిల్, ఈఎన్‌సీ మహ్మద్ అమ్జాద్ హుస్సేన్, సీఈ ప్రసాద్ హాజరయ్యారు.

బీఈడీ కాలేజీలపై కొరడా

» సబ్జెక్టు మెథడాలజీలో ఉల్లంఘనలు గుర్తింపు

» ఒక్కో అడ్మిషన్‌పై రూ.3 వేలు పెనాల్టీ కట్టండి

» సుమారు 5వేల అడ్మిషన్లపై జరిమానా విధింపు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): బీఈడీ కాలేజీల్లో ఉల్లంఘనలపై ఉన్నత విద్యామండలి కొరడా ఝుళిపించింది. సబ్జెక్టు మెథడాలజీలో ఉల్లంఘనలకుగాను కాలేజీ యాజమాన్యాలపై భారీ జరిమానా విధించింది. మెథడాలజీ ఉల్లంఘనలతో చేపట్టిన ఒక్కో అడ్మిషన్‌పై రూ.3వేలు చొప్పున సుమారు 5వేల అడ్మిషన్లపై జరిమానా చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనిపై ఉన్నత విద్యామండలి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేసింది. 2008లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 31 ప్రకారం బీఈడీ కాలేజీలు మెథడాలజీని తప్పనిసరిగా అమలుచేయాలి. ఆయా కాలేజీల్లో ఉన్న మొత్తం సీట్లలో 25 శాతం గణితం కోర్సులతో భర్తీ చేయాలి. ఫిజిక్స్, బయాలజీకి 30 శాతం సీట్లు ఉంటాయి. వీటిలో కనిష్ఠంగా 10 శాతం, గరిష్ఠంగా 20శాతం సీట్లను పరస్పరం మార్చుకోవచ్చు. సోషల్ స్టడీస్, ఇంగ్లిష్ కోర్సులకు 45 శాతం సీట్లు ఉంటాయి. వాటిలో 10-15 శాతం సీట్లు మార్చుకోవచ్చు. అయితే చాలా కాలేజీలు ఈ పరిమితిని దాటి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు మండలి గుర్తించి కాలేజీలను వివరాలు కోరింది. ఇప్పటి వరకూ 284 కాలేజీలు ఆ సమాచారం సమర్పించాయి. చాలావరకు కాలేజీలు మెథడాలజీని ఉల్లంఘిస్తున్నాయి. దీంతో సీరియస్ అయిన మండలి భారీగా జరిమానాలు విధించింది.

ప్రవేశ పరీక్షలు సకాలంలో పూర్తి

» సెట్ల కన్వీనర్లతో ఉన్నత విద్యామండలి సమీక్ష

వివిధ కోర్సుల్లో వచ్చే విద్యా సంవత్సరంలో నిర్వహించే ప్రవేశ పరీక్షలను సకాలంలో పూర్తిచేస్తామని ఉన్నత విద్యామండలి తెలిపింది. 2026-27లో జరిగే సెట్లకు నియమితులైన కన్వీనర్లు, ఆన్‌లైన్ సర్వీసు ప్రొవైడర్లతో మండలి చైర్మన్ కె. మధుమూర్తి, ఇతర అధికారులు సమీక్షించారు. పరీక్షల ప్రక్రియ, దరఖాస్తులు, హాల్‌టికెట్ల విడుదల, పరీక్షల షెడ్యూళ్లు, ఫలితాలు, కౌన్సెలింగ్‌పై సమగ్ర నివేదికలు రూపొందించాలని కన్వీనర్లను ఆదేశించారు. పరీక్షలపై రియల్ టైమ్ డేటా కోసం డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేయాలన్నారు.

రాజధానిలో బిట్స్ అమరావతి



బిట్స్ ప్రతినిధులకు ఒప్పంద పత్రాన్ని అందజేస్తున్న సీఆర్‌డీఏ అధికారులు

» మందడం-వెంకటపాలెంలో 70 ఎకరాల్లో ప్రాంగణం

» పూర్తయిన భూ విక్రయ ఒప్పందం

» ప్రారంభమవుతున్న నిర్మాణ పనులు

» మూడు దశల్లో అభివృద్ధి... 10 వేల మందికి విద్యావకాశాలు

గుంటూరు, జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతిలో మరో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ కొలువు తీరబోతోంది. బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్(బీఐటీఎస్) అమరావతిలో 70.011 ఎకరాల్లో ప్రాంగణాన్ని ఏర్పాటు చేయబోతోంది. బిట్స్‌కు తుళ్లూరు మండలంలోని మందడం, వెంకటపాలెంలో రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించింది. ఈ మేరకు ఏపీసీఆర్డీఏతో శుక్రవారం బిట్స్ ప్రతినిధులు భూ విక్రయ ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. కార్యక్రమంలో ఏపీసీఆర్డీఏ ఎస్టేట్స్ విభాగం జాయింట్ డైరెక్టర్ వీ.డేవిడ్ రాజు, బిట్స్ పిలానీ ప్రతినిధిగా డిప్యూటీ రిజిస్ట్రార్ వీవీఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు. మందడం సబ్ రిజిస్ట్రార్ సి.హెచ్. రాంబాబు సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. సంస్థ ప్రతినిధులు మీడియాతో మాట్లాడారు. 'బిట్స్ అమరావతి క్యాంపస్‌ను మూడు దశల్లో అభివృద్ధి చేస్తాం. మొదటి దశలోనే సుమారు రూ.1,000 కోట్ల పెట్టుబడితో క్యాంపస్ పనులు ప్రారంభిస్తున్నాం. ఆధునిక మౌలిక వసతులతో కూడిన స్మార్ట్ భవనాలు, కృత్రిమ మేధ ఆధారిత సేవలు, ఆధునిక బోధన పద్ధతులు, పర్యావరణహిత నిర్మాణాలతో ఈ క్యాంపస్‌ను కొత్తతరం విజ్ఞాన కేంద్రంగా అభివృద్ధి చేస్తాం. 2027 నుంచి అమరావతి క్యాంపస్‌లో విద్యార్థులకు ప్రవేశాలు లభించేలా నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేస్తాం. దశలవారీగా 10,000 మంది విద్యార్థులు అమరావతి బిట్స్‌లో విద్యను అభ్యసించేలా ప్రణాళికాయుతంగా కార్యకలాపాలు నిర్వహిస్తాం. ఈ క్యాంపస్ ద్వారా వందలాది మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయి' అని వారు తెలిపారు.

గ్రూప్-1 ఫలితాలు విడుదల

(మొదటి పేజీ తరువాయి)

కారణంగా రెండు క్రీడా కోటా పోస్టులను పెండింగ్‌లో పెట్టింది. సీటీవో, డీఎస్పీ సివిల్ పోస్టులు మినహా మిగిలిన పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసింది. వివిధ కేటగిరీల్లో పోస్టులకు ప్రాథమికంగా ఎంపిక చేసిన వారి హాల్‌టికెట్ నంబర్లతో కూడిన జాబితాను వెబ్‌సైట్‌లో పొందుపరిచింది. 2023 డిసెంబరులో 81 పోస్టులతో గ్రూప్-1 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. అనంతరం 8 క్యారీ ఫార్వార్డ్ పోస్టులు కలిపారు. 2024 మార్చిలో ప్రిలిమ్స్, 2025 మేలో మెయిన్స్ జరిగాయి. జూన్‌లో ఫలితాలు విడుదలయ్యాయి. ఇంటర్వ్యూలకు 185 మంది ఎంపికయ్యారు. వారిలో నలుగురు క్రీడా కోటా అభ్యర్థులున్నారు. మొత్తం పోస్టుల్లో 2 క్రీడా కోటా పోస్టులున్నాయి. ఇప్పుడు క్రీడా కోటా మినహా 87 పోస్టులకు అభ్యర్థులు ఎంపికయ్యారు. ఇందులో బీసీ-ఈ కేటగిరీ అభ్యర్థుల ఎంపిక న్యాయస్థానంలో ఉన్న ఓ కేసులో తుది తీర్పునకు అనుగుణంగా ఉంటుందనే షరతుతో జరిగిందని ఏపీపీఎస్సీ తెలిపింది. అలాగే మిగిలిన అభ్యర్థుల ఎంపికలోనూ క్రీడా, ఇతర కేసుల తుది తీర్పు అనంతరం మార్పులు జరగొచ్చని స్పష్టం చేసింది. కాగా, ఇటీవల గ్రూప్-2కు ఎంపికైన పలువురు ఇప్పుడు గ్రూప్-1లోనూ ఉద్యోగాలు సాధించారు. తెలంగాణ గ్రూప్-1లో డీఎస్పీ ఉద్యోగం దక్కించుకున్న సుదర్శన్ ఏపీ గ్రూప్-1లోనూ డీఎస్పీగా ఎంపికయ్యారు. ఇటీవల గ్రూప్-2లో సబ్ రిజిస్ట్రార్ ఉద్యోగం సాధించిన అశోక్ రెడ్డి ఇప్పుడు అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్ ఆఫీసర్‌గా ఎంపికయ్యారు. గుడివాడ మున్సిపల్ పాఠశాలలో గణితం టీచర్‌గా పనిచేస్తున్న బి.నాగేంద్ర అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్ ఉద్యోగం సాధించారు.

కేటగిరీల వారీగా పోస్టుల భర్తీ...

డిప్యూటీ కలెక్టర్- 9, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్- 17, డీఎస్పీ- 25, డీఎస్పీ(జైళ్లు)- 1, డివిజనల్/డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్- 2, రీజనల్ ఆర్టీవో- 6, జిల్లా బీసీ సంక్షేమ అధికారి-1, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్- 3, కోఆపరేటివ్స్ డిప్యూటీ రిజిస్ట్రార్- 6, గ్రేడ్-2 మున్సిపల్ కమిషనర్- 3, ఏఈఎస్- 1, అసిస్టెంట్ ట్రెజరీ ఆఫీసర్- 3, జిల్లా ఉపాధి కల్పన అధికారి-4, అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్- 2, ఎంపీడీవో- 4 పోస్టులు భర్తీ అయ్యాయి.

విజయం సాధించారిలా..



నరసింహారావు



సూర్యప్రకాశ్



శివ నాగగౌరి



పైల సుందరరావు



పి.వెంకట నవీన



శ్రుతి బేతాళ



వైష్ణవి



జీవన జ్యోతి

» కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన భూపతి నరసింహారావు రాష్ట్ర పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్‌గా ఎంపికయ్యారు. రెండో ప్రయత్నంలో ఈ విజయం సాధించానని, ప్రస్తుతం యూపీఎస్సీ పరీక్షలకు సన్నద్ధమవుతున్నానని ఆయన తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

» కృష్ణా జిల్లా మొవ్వ మండలం కాజ గ్రామానికి చెందిన కోదాటి సూర్యప్రకాశ్ డీఎస్పీగా ఎంపికయ్యారు. జేఎన్టీయూ విజయనగరంలో బీటెక్ పూర్తిచేశానని, ప్రస్తుతం విజయవాడలోని శరత్‌చంద్ర అకాడమీలో మెంటార్‌గా పనిచేస్తూ రోజుకు 7గంటల పాటు చదివి విజయం సాధించానని తెలిపారు.

» శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం ఎస్ఎంపురం గ్రామానికి చెందిన సంపతిరావు శివ నాగగౌరి డీఎస్పీగా ఎంపికయ్యారు. ఈమె ప్రస్తుతం వంశధార ప్రాజెక్ట్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)గా పనిచేస్తున్నారు. ఈమె భర్త చౌదరి అవినాష్ శ్రీకాకుళం డీసీఎంఎస్ చైర్మన్‌గా ఉన్నారు. శివ నాగగౌరి రెండో ప్రయత్నంలో విజయం సాధించారు.

» శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం రావులవలస గ్రామానికి చెందిన పైల సుందరరావు డీఎస్పీగా ఎంపికయ్యారు. 2022 సీజేఎల్ పరీక్షల్లో ప్రతిభ కనబరచిన ఆయన ప్రస్తుతం విజయవాడలో గణంకాల శాఖలో అసిస్టెంట్ ఆడిట్ అధికారిగా పనిచేస్తున్నారు. సివిల్స్‌లో ప్రతిభ కనపరచడమే తన లక్ష్యమని సుందరరావు తెలిపారు. తండ్రి పైల రాజారావు రైతు. తల్లి లక్ష్మి గృహిణి.

» ప్రకాశం జిల్లా ఒంగోలు కమ్మపాలేనికి చెందిన పెండ్యాల వెంకట నవీన డీఎస్పీగా ఎంపికయ్యారు. గ్రూపు-1 మొదటి ప్రయత్నంలోనే ఆమె అర్హత సాధించారు. రెండో ప్రయత్నంలో డీఎస్పీగా ఎంపికయ్యారు. తల్లి మాధవి ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. తండ్రి పెండ్యాల రామకోటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు యూనిట్ టెక్నికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు.


» ప్రకాశం జిల్లా కొత్తపట్నానికి చెందిన శ్రుతి బేతాళ జిల్లా సాంఘిక సంక్షేమశాఖాధికారిగా ఎంపికయ్యారు. యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతూ రెండుసార్లు ఇంటర్వ్యూ వరకు వెళ్లారు. ప్రస్తుతం కేంద్రప్రభుత్వ సంస్థ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్‌లో అకౌంట్స్ కమ్ ఎన్‌ఫోర్స్‌మెంటు ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. తల్లి బి.రమ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. తండ్రి శ్రీనివాస్ 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు.

» ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేటకు చెందిన అంగజాల వైష్ణవి ఏసీటీవోగా ఎంపికయ్యారు.. ప్రస్తుతం ఆమె దేవదాయ శాఖలో షేర్‌మహ్మద్‌పేట గ్రూప్ టెంపుల్స్‌కు గ్రేడ్1 ఈవోగా విధులు నిర్వహిస్తున్నారు. ఈమె తండ్రి రవీంద్రబాబు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్నారు.

» గోరంట్ల పట్టణానికి చెందిన దేవాంగం జీవన జ్యోతి ఏసీటీవో ఉద్యోగం సాధించారు. హైదరాబాద్ జేఎన్టీయూలో బీటెక్ పూర్తిచేసిన ఆమె ఢిల్లీలో సివిల్స్ కోచింగ్ తీసుకున్నారు. ఆమె తల్లిదండ్రులు ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులు.

» తిరుపతికి చెందిన చాందిని డీఎస్పీ పోస్టుకు ఎంపికయ్యారు. ఆమె తండ్రి భాస్కర్ టీటీడీ డిప్యూటీగా పనిచేస్తున్నారు.

ఆర్‌టీవోగా కార్పెంటర్ కుమారుడు



పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణంలో వరవకట్ట ప్రాంతానికి చెందిన షేక్ ఇసుబ్ సలాం ఏపీ రవాణా శాఖలో ప్రాంతీయ రవాణా అధికారి(ఆర్‌టీవో)గా ఎంపికయ్యారు. సలాం తండ్రి షేక్ సుభానీ వృత్తిరీత్యా కార్పెంటర్ కాగా, తల్లి గృహిణి.

కానిస్టేబుల్ కుమార్తెకు డీఎస్పీ



పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు పట్టణానికి చెందిన గురుజు లక్ష్మీ అంజన డీఎస్పీగా ఎంపికయ్యారు. ఆమె తండ్రి దివాకర్ భీమవరంలోని పోలీసు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో రైటర్ కాగా తల్లి హేమలత ప్రైవేటు పాఠశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు. అంజన డీఎస్పీ పోస్టు దక్కించుకోవడంపై వారి కుటుంబ సభ్యులు, బంధువులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అది అశ్లీల డాన్స్ కాదు జగన్ గారూ.!

» మా వినతితోనే మంత్రి సుభాష్ స్టెప్పులేశారు: జబర్దస్త్ శాంతిస్వరూప్



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): "సంక్రాంతి సంబరాల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ అనే వాడు అశ్లీల డాన్సులు చేశాడు" అంటూ వైఎస్ జగన్ ఇటీవల చేసిన విమర్శలపై జబర్దస్త్ షో నటుడు శాంతి స్వరూప్ స్పందించారు. మగాడినైనా కూడా జబర్దస్త్ షోలో, బయట ఈవెంట్లలో ఆడ వేషంలో ప్రదర్శనలు చేస్తుంటానని, విమర్శలు చేసే ముందు తెలుసుకుని చేసుంటే బావుండేదని తాను విడుదల చేసిన వీడియోలో అభిప్రాయపడ్డారు. జనవరి 15న రామచంద్రాపురంలో జరిగిన సంక్రాంతి సంబరాల్లో వేల మంది జనాల మధ్య మంత్రి సుభాష్‌తో తాము చేసింది అశ్లీల నృత్యం కాదన్నారు. రికార్డింగ్ డాన్స్‌లకు, తమ స్టేజ్ షో స్కిట్‌లకు తేడా తెలుసుకోవాలన్నారు. ఈవెంట్ సందర్భంగా తామే మంత్రిని రిక్వెస్ట్ చేస్తే రెండు స్టెప్పులేశారని, నిజానికి తామే వెళ్లి ఆయనతో స్టెప్పులేశామని వివరించారు. ఇక మంత్రిని మాజీ ముఖ్యమంత్రి వాడూ, వీడూ అంటూ సంబోధించడంపైనా సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేనున్నా... న్యాయ పోరాటం చేద్దాం

» బెయిల్‌పై విడుదలైన చెవిరెడ్డికి జగన్ భరోసా

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): 'నేనున్నా... కేసులపై న్యాయ పోరాటం చేద్దాం' అంటూ అక్రమ మద్యం కేసులో బెయిల్‌పై విడుదలైన చెవి రెడ్డి భాస్కరరెడ్డికి జగన్ భరోసా ఇచ్చారు. గురువారం హైకోర్టు ఆదేశాల మేరకు బెయిల్‌పై విడుదలైన చెవిరెడ్డి తన అనుచరులతో కలసి తాడేపల్లి నివాసంలో జగన్‌ను కలిశారు. 226 రోజుల పాటు జైలులో ఉన్న చెవిరెడ్డి.. తనపై కూటమి ప్రభుత్వం కక్షతో అక్రమ కేసులు పెడుతోందని జగన్‌కు వివరించారు. ఈ కేసులకు భయపడేది లేదని, న్యాయ పోరాటం చేద్దామ ని జగన్ అన్నారు. తర్వాత చెవిరెడ్డి మాట్లాడుతూ... 'నాపై ఎన్ని కేసులు పెట్టినా భయపడేది లేదు. నా భార్య, తల్లి మినహా కుటుంబ సభ్యులందరిపైనా కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టింది' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నాపై కేసు కొట్టివేయండి: హైకోర్టుకు పేర్ని నాని

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను అవమానకరంగా దూషించాననే ఆరోపణలతో తనపై మచిలీపట్నం ఇనగుదురుపేట పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ వైసీపీ నేత పేర్ని నాని హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం పిటిషన్ దాఖలు చేశారు.

మోహన్ భాగవత్‌తో బీజేపీ మాధవ్ భేటీ

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్ఎస్ అధినేత మోహన్ భాగవత్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ శుక్రవారం భేటీ అయ్యారు. ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాల నేపథ్యంలో మాధవ్ భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ ఉత్సవాల్లో భాగంగానే మోహన్ భాగవత్ దేశవ్యాప్తంగా పర్యటిస్తూ విజయవాడ వచ్చారు.

ఉద్యోగుల అభ్యసన కాంక్షకు నిదర్శనం: సీఎం

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): ఐగాట్ (ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్‌లైన్ ట్రైనింగ్ ప్రోగ్రాం) కర్మయోగి పోర్టల్‌లో వివిధ రకాల కోర్సులు నేర్చుకునేందుకు కోటి పైచిలుకు ఎన్‌రోల్‌మెంట్స్ రిజిస్టర్ కావడం ఉద్యోగుల్లో నిరంతర అభ్యసన కాంక్షకు నిదర్శనమని సీఎం చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఐగాట్ కర్మయోగి అనేది ప్రభుత్వ ఉద్యోగులు ఆన్‌లైన్‌లో వివిధ కోర్సులను నేర్చుకునే వేదిక. ఇందులో 4290 రకాల కోర్సులను నేర్చుకునే వెసులుబాటు ఉంది. ఈ పోర్టల్‌లో కోటి పైచిలుకు ఎన్‌రోల్‌మెంట్స్ రిజిస్టర్ అవ్వడమే కాకుండా 80 లక్షలపైచిలుకు కోర్సులను ఇప్పటికే పూర్తి చేయడం ఆనందంగా చంద్రబాబు ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా.. గాంధీజీ వర్ధంతిని పురస్కరించుకుని శుక్రవారం ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో గాంధీ వర్ధంతి నిర్వహించారు. అసెంబ్లీ కమిటీ హాలులో సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్న కుమార్, అసెంబ్లీ ఉద్యోగులు మహాత్మునికి నివాళులర్పించారు.




కంగుంది హెరిటేజ్ విలేజ్-బౌల్డరింగ్ పార్కులో ముఖ్యమంత్రి చంద్రబాబు

వినూత్నంగా ఆలోచించండి

▸▸ కుప్పం 'అగస్త్య' విద్యార్థులతో సీఎం చంద్రబాబు

కుప్పం/గుడుపల్లె, జనవరి 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వినూత్నంగా ఆలోచించినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని, అలాంటి ఆలోచనలకే భవిష్యత్తులో మంచి అవకాశాలు దక్కుతాయని సీఎం చంద్రబాబు అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం ఆయన కుప్పం నియోజకవర్గానికి చేరుకున్నారు. తొలి రోజు గుడుపల్లె మండలంలోని అగస్త్య విద్యాచల్ అకాడమీ ప్రాంగణంలోని టీచర్ ట్రైనింగ్ సెంటర్‌ను ప్రారంభించారు. లెర్నర్ అకామిడేషన్ ఫెసిలిటీ సెంటర్‌కు, ఒబెరాయ్ విజిటర్స్ సెంటర్‌కు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి ఆడిటోరియంలో విద్యార్థులతో సీఎం సమావేశమయ్యారు. 'భవిష్యత్తు మనదే. రాబోయే రోజుల్లో మరిన్ని ఆవిష్కరణలు వస్తాయి. కొత్త ఆవిష్కరణలకు, స్టార్టప్ కంపెనీలకు అవకాశాలు దక్కేలా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ పెట్టాం. భవిష్యత్తు భారత్ ఎలా ఉంటుందనే అంశంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు, ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను గమనించాలి. కుప్పానికి అన్నిరకాల టెక్నాలజీలను తెస్తున్నాం. హంద్రీనీవా నీళ్లు తెచ్చాం. నీటి సంరక్షణ విషయంలో అగస్త్య అకాడమీ ప్రతినిధులు వినూత్నంగా ఆలోచించాలి' అని చంద్రబాబు పేర్కొన్నారు. తొలి రోజు కంగుంది హెరిటేజ్ విలేజ్-బౌల్డరింగ్ పార్కును, పున్నమి రెస్టారెంట్‌ను ప్రారంభించారు. అలాగే రూ.4 కోట్లతో కుప్పం పర్యాటక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కుప్పం చెరువుకు జలహారతి ఇచ్చారు. గంగమ్మకు సారె సమర్పించారు. కార్యక్రమాల అనంతరం కడపల్లెలోని స్వగృహంలో బస చేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

పింఛన్ల పంపిణీ నేడే

▸▸ ఒక రోజు ముందే భరోసా పెన్షన్లు: మంత్రి కొండపల్లి



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రతి నెలా 1వ తేదీన పంపిణీ చేసే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఫిబ్రవరి ఒకటో తేదీ ఆదివారం కావడంతో ఒక రోజు ముందుగా(జనవరి 31) పంపిణీ చేయనున్నట్టు సెర్ప్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. కొత్తగా మంజూరైన వితంతువుల పెన్షన్లు 7,944తో కలిపి మొత్తం 62.94 లక్షల మంది పెన్షన్‌దారులకు రూ.2,724 కోట్లు సచివాలయ సిబ్బంది ద్వారా లబ్ధిదారుల ఇంటి వద్దే అందజేస్తారని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో జనవరి 31న పింఛను సొమ్ము అందుకోని వారు ఫిబ్రవరి 2న తీసుకోవచ్చని పేర్కొన్నారు. కాగా, శనివారం ఉదయం కుప్పంలోని గుడుపల్లె మండలం బెగ్గిలిపల్లె గ్రామ పంచాయతీలో సీఎం చంద్రబాబు లబ్ధిదారులకు పెన్షన్లను పంపిణీ చేయనున్నారు.

ఏపీ కరోనా జగన్ : మంత్రి సత్యకుమార్

గుంటూరు మెడికల్, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రాష్ట్రాన్ని పట్టి పీడించిన కరోనా వైరస్ అని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. కూటమి ప్రభుత్వంలోని వైద్య ఆరోగ్య రంగంపై అబద్ధాలు వల్లిస్తూ నిత్యం విషం చిమ్ముతున్న ఆయన... తన హయాంలో పలు ఆసుపత్రులు, వైద్య కళాశాలల నిర్మాణాలను పట్టించుకోకుండా అర్ధాంతరంగా వదిలేశా అని మంత్రి మండిపడ్డారు. శుక్రవారం గుంటూరు ప్రభుత్వ సమగ్రాసుపత్రిలో జరిగిన కానూరి జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం భవనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో కలసి మంత్రి పాల్గొన్నారు. సభలో జింకాన బిల్డింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బాబురెడ్డి సాగిరెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వ హయాంలో తమకు ఎదురైన చేదు అనుభవాలను వివరించారు. ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులను, మంత్రులను కలిసేందుకు తాము అమెరికా నుంచి ఇక్కడకు వస్తే కనీసం వారి సమయం కూడా దొరికేదికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక సమయంలో ఈ నిర్మాణం ఆగిపోతుందని భయపడ్డామని, ఆ సమయంలో డాక్టర్ ఉమా గవిని వ్యక్తిగతంగా రూ.20 కోట్లు నిధులు విరాళంగా ఇవ్వడంతో తమలో ఆత్మవిశ్వాసం పెరిగి సొంత నిధులతో భవన నిర్మాణం పూర్తి చేశామని వివరించారు. అనంతరం దీనిపై స్పందించిన మంత్రి.. 2020లో కరోనా కారణంగా రెండేళ్ల పాటు కానూరి జింకానా నిర్మాణం నిలిచిపోగా, అనంతరం మరో రెండేళ్ల పాటు జగన్ ప్రభుత్వం నిధులు, అనుమతులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయినట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో 2016లో భూమి పూజ జరిగినా, జగన్ దీనికి నిధులు ఇవ్వలేదని విమర్శించారు.

జెన్కోలో 27 మందికి కారుణ్య నియామకాలు

▸▸ కూటమి హయాంలో 500కుపైగా ఉద్యోగాలిచ్చాం

▸▸ అర్హులందరికీ జూనియర్ ఇంజనీర్‌గా నియామకాలు

▸▸ వైసీపీ హయాంలో అర్హులకూ ఇవ్వలేదు: మంత్రి గొట్టిపాటి



కారుణ్య నియామకాలు పొందిన వారితో మంత్రి గొట్టిపాటి రవికుమార్, సీఎస్ విజయానంద్, తదితరులు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాల ద్వారా బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలోని కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. విద్యుత్ శాఖలో వివిధ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబ సభ్యులకు సచివాలయంలోని మంత్రి కార్యాలయంలో శుక్రవారం కారుణ్య నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 27 మంది లబ్ధిదారులు.. మంత్రి, సీఎస్ విజయానంద్ నుంచి నియామక పత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా గొట్టిపాటి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక విద్యుత్ శాఖలో సుమారు 500 మందికిపైగా కారుణ్య నియామకాల కింద ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. వైసీపీ హయాంలో అన్ని అర్హతలున్న వారికి కూడా జూనియర్ అసిస్టెంట్ స్థాయి ఉద్యోగాలు మాత్రమే ఇచ్చారని, కూటమి ప్రభుత్వం విద్యార్హతలను బట్టి జూనియర్ ఇంజనీర్ పోస్టులను కూడా ఇచ్చిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రతి మూడు నెలలకోసారి కారుణ్య నియామకాలు చేపడుతోందని తెలిపారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ ఉద్యోగులు స్కిల్స్‌ను పెంచుకుంటే పదోన్నతులు త్వరగా వస్తాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అశోక్ రెడ్డి, నారాయణ, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డితోపాటు జెన్కో డైరెక్టర్లు పాల్గొన్నారు.

11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఫిబ్రవరి 11 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈమేరకు శుక్రవారం అధికారిక ఉత్తర్వులు విడుదలయ్యాయి. 11వ తేదీ ఉదయం 10 గంటలకు గవర్నర్ ప్రసంగంతో సమావేశాలు ప్రారంభంకానున్నాయి.

3న క్యాబినెట్ భేటీ: రాష్ట్ర మంత్రి మండలి సమావేశం సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఫిబ్రవరి 3న ఉదయం 10.30 గంటలకు జరగనుంది.

అమరావతి పరిధిలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పెన్షన్లు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): అమరావతి రాజధాని ప్రాంతంలోని గ్రామాల్లో నివశిస్తున్న భూమిలేని పేదలకు ఇచ్చే సామాజిక పెన్షన్‌కు సంబంధించి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ పెన్షన్లు పొందుతున్న కుటుంబ యజమానులు మరణిస్తే, వారికి దక్కాల్సిన పెన్షన్‌ను మైనర్లుగా ఉన్న వారి పిల్లలకు అందించనున్నారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

లిక్కర్ కేసులో ఐదుగురికి రిమాండ్ పొడిగింపు

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణంలో ఐదుగురు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు రిమాండ్ పొడిగించింది. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, బూనేటి చాణక్య, అనిల్ చోక్రాతో పాటు గుంటూరు జిల్లా జైల్లో ఉన్న బాలాజీ కుమార్ యాదవ్, రోణక్ కుమార్‌ను ఎస్కార్ట్ పోలీసులు శుక్రవారం కోర్టుకు తీసుకొచ్చారు. వారికి వచ్చే నెల 13 వరకు రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలు ఇచ్చారు. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి, నవీన్ కృష్ణ వాయిదాకు హాజరు కాలేమంటూ ఆబ్సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. మాజీ ఐఏఎస్ అధికారి కె.ధనంజయరెడ్డి, పి.కృష్ణమోహన్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్, బాలాజీ గోవిందప్ప, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేష్ నాయుడు వాయిదాకు హాజరయ్యారు.కాగా, 'నన్ను ఎంతకాలం జైల్లో ఉంచుతారు? ఇంతకంటే ఏం చేయగలరు?' అంటూ రిమాండ్‌లో ఉన్న ఓ నిందితుడు పీపీ చాంబర్‌లో కూర్చొని ఉన్న దర్యాప్తు అధికారితో అన్నట్టు తెలిసింది.

అమరావతి.. తెలుగు జాతి ఖ్యాతి

కొంతమంది 100 ఎకరాలు తీసుకుని సచివాలయం కట్టొచ్చని అంటున్నారు. లేకపోతే మున్సిపల్ భవనంలో సెక్రటేరియట్ పెట్టొచ్చు కదా అని అంటారు. అలా కూడా చేయొచ్చు కానీ జాతికి గుర్తింపు ఉండాలన్నా.. అన్ని ప్రాంతాలతో సమానంగా ఆంధ్రప్రదేశ్ ఉండాలన్నా.. ఒక విశ్వ నగరం అవసరం.

తమిళనాడుకు చెన్నై, కర్ణాటకకు బెంగళూరు, తెలంగాణకు హైదరాబాద్ ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు ఒక విశ్వనగరం అవసరం. ఏపీ రాజధానిని ఓ చిన్ననగరంగా వదిలేస్తే ఆర్థిక వ్యవస్థలో వెనకబడతామన్న ఉద్దేశంతోనే హైదరాబాద్ కంటే మెరుగైన నగరం నిర్మించాలని అమరావతికి శ్రీకారం చుట్టాం. - సీఎం చంద్రబాబు

విశ్వనగరంగా రాజధాని అభివృద్ధి

ఇతర రాష్ట్రాలతో సమానంగా మనకు మహానగరం అవసరం

ఎన్ఆర్ఐ వైద్యులు శాశ్వతంగా ఈ ప్రాంతంతో మమేకం కావాలి

గుంటూరు జీజీహెచ్‌లో కానూరి జింకాన ఎంసీహెచ్ ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు



గుంటూరు ప్రభుత్వ సమగ్రాస్పత్రిలో డాక్టర్ కానూరి రామచంద్రరావు జింకానా తల్లీ పిల్లల ఆరోగ్య కేంద్రం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి సత్య కుమార్

గుంటూరు, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): "అమరావతి భవిష్యత్తు నగరం. ఇలాంటి నగరాలు మరిన్ని దేశంలో రావాలని కేంద్ర ఆర్థిక సర్వే స్పష్టంగా చెప్పింది" అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. గుంటూరు మెడికల్ కళాశాలలో చదువుకుని అమెరికాలో నివసిస్తున్న ఎన్ఆర్ఐ వైద్యులు రూ.100 కోట్లు విరాళాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో జీజీహెచ్‌లో నూతనంగా నిర్మించిన కానూరి జింకాన మాతా శిశు సంరక్షణ కేంద్రాన్ని శుక్రవారం సీఎం చంద్రబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఆర్ఐ వైద్యులు, దాతలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం వారిని ఉద్దేశించి ప్రసంగించారు. "2019-24లో అనేక ఇబ్బందులు పడ్డాం. అవన్నీ పోయాయి. మీరు పుట్టిన గుంటూరు మరో పది, పదిహేనేళ్లలో మారిపోతుంది. అమరావతి.. గుంటూరు, విజయవాడ, మంగళగిరి కార్పొరేషన్లలో కవర్ అవుతుంది. అవుటర్ రింగురోడ్డు గుంటూరు, విజయవాడకు అవతల వస్తుంది. ఈ రోజున హైదరాబాద్‌లో 162 కిలోమీటర్ల అవుటర్ రింగురోడ్డు ఉంది. అమరావతికి 182 కిలోమీటర్ల ఓఆర్ఆర్, ఐఆర్ఆర్, నేరుగా ఉండే రోడ్లు వస్తాయి. అన్ని సర్వీసులు డక్ట్‌లో ఉంటాయి. రోడ్లు కట్ చేసే పరిస్థితి ఉండదు. పర్యావరణహిత నగరంగా అభివృద్ధి చేస్తాం. ఇలాంటి ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకుని ముందుకు వెళ్తున్నాం.

అమరావతిలో క్వాంటం వ్యాలీ

ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్ నగరం కావాలని ఆలోచించి, విజ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థకు చిరునామాగా తెలుగువారు ఉండాలని దానిని ఏర్పాటు చేశాం. ఇటీవల ఆ నగరం తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఎక్కువ తలసరి ఆదాయాన్ని ఇస్తోంది. హైదరాబాద్ కంటే మెరుగైన నగరం నిర్మించాలని అమరావతికి శ్రీకారం చుట్టాం. ఇది గ్రీన్ ఫీల్డ్ సిటీ. ఆ రోజున ఐటీ గురించి చెప్పాం. ఈ రోజున ఏఐ గురించి మాట్లాడుతున్నాం. అమెరికాకు సిలికాన్ వ్యాలీ ఉంది. భారత దేశానికి ఏముందంటే.. క్వాంటం వ్యాలీ ఉంది. అది కూడా అమరావతిలో ఉందని సమాధానం చెప్పొచ్చు. ఆ రోజున సైబరాబాద్ కట్టాం. ఈ రోజున క్వాంటం వ్యాలీ నిర్మాణానికి శ్రీకారం చుట్టాం. మరోవైపు నాలెడ్జ్ ఎకానమిలో ఉన్నాం. ఇంటిపైనే కరెంటు ఉత్పత్తి జరుగుతోంది. మీరు ఇప్పుడు బిల్డింగ్ ఇచ్చారు. పైన సోలార్ పెడితే కరెంటు కూడా మీరే ఇచ్చినట్లు. ఇవన్నీ సింపుల్ ఎడిషన్స్. అందుకే ప్రొసూమర్(ఉత్పత్తిదారు+వినియోగదారుడు) అనే కొత్త విధానాన్ని తీసుకొచ్చాం.

నాడు విద్యుత్‌కు కటకట

1999లో విద్యుత్ లేని పరిస్థితి. పొలాలు ఎండిపోయేవి. అసెంబ్లీలో గంటల తరబడి ప్రతిపక్ష ఎమ్మెల్యేలు మాట్లాడేవారు. అప్పుడు విద్యుత్ రంగంలో సంస్కరణలు తీసుకొచ్చాం. 2004లో పవర్ షార్ట్ లేకుండా చేశాం. అయితే కఠినమైన నిర్ణయాలు తీసుకోవడం వలన నా పవర్ పోయింది. అయినా పర్వాలేదు. ఈ రోజున ప్రపంచంలో విద్యుత్ రంగంలో నంబరు1గా భారత దేశం ఉండటం గర్వకారణం.

పర్సనల్ మెడిసిన్ ఎంతో దూరంలో లేదు

పర్సనల్ మెడిసిన్ ఎంతో దూరంలో లేదు. నేను 1995లో ఐటీ ప్రమోట్ చేశాను. 1999-2000లో బయోటెక్నాలజీని ప్రమోట్ చేశాను. టెక్నాలజీతో వైద్యాన్ని రోగి ఇంటి వద్దకు తీసుకెళ్లాలని సంజీవని ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టాం. బిల్‌గేట్స్ ఫౌండేషన్ తరపున సహకరిస్తామన్నారు. ఒక నియోజకవర్గాన్ని కేస్ స్టడీగా తీసుకుని 70 వేలమందికి టెస్టులు చేశాం. 2026లో 28 జిల్లాలలో పూర్తిగా సంజీవని ప్రాజెక్టు కింద డిజిటల్ హెల్త్ రికార్డులు తయారు చేయడమే కాకుండా 72 లక్షల మంది తీవ్ర అనారోగ్యం కలిగిన రోగుల డేటా తీసుకొంటున్నాం.

కొత్తగా ఎయిర్ అంబులెన్స్

ఎవరైనా రోగి ఇంటి వద్ద ఉంటే ఎప్పటికప్పుడు ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు అరగంటలో ఆస్పత్రికి తరలించే వ్యవస్థ రాబోతున్నది. కొత్తగా ఎయిర్ అంబులెన్స్ వస్తోంది. 2026లో డ్రోన్‌తో ఎయిర్ అంబులెన్స్‌ను ఇంటిగ్రేట్ చేయాలనుకొంటున్నాం. డ్రోన్‌లే మిద్దెపై నుంచి రోగులను ఆస్పత్రికి తీసుకెళతాయి. ఇలాంటి వినూత్న ఆలోచనలు చేస్తున్నాం. మీరు ఎన్ఆర్ఐలు.. మీకు అపారమైన జ్ఞానం ఉంది. భవిష్యత్తులో మీరు చదువుకున్న కాలేజీతో శాశ్వతంగా భాగస్వామ్యం కావాలంటే ఇక్కడికి వచ్చి తల్లిదండ్రులతో ఉంటూ సేవలందించొచ్చు.

దేశాభివృద్ధికి తోడ్పడండి

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు గేమ్‌చేంజర్ వంటి సంజీవిని పథకంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'నేను తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టిన కొత్తలో బ్రెయిన్ డ్రెయిన్ (మేధో వలస) వల్ల నష్టం ఉంటుందా? అని కొందరు అడిగారు.. బ్రెయిన్ డ్రెయిన్ భవిష్యత్తులో బ్రెయిన్ గెయిన్ (దేశానికి సంపద సృష్టి)గా మారుతుందని చెప్పాను. ఇందుకు నిలువెత్తు నిదర్శనమే ఈ ఎన్ఆర్ఐ వైద్యులు. అమెరికాతో సహా వివిధ దేశాల్లో స్థిరపడిన ప్రవాస భారతీయులు తమ మాతృ దేశాభివృద్ధికి తోడ్పాటు అందించాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వాస్పత్రుల్లో త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు ప్రవేశపెడతామన్నారు.

అమెరికా కంటే బెటర్ సిటీగా అమరావతిని తయారు చేస్తాం. మీకు ఏది కావాలన్నా ఎక్కడికీ పోవాల్సిన పని లేదు. అన్ని అనుమతులు ఆన్‌లైన్‌లోనే పొందవచ్చు" అని సీఎం చంద్రబాబు అన్నారు. వీలైనంత మంది ఎన్ఆర్ఐ వైద్యులు ముందుకొచ్చి పీ-4లో భాగస్వామ్యమై మార్గదర్శకులుగా మారాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని, రాష్ట్ర మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్యేలు కామినేని శ్రీనివాస్, ఎండీ నసీర్ అహ్మద్ పాల్గొన్నారు.

త్వరలోనే జాబ్ క్యాలెండర్

కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రానికి 755 కంపెనీలు: మంత్రి లోకేశ్

▸▸ ఒక్కటొక్కటిగా గ్రౌండవుతున్నాయ్

▸▸ ఇప్పటివరకు 4 లక్షల ఉద్యోగాల కల్పన

▸▸ 4 వేల ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి చర్యలు

▸▸ పాదయాత్రతో జీవితంలో ఎన్నో మార్పులు.. నాటి అనుభవాలనే నేడు అమలుచేస్తున్నాం

▸▸ పిల్లలను సోషల్ మీడియాకు దూరంగా ఉంచుతాం: మంత్రి

▸▸ కాకినాడ జేఎన్‌టీయూ విద్యార్థులతో 'హలో లోకేశ్' పేరుతో ముఖాముఖి

▸▸ ఇకపై నెలకోసారి విద్యార్థులను కలుస్తానని వెల్లడి





కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించిన 'హలో లోకేశ్' కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్, హాజరైన విద్యార్థులు

కాకినాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన మాట ప్రకారం త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. దేశంలో ఏపీని నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యంగా పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటివరకు రాష్ట్రానికి 755 కంపెనీలు వచ్చాయన్నారు. నాలుగు లక్షల ఉద్యోగాలు లభించాయని తెలిపారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇవ్వడం తమ లక్ష్యమని గుర్తుచేశారు. కాకినాడ జేఎన్టీయూలో మంత్రి శుక్రవారం 'హలో లోకేశ్' పేరుతో విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌ను నంబర్‌వన్ రాష్ట్రం చేసే క్రమంలో విద్యార్థులందరూ అందులో భాగస్వాములయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. నైపుణ్యం ఉంటేనే పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. నైపుణ్యం పోర్టల్ ద్వారా సప్లయ్-డిమాండ్ తరహాలో కొత్త విధానం తెచ్చామని.. దీని ద్వారా 75 వేల మందిని స్క్రీనింగ్ చేశామని వివరించారు. గత ఏడాదిన్నరలో 755 కంపెనీలు రాష్ట్రానికిరాగా.. అవన్నీ ఒక్కొక్కటిగా గ్రౌండ్ అవుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో 4 వేల ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయాల్సిఉందని, న్యాయపరమైన చిక్కులు తొలగించి వీటి భర్తీకి చర్యలు చేపడతామన్నారు. కొంతమంది కులం, మతం, ప్రాంతం అనే భావన తీసుకొచ్చి గొడవలు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని, సోషల్ మీడియాకు పిల్లలను దూరంగా ఉంచేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇకపై నెలకోసారి విద్యార్థులను కలుస్తానని ప్రకటించారు.

అండగా పవన్..

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో తన కున్న అనుబంధాన్ని గురించి వివరిస్తూ.. కష్టకాలంలో తమ కుటుంబానికి పవన్ అండగా నిలిచిన విషయాన్ని ఎప్పటికీ మరచిపోనన్నారు. అంతకు ముందు జేఎన్టీయూలో రూ.10 కోట్లతో నిర్మించిన పీజీ బాలుర వసతి గృహాన్ని లోకేశ్ ప్రారంభించారు. 'ఇన్నోవేషన్ ఫెయిర్'లోని 20 స్టాళ్లను సందర్శించారు. అనంతరం కోరమాండల్ కంపెనీకి చెందిన 60 పడకల ఇంటిగ్రేటెడ్ ఆస్పత్రిని ఆయన ప్రారంభించారు.

పాదయాత్ర నా జీవితాన్ని మార్చేసింది..

జీవితంలో తీసుకునే కొన్ని నిర్ణయాలు మనల్ని మారుస్తాయని, యువగళం పాదయాత్ర కూడా తన జీవితాన్ని అలాగే మార్చేసిందని లోకేశ్ అన్నారు. కోట్లాదిమంది ప్రజలు, యువత ఆశలు, ఆకాంక్షలు, సమస్యలను తెలుసుకునే అవకాశం దీని ద్వారా లభించిందని తెలిపారు. నాటి అనుభవాలనే ఇప్పుడు ప్రభుత్వంలో అమలుచేస్తున్నామని స్పష్టంచేశారు. 'హలో లోకేశ్'లో విద్యార్థులు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను, సమస్యలను సీరియస్‌గా తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొంతకాలం కిందట కుంభమేళాకు వెళ్లానని, అక్కడ చేపట్టిన రద్దీ నియంత్రణ విధానం సమర్థంగా ఉందన్నారు. గతంలో గోదావరి పుష్కరాల్లో తొక్కిసలాట జరిగి కొంతమంది చనిపోయారని, అటువంటివి ఇక జరగకుండా ఈసారి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. పుష్కర ఘాట్లలో క్రౌడ్ మేనేజ్‌మెంట్, సౌకర్యాలపై ఎప్పటికప్పుడు తెలుసుకునేలా డిజిటల్ ట్విన్ ప్రాజెక్టులు తయారు చేయాలని జేఎన్టీయూను కోరారు.



కాకినాడలో మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న టీడీపీ కార్యకర్తలు

ఆ నెయ్యిలో జంతు కొవ్వు కలిసింది!

▸▸ సిట్ చార్జిషీటులో స్పష్టంగా ఉంది

▸▸ అయినా వైసీపీ కొత్త డ్రామా.. అసలా పార్టీ మొత్తం కల్తీయే

▸▸ జగన్ సినిమాల్లోకి వెళ్తే భాస్కర్ అవార్డు వచ్చేది: లోకేశ్

▸▸ కాకినాడలో కార్యకర్తలతో.. ఉండవల్లిలో టీడీపీ నేతలతో సమావేశం

కాకినాడ/అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డూ ప్రసాదానికి సరఫరా అయిన నెయ్యిలో జంతుకొవ్వు కలిసిందని, వెజిటబుల్ ఆయిల్‌న్నట్లు తేలిందని విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేశ్ అన్నారు. సీబీఐ ఆధ్వర్యంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) రెండ్రోజుల కిందట నెల్లూరు ఏసీబీ కోర్టులో దాఖలుచేసిన చార్జిషీటులోని పేజీ నంబరు 35లో ఈ విషయం చాలా స్పష్టంగా చెప్పిందని తెలిపారు. అయినా వైసీపీ ఇప్పుడు కొత్త డ్రామా మొదలుపెట్టిందని మండిపడ్డారు. ప్రజలకు ఈ వాస్తవాలు వివరించి చైతన్యం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన కాకినాడ రూరల్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో పట్టణ, వార్డు, మండల స్థాయి టీడీపీ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల కోసం నిర్వహించిన 11వ బ్యాచ్ క్యాడర్ శిక్షణ తరగతుల్లో పాల్గొన్న నేతలతోనూ ఉండవల్లి క్యాంపు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆయా సందర్భాల్లో మాట్లాడుతూ.. గత జగన్ ప్రభుత్వం కలియుగ దైవం శ్రీవేంకటేశ్వరుడు, టీటీడీల ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా వ్యవహరించిందని విమర్శించారు. చేయకూడని పాపాలు చేసి.. ఇప్పుడు కూడా తప్పుడు ప్రచారాలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని మండిపడ్డారు. దాని తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టి.. వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత టీడీపీ కార్యకర్తలదేనన్నారు. 'వైసీపీ కల్తీ పార్టీ. కింది నుంచి పైవరకు మొత్తం కల్తీగా మారింది. అధికారంలో ఉన్నప్పుడు కల్తీ మద్యం, కల్తీ నెయ్యి సరఫరాకు తెగబడింది. అంతకుముందు కోడికత్తి డ్రామాలు, బాబాయ్ హత్య వంటి కుట్రలు చాలా చేసింది. ఇప్పుడు కూడా అలాంటి కుట్రల డ్రామాలు చేయడానికి చూస్తోంది. టీడీపీ కార్యకర్తలంతా అప్రమత్తంగా ఉండాలి' అని పిలుపిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ సినిమాల్లోకి వెళ్తే ఆస్కార్ కాకుండా భాస్కర్ అవార్డు ఇచ్చేవారని ఎద్దేవా చేశారు. 2019 వరకు టీటీడీకి నాణ్యమైన నెయ్యి సరఫరాకు టీడీపీ ప్రభుత్వం చర్యలు తీసుకుందని గుర్తుచేశారు. 'అప్పట్లో టెస్టింగ్ చేసి పద్ధతి ప్రకారం వెళ్లాం. నాణ్యమైన నెయ్యి కోసం కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ నుంచి ఎక్కువ శాతం నెయ్యి కొన్నాం. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక చిన్న కంపెనీలకు నెయ్యి ఆర్డర్లు వచ్చేలా టెండర్ నిబంధనలు మార్చారు. 2022లో శాంపిల్ తీసుకుని పరీక్షిస్తే ఫెయిల్ అయింది. ఆ రిపోర్టు బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కూటమి అధికారంలోకి వచ్చాక నెయ్యి శాంపిల్స్ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ సంస్థ ద్వారా పరీక్ష చేయిస్తే నిజాలు వెలుగులోకి వచ్చాయి' అని వివరించారు. అధికారంలో ఉన్నప్పుడు మనం చేస్తున్న మంచిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో విఫలమవుతున్నామని లోకేశ్ అసంతృప్తి వ్యక్తంచేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసినా.. వాటిని ప్రజల్లోకి సమర్థంగా తీసుకెళ్లడంలో వెనుకబడ్డామని.. నాటి ఓటమికి అది కూడా కారణమని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వం చేస్తున్న ప్రతి మంచి కార్యక్రమాన్ని జనంలోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని తెలిపారు.

కూటమిని విడదీయలేరు...

కూటమి నాయకుల మధ్య సఖ్యత అత్యంత ముఖ్యమని లోకేశ్ తెలిపారు. కూటమిని చీల్చేందుకు కొన్ని శక్తులు ప్రయత్నిస్తున్నా.. విడదీయడం ఎవరి తరమూ కాదన్నారు. గ్రామస్థాయిలో కూటమి నేతలందరినీ కలుపుకొని కలిసికట్టుగా పనిచేయాలన్నారు. కూటమిలో ఉండడం వల్లే విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుకోగలిగామని చెప్పారు. నాయకులు అలగడం తగదని, ప్రతి ఒక్కరి కష్టాన్నీ పార్టీ తప్పకుండా గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు. టీడీపీ ఒక కుటుంబమని.. కుటుంబంలో సమస్యలుంటే కూర్చుని మాట్లాడుకుంటే పరిష్కారం దొరుకుతుందని తెలిపారు. గతంలో ఎంతోమంది టీడీపీని భూస్థాపితం చేస్తామన్నారని.. వారంతా ఇప్పుడు ఏ పరిస్థితుల్లో ఉన్నారో తెలుసన్నారు. తనకు వాట్సా‌ప్‌లో కార్యకర్తలు పంపుతున్న మెసేజ్‌లు చదవడానికి మూడు గంటలు పడుతోందని, దీని ద్వారా కార్యకర్తల మనోభావాలు తెలుస్తున్నాయని చెప్పారు. కార్యకర్తలు రెవెన్యూ, పోలీసుశాఖ అధికారుల వద్దకు పనులపై వెళ్తే పట్టించుకోవడం లేదని కొందరు తన దృష్టికి తీసుకువచ్చారని, దీనిని తీవ్రంగా పరిగణిస్తున్నట్లు లోకేశ్ తెలిపారు. టీడీపీ కోసం ప్రాణాలు కోల్పోయిన కార్యకర్త తోట చంద్రయ్య కుమారుడికి కూటమి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలని పట్టుబట్టి అసెంబ్లీలో బిల్లు ఆమోదిస్తే.. మండలిలో వైసీపీ నేతలు అడ్డుకున్నారని ఆక్షేపించారు. వచ్చే సమావేశాల్లో దీనిని ఆమోదింపజేసి చంద్రయ్య కుమారుడికి ఉద్యోగం ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని హామీఇచ్చారు. పార్టీ కోసం ప్రతి కార్యకర్తా చేస్తున్న సేవలు, కష్టాలను మై టీడీపీ యాప్ ద్వారా నమోదు చేసి.. నాయకత్వం దృష్టికి తీసుకురావాలని సూచించారు.

యర్రాజీ జ్యోతికి గ్రూప్ 1 ఉద్యోగం

»» విశాఖలో 500 గజాల ఇంటి స్థలం.. ఉత్తర్వులు జారీ



అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఏషియన్ అథ్లెటిక్స్‌లో స్వర్ణపతకం సాధించిన.. అర్జున్ అవార్డు గ్రహీత యర్రాజీ జ్యోతికి ప్రభుత్వం ప్రత్యేక ఇన్‌సెంటివ్స్ ప్రకటించింది. క్రీడాప్రాధికార సంస్థ ఎండీ ఆమెకు గ్రూప్ - 1 ఉద్యోగంతో పాటు వెయ్యి గజాల స్థలం కేటాయించాలని ప్రతిపాదించగా, ఇప్పటికే ప్రభుత్వం విశాఖపట్నంలో 500 గజాల్లో రెసిడెన్సియల్ ఫ్లాట్ ఇచ్చేందుకు, ఆమె డిగ్రీ పూర్తి అయిన వెంటనే గ్రూప్ - 1 ఉద్యోగం ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ మేరకు క్రీడాశాఖ స్పెషల్ సీఎస్ అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతాం: మంత్రి మండిపల్లి

న్యూఢిల్లీ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌ను క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర క్రీడా, రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. ఏపీలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా అమలవుతున్నాయని చెప్పారు. శుక్రవారం న్యూఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 'ఏపీలో నిధుల విషయంలో రాజీ పడకుండా క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నాం. క్రీడల సంబంధిత పెండింగ్ ప్రాజెక్టులపై తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని కేంద్రానికి విన్నవించాం. అశ్విత స్కీమ్ రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని కోరాం. సండే ఆన్ సైకిల్ కార్యక్రమం కోసం వచ్చే మార్చి నుంచి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయి. ఖేలో ఇండియా పథకం కింద ఏపీ నుంచి రూ.600 కోట్ల ప్రతిపాదనలు కేంద్రానికి అందించాం. గత నెలలోనే రూ.67 కోట్లు మంజూరు చేశారు' అని తెలిపారు.

ఈహెచ్‌ఎస్ కమిటీకి ఇద్దరు ప్రత్యేక ఆహ్వానితులు

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం, వర్కింగ్ జర్నలిస్టుల ఆరోగ్య పథకంలో తలెత్తున్న సమస్యలపై ప్రభుత్వం నియమించిన అధికారుల కమిటీలో మరో రెండు ఉద్యోగ సంఘాల అధ్యక్షులకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహించే కమిటీలో తొలుత ఆరుగురు సభ్యులను ప్రభుత్వం నియమించింది. వీరితో పాటు ఆంధ్రప్రదేశ్ సచివాలయ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు జి.రామకృష్ణ, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు కె.ఆర్.సూర్యనారాయణను ప్రత్యేకఆహ్వానితులుగా నియమించింది.

ఎండోమెంట్ ట్రైబ్యునల్ సభ్యుడిగా అదనపు బాధ్యతలు

ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ట్రైబ్యునల్ మెంబర్‌గా ఆ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ ఎం.హరిజవహర్‌లాల్‌కు ప్రభుత్వంఅదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం ఎండోమెంట్ ట్రైబ్యునల్ మెంబర్‌గా ఉన్న దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ పదవీ విరమణ చేశారు.

జేసీ పదోన్నతిపై అభ్యంతరాలు

మరోవైపు దేవదాయశాఖ ప్రధాన కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ కమిషనర్ ఎం.రత్నరాజుకు ఇప్పటికే డిప్యూటీ కమిషనర్‌గా అడహక్ పదోన్నతి కల్పించారు. ఇప్పుడు మరోసారి జాయింట్ కమిషనర్‌గా అడహక్ పదోన్నతి కల్పించడం నిబంధనలకు విరుద్ధమని చెబుతున్నారు. దీనిపై దేవదాయ శాఖ మరోసారి పరిశీలించాలని కోరుతున్నారు.

హైస్కూల్ ప్లస్ పీజీటీలకు జాబ్‌చార్ట్ ప్రకటించాలి

విజయవాడ, జనవరి 30(ఆంధ్రజ్యోతి): హైస్కూల్ ప్లస్ పీజీటీలకు తక్షణమే జాబ్‌చార్ట్ ప్రకటించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్(ఏపీఎస్టీఏ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాడిశెట్టి శ్రీనివాసులు, తమ్మినాన చందనరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రస్తుతం హైస్కూల్ ప్లస్‌లో పనిచేస్తున్న డిప్లాయడ్ పీజీటీలను ప్రత్యేక కేడర్‌గా గుర్తించాలని శుక్రవారం మీడియాకు విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఖాళీలను భర్తీ చేయాలని, బదిలీలకు అవకాశం కల్పించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.



విద్యార్థుల 'నో డ్రగ్స్' ప్రచారం

డ్రగ్స్‌పై దండయాత్ర పేరుతో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్‌లోని మహిళా పోలీసులు నిర్వహిస్తున్న సైకిల్ యాత్రకు ఎనికేపాడులో విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. ఇక్కడి ఎస్ఆర్‌కే ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు 'నో డ్రగ్స్' అక్షరాకృతిలో నిలబడి మహిళా పోలీసులకు మద్దతు పలికారు. 510 కిలోమీటర్లు సాగే ఈ సైకిల్ యాత్రలో అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు.

- విజయవాడ, ఆంధ్రజ్యోతి

జగన్, గజదొంగలంతా

క్షమాపణ చెప్పాలి

- »» నెయ్యి కొనుగోలులో అన్నీ ఉల్లంఘనలే
- »» జంతువుల కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ ల్యాబ్ నివేదిక
- »» సిట్ సప్లిమెంటరీ చార్జిషీటులో లోపాలు
- »» సుబ్బారెడ్డి పీఏ ఖాతాలోకి వచ్చిన కోట్ల రూపాయలు ఎక్కడికి పోయాయి?
- »» కల్తీ నెయ్యి దందా వెనుకున్న పెద్దలను బయట పెట్టాలి: టీటీడీ చైర్మన్



తిరుపతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): నెయ్యి కల్తీ జరగలేదని, సిట్ క్లీన్ చిట్ ఇచ్చిందని అబద్ధాలు చెబుతున్న వైసీపీ నేతలకు సిగ్గుండాలని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు మండిపడ్డారు. కోట్లాదిమంది హిందువుల మనోభావాలు దెబ్బతీసిన కల్తీ నెయ్యి వ్యవహారంలో మాజీ సీఎం జగన్ సహా గజదొంగలంతా హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తిరుపతిలో మీడియాతో మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన వేలాది అరాచకాల్లో కల్తీ నెయ్యి వ్యవహారం కూడా ఒకటన్నారు. సిట్ చార్జిషీట్‌లో వందశాతం కల్తీ నెయ్యి అని పదేపదే ప్రస్తావించిందన్నారు. అయితే జంతువుల కొవ్వు లేదని చెబుతూ వైసీపీ నేతలు యజ్ఞాలు, యాగాలు, సంబరాలు చేసుకుంటున్నారని అన్నారు. హిందూ దేవుళ్లను, భక్తులను కించపరిచే విధంగా గత వైసీపీ పాలనలో దాడి జరిగిందని ఆరోపించారు. నెయ్యి కొనుగోలుకు సంబంధించి తొలి రోజు నుంచీ అన్నీ ఉల్లంఘనలే జరిగాయన్నారు. సామర్థ్యం లేని డెయిరీలకు నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇచ్చారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఐదేళ్లలో రూ.250 కోట్ల విలువైన 60 లక్షల కిలోల నెయ్యి కొనుగోలు చేశారన్నారు. అందులో జంతువుల కొవ్వు ఉందని ఎన్‌డీడీబీ ల్యాబ్ రిపోర్టు తేల్చిందని, దాని ఆధారంగానే సీఎం, డిప్యూటీ సీఎం, సాధువులు స్పందించారని అన్నారు. అది వదిలిపెట్టి సిట్ క్లీన్ చిట్ ఇచ్చిందని వైసీపీ నేతలు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన డెయిరీ నిపుణుల్ని భోలేబాబా డెయిరీ తనిఖీ కోసం పంపిస్తే అక్కడ ఒక ఆవు గానీ, చుక్క పాలు గానీ, చుక్క జున్ను గానీ లేవన్నారు. కానీ 60 లక్షల కిలోల నెయ్యి ఎలా వచ్చిందని ప్రశ్నించారు. సిట్ దర్యాప్తులో భాగంగా వైవీ సుబ్బారెడ్డి, ఆయన సతీమణి బ్యాంకు ఖాతాల వివరాలు అడిగితే సహకరించలేదని అన్నారు. టీటీడీలో ఏ ఫైలు తీసుకున్నా అవినీతి కనిపిస్తోందని, ఒక్క ఫైలు కూడా సక్రమంగా లేదని చెప్పారు. టీటీడీని భ్రష్టుపట్టించి కోట్లు సంపాదించారన్నారు. సిట్ కోర్టులో దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీటులో లోపాలున్నాయని అభిప్రాయపడ్డారు. సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్న ఖాతాలోకి వచ్చిన కోట్ల రూపాయలు తర్వాత ఎక్కడికి పోయాయన్నది చార్జిషీటులో లేదన్నారు. ఆ దిశగా ఎందుకు దర్యాప్తు చేయలేదని, కనీసం తదుపరి చార్జిషీట్‌లోనైనా కల్తీ నెయ్యి దందా వెనుక ఉన్న పెద్దలను బయట పెట్టాలని డిమాండ్ చేశారు.

11న 11 మందీ అసెంబ్లీకి రండి

కల్తీ నెయ్యిపై సభలో చర్చిద్దాం.. కలియుగ దైవాన్ని మోసం చేశారు

ఆ ఘనత జగన్, వైసీపీ నేతలదే.. పాలు లేకుండానే నెయ్యి తయారీ

ఆధారాలతో దొరికినా దబాయింపు.. కల్తీ చేశారని సిట్ తేల్చినా అబద్ధాలు

జగన్‌ను ప్రజలు నిలదీయాలి: టీడీపీ

పార్వతీపురం/ఒంగోలు కార్పొరేషన్/అనంతపురం క్రైం/తిరుపతి(రవాణా), జనవరి 30 (ఆంధ్రజ్యోతి): కలియుగ దైవం వేంకటేశ్వరస్వామిని మోసం చేసిన ఘనత మాజీ సీఎం జగన్‌తో పాటు ఆ పార్టీ నాయకులకు దక్కుతుందని మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విమర్శించారు. ప్రజా సమస్యలు, తిరుపతి లడ్డూ తయారీలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన తప్పులపై చర్చించేందుకు దమ్ముంటే జగన్మోహన్‌రెడ్డి సహా 11 మంది వైసీపీ ఎమ్మెల్యేలు వచ్చే నెల 11వ తేదీ ప్రారంభంకానున్న అసెంబ్లీ సమావేశాలకు రావాలని సవాల్ విసిరారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా కుశ గ్రామంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. పాలు లేకుండా రసాయన పదార్థాలతో నెయ్యి తయారు చేసి వెంకటేశ్వరస్వామిని జగన్‌తో పాటు వైసీపీ నాయకులు మోసం చేశారని ఆరోపించారు. ఆధారాలతో దొరికిపోయినా వైసీపీ నాయకులు దబాయింపు ప్రారంభించారని ఆమె మండిపడ్డారు. కల్తీ నెయ్యిపై వైసీపీ నేతలు రోజుకో మాట, పూటకో కథ చెబుతూ తప్పించుకునే ధోరణితో వ్యవహరిస్తున్నారని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి ఒంగోలులో అన్నారు. జంతువుల కొవ్వును ఉపయోగించి నెయ్యి పేరుతో భారీగా దోచేశారన్నారు. హిందువుల మనోభావాలపై దాడి చేసిన జగన్‌ను ప్రజలు ఎక్కడికక్కడ నిలదీయాలని టీటీడీ సభ్యుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనంతపురంలో పిలుపునిచ్చారు. జగన్‌కు ఎవరు క్లీన్ చిట్ ఇచ్చారని ప్రశ్నించారు. దేవదేవున్ని నల్లరాయి, అవసరమైతే పెకలిస్తామని మాట్లాడిన నాస్తికుడు కరుణాకర్‌రెడ్డి అని మండిపడ్డారు. ఏ తప్పూ చేయకుంటే సుబ్బారెడ్డి భార్య బ్యాంకు ఖాతాల వివరాలను ఎందుకు ఇవ్వలేదని, ఎందుకు కోర్టుకు వెళ్లారని ప్రశ్నించారు. వైసీపీ నాయకులు కాసులకు కక్కుర్తి పడి ప్రసాదాన్ని అపవిత్రం చేశారని శాప్ చైర్మన్ రవినాయుడు తిరుపతిలో అన్నారు. 10 శాతం కన్నా తక్కువ వివిధ జంతువుల కొవ్వులు కలిపి ఉంటే వాటిని గుర్తించలేమని సిట్ ఇచ్చిన రిపోర్టులో ఉన్నప్పటికీ వైసీపీ నేతలు ఎక్కడా జంతువుల కొవ్వు కలపలేదంటూ సిట్ నివేదిక ఇచ్చిందని సంబరాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు.



ఎన్ఐవో కోసం నిర్మించిన నూతన భవనం ప్రారంభం సందర్భంగా శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జితేంద్రసింగ్. చిత్రంలో హోంమంత్రి అనిత

పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఎన్ఐవో

»» కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రి జితేంద్రసింగ్

సాగర్‌నగర్ (విశాఖపట్నం), జనవరి 30(ఆంధ్రజ్యోతి): దేశ తూర్పు తీర ప్రాంతంలో సముద్ర పరిశోధనలను మరింత బలోపేతం చేసేందుకు నూతనంగా అందుబాటులోకి వచ్చిన షోర్ బేస్డ్ లేబొరేటరీ దోహదం చేస్తుందని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ, భూ విజ్ఞాన శాఖ మంత్రి జితేంద్రసింగ్ పేర్కొన్నారు. బీచ్‌రోడ్డులో సాగర్‌నగర్ సమీపాన రాడిసన్ బ్లూ హోటల్ ఎదురుగా జాతీయ సముద్ర పరిశోధన సంస్థ (ఎన్ఐవో) కార్యాలయం, ప్రయోగశాల కోసం నిర్మించిన భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ 'ఓఎన్‌జీసీ, రిలయన్స్, గెయిల్, ఆయిల్ ఇండియా వంటి సంస్థలకు అవసరమైన సాంకేతిక సహకారాన్ని ఎన్ఐఓ లేబొరేటరీ అందిస్తుంది. అలాగే ఫార్మా, స్టీల్, థర్మల్ పవర్, ఓడరేవుల అభివృద్ధిలో పర్యావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు తోడ్పాటునందిస్తుంది. తుఫాన్‌ల గమనాన్ని అంచనా వేయడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారిస్తుంది. సముద్ర అధ్యయన రంగంలో యువ శాస్త్ర వేత్తలకు, నిపుణులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలి' అని అన్నారు. రాష్ట్ర హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత ఎంపీ ఎం.శ్రీభరత్, భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, ఎన్ఐఓ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్ సింగ్ తదితరులు ప్రసంగించారు.

కల్తీ సహజమే: సజ్జల

అమరావతి, జనవరి 30(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీకి వాడిన నెయ్యి కల్తీ జరిగిందని సిట్ నివేదికలో చెప్పినా, జంతువుల కొవ్వు లేదని చార్జిషీట్‌లో స్పష్టంగా పేర్కొన్నారని, కల్తీ జరగడం సహజమేనని వైసీపీ రాజకీయ సలహా కమిటీ సమన్వయకర్త సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. తిరుమల లడ్డూలో జంతు వ్యర్థాలు లేవని తేలినందున భక్తులకు ముఖ్యమంత్రి చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు శుక్రవారం వైసీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'నెయ్యిలో కల్తీ ఉందంటూ ల్యాబొరేటరీలు చెప్పినా, అందులో జంతు కొవ్వు అవశేషాలు లేవని తేలింది. నెయ్యిలో జంతు కొవ్వులేదని సిట్ తేల్చి చెప్పింది. తిరుమల లడ్డూలో జంతు కొవ్వు ఉందంటూ చంద్రబాబు వ్యాఖ్యానించి కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతీశారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఏకంగా పంది కొవ్వును వాడారని చెబుతూ భక్తుల మనోభావాలను మరింత దెబ్బతీశారు. తాను తప్పుగా మాట్లాడానని చంద్రబాబు క్షమాపణ చెప్పే దాకా భక్తులు ఒత్తిడి చేయాల'ంటూ సజ్జల పిలుపునిచ్చారు.

భారతి సిమెంట్స్‌కు చెక్!

(మొదటి పేజీ తరువాయి)

లీజులు ఇచ్చారని, అవి తప్పు అని ఇప్పుడు ఎలా అంటారని వాదిస్తోంది. లీజులు రద్దు చేయాలన్న ముందస్తు ఉద్దేశాలతోనే తమకు నోటీసులు ఇచ్చారని, ఆ చర్య చట్టవిరుద్ధమైనదని అంటోంది. ఇది సహజ న్యాయ సూత్రాలు, చట్టబద్ధ పాలనకు విరుద్ధమంటూ ఆ కంపెనీ ప్రభుత్వానికి వివరణ ఇచ్చింది. లీజుల రద్దుకోసం చూపిస్తున్న కారణాలు, నిబంధనలు తమకు వర్తించవని, తక్షణమే లీజుల రద్దు షోకాజ్ నోటీసును వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేసింది. నోటీసుపై వ్యక్తిగతంగా వివరణ ఇచ్చే అవకాశం కల్పించాలని గనులశాఖను కోరింది. దీనిపై గనుల శాఖ దీటుగా స్పందించింది. నోటీసు వెనక్కి తీసుకోవడం కుదరదని తేల్చిచెప్పింది. కేంద్ర గనులు, ఖనిజాల అభివృద్ధి, నియంత్రణ చట్టం (ఎంఎండీఆర్) 1957లోని సెక్షన్ 10 (ఏ)(2)(సి) ప్రకారం లీజులు ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వానిదే తప్పంటూ భారతి సిమెంట్స్ సరికొత్త వాదన చేస్తోంది. ఈ నేపథ్యంలో చట్టప్రకారం ఆ కంపెనీ లీజులను రద్దుచేసేందుకు గనుల శాఖ రంగం సిద్ధం చేస్తోంది. ఇదే బాటలో ఏసీసీ, రామ్‌కో సిమెంట్స్‌కి ఇచ్చిన లీజులను కూడా రద్దు చేసేందుకు ఫైలు కదిలింది.

ఎన్నికల సమయంలో లీజులు..

2024 ఎన్నికల సమయంలో నాటి సీఎం జగన్ కడప జిల్లా కమలాపురం మండలంలోని మూడు గ్రామాల పరిధిలో భారతి సిమెంట్స్‌కు 235.56 ఎకరాల మేర సున్నపు రాయి లీజులను ఇచ్చారు. లీజు కాలపరిమితి 50 ఏళ్లుగా ఖరారుచేస్తూ 2024 ఫిబ్రవరి 2న జీఓ 4 జారీచేశారు. భారతి సిమెంట్స్‌కు ఎంఎండీఆర్ యాక్ట్-1957కు విరుద్ధంగా లీజులు ఇచ్చారని, దీనిపై విచారణ చేయాలంటూ కడప జిల్లాకు చెందిన వ్యక్తే కేంద్రానికి లేఖ రాశారు. ఈ లేఖలోని అంశాలు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేంద్రం 2024లోనే రాష్ట్రాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర గనుల శాఖ లీజుల ఫైళ్లను పరిశీలించింది. ఎంఎండీఆర్ యాక్ట్‌లోని సెక్షన్ 10 (ఏ)(2)(సి)కి విరుద్ధంగా భారతి సిమెంట్స్‌కు లీజులు ఇచ్చారని నిర్ధారించారు. ఇది చట్ట ఉల్లంఘన పరిధిలోకి వస్తుందని, కాబట్టి ఆ లీజులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని గనుల శాఖ గత ఏడాది డిసెంబరు 11న భారతి సిమెంట్స్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. 14 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని కోరింది. ఈ మేరకు భారతి సిమెంట్స్ డైరెక్టర్ ఈ నెల 5న గనుల శాఖ డైరెక్టర్‌కు వివరణ పంపించారు.

లీజుల రద్దుకు సిఫారసు

షోకాజ్ నోటీసుపై భారతి సిమెంట్స్ వాదన గనుల శాఖను విస్మయానికి గురిచేసింది. నోటీసు సమగ్రంగా లేదని వాదించడంతోపాటు, తమకు రూల్స్ ప్రకారమే లీజులు ఇచ్చారనడం ఆశ్చర్యానికి గురిచేసింది. నోటీసు వెనక్కి తీసుకోవాలని కోరుతూ, మరోవైపు లీజులు రద్దు చేయాలన్న ఉద్దేశంతోనే నోటీసులు ఇచ్చారని వాదించడం చర్చనీయాంశంగా మారింది. నోటీసులు వెనక్కి తీసుకోవాలన్న వాదనకే భారతి సిమెంట్స్ కట్టుబడి ఉందా? అంటే అదీలేదు. వ్యక్తిగతంగా వివరణ ఇచ్చేందుకు అవకాశం ఇవ్వాలని కోరడం చర్చనీయాంశంగా మారింది. లీజులు ఎందుకు రద్దుచేయకూడదో భారతి సిమెంట్స్ హేతుబద్ధ కారణాలు చెప్పలేదని గనుల శాఖ నిర్ధారణకు వచ్చింది. ఎంఎండీఆర్ చట్టంలోని సెక్షన్ 10 (ఏ)(2)(సి)కి విరుద్ధంగా సున్నపురాయి లీజులు పొందినందున వాటిని రద్దు చేయాలని గనులశాఖ డైరెక్టర్ సిఫారసు చేసినట్లు తెలిసింది. త్వరలో ఉత్తర్వులు వెలువరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది.

నోటీసులు వెనక్కి తీసుకోవాలి: భారతి సిమెంట్స్

షోకాజ్ నోటీసు అసంబద్ధంగా, అసంపూర్ణంగా ఉందని భారతి సిమెంట్స్ పేర్కొంది. ప్రభుత్వం చట్టపరమైన అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే సున్నపురాయి లీజులు ఇచ్చిందని పేర్కొంది. ఒకసారి ప్రభుత్వం అన్నీ పరిశీలించి లీజులు ఇచ్చిన తర్వాత అవి చట్టవిరుద్ధమని, ఉల్లంఘనలు ఉన్నాయని ఏ ప్రాతిపదికన చెబుతున్నారని ప్రశ్నించింది. "ఎంఎండీఆర్-1957లోని సెక్షన్ 10 (ఏ)(2)(సి) కింద మా లీజులు రద్దు చేయడం న్యాయబద్ధం కాబోదు. మాకు ఆ రూల్స్ వర్తించవు. మా లీజులు ఆ రూల్స్‌కు లోబడే ఇచ్చారు. కాబట్టి ఆ రూల్స్‌ను ఉల్లంఘించారని చెప్పడం సరైనది కాదు. న్యాయ సలహా తీసుకున్న తర్వాతే నాటి ప్రభుత్వం మాకు లీజులు ఇచ్చింది. నాటి ప్రభుత్వం తీసుకున్న సరైన నిర్ణయాన్ని సమీక్షించడం హేతుబద్ధమైన చర్య కాబోదు. లీజుల రద్దు ప్రత్యేకమైన పరిస్థితుల్లోనే జరగాలి. నిబంధనలు ఉల్లంఘించి, మోసపూరితంగా, వాస్తవ విరుద్ధంగా లీజులు తీసుకుంటేనే రద్దుచేయాలి. కానీ భారతి సిమెంట్స్‌కు అలా లీజులు రాలేదు. మీ నోటీసులో అలాంటి అంశాలు కూడా లేవు. లీజులు రద్దు చేయాలన్న ఉద్దేశంతోనే నోటీసులు ఇచ్చినట్లుగా కనిపిస్తోంది. లీజుల రద్దుకు మీరు చూపిస్తోన్న కారణాలు ఏవీ సహేతుకంగా, న్యాయబద్ధంగా లేవు. ఆ రూల్స్, కారణాలేవీ మాకు వర్తించవు. కాబట్టి లీజుల రద్దుకు ఇచ్చిన నోటీసును ప్రభుత్వమే వెనక్కి తీసుకోవాలి. ఆ నోటీసు అసమగ్రంగా ఉంది. కీలకమైన, అవసరమైన సమాచారం, డాక్యుమెంట్లు ఇవ్వకుండానే నోటీసు ఇచ్చారు. కాబట్టి ఈ విషయమై వ్యక్తిగతంగా వచ్చి వివరణ ఇచ్చేందుకు మాకు అవకాశం ఇవ్వాలి" అని భారతి సిమెంట్స్ తన 13 పేజీల వివరణలో పేర్కొంది.

అదేం కుదరదు: గనుల శాఖ

భారతి సిమెంట్స్ డైరెక్టర్ ఇచ్చిన సుదీర్ఘ వివరణపై గనుల శాఖ తీవ్రంగా స్పందించింది. తాము ఎంఎండీఆర్ చట్టంలోని అంశాలను, ఇతర చట్టపరమైన విషయాలను పరిగణనలోకి తీసుకొనే షోకాజ్ నోటీసు ఇచ్చామని, అందులోనే కీలకమైన అంశాలున్నాయని గనుల శాఖ పక్షం రోజుల క్రితమే భారతి సిమెంట్స్‌కు పంపిన రెండో నోటీసులో స్పష్టం చేసింది. నోటీసులోనే కీలకమైన అంశాలను పేర్కొన్నామని, తాము ఏ సమాచారం ఇవ్వలేదన్నది సరైనది కాదని స్పష్టం చేసింది. కాబట్టి, నోటీసులో పేర్కొన్నట్లుగా ఎంఎండీఆర్ చట్టం-1957లోని సెక్షన్ 10 (ఏ)(2)(సి)కింద భారతి సిమెంట్స్‌కు ఇచ్చిన లీజులు పూర్తిగా నిబంధనలకు విరుద్ధమైనవని పేర్కొంది. కాబట్టి ఆ లీజులను ఎందుకు రద్దు చేయకూడదో బదులు ఇవ్వాలని గనుల శాఖ స్పష్టం చేసింది. తాము చట్టాలు, నిబంధనలను పరిగణనలోకి తీసుకొనే నోటీసు ఇచ్చామని వెల్లడించింది.

'నెయ్యి' అబద్ధం.. కొవ్వు నిజం!

(మొదటి పేజీ తరువాయి)

కొవ్వు, చేప నూనెలను గుర్తించే శక్తి మాకు లేదు' అంటూ ఐసీఏఆర్ అనే ఒక డీమ్డ్ యూనివర్సిటీ అసహాయత వ్యక్తం చేస్తూ ఇచ్చిన నివేదికను పట్టుకుని చిందులు వేస్తోంది. తమ హయాంలో నెయ్యి పేరిట 60 లక్షల కిలోల రసాయన మిశ్రమాన్ని టీటీడీకి సరఫరా చేసి నీచానికి పాల్పడటం ఒక ఎత్తయితే... 'అందులో జంతువుల కొవ్వు లేదు కాబట్టి చంద్రబాబు సారీ చెప్పాలి' అని డిమాండ్ చేయడం మరొక ఎత్తు. అది నెయ్యే కాదన్నది నిజం! అందులో... జంతువుల కొవ్వు కలిసిందన్నదీ నిజం! ఎన్‌డీడీబీ నివేదిక ఆధారంగానే అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు 'తిరుమలకు సరఫరా చేసిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలిసింది' అని సంచలన ప్రకటన చేశారు. అప్పుడే జగన్ తనదైన శైలిలో తికమక ప్రకటనలు చేశారు. 'ఆవుకు ఆరోగ్యం బాగలేకున్నా అది ఇచ్చే పాలు కొంచెం అటూఇటుగా ఉంటుంది. దానివల్ల కూడా జంతువుల కొవ్వు కనిపిస్తుంది. అదేం తప్పు కాదు' అంటూ వితండ వాదం చేశారు. ఇప్పుడు... అసలు అది నెయ్యే కాదని రుజువయ్యాక, 'జంతువుల కొవ్వు లేదుకదా' అంటూ ఒక తప్పుడు ప్రచారాన్ని వదులుతున్నారు.

ఎన్‌డీడీబీ... ఏం చెప్పిందంటే...

'ఎన్‌డీడీబీ - కాల్ఫ్' డెయిరీ రంగంలో జాతీయ గుర్తింపు పొందిన, అత్యుత్తమ పరిశోధనా కేంద్రం. 2009లో ఈ పరిశోధన సంస్థను ఏర్పాటు చేశారు. పాలు, పాల ఉత్పత్తుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి నిర్ధారించడంలో జాతీయ స్థాయిలో దీనికి మించిన వ్యవస్థ మరొకటి లేదు. టీటీడీ 2024 జూలైలో స్వాధీనం చేసుకున్న రెండు ట్యాంకర్ల నుంచి తీసిన శాంపిల్స్‌ను ఎన్‌డీడీబీ- కాల్ఫ్‌కు పంపించారు. ఇందులో జంతువుల కొవ్వు కలిసిందని ఆ సంస్థ ధ్రువీకరించింది. ఈ విషయాన్ని 'సిట్' తన చార్జిషీటులో కూడా పొందుపరిచింది. మరోవైపు... 'నెయ్యి' శాంపిళ్లను హరియాణాలోని 'ఐసీఏఆర్ - నేషనల్ డెయిరీ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్'కు కూడా పంపించారు. ఇది... ఒక డీమ్డ్ యూనివర్సిటీ. తమకు అందిన నమూనాల్లో పంది కొవ్వు (ల్యార్డ్) ఆనవాళ్లు లేవని ఆ సంస్థ తెలిపింది. అదే సమయంలో... తమ సొంత 'మెథడాలజీ' ప్రకారం, ఎప్పుడూ చేసే ప్రక్రియకు భిన్నంగా ఈ పరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించింది. అంతేకాదు... 'సాధారణంగా ఇలాంటి పరీక్షలు మేం చెయ్యం. మేం అనుసరించిన మెథడ్‌ను థర్డ్‌పార్టీ ధ్రువీకరించాల్సి ఉంది' అని కూడా ఐసీఏఆర్-ఎన్‌డీఆర్ఐ స్పష్టం చేసింది. అన్నింటికంటే ముఖ్యంగా... తమకు వచ్చిన నమూనాల్లో గొర్రె కొవ్వు (ట్యాలో), చేప నూనె (ఫిష్ ఆయిల్) కలిసిందో, లేదో నిర్ధారించేంత పరిజ్ఞానం తమకు లేదని అసహాయత వ్యక్తం చేసింది. అంతేతప్ప... అందులో ఆ కొవ్వులు లేవు అని ధ్రువీకరించలేదు. కానీ... వైసీపీ మాత్రం 'జంతువుల కొవ్వు కలవలేదు' అంటూ అబద్ధాలను ప్రచారం చేస్తోంది. 'ఉల్టా చోర్...' తరహాలో చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేయడం మరో విడ్డూరం!

సింఘాల్ తప్పు చేశారు..!

'తిరుమల లడ్డూ' వ్యవహారంలో తప్పుడు నిర్ణయాలకు తలూపారు

రాష్ట్ర ప్రభుత్వానికి సీబీఐ సిట్ నివేదిక!

అమరావతి, జనవరి 30 (ఆంధ్రజ్యోతి) : టీటీడీ కల్తీ నెయ్యి వ్యవహారంపై దర్యాప్తు జరుపుతున్న సీబీఐ సిట్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. కల్తీ నెయ్యి సరఫరా కావడానికి టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి హయాంలో నెయ్యి సేకరణ విధానంలో తెచ్చిన మార్పులే కారణమని దర్యాప్తు అధికారులు నిర్ధారించినట్టు తెలిసింది. అప్పటి, ప్రస్తుత ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఈ వ్యవహారాన్ని సకాలంలో గుర్తించకపోవడం లేక గుర్తించినా చూసీచూడనట్లు వదిలేయడం క్షమించరాని నేరంగా సిట్ ఆక్షేపించినట్టు సమాచారం. ఈ వ్యవహారంలో సింఘాల్ అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు లేకపోయినా, తన విధి నిర్వహణలో ఆయన తీవ్ర నిర్లక్ష్యం వహించారని, టీటీడీ పాలక మండలి ఒత్తిడికి తలొగ్గారని గుర్తించినట్టు తెలిసింది. వైవీ సుబ్బారెడ్డి పీఏ చిన్నప్పన్నపై నేరాభియోగాలతో ఇటీవలే నెల్లూరు కోర్టులో సిట్ చార్జిషీట్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఇదే క్రమంలో మరి కొన్ని వివరాలతో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.





పాలసీలో భారీ మార్పులు..

లడ్డూ ప్రసాదం తయారీకి వాడే నెయ్యికొనుగోలుకు టీటీడీలో ఒక విధానం ఉంది. వైసీపీ హయాంలో ఈ విధానానికి మంగళం పాడారు. బాగా పేరున్న సంస్థలను పక్కకు తప్పించి, ఊరుపేరు లేని సంస్థలకు టెండర్లలో అవకాశం ఇవ్వడమే లక్ష్యంగా 370 తీర్మానం ద్వారా టీటీడీ గేట్లు ఎత్తేసింది. ఈ పనిని సుబ్బారెడ్డి ఉద్దేశపూర్వకంగా చేశారా లేదా అన్న విషయాన్ని సిట్ తేల్చింది. ఒకవైపు చిన్నప్పన్న తన పీఏ కాదని సుబ్బారెడ్డి అంటున్నారు. మరీ ఆయన పీఏ కానప్పుడు ఆయన ఖాతాల్లోకి డబ్బులు ఎందుకు వెళ్లాయన్నది పెద్ద ప్రశ్న. ఏపీ భవన్‌లో పని చేసే ఒక చిన్న ఉద్యోగి ఖాతాలోకి రూ.4.5 కోట్లు ఎవరైనా ఎందుకు వేస్తారు? ఆ డబ్బులు అప్పన్న ఖాతాల్లోకి వచ్చిన తర్వాతనే టీటీడీ నెయ్యి కొనుగోలు పాలసీలో భారీ మార్పులు జరిగాయి. ఆ తర్వాతే టీటీడీ బోర్డులో తీర్మానం చేశారంటే, ఆయన చెబితేనే అప్పటి చైర్మన్ చేసి ఉండాలి. లేదా చైర్మన్ టీటీడీ పాలసీ నిబంధనలను కొందరి కోసం మార్చాలని నిర్ణయించుకున్న తర్వాత.. చిన్నప్పన్న ద్వారా సదరు వ్యక్తుల నుంచి లబ్ధి పొంది ఉండాలి. ఇలా తప్ప కిందస్థాయి సిబ్బంది అంత పెద్ద నేరానికి పాల్పడే అవకాశం లేదు. టీటీడీ పాలక మండలిలో రాజకీయ నాయకులే ఎక్కువ మంది ఉంటారు. వారికి రకరకాల వ్యాపకాలు, లావాదేవీలు, వివిధ వ్యక్తులతో సంబంధాలు ఉంటాయి. వాటన్నింటినీ టీటీడీపై రుద్దకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది. బోర్డులో ఒక సభ్యుడు ఏదైనా ప్రతిపాదన పెడితే, దాని లోతుపాతులను కూలంకషంగా పరిశీలించాల్సిన బాధ్యత అధికారులదే. నెయ్యి కొనుగోలు వ్యవహారంలో అప్పటి వరకూ ఉన్న పటిష్ఠమైన పాలసీకి తూట్లు పొడిచినా, దిక్కుమాలిన డెయిరీలకు నెయ్యి సరఫరా చేసే అవకాశం కల్పించినా సింఘాల్ ఏదశలోనూ నిలువరించలేదని సిట్ తన నివేదికలో తెలిపినట్టు సమాచారం.

ఏ నిబంధన ఏం చెబుతుందంటే..

నెయ్యి కొనుగోలుకు సంబంధించిన నిబంధనలను మారుస్తూ, సుబ్బారెడ్డి నేతృత్వంలోని బోర్డు 2020 ఫిబ్రవరి 29వ తేదీన తీర్మానం చేసింది. 18, 19, 20, 21, 72 నిబంధనలను సవరించింది. నిబంధన 18 ప్రకారం మూడేళ్ల ఆపరేషన్‌లో ఉన్న డెయిరీకి మాత్రమే టెండర్లలో పాల్గొనే అర్హత కల్పించాలి. దానిని ఏడాదికి తగ్గించారు. రోజుకు 4 లక్షల లీటర్ల ఆవు నెయ్యి సేకరించి ఉండాలని, ఏడాదిలో ఎనిమిది టన్నుల ఆవు పాల కొవ్వు ప్రాసెస్ చేసే సామర్థ్యం కలిగి ఉండాలన్న 19, 20 నిబంధనలను పూర్తిగా ఎత్తేశారు. నిబంధన 21 ప్రకారం... ప్రతి రోజు 12 టన్నుల ఆవు పాల కొవ్వుకు సంబంధించిన పాల సేకరణ చేసి ఉండాలి. దానిని ఎనిమిది టన్నులకు కుదించారు. రూ.250 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీలు మాత్రమే పాల్గొనాల్సిన నిబంధనను సవరించి రూ.150 కోట్ల టర్నోవర్ ఉన్న డెయిరీలకు కూడా టెండర్లలో పాల్గొనే అవకాశం కల్పించారు. ఈవో సింఘాల్ సకాలంలో స్పందించి ఉంటే అసలు కల్తీ నెయ్యి స్కామ్‌కే అవకాశం ఉండేది కాదని, ఆయనపై గట్టి చర్యలు తీసుకోవాలని సిట్ తన నివేదికలో కోరినట్టు తెలిసింది. సింఘాల్ తర్వాత ఈవోగా బాధ్యతలు స్వీకరించిన ధర్మారెడ్డి టీటీడీ ఆర్థిక సలహాదారు బాలాజీ కూడా తన విధి నిర్వహణలో నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించారని సిట్ తన నివేదికలో పేర్కొన్నట్టు సమాచారం.

రేపు బెజవాడలో రాష్ట్ర రెవెన్యూ జేఏసీ ఏర్పాటు

విజయవాడ (గాంధీనగర్), జనవరి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వీఆర్ఏ, వీఆర్వో, సర్వేయర్లు, రెవెన్యూ కుటుంబ సభ్యులతో ఈ ఫిబ్రవరి 1న సమావేశం నిర్వహించనున్నట్లు ఏపీ వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్.రవీంద్రరాజు తెలిపారు. విజయవాడలోని ఫిల్మ్ చాంబర్‌లో జరిగే ఈ సమావేశంలో.. క్షేత్రస్థాయిలో రెవెన్యూ ఉద్యోగుల సమస్యల పరిష్కారమే అజెండాగా రాష్ట్ర రెవెన్యూ జేఏసీ ఏర్పాటు చేస్తామన్నారు. జేఏసీలో పని చేయడానికి వీఆర్ఏ నుంచి తహసీల్దార్ల వరకుఅందరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. వీఆర్ఏ, వీఆర్వో, సర్వేయర్ల సంఘాల నేతలు ఈ సమావేశానికి హాజరు కావాలని ఆ ప్రకటనలో రవీంద్రరాజు కోరారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: **N.Rahul Kumar** Phone No: (0863)2512379,2512376 ,
RNI no.APTEL/2003/9781. **Managing Director : Vemuri Radha Krishna**. Founder: K.L.N.Prasad.